శు ౧ బు. ప్ర. బ ౭ బు. ప. బుధ శుక్రులలో బుధమాత్ర వక్రము. శు ౧౦ శు. ప్ర. పురశ్శుక్రుడు. బ ౬ సో. మున కర్కాటమున కుజ ప్రవేశమున్ను వర్షయోగములు గావున నిందు ఒకొక్కచో వర్షపీడ గలుగవచ్చును.

ఫాల్గునమాసము:— ఇంద్రాశ్లేషాంగారకుడును పురశ్శుక్రరవి మధ్యమున్ను ప్రతిబంధకములు. అందు పురశ్శుక్రుడు వృష్టికరుడు, బ ౯ శ. కుజవక్రత్యాగము వృష్టికరము. గావున నిందు వర్షభీతి అపుడపుడు గలుగవచ్చును. శ్రీః శ్రీః శ్రీః

N. B. పురశ్శుక్రుడు, పురోబుధుడు, ఇత్యాదిపదములందు ముందు వెనుకలు సూర్యునిబట్టి అనుగ్రహింపవలెను.

గృహభ కలశచక్రములు

గృహారంభగృహప్రవేశములవిషయమై సూర్యుడున్న నక్షత్రము మొదలు చంద్రుడున్న నక్షత్రమువరకు గృహభచక్రమున అభిజిత్తు సకలిపియున్ను, కలశచక్రమున నభిజిత్తు గాకుండగనున్ను లెక్కించి ఫలము నెరుంగవలయును.

గృహభచక్రము.		కలశచక్రము.	
౩ వృశ్చికి (?)	౪ ధనలాభ	౧ హాని	౪ నిర్ధనం
౪ దుర్గతి	౪ ధాన్యం	౪ ప్రవాసం	౪ గర్భస్రావం
౪ స్థైర్యం	౩ సంపత్తు	౪ నిర్భయం	౩ లక్ష్మీ
౩ భ్రమణం	౩ పశువృద్ధి	౪ ధాన్యం	౩ ఆయుర్వృద్ధి

(1) స్తంభప్రతిష్ఠ మొదలగు వాటికి తిర్యఙ్ముఖనక్షత్రములు శుభములు అశ్వి, పున, హ, చి, స్వా, అనూ, జ్యే, రే.

(2) వృక్షలతాస్థాపనాదులకు ఊర్ధ్వముఖనక్షత్రములు శుభములు. రోహి, ఆర్ద్ర, పుష్య ఉత్తరాత్రయం శ్ర, ధ, శత.

(3) వాపీకూపతటాకాదులకు అధోముఖనక్షత్రములు శుభప్రదములు. భర, కృ, మ, విశా, పూర్వాత్రయం, ఆశ్లే, మూల.

వ్యాధివిషయమై చెడునక్షత్రములు మొదలగునవి

౧-౨-౬-౮-౧౧-౧౨-౧౩-౧౪ తిథులు; ఆది మంగళ శుక్ర శనివారములు; కృత్తిక రోహిణి మృగశిర పున మఘ ఉఫ చిత్త విశా ఉషా ధని శ పూభా ఉభా రేవతి ఈనక్షత్రములును దోషములు. వీటియందు వ్యాధి సంభవించినచో గృహమునకు దోషము. నక్షత్రము చెడుగయుచో అధికదోషము. నక్షత్రము మంచిదై మిగిలినవి చెడుగైనచో స్వల్పదోషము.

ఆర్ద్ర	ఆశ్లే	ఉ	స్వాతి	జ్యే	ఉ	ఉ	రే	రో
పు	మ	హ	వి	మూ	శ్ర	పూ	అ	రో
పు	పు	చి	అనూ	పూ	ధ	ఉ	భ	మృ

ఇది జ్వరవిషయమైన చక్రము. జ్వరదినమున రవిచంద్ర జన్మనక్షత్రము లేక రేఖయందుండిన రోగి జీవింపడు.

విషయము	తిథులు.	వారములు	నక్షత్రములు.	లగ్నములు.	విశేషములు.
గృహారంభం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	అశ్వి రో మృ పున ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ శత రే	వృ.మి. కన్యా.ధ.కుం మీ (సిం. వృశ్చి)	అష్టమశుద్ధి.కర్తరీమీనమిధున ధనుర్మాసములునింద్యములు
గృహప్రవేశం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	రో మృ ఉత్తరాత్రయ చి అనూ ధ శత రే (పుష్య)	వృ.మి. సిం. క. వృ ధ కుం.మీ.	అష్టమశుద్ధి, కలశ చక్రశుద్ధి (చతుర్థశుద్ధి)
నిషేకము	౨-౩-౫-౧౦	సో-బు-గు-శు (శ)	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయ హ చి స్వా అనూ మూ శ్ర ధ శత రే	శుభయుతిదృష్టములు.	సంధ్యాపర్వప్రదోషవ్రతశ్రాద్ధ దినములు నింద్యములు
గర్భాధానము	౨-౩-౫-౭-౧౦ ౧౩	ఆ-సో-బు గు-శు	రోమృపునపుఉత్తరాత్రయ హచి స్వా అనూశ్రధశఆర్ద్రాపూర్వాత్రయంవిశా	,,	సంధ్యాపర్వవ్రత శ్రాద్ధదినములు నింద్యములు
పుంసవన సీమంతములు	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩-౧౫	ఆ-మం-బు గు-శు	మృ పున పు హ అనూ శ్ర ధ శత రే (అశ్వి రో చి స్వా ఉత్తరాత్రయం)	మే.వృష.మి.తు. ధ.కుం.మీ	పుంసవనమునకు 3 మాసం. సీమంతం ౪.౬.౮మాసములు
జాతకర్మ నామకరణములు	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩	ఆ-సో-బు గు-శు	అశ్వి రో మృ పున పు హ చి స్వా అనూ ఉత్తరాత్రయం శ్ర ధ శత రే	శుభలగ్నములు ,,	అష్టమశుద్ధి. ,,
డోలారోహణము	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩-౧౫	ఆ-సో-బు గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి అనూ రే స్వా శ్ర	,,	,,
నిష్క్రమణం	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩	సో-బు-గు శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ రే	మే. వృష. కర్క. తు. ధ. మీ.	౪ మాసం శుభం 3 మాసమున్న శుభము
అన్నప్రాశనం	౨-౩-౫-౭-౧౦ ౧౩-౧౫	సో-బు-గు శు-ఆ	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ శత రే	మీన మే వృశ్చి వినా	దశమశుద్ధిపూర్వాహ్ణముపురుషులకు సరినెలలు, స్త్రీలకు బేసి
కర్ణవేధ	౨-౩ ౫-౭-౧౦ ౧౧-౧౩	సో-బు-గు శు-ఆ	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి శ్ర ధ అనూ రే (ఆర్ద్ర)	వృ మి. క. క. తు.ధ మీ (మే.మ)	౬-౭-౮ మాసములు అష్టమశుద్ధి
కేశఖండనం	౨-౩-౫-౭-౧౦ ౧౩-౧౫	సో-బు-గు శు	అశ్వి మృ పున పు హ చి స్వా శ్ర ధ శత రే (జ్యే)	శుభలగ్నములు	ఉత్తరాయణం పూర్వాహ్ణం విషమవర్షములుఅష్టమశుద్ధి
అక్షరాభ్యాసము	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౨-౧౩	సో-బు-గు శు	అశ్వి పున పు హ చి స్వా అనూ శ్ర రే (ఆర్ద్ర మృ ధ శ)	మి. కన్యా ధ మీ	అష్టమశుద్ధిఉత్తరాయణం ౫-వ సంవత్సరము
విద్యారంభం	౨-౩-౫-౧౦-౧౧ ౧౨	బు-గు-శు	అశ్విమృ ఆర్ద్రపున పు ఆశ్లే పూర్వాత్రయం హ చి స్వామూ శ్ర(ధశతఅనూ)	మే.మి.క.క.తు.ధ మ. మీ	దివాభాగము శుభము
ఉపనయనం	౨-౩-౫-౧౦-౧౧ (౬-౧౨)	బు-గు-సో శు	అశ్విరోమృపున పు ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ శ రే	శుభలగ్నములు	అష్టమశుద్ధి మీనచైత్రముశుభం
వివాహం	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౨-౧౩-౧౫	బు-గు-శు	రో మృ మ ఉత్తరాత్రయం హ స్వా అనూ మూ రే(అశ్వి శ్ర చి ధ)	శుభలగ్నములు	జామిత్రశుద్ధి. మీనచైత్రము నింద్యము
నవవధూప్రవేశము	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩	సో-బు-గు శు	అశ్వి రో మృపున పుమఉత్తరాత్రయం హ చి స్వా అనూ మూ శ్ర ధ శత రే	,,	ద్వాదశశుద్ధి విషమవర్ష మాసములు
నవవస్త్రాభరణ ధారణం	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩-౧౫	బు-గు-శు	అశ్వి హ చి స్వా వి అనూ ధ రే (నగ సైత్రక, రో పున పు ఉత్తరాత్రయం)	వృ.మి.క. క.తు.ధ మీ	తృతీయశుద్ధి
వాపీకూపాదికము	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩-౧౫	సో-బు-గు శు	అశ్విరోమృపుష్య మ ఉత్తరాత్రయం హ అనూ మూ శ్ర ధ శ రే (జ్యే)	కర్క.మ.కుం.మీ	అగ్ని,దక్షిణ, నిరృతి, వాయు, దిక్కులు గృహమధ్యంకూడవు.
బీజావాపనం	౨-౩-౫-౭-౧౦ ౧౧-13-15	సో-బు-గు శు	రోపుష్య మ ఉత్తరాత్రయం హ స్వా అనూ మూ శ్ర శ రే అశ్వి మృ పువధని	వృ.కర్క.సిం.మ. (కు.మీ కుం)	అష్టమశుద్ధి. 3-6 లలో శుభులు కూడదు
వృక్షలతాది స్థాపనం	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩-౧౫	సో-బు-గు శు	అశ్విరోమృ పుష్య మ ఉత్తరాత్రయం హ చి వి అనూ మూ శ్ర శత రే	శుభలగ్నములు.	చతుర్థమునకు శుభదృష్టి వలయును.
దేవతా ప్రతిష్ఠ	౨-౩-౫-౭-౮ ౧౦-౧౧-౧౨-౧౩	ఆ-సో-బు గు-శు	అశ్విరో మృ పున పు ఉత్తరాత్రయహ చి స్వా అనూ శ్ర ధ శ రే(దేవనక్షత్ర)	వృ.మి.సిం.మి.కన్యా ధ కుం. మీ	సౌమ్య దేవతలకు ఉత్తరాయణం ఉగ్రదేవతలకు దక్షిణాయనం
యాత్ర	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩	బు-గు-శు	అశ్వి మృ పున పు హ అనూ ధ శ్ర రే (రో ఉత్తరాత్రయం మూ శ)	మే.వృష.క.తు.ధ మ.మీ	పంచమశుద్ధి సుశకునం
హలకర్మ	౨-౩-౫-౭-౧౦ ౧౧-౧౩-౧౫	ఆ-మం-బు గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా వి అనూ మూ శ్ర ధ శ రే	వృ.మి.కన్యా.వృ.ధ మీ	కర్తరికూడదు.

ఈ ముహూర్తములకు ఏకవింశతి మహాదోషములను వదలిపెట్టవలెను. పంచకరహితముగ నుండవలెను. చంద్రతారాబలము లుండవలెను. పాపగ్రహములు అనగా రవి, శని, కుజ, రాహు, కేతులు, లగ్నమునకు ౩-౬-౧౧ స్థానముల యందు, శుభగ్రహములగు గురు, శుక్ర, పూర్ణచంద్రులు, పాపయుతుడు కాని బుధుడు, లగ్నమునకు ౧-౨-౪-౫-౭-౯-౧౦-౧౧ స్థానములయందును ఉండిన శుభము.

పంచకమును తెలిసికొను పద్ధతి

ప్రతిపత్తు మొదలు తిథి సంఖ్యయును, ఆదివారము మొదలు వారసంఖ్యయును, అశ్విన్యాదిగా నక్షత్రసంఖ్యయును, మేషాదిగా లగ్నసంఖ్యయునుగలిపి, తొమ్మిదిచే భాగించగా శేషము ౧ మిగిలెనేని మృత్యుపంచకము, ౨ మిగిలెనేని అగ్నిపంచకము, ౪ మిగిలెనేని రాజపంచకము; ౬ మిగిలెనేని చోరపంచకము, ౮ మిగిలెనేని రోగపంచకము. ఈదోషపంచకము మిగలకుండుటయే పంచకరహితము శేషసంఖ్యలు శుభమయినవి. మతాంతరము గత తిథులను లగ్నసంఖ్యను కలిపితొమ్మిదిచే భాగించగా శేషము ముందుచెప్పిన ప్రకారముగా చూచుకొనుట. ధ్రువకము కలుపుట శాస్త్ర సమ్మతము కాదు.

శుభకర్మలయందు మహాదోషములు

దుష్టతిథి వారనక్షత్ర యోగకరణములు (విష్కం, అతిగం, శూల, గండ, వ్యాఘ, వజ్ర, వ్యతి, పరి,వైధృ, దుష్టయోగములు. విష్టి, శకుని, చతు, నాగ, కింస్తు దుష్టకరణములు.) సంక్రాంతి, అయనదినములు, పాపాక్రాంత పాపదృష్టలగ్నములు, అష్టమకుజుడు, షష్ఠశుక్రుడు, పాపగ్రహకర్తరి, జన్మలగ్న చంద్రలగ్నములకు అష్టమలగ్నము, షష్ఠాష్టద్వాదశముల చంద్రుడు, సగ్రహచంద్రుడు, వేధక్రాంతులు. గ్రహణనక్షత్రము, వర్జ్యదుర్ముహూర్తములు, తిథినక్షత్రలగ్నసంధులు, మహాపాతలు, ఇవి విడువదగినవి.

గౌరీపంచాంగం కాలము ౧-కి గడియలు ౩¾. ఘంట ౧ నిమిషములు ౩౦

పగటి ముహూర్తములు

వారములు	ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
౧	ఉద్వే	అమృ	రోగం	విషం	ఉద్వే	రోగం	విషం
౨	లాభం	విషం	ఉద్వే	అమృ	విషం	జ్వరం	అమృ
౩	విషం	ఉద్వే	జ్వరం	శుభం	జ్వరం	అమృ	జ్వరం
౪	అమృ	లాభం	లాభం	ఉద్వే	లాభం	కలహం	ఉద్వే
౫	శుభం	జ్వరం	అమృ	రోగం	అమృ	లాభం	శుభం
౬	ధనం	అమృ	ఉద్వే	శుభం	విషం	సుఖం	లాభం
౭	అమృ	లాభం	విషం	ధనం	కలహం	ధనం	ధనం
౮	విషం	ధనం	లాభం	అమృ	జ్వరం	అమృ	లాభం

రాత్రి ముహూర్తములు

వారములు	ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
౧	శుభం	రోగం	జ్వరం	లాభం	సుఖం	అమృ	విషం
౨	అమృ	లాభం	ఉద్వే	రోగం	రోగం	జ్వరం	ఉద్వే
౩	జ్వరం	ధనం	కలహం	విషం	కలహం	కలహం	శుభం
౪	రోగం	ఉద్వే	లాభం	ఉద్వే	లాభం	లాభం	అమృ
౫	కలహం	రోగం	రోగం	శుభం	ఉద్వే	శుభం	కలహం
౬	లాభం	అమృ	లాభం	లాభం	జ్వరం	ధనం	రోగం
౭	ఉద్వే	విషం	ఉద్వే	ధనం	లాభం	అమృ	అమృ
౮	రోగం	జ్వరం	ధనం	లాభం	ఉద్వే	విషం	లాభం

నవగ్రహములు ద్వాదశస్థానములయం దుండునపు డిచ్చెడి గోచారఫలమును తెలియజేయు చక్రము.

గ్రహములు:—	రవిః	చంద్రః	కుజః	బుధః	గురుః	శుక్రః	శనిః	రాహుః	కేతుః
౧	స్థానచలనం	సౌజన్యం	ఖేదం	బంధం	గమనం	ఆరోగ్యం	ఆపత్	భయం	భయం
౨	భయం	వ్యయం	వ్యయం	లాభం	ధనలాభం	భాగ్యం	హాని	కలహం	విరోధం
౩	సంపత్తు	లాభః	లాభం	వ్యయం	ఆపత్తు	సౌఖ్యం	సంపత్తు	సౌఖ్యం	సుఖం
౪	మానభంగం	రోగం	శత్రుపీడ	శత్రుభయం	నాశనం	సుఖం	కుక్షిరోగం	మానహాని	మానహాని
౫	భయం	కార్యనాశనం	రిపుభయం	దారిద్ర్యం	సంపత్	పుత్రలాభం	పీడ	ధనవ్యయం	ధనక్షయం
౬	శత్రుక్షయం	ధనం	ధనలాభం	భూషణం	క్లేశం	మానహాని	లక్ష్మి	సుఖం	సుఖం
౭	దేహపీడ	లాభః	కలహం	వ్యసనం	ఆరోగ్యం	క్లేశం	రాజదండం	భయం	భీతి
౮	రోగం	వ్యయం	భయం	సంతోషం	హాని	భయం	దుఃఖం	మృత్యువు	హాని
౯	భయం	వ్యాకులం	వ్యయం	దుఃఖం	ధనాగమనం	ధనలాభం	రోగం	సంతాపం	కలహం
౧౦	లాభం	లాభం	చలనం	శుభం	హాని	హాని	జాడ్యం	కలహం	విరోధం
౧౧	ఆరోగ్యం	సుఖం	లాభం	సుఖం	సంతోషం	సౌఖ్యం	లాభం	లాభం	ధనాగమః
౧౨	వ్యయం	దుఃఖం	రోగం	వ్యయం	పీడా	లాభం	క్లేశం	హాని	హాని

ఆనందాది యోగములు

ఆ	సో	మం	బు	గు	శు	శ	
అ	మృ	ఆ	హ	అనూ	ఉషా	శ	ఆనందయోగము ౧౫ దినములలో కార్యసిద్ధి
భ	ఆ	మ	చి	జ్యే	అ	పూ	కాలదండయో. ౨౭ దినములలో కార్యసిద్ధి అపశకునం
కృ	పు	పు	స్వా	మూ	శ్ర	ఉ	ధూమ్రయో. ౧౫ ది.వరకు పనికాదు సొమ్మునష్టం
రో	పు	ఉ	వి	పూ	ధ	రే	ధాత్రీయో. ౧౫దిలో కార్యమగునునీళ్ల కుండలుకనబడును
మృ	ఆ	హ	అనూ	ఉషా	శ	అ	సౌమ్యయో. ౧౬ ది.లో కార్యమగును. సర్వసౌఖ్యము
ఆ	మ	చి	జ్యే	అ	పూ	భ	ధ్వాంక్షయోగము కార్యహాని దుఃఖప్రాప్తి
పు	పు	స్వా	మూ	శ్ర	ఉ	కృ	ధ్వజయోగము ౨౭ ది.లో కార్యసిద్ధి వేశ్యాగమనము
పు	ఉ	వి	పూ	ధ	రే	రో	శ్రీవత్సయోగము లాభము
ఆ	హ	అనూ	ఉషా	శ	అ	మృ	వజ్రయో. కార్యనాశనం చచ్చినజంతువులుకనిపించును
మ	చి	జ్యే	అ	పూ	భ	ఆ	ముద్గరయోగము కలహము దుష్టశకునము
పు	స్వా	మూ	శ్ర	ఉ	కృ	పు	ఛత్రయో. ౨౭ ది.లో స్త్రీలాభము కమలదర్శనము
ఉ	వి	పూ	ధ	రే	రో	పు	మిత్రయో. ౨౭ ది.లో తీర్థదర్శనము సన్మిత్రలాభము
హ	అనూ	ఉషా	శ	అ	మృ	ఆ	మానసయోగము కార్యలాభము
చి	జ్యే	అ	పూ	భ	ఆ	మ	పద్మయోగము ౧౫ దినములలో ఐశ్వర్యప్రదము
స్వా	మూ	శ్ర	ఉ	కృ	పు	పు	లంబయోగము కార్యవిలంబము అపశకునము
వి	పూ	ధ	రే	రో	పు	ఉ	ఉత్పాతయోగము ద్రవ్యనాశనం అవమానం
అనూ	ఉషా	శ	అ	మృ	ఆ	హ	మృత్యుయోగము హాని సర్పదర్శనము
జ్యే	అ	పూ	భ	ఆ	మ	చి	కాలయోగము అవమానము వృద్ధబ్రాహ్మణదర్శనము
మూ	శ్ర	ఉ	కృ	పు	పు	స్వా	సిద్ధయో. ౧౮ ది. లో పనియగును సువాసినీదర్శనము
పూషా	ధ	రే	రో	పు	ఉ	వి	శుభయోగము ౧౮ దినములలో పనియగును
ఉషా	శ	అ	మృ	ఆ	హ	అనూ	అమృతయోగము కార్యసిద్ధి వస్త్రలాభము
అ	పూ	భ	ఆ	మ	చి	జ్యే	ముసలయోగము దుఃఖము
శ్ర	ఉ	కృ	పు	పు	స్వా	మూ	గదాయోగము చెరుపుకలుగును
ధ	రే	రో	పు	ఉ	వి	పూ	మాతంగయోగము అశ్వలాభము బ్రాహ్మణదర్శనము
శ	అ	మృ	ఆ	హ	అనూ	ఉషా	రాక్షసయోగము చెడ్డది మిత్రకలహము
పూ	భ	ఆ	మ	చి	జ్యే	అ	చరయోగము దుర్వాక్యశ్రవణము
ఉ	కృ	పు	పు	స్వా	మూ	శ్ర	స్థిరయోగము శుభాశుభమిశ్రమము కత్తి కనుపించును
రే	రో	పు	ఉ	వి	పూ	ధ	వర్ధమానయోగము శివాదర్శనము ఉత్తమము

వివాహమునకుముందు చూడవలసిన కొన్ని పొంతనములు

౧ నాడీకూటము

ఏకనాడీనక్షత్రములు— జ్యేష్ఠ, మూల, ఉ-ఫ, హస్త, ఆర్ద్ర, పున, శత, పూభా, అశ్విని.

మధ్యనాడీనక్షత్రములు—పుష్య, మృగ చిత్ర, అనూ, భరణి, ధనిష్ఠా, పూఫ, ఉ-భా.

అంత్యనాడీ నక్షత్రములు

స్వాతి, కృత్తిక, ఆశ్లే, ఉ-షా, విశా, రోహి, మఘ, శ్రవ, రేవతి, ఇందు వధూవరుల నక్షత్రములు రెండును ఒకేనాడియందున్నచో అనిష్టము కల్గును. భిన్ననాడీగతనక్షత్రములైనచో శుభప్రదములు.

౨ గణకూటము

దేవగణ నక్షత్రములు — అనూ, పున, మృగ, శ్రవ, రేవ, స్వాతి, అశ్వి, హస్త, పుష్య.

రాక్షసగణనక్షత్రములు

మఘ, ఆశ్లే, ధని జ్యేష్ఠ, మూల, శత, కృత్తి, చిత్ర, విశా.

మనుష్యగణ నక్షత్రములు

పూ-ఫ, ఉఫ, పూషా, ఉషా, పూభా, ఉభా, రోహి, భర, ఆర్ద్ర.

౩ యోనికూటము

అశ్వినీశతతార లశ్వములు, భరణీరేవతులు గజములు, కృత్తికా పుష్యలు మేకలు, రోహిణీ మృగశిర్షలు సర్పములు, ఆర్ద్రామూలలు శునకములు, పునర్వసూ ఆశ్లేషలు మార్జాలములు, మఘపుబ్బ లెలుకలు, ఉత్తరఉత్తరాభాద్రలు గోవులు, హస్తస్వాతు లెనుబోతులు, చిత్రావిశాఖలు పెద్దపులులు, అనూజ్యేష్ఠలు లేళ్లు, పూషాశ్రవణములు కోతులు, ధనిష్ఠాపూర్వాభాద్రలు సింహములు, ఉషాభిజిత్తులు ముంగిసలు. ఇట్లు యోచించి విరోధజంతునక్షత్రములు లేని స్త్రీపురుషులకు వివాహము చేయవలయును. విరోధజంతువులు కుక్కలు లేళ్ళు, పాములు ముంగిసలు, సింహగజములు, గుఱ్ఱము లెనుబోతులు, గోవ్యాఘ్రములు, పిల్లి లెలుకలు, విరోధ జంతువులు.

ఇందు వధూవరుల నక్షత్రములు రెండును ఒకేగణమందున్నచో, అత్యంతానురక్తులై యుందురు. ఒకటి దేవగణములోనిది రెండవది మనుష్యగణములోనిది అయినయెడల సామాన్యమైన అనురాగముగల వారగుదురు. ఒకటి రాక్షసగణములోనిదై, రెండవది మనుష్యగణములోనిదైనను, దేవగణములోనిదైనను అశుభకరము.

రాహు, గుళిక కాలములు

సూర్యోదయము 6 ఘంటలకు అయ్యే దినములకు.

వారములు	రాహు కాలము		గుళిక కాలము	
	మొదలు	వరకు	మొదలు	వరకు
ఆదివారము -	4-30	6	3	4-30
సోమవారము -	7-30	9	1-30	3
మంగళ వారము	3	4-30	12	1-30
బుధవారము -	12	1-30	10-30	12
గురువారము -	1-30	3	9	10-30
శుక్రవారము -	10-30	12	7-30	9
శనివారము -	9	10-30	6	7-30


ANNOUNCING
A GREAT IMPROVEMENT
IN NUTRITIONAL PROGRESS
Sana-Vita
A DELIGHTFUL FOOD AND TONIC
The Goodness of Sana-Vita is composed of—
Full Cream Milk, Cocoa,
Malted Soyabean,
Essential Minerals,
Lecithin,
Vitamin B. complex.
Sana-Vita admirably incorporates all the essential improvements suggested by the latest nutritional research. It is indeed a wonderfully delicious food-drink and provides 100% concentrated nourishment in a form exceptionally easy to digest—highly Soothing and Energising. A cup taken regularly at bedtime and in the morning will produce deep restful sleep and vigour to keep you briskly going through the whole day. It is invaluable to all alike and specially to growing children, expectant and nursing mothers, convalescents and brain-workers.
Sana-Vita can be taken freely at all hours. Fascinatingly flavoured—easy to make—only hot water required.
NATIONAL NUTRIMENTS
RESEARCH IN NUTRITION
THE
Vita-milk
PEOPLE
LTD.
12, CHOWRINGHEE SQUARE, CALCUTTA
A.A.S



స్వల్పాహారమును అధిక ప్రయోజనకారిగ చేయుట యెట్లు.

దేశమున ఆహారకొరతవల్ల, ప్రస్తుతము కనీస అవసరములవరకు, రేషనులు నిర్వహింప బడుచున్నవి. ఈరోజులలో అందుచేత, స్వల్ప ఆహారమును అధిక ప్రయోజనకరముగ చేయుట బాధ్యతకల ప్రతి గృహిణియొక్క ధర్మమైయున్నది.

ఇందుకొఱకై మీ భోజనపదార్థములు సాధ్యమైనంత రుచికరముగ తయారు చేయబడునట్లు చూడుడు. స్వస్తిక్ గోవాలిన్ బ్రాండు వనస్పతితో, పూరీలు, చపాతీలు, బజ్జీలు, మున్నగు సకల భోజన పదార్థములు మిక్కిలి రుచ్యములై యుండును. ఉత్తమ శాకముల నుండి తీయబడి శక్తి సమృద్ధమైన ద్రవ్యములతో తయారైన గోవాలిన్ బ్రాండ్ వనస్పతి, దానిగుణమును చెడనీయని పరిశుద్ధములైన సీలు డబ్బాలలో మీవద్దకు చేరును.

అన్ని స్టోరులలోను 2, 5, 10 పౌనులలో దొరుకును.

స్వస్తిక్ వారి యితర ప్రాడక్టులలో సువాసన ఆముదము,
కాంతి సోప్, యితర టాయిలెట్ సబ్బులు, స్వస్తిక్ షేవింగ్ స్టిక్,
బట్టల సబ్బులు చేరియున్నవి.



SWASTIK VANASPATI

UNMATCHED FOR QUALITY

SWASTIK OIL MILLS LIMITED, Wadala, BOMBAY.

SDM-4 SHILPI


BE INDIAN - - - - - - - - - -BUY INDIAN!

సేల్సుడిపో, మద్రాసు నెం. 14, జి. స్ప్రింగర్ వీధి, లోన్‌స్క్వేర్, మద్రాసు.
సేల్సు డిపో, బెంగుళూరు ఆర్కాట్ శ్రీనివాసాచారివీధి, బెంగుళూరుసిటీ.

ఆంధ్ర రహాట్

60 అడుగుల లోతువరకు బావులలో నుంచి నీరు తోడును.

బలిష్టమైన
పనిముట్లు!
హెచ్చు మన్నిక!



చక్కని పనితనము!
ఖర్చులేని నడక!!
సరసమైన ధర!!!

జరీబు వ్యవసాయదారులకు నారింజతోటలకును, పసుపుతోటలకును, పొగాకుతోటలకును యెంతలోతు బావులలోనుంచి యైనను సులభముగా నీరు తోడుటకు 'ఆంధ్ర రహాట్' మాత్రమే చాలా అనుకూలమైన మిషన్ అయియున్నది. అనాయాసముగాను, నిరపాయముగాను రెండెడ్లుగాని, దున్నపోతులుగాని పనిచేయుటవల్ల మూడు మోటల నీరు సులభముగా తోడవచ్చును. రహాట్‌ను నడుపుటకు ప్రతిరోజు కిరసనాయిలు, లూబ్రికేటింగు ఆయిల్ మొదలగు ఇతర ఖర్చులు ఏమిన్ని కావు. సామానులు యావత్తు బలిష్టమైన స్టీలు యాంగిల్సుతోను, షాఫ్టింగులతోను తయారుచేయబడినవి. కాబట్టి రిపేరు ఖర్చులు అనవసరము. ఆంధ్ర రహాట్ 4 సైజులలో తయారుచేయబడును. 1½, 2, 3, 4 గాలనుల బొక్కెనలు బావి లోతునుబట్టి యియ్యబడును. నాలుగుజతలు యెద్దులతో తోడు నాలుగుమోటల నీళ్లు రెండు యెద్దులతోనే వచ్చును.

మాన్యుఫాక్చరర్సు:

డైమండు మెషినరీ మాన్యుఫాక్చరింగ్ వర్క్సు, బెజవాడ.

LESSEES.

ఆంధ్ర ఇండస్ట్రియల్ సిండికేట్ లిమిటెడ్., బెజవాడ.

ప్రస్తావన

అనంత కాలప్రవాహములో మరొక్క వర్ష బిందువు, బుద్బుదరూపమున, మానవ జ్ఞాతమయిన పరిధులను గల్పించుకొని కాలాకాశములో లీనమయిపోయినది. మరొక్క బిందువు ఆ స్థాన మాక్రమించి తన జీవిత మారంభించుకొనినది.

వ్యయసంవత్సరము యుద్ధానంతర ప్రారంభ దశలలో సంభవమయినది. ప్రళయపురుషుని విలయ తాండవము సర్వభూభాగమును నిస్సార మొనర్చివైచిన సమయ మది. నాటి బీభత్స మాగినంతనే, కాళరాత్రి గడచినట్లు ప్రపంచ మొక్క నిట్టూర్పువిడిచినది. కాని శాంతిదేవత ప్రత్యక్షము కాలేదు. యుద్ధకాల జ్వర తీవ్రతకన్న యుద్ధజ్వర విముక్త పథ్యకాలమే ప్రాణాపాయాపన్న సమయముగ పరిణమించినది. కాళరాత్రి గడచినను, జేబుజీకటి తెరలలోనే వ్యయసంవత్సరము గడచినది.

యుద్ధపురుషుని ప్రళయస్వరూపములో, పాత కాలముల మంచిచెడ్డలు రెండును ఏకకాలమున నశించి పోయినవి. ప్రళయాస్త్రము ప్రత్యక్షమయినది గాని తదుపసంహారము ప్రయోగజ్ఞానముతోపాటు లభ్యము కాలేదు.

శాంతి నెలకొల్పబూనుదు నను నెపమున తన "అణుశక్తి" పరమాస్త్ర బలముచే తనమాట యావత్ప్రపంచము వినవలెనని, రష్యాను బెదరించు నెపమున, అమెరికా భయదసాంత్వన ప్రలాపములు సాగించినది. ఆ అణు అస్త్రము తనకును త్వరలో లభ్యముకాగల దన్న నెపమున రష్యా హుంకరించినది. తక్కిన భూప్రపంచ మీ యిద్దరి మధ్య నూగులాడుచున్నది.

వ్యయసంవత్సరమున జరిగిన సర్వ శాంతిప్రయత్నములలో అస్థిరత్వమే, అనుమానమే విషకీటకమై ప్రవేశించి, ప్రయత్నము లన్నియు ఫలశూన్యముగ వ్యయమై పోయినవి. యుద్ధసమయమునందాక, పరపాద దళితమై నలగద్రొక్కబడిన ప్రపంచజాతులు తమతమ హక్కులకై కృషిసల్పుటలో, ప్రతివారును, ఆహక్కులతోపాటు తమ కుండవలసిన విధ్యుక్తధర్మములను విసర్జించుకొనిరి.

యుద్ధాత్పూర్వకాలమున నియంతల చెప్పుచేతలలో దేశములు నలిగిపోయినవి. ఆయాదేశ ప్రజలు తమ స్వాతంత్ర్యములను నియంతల కప్పగించి, లభ్యమైన పరిమిత భద్రత్వములోనే తృప్తిపడిపోవదలచిరి. కాని నియంతల దాహము తీరకపోవుటచే, సర్వప్రపంచము యుద్ధములో మునిగిపోయినది. ధర్మముపేర వారి నణగద్రొక్కదలచినవారు నియంతలతోపాటు వారి ప్రజలను గూడ అణగద్రొక్కివైవసమకట్టిరి. ధర్మపక్షమున చేరి యుద్ధమొనర్చిన ప్రతివారిలోను, ధర్మావసరము తీరిపోయి, అస్తులకై రాబందులవలె కొట్లాడుకొనుట ప్రారంభమాయెను. యుద్ధవిజితులును, విజయులును కూడ నిస్సారులై, నిర్జీవసమానులై నిలిచిరి. భారత యుద్ధానంతరము, కృష్ణనిర్యాణ కల్యారంభ సందేహములు పొడమిననాడు, ధర్మజుడు భీమునితో వర్ణించిన రీతిగనే నేడును సర్వప్రపంచము నిలిచినది.

ప్రథమ ప్రపంచసంగ్రామము ధనికవాదములను కూకటి వేళ్లతో కదలించినది. కాని ప్రజాస్వామ్య, సామ్యవాదము లా స్థానమును సంపూర్ణముగ నాక్రమించుకొన లేకపోయినవి. ధనికవాదమందలి నిరంకుశగుణమునే తాము నలవరచుకొనినవి. సామ్యవాదబీజములు ఫలించ

నున్న దేశములలో నియంతృత్వమే ఆ వృత్తముల కెరువైనది. ప్రజాస్వామ్య దేశములలో ఇంతటి ప్రత్యక్ష రూపము వహింపక నిరంకుశతత్వము ప్రచ్ఛన్నముగా బలమయినది. పరస్పర దురాక్రమణావేశములలో ద్వితీయ ప్రపంచసంగ్రామ ముద్భవమవక తప్పలేదు. ఆ ఆపత్కాలావసరములలో ధనికవాద దేశములు "సామ్రాజ్యములు దైవమెరుగును, తాము బ్రతికిన చాలు" నని తాపత్రయపడినవి. స్వదేశావసరములలో సామ్యవాదసూత్రములనే ప్రాణాధారములుగ పట్టుకొనినవి. ఆపద తీరినంతనే మరల నిరంకుశపుటాశలు, ఏ అన్యాయముననో తమ పూర్వులు సాధించిన పరుల యాస్తులకై ప్రాకులాటలు మరల తలచూపినవి. కాని గృహము, దేశము, ప్రపంచము - సర్వము అణువణువున ఛిద్రమై పోయినవి. గట్టి పునాదులతో పునర్నిర్మాణము సాగించుకొనకున్న బ్రదుకే దుర్భరమైనది.

తిన తిండి, కట్ట బట్ట, నిలువనీడయు సర్వప్రపంచమునకు కరువైనకాలమున వ్యయసంవత్సర మారంభమైనది. సంవత్సరము పొడుగునను ఆ కరువల్లే పెరిగినది. సంపద శూన్యమయినను, ధనపర్యాయమైన కృతక భ్రమ ప్రపంచమంతటను పెరిగిపోయినది. ఇన్‌ఫ్లేషన్ గాలిబుడగవలె యుద్ధకాలముకన్న ఇంతింతగా పెరిగి, ఏనాడు బుస్సుమని చితికిపోయి, వస్తుదారిద్ర్యము నొక్కసారి కన్నులకు ప్రత్యక్షమొనర్చునో యన్న భీతావహమంతంతగాను పెరిగినది. ఈ మాయనుండి చీల్చుకొని బైటపడుటకు సర్వదేశ రాజ్యాంగములు ప్రయత్నమెట్లో తెలియక ప్రాకులాడినవి. ఈ మహాశక్తుల నడ్డ సామర్థ్యము గల మహావ్యక్తులు ఏదేశ రాజ్యాంగాకాశమునను పొడముట లేదు. ఈ మహానిర్మాణ కార్యక్రమమునకు వలసిన ధర్మనీతిను ప్రజలలో స్థాపింపగల మహామహుడే రాజ్యాంగములోను కనుపించుట లేదు. ఇంగ్లండు కార్మికప్రభుత్వము దినదిన గండముగా గడుపుకొనుచు వచ్చుచున్నది. ట్రూమన్ అధ్యక్షతను అమెరికా సహర్షముగా పొడిగించు స్థితిలో లేదు. ఫ్రాంసులో దినమున కొక రాజ్యాంగము మారినది. పాలస్తీనా, ఈజిప్టు, టర్కీ, ఇరానులు అంతఃకలహములకే కాక అగ్రరాజ్యత్రయ చాణక్య ప్రజ్ఞల కాస్కారమైనవి. జావా ఇండో-చైనాలు స్వాతంత్ర్యసమరమునుసాగించుచున్నవి. చైనా విదేశ శత్రువును తప్పించుకొన్నను, అగ్రరాజ్యత్రయ నాటకములలో ఇరుకుకొని అంతఃకలహములతో సతమతమైనది. భారతదేశము తాత్కాలిక ప్రభుత్వ, రాజ్యాంగ పరివత్సంపదలను బడసియు, మతకల్లోల దురంతములలో రక్తసిక్తమయిపోయినది. శాంతిసమావేశము లన్నియు స్వలాభాకాంక్షలతోను, పరస్పరావమానములతోను హాస్యనాటకములుగా తయారయినవి. అట్లాంటిక్ ఛార్టరును, శాంతిపత్రములను పుట్టించిన వారికే వాటి పవిత్రతలు గోచరించలేదు.

వ్యయసంవత్సరమున భారతదేశ మేయే శుభాశుభములను ఫలించుకొన్నదీ, మనరాష్ట్ర ప్రయత్నమేమాత్రము ముందడుగు వైచినదీ, మన విజ్ఞానసాహిత్యాభ్యుదయము లెట్లున్నదీ ఒక్కసారి సింహావలోకనము చేసికొందము.

అరువదియేండ్లుగా కాంగ్రెసు చేసిన కృషి ఈ సంవత్సరములో ఫలరూపము నందినది. భారతదేశము స్వతంత్రముకాకతప్పదని ఆంగ్లప్రభువులకు సత్యగోచరమైనది. అంతకు మూడేండ్లముందు మహాత్ముని 'క్విట్ ఇండియా'నినాదము విద్రోహకరమైన నినాదముగా తలపోసిన పరప్రభువులే, ధర్మసమ్మతమైన హితవుగా దానిని స్వీకరించి, ఎప్పుడో మేము వైదొలగుట తథ్యమని సంవత్సరప్రారంభమున రాజ్యాంగపథకమును సూచించి; సంవత్సరాంతము లోపుననే, తాము వైదొలగ దలచిన ప్రయాణ ముహూర్తమును కూడ నిశ్చయపరచుకొని వెల్లడించిరి. భారత రాజ్యాంగ పరిషత్పథకమును సర్వపక్షముల కాదరణీయము గావలెనను సదుద్దేశములోనే తమ దృక్పథరీత్యా సూచించిరి. కేంద్రమున భారతీయ ప్రభుత్వమునే తాత్కా-

లికముగా స్థాపించిరి. రాష్ట్రములలో ప్రజాప్రభుత్వములు స్థాపింపబడినవి. స్వతంత్రభారత రాజ్యాంగనిర్మాణకార్యక్రమమునకై రాజ్యాంగపరిషత్సభ సమావేశమైనది. రాజ్యాంగనిర్మాణ కార్యక్రమము ప్రారంభమైనది. కాని లీగు కలిసి రాలేదు.

బ్రిటిష్‌వారి పక్షపాతమున కలవాటుపడ్డ ముస్లిం లీగు, నేడు దేశక్షేమ కార్యాచరణ సమయము చేకూరునప్పటికి, అట్టి పూర్వపక్షపాతము తమ మంకుపట్టుకు పరిపూర్ణముగా లభించలేదను కోపముతోను, యావద్భారత ప్రాతినిధ్యమువహించు కాంగ్రెసుయెడ గల అసూయతోను ప్రతిష్టంభనాచరణమున కొడిగట్టినది. కేంద్రప్రభుత్వమున చేరి కూడ, కేంద్రప్రభుత్వములోని లీగుసభ్యులు, లీగు రాష్ట్రప్రభుత్వములు స్వార్థపరిపూరితమయిన మార్గ మవలంబించి శ్రేయోఘాతుకములయిన పాక్షికతత్వములకు ప్రోత్సాహమిచ్చిరి.

పన్నెండువందల ఏండ్లనాడు మహమ్మదీయులీదేశమున నడుగుపెట్టి, ఈ ప్రాచీన నాగరికతలో లీనమయిరి. మతసామరస్యము సంపూర్ణముగను, అవిచ్ఛిన్నముగను కుదురకపోయినను, మతకలహములేనాడును పరిమితులుదాటి పెచ్చుపెరగలేదు. కాని వ్యయ సంవత్సరము ఈ పన్నెండువందల ఏండ్లలోను ఏనాడును సంభవించనంతటి మతవిద్వేషజ్వాలలను రగుల్కొల్పుకొనినది. బెంగాల్, బీహారు ఘోరదురంతముల రక్తాక్షరములతో భారతీయ చరిత్రమున వ్యయ సంవత్సర పత్రము రక్తసిక్తమై కల్మషమైపోయినది. ఈ దారుణ హత్యాకాండను చూచినైన లీగు తన విధానమును మార్చుకోవలసి యున్నది.

ఆంధ్రుల కింకను స్వరాష్ట్రము లభ్యముకాలేదు. భాషావిషయైకరాష్ట్ర విభజనకు కాంగ్రెస్ ఏనాడో హృదయపూర్వకముగ ఆమోదమొసగినది. కాని అమాత్యరాజ్యాంగ పత్రరీత్యా ప్రస్తుతమున్న రాష్ట్రములు యథాతథముగనే రాజ్యాంగ నిర్మాణ కార్యక్రమములో స్వతంత్రభారత రాజ్యాంగము లభించుదాక వ్యవహరించవలసియున్నది. కాంగ్రెస్ సారథ్యసంఘము యావద్భారతమున భాషావిషయైక రాష్ట్రవిభజన లీసమయమున నొనర్ప సమ్మతించుటకు, సరిహద్దు సమస్యలు భాషావిషయకముగా నాగక మతవిషయములుగాకూడ ప్రకోపించి, అఖండ భారత నిర్మాణమునకు ప్రప్రథమములో అడ్డుతగులునేమో యని సందేహించినది. ఆంధ్రరాష్ట్రసమస్యను ప్రజాపరిషత్ప్రస్తుత ప్రారంభ సమావేశములలో ప్రవేశపెట్టుటకు అభ్యంతరమున్నను, రాజ్యాంగ నిర్మాణ కార్యక్రమ మారంభమైనవెనుక ఈ ప్రతిపాదనను తానే స్వయముగా ప్రవేశపెట్టుటకు తీర్మానించినది. రాష్ట్రసిద్ధి త్వరలో కలుగవచ్చునను ఆశ కాస్కారము కలిగినది.

ఈ సంవత్సరములో దేశమున శాస్త్రాభ్యుదయమెక్కువగా గలిగినదని చెప్పవచ్చును. ప్రపంచశాస్త్రజ్ఞుల పరిషత్సభ భారతదేశమున జరిగి ఆధునిక శాస్త్రయుగమున భారతదేశము వెనుకంజవేయక తక్కిన దేశములతో సమముగ నడచుట కనువైనది. భారతప్రభుత్వములు యుద్ధానంతర కార్యనిర్మాణములకై దేశీయులగు యువకులను మున్నెనాటికన్నకూడ ఎక్కువగా విదేశములలో విజ్ఞాన సంపాదనమునకై పంపినవి.

సంఘ ఆర్థిక జీవనపరిస్థితులను, సాహిత్యాది దేశకళాభ్యుదయములను ఒక్కొక్క వత్సరమంతటి స్వల్పకాలములలో హెచ్చుతగ్గులను చూచి చెప్పకొనుట కష్టము. ఆంధ్రసాహితీరంగమున, సాహిత్యపరిషత్తు మరల ఈ సంవత్సరమే నవచైతన్యముగా పొడసూపినది. అభ్యుదయసాహితీసంఘము సర్వప్రజాదరణపాత్రమైన విధానమునకై ప్రయత్నము సాగించినది. ప్రబలరూపములో సాహిత్యము ప్రత్యక్షమైనదనుకొనుటకు తగినన్ని నిదర్శనములేవియు లేకపోయినను, వెనుకంజ పడలేదని మాత్రము చెప్పకొనుటకు తగిన చైతన్యము ప్రదర్శితమయినది.

సర్వజిన్నామ సంవత్సరము భారతావనికి సర్వవిధముల నూతన యుగారంభ సమయముగనే ప్రారంభించినది. ప్రపంచార్ధగోళములలో పూర్వగోళమునంతను దాదాపు ఆక్రమించుకొని, ప్రపంచప్రజలో అర్ధభాగమున కధివాసమయిన ఆసియాఖండము తన పూర్వౌన్నత్యమును, తన మహాబలశక్తిసంపత్తిని మరచి పరపాదదళితమై శోచనీయస్థితిలో అలసి నిద్రాణమై పోయినది. నేడు భరతఖండ,మామహాప్రజకు మేలుకొలుపుపాడి, ఖండమునంతను మేలుకొలిపి, స్వాతంత్ర్య, శాంతి, భద్రతాపూరితమయిన సమిష్టి గోళముగా ముందంజవైచి, చైతన్యయుతముగా అభ్యుదయపథమునకు నడచిపోదము రండని ఆహ్వానములంపి తనయింటికందరు బందుగులను పిలుచుకొని, ఉగాదిపండుగయొనర్చుకొని, స్నేహరక్త సిందూరములతో తిలకముద్రలను బంధువదనములనుంచి, రక్త బాంధవ్యములను పెంచుకొనుచున్నది. ఆసియాఖండవాసులందరు భరతావనివంక తమ దృక్కులు పరపించి తమతమ స్వతంత్ర సంరంభములకు మార్గగామిగా గమ్మనట్లు జ్యేష్ఠస్థానగౌరవ మిచ్చుచున్నారు. భారతస్వాతంత్ర్యమును భారతీయుల పరమొనర్చు కార్యకరామతులకై సాధికారుడై నూతనరాజప్రతినిధి ఉగాదిదినమున భరతదేశమున అడుగుపెట్టినాడు. శాంతికై జరుగు ప్రపంచ మహాభద్రతాసంఘములు, స్వార్థపరిపూరితమయిన కీచులాటల నష్టదాయకత్వమును గుర్తించి సర్వతోభద్రవిధానమవలంబించు నవసరములను గుర్తించుచున్నారు. ప్రపంచార్ధవాసులకు స్వేచ్ఛాప్రాతినిధ్యములు లేనిదే ఈవిధాన మాచరణసాధ్యము కాదన్న సత్యము ప్రపంచము గ్రహించినది. ఈ శాంతిభద్రతాపరిషత్తులలో స్వతంత్ర భారతదేశమున కొక ముఖ్యస్థానము సంవత్సరారంభమునాటికే లభించి, అంతర్జాతీయసంఘములో భారత ప్రతిపాదనకఖండ జయము చేకూరినది. దినదిన ప్రవర్ధమానముగా స్వతంత్రభారతప్రాతినిధ్యము ఆ యంతర్జాతీయ సమావేశములలో ప్రాముఖ్యము వహించగల ఆశ మిక్కుటముగా తోచుచున్నది. వ్యయనామ సంవత్సరముతోనే బీభత్స మతకలహోద్రేకఘాతుకములు వ్యయమైన ట్లాశ పొడముచున్నది. సర్వాఘములు, సర్వపీడనములు జితమై, సర్వజిన్నామ సంవత్సరము సర్వప్రపంచశాంతిభద్రతాసుఖదాయకమై, "సర్వే జనాః సుఖినో భవంతు"అన్న ఆర్యమంగళాచరణమునకు సార్థకప్రతిపాదకమగుగాత యని ప్రార్థించుచున్నాము.

ఓం శ్రీ శ్రీ శ్రీ

ఉగాదివేళ

❀

= శ్రీ బులుసు వేంకటేశ్వర్లు =

ఉపనిషత్పీయూష ముపహారముగ సర్వజాతుల కందిచ్చు పూతచరిత
ప్రథితవేదవ్యాస భట్టారకపురాణ ధర్మముల్ వెదచల్లు ధన్యురాలు
దివ్యధునీ సముద్భిన్న నదీలలామలఁ గని పెంచు నమ్మలకు నమ్మ
ఐహికాముష్మికాద్యఖిలసంపదఁ జూఱగా విశ్వమున కిచ్చు పావనాత్మ
అఖిల వీరాధివీర మహాప్రభావ-భావుకులఁ బుణ్యకవిసార్వభౌమతతులఁ
గరము గని పెంచి మించిన భరతమాత - పాదములు భక్తిఁ గొల్తు నుగాదివేళ.

అలనాఁటి మునివాటికలలోనఁ దలపోసి సకలజీవుల సృష్టి సలిపె నొకఁడు [1]
సృష్టిస్థితిలయంబుఁ జేయు త్రిమూర్తుల శోధించి వచ్చిన శూరుఁ డొకఁడు [2]
తన తపశ్శక్తిచేతను జగత్క్షోభంబు మాన్పఁజాలినయట్టి మహితుఁ డొకఁడు [3]
అఖలభీకరమైన యంభోనిధిని బీల్చి మరలఁ బూరించిన మాన్యుఁ డొకఁడు [4]
దివ్యతేజోనిధులు మహోదీర్ణశక్తులైన ఋషివరు లేదేవి యనుఁగుబిడ్డ
లామహాదేవి భారతభూమి దివ్య-పాదములు భక్తిఁ గొల్తు నుగాదివేళ.

సాకారమున విశ్వజన రక్షణార్థమై పుత్రులం గాంచిన పుణ్యనదులు [5]
అమృతంబు గొనివచ్చి యార్యర్షిఁ బెంచిన విమలజీవనము నా వృక్షవితతి [6]
విమల సుక్షత్రివంశములు నశింప రాజుల దాఁచి పెంచు గోవుల గణములు [7]
స్ఖలితార్య ఋషివీర్య సారపానంబుచేఁ బరమర్షులనుగన్న చిరుమెకములు [8]
ఏమహామాత బిడ్డలై యెసఁగు కతన-జగదతీత మహాశక్తిఁ దగ ధరించె
నామహామాత భారతభూమి దివ్య-పాదములు భక్తిఁ గొల్తు నుగాదివేళ.

చలిచీమకైనఁ గష్టము కల్గ నోర్వని భరతపుత్త్రిని కృపాపరతఁ బొగడి
ఒకనికోసము తన సకలంబు నర్పించు భరతపుత్త్రిని త్యాగపరత మెచ్చి
అఖిలావనీరాజ్యసుఖమైన బొంకని భరతపుత్త్రిని సత్యపరత కెఱఁగి
తలమించి వచ్చిన ధర్మువే మది నమ్ము భరతపుత్త్రిని ధర్మపరత కలరి
యేమహాధాత్రి జనియింప నేఁగె దివికి-నఖిలపాశ్చాత్య విద్యామహా వివేకి [9]
ఆమహామాత భారతభూమి దివ్య-పాదములు భక్తిఁ గొల్తు నుగాదివేళ.

---

1. కశ్యపమహర్షి. 2. భృగుమహర్షి. 3. వసిష్ఠమహర్షి. 4. అగస్త్య మహర్షి. 5. గంగ భీష్ముని, సరస్వతి దధీచివలన సారస్వతమహర్షిని గాంచుట ప్రసిద్ధము. 6. దధీచి దేవతాప్రీతికై మరణింప నాతని భార్య గర్భిణియయ్యు సహగమనము చేయఁగా నా మెకుఁ బుట్టిన పిప్పలాదమహర్షిని వృక్షములు పెంచినవి. 7. పరశురాముఁడు లోకము నిఃక్షత్త్రము చేయుచుండఁ గొందఱురాజులను గోగణములు తమలో దాఁచి కాపాడినవి. 8. ఋష్యశృంగ మహర్షిని విభాండక వీర్యమును గ్రోలి యొక మనుఁబెంటి గన్నది. 9. పేర్కొనుల్లరు.

అజ్ఞానజనిత యుద్ధాగ్నిచేఁ గాలు విశ్వమున సుధావృష్టిఁ జల్లె నెవతె
హింసాత్మకంబైన యీవిశ్వమంత కహింసాత్మకతఁ జూపి యొసఁగె నెవతె
స్వారాజ్య సంపాదనారాములై మనఁ దన బిడ్డలకుఁ దెల్పె ధన్య యెవతె
అఖిలలోకంబుల కాధ్యాత్మికానూన దివ్యసాధనములఁ దెల్పె నెవతె
ఏమహామాత స్మరియింప నెసఁగు సకల-శోభనంబులు త్రైలోక్య శుద్ధతనుల
కామహామాత భారతభూమి దివ్య-పాదములు భక్తిఁ గొల్తు నుగాదివేళ.

స్వాగతము

●

— శ్రీ కొమరవోలు వెంకటసుబ్బారావు —

పరదేశనరపాల పరిపాలనమువోలె పతనోన్ముఖం బయ్యె పండుటాకు
జాతీయ విభవసంస్థాపన మ్మగురీతి చిగురుజండా లెత్తె చెట్టు చేమ,
చిరదాస్యబంధనచ్ఛేదనమ్ముగు భంగి నడలె నాయువుపట్లు చలికివలికి
ప్రాచ్యవిజ్ఞానదీప మ్మంటుకొన్నట్లు తపనుండు శబ్దసార్థకత నొందె
జనుల మనసుల విరియు నుత్సాహమట్లె- భసలములు మ్రోయ విప్పారె ప్రసవచయము
తగ నలంకృతమయ్యె స్వాతంత్ర్యరథము-తరలిరావమ్మ సర్వజిద్వత్సరంబ !

ఆసేతుశీతశైలాంతతార్యావర్త మండలం బధ్వరకుండమయ్యె
మిన్నంట లోలకరి మేఘమాలలు లేచి హోమధూమవితాన ముద్వహించె
దీక్షావిధుల బూని దేశనాయకు లెల్ల చదువుచున్నా రభిచార ఋక్కు-
పశువులై విశసింపబడ నొడ్డియున్నారు కుక్షికల్ నలుబదికోట్ల జనులు
ఈ మహాయజ్ఞ ఫలితమై యేపుమిగిలి- పరిణమించెడు స్వాతంత్ర్యఫలము లేమొ
యొడిన దాల్చినయటులగు పడుచునున్న- దెట్టిఫలములో! వీక్షింప నిమ్ము సుంత.

స్వత్వస్థాపనకోస మేర్పడిన యీ స్వాతంత్ర్యయజ్ఞంబులో
ఋత్విక్కుల్ పఠియించు మంత్రముల కర్థిలార్థముల్ దోచెలా
కేత్వం బయ్యె సుహృత్సహోదరవిధుల్ హింసారిరంసా ప్రమా
ణత్వంబుల్ నృపనీతి గైకొనె నికేన్యాయంబు రానున్నదో.

జనవిధ్వంసము జంతుహింసయును దేశధ్వంసముం జేసి తా
చనిమెల్ సార్థకనామయాచు వ్యయ, దేశస్వేచ్ఛకుల్ దుష్టవ
ర్తనులై కొందరు పన్నినార లవరోధవ్రాత మవ్వాని నో
య్యన బోకారిచి సర్వజిత్తను పద మ్మన్వర్థముం జేయుమా !

ప్రజలలో నైకమత్యంబు ప్రబలజేసి - దేశసంపత్తి కతిమాత్రదీప్తి గూర్చి
భారతీయుల దాస్యంబు బాపగదవె - స్వాగతము నీకు సర్వజిద్వత్సరంబ !

అట్లీ ప్రకటన: భరత ఖండమునుండి బ్రిటిషువారి నిర్గమనము

= శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య =

ఈ సంవత్సరం ఫిబ్రవరి ౨౦ తేదీన భారతదేశ విషయమై బ్రిటిష్ ప్రధాని అట్లీ ఒక గొప్ప ప్రకటన చేసెను. దాని ఫలితముగా మన దేశమునకు పదహారు మాసములలో సంపూర్ణ స్వాతంత్ర్యము లభించు నని ప్రముఖులందరు అభిప్రాయపడుచున్నారు. నిజముగా అట్లే జరిగి నచో అంతకంటె మహాభాగ్యము మరియొకటి లేదు.

అట్లీప్రకటనలో గమనించతగ్గ అంశములు అయిదు ఉన్నవి. (౧) ౧౯౪౮ సంవత్సరం జూన్ నెల లోపుగా భరతఖండముపై బ్రిటిష్ వారికి గల అధికారమును భారతీయులపరము చేయుటకు బ్రిటిష్ ప్రభుత్వమువారి నిశ్చయము మొదటిఅంశము. (౨) ఈ నిశ్చయమునకు కారణములను సూచించుట రెండవది. (౩) భారతీయులలో ఎవరిపరముగా ఈ అధికారము మార్చబడునో వివరించుట మూడవది. (౪) ఈ మధ్య కాలములో, అనగా ఇప్పటినుండి ౧౯౪౮ జూన్‌వరకు ఇందునిమిత్తమై వారు చేయబూనుకొనిన కార్యకలాపము నాల్గవది. (౫) అధికారము వదలు కొనినతర్వాతకూడా వ్యాపార విషయములలో బ్రిటన్ ఇండియాల మధ్యన ఇదివర కుండిన స్నేహభావము శాశ్వతముగ నుండగలదని ఆశించుట అయిదవది.

అధికారమును ఫలాని తేదీనాటికి భారతీయుల పరము గావించుటకు బ్రిటిష్‌వారు సంసిద్ధులగుట ఈ అంశములన్నిటిలో ప్రధానమైనది.

ఇదివరకు ఈ విషయమై బ్రిటిష్‌వారు అవలంబించుచుండిన రాజ నీతికిని, ఇప్పటి ప్రకటనకును ఇదియే ముఖ్యమైన భేదము.

గత సంవత్సరము మే ౧౬ తేదీన మంత్రిత్రయ రాయబారము వారు చేసిన ప్రకటనలో రాజ్యాంగపరిషత్తు రాజ్యాంగవిధానము నొకదానిని అన్నిపక్షములవారి ఆమోదమున తయారుచేసి, ఆ రాజ్యాంగవిధానము ననుసరించి ఏర్పడిన ప్రభుత్వము అధికారమునకు వచ్చినవెంటనే తాము తమ అధికారమును దానిపరము చేసి వెళ్లిపోవుటకు సంసిద్ధులుగ నుండునట్లు చెప్పిరి. అప్పట్లో వారు రాజ్యాంగపరిషత్తు తలపెట్టిన పని పూర్తిఅగుటకు కొన్ని సంవత్సరములు పట్టుననియు, అంతవరకు తాము మన దేశములో యథాప్రకారము ఉండవచ్చు ననియు అనుకొనియుండిరి. కాని ఇప్పుడు ఆ అభిప్రాయమునుకూడ మానుకొనినట్లు కనుపించుచున్నది. ఏది జరిగి నను జరుగకపోయినను, రాజ్యాంగవిధానము తయారైనను, కాకపోయి నను, తాముమాత్రము ౧౯౪౮ జూన్‌నెలనాటికి అధికారమును మనపరము చేసెదరట: దీనిమూలముననే ప్రకటనలోని మొదటి అంశమునకు ఎక్కుడ లేని ప్రాధాన్యము లభించుచున్నది.

అధికారమును వదలుకొనుటకు ఒకతేదీని నిర్ణయించుటకు కారణము లేమైన ఉన్నవా? అందులో ఒక కారణమును వారు ప్రకటనలోనే సూచించియున్నారు. అన్నిపక్షములవారి ఆమోదముతో రాజ్యాంగపరిషత్తు క్రొత్తరాజ్యాంగమును తయారుచేయగలదను నమ్మకము వారి కిప్పుడు లేదు. అట్టిది తయారగుటయే తాము వెళ్లిపోవుటకు గడువుగ వా రిదివరకు ప్రకటించియుండిరి. కాని ముస్లింలీగువారు రాజ్యాంగపరిషత్తును బహిష్కరించినందున అందరి ఆమోదముపై రాజ్యాంగ మొకటి తయారగుట అసాధ్యమని వా రిప్పుడు నిశ్చయించుకొనిరి. ఇదివరకు వారు వేసు కొన్న వాయిదా ఎన్నటికికూడ రాదని వారికి తోచినది. గనుక ఆ వాయిదాతో నిమిత్తము లేకుండ ౧౯౪౮ జూన్‌నెలనాటికి వెళ్లిపోవుటకు వారు సంసిద్ధులగుట సంభవించినది.

ఇదివరలో వారు ఏదోఒక మిష బెట్టి మనదేశమందు కట్టుకొని కూర్చుండ తీర్మానించుకొనియుండిరి. కాని వారి స్థితిగతులు మారుటమూలమునను, ప్రపంచపరిస్థితులుకూడ వారికి అనుకూలములుగ లేనందునను తమ అధికారమును మన దేశములో ౧౯౪౮ జూన్ తర్వాత నిలబెట్టుకొనుట సాధ్యముకాని పని యని వారి కిప్పుడు తోచుచున్నది. ౧౯౧౯, ౧౯౩౫ లలో వారు గావించిన సంస్కరణములకు ఫలితముగా రాష్ట్రపరిపాలనమందు వారి కదివరకున్న అధికారము చాలవరకు ప్రజలెన్నుకొనిన మంత్రుల వశమయ్యెను. వారి అధికారమును నిలబెట్టుకొనుటకై కావలసిన ఉద్యోగస్థుల సంఖ్య చాలవరకు తగ్గిపోయెను. కేంద్రప్రభుత్వములోకూడ భారతీయనాయకుల సహాయముతో ఏర్పడిన మంత్రివర్గమును ఏర్పరచ వలసిన అగత్యము కలిగెను. వారి అధికారము ఇప్పటికే చాలవరకు సడలిపోయె ననియు, దానిని తిరిగి సంపాదించుట శక్తికి మించిన పని అనియు వా రిప్పుడు అభిప్రాయపడుచున్నారు.

బ్రిటిష్‌వారు ముప్పై సంవత్సరముల మధ్యన రెండు ప్రపంచ యుద్ధములలో పాల్గొనుటమూలమున వారి కదివరకుండిన బలమంతయు క్రుంగిపోయెను. అమెరికా మొదలైన ఇతరదేశములవారికి వారు ఋణగ్రస్తులైరి. విదేశములలో వారి కదివర కుండిన ఆస్తులను అమ్ముకొనవలసివచ్చెను.

ఇండియా మొదలగు దేశములను తమవశమం దుంచుకొనుటకు కావలసిన సైన్యములను సిద్ధపరచుకొనుటకు జనసంఖ్య చాలని పరిస్థితు లేర్పడెను. దేశములో వ్యవసాయమందును, గనులందును, పరిశ్రమలందును పని చేయుటకు జనము వారి కిప్పుడు దొరుకుటలేదు. విదేశములం దిప్పుడుండు వారి సైన్యములను తగ్గించుకొనినగాని పనివాండ్ర సంఖ్యను ఎక్కువ చేసుకొనుటకు వారికి వీలులేదు. వారు యుద్ధకాలమందు చేసిన ఋణములను తీర్చుకొనుటకును, వాటిపై చెల్లించవలసిన వడ్డీలను ఏటేట వాయిదామేరకు చెల్లించుటకును వారు పూర్వముకంటె ఎన్నోరెట్లు ఎక్కువగ కష్టపడి పని చేసి, ఎక్కువ వస్తుసామగ్రిని తయారుచేసి విదేశములకు పంపవలసి యున్నవి. వారికి కావలసిన ఆహారపదార్థములు విదేశములనుండి రావలసి యున్నది. వాటికి బదులుగా వారు తమ దేశములో ఇతర దేశములవారికి కావలసిన పదార్థములను విరివిగ తయారుచేయవలసి యున్నది. అనగా బ్రిటిష్‌వారు ఆర్థికముగ ప్రస్తుతము గొప్ప చిక్కులో నున్నారు. వారి కిది వరకున్న అర్థబలము, సైనికబలము తగ్గిపోయినది. ఇందుచేతనే వారు ఈజిప్టు మొదలైన దేశములనుండి నిర్గమించుట అవసరమయ్యెను. మన దేశమందుండికూడ వారు నిర్గమింప నిశ్చయించుటకు ఇదియే కారణము.

రెండవ ప్రపంచయుద్ధమునకు ఫలితముగా బ్రిటిష్‌వారు క్రుంగిపోవుటయేగాక, అమెరికావారు, రష్యావారు బలవంతులైరి. వారితో పోటీచేసి, విదేశములందు తమ సామ్రాజ్యమును నిలుపుకొనుటకు కావలసిన అనుకూలములు బ్రిటిష్‌వారి కిప్పుడు లేవు. శక్తికిమించిన బాధ్యతను వహించుట లాభకారి కాదని వారు గుర్తించిరి.

ఫిబ్రవరి ౨౦ తేదీన అట్లీ చేసిన ప్రకటనను మనము నమ్ముట యుక్తమా? ఈ ౧౬ నెలల మధ్యన వారు మరొక ప్రకటనను చేసి వారి వైఖరిని మార్చుకొనగూడదా? అను వాదములో సత్యము లేకపోలేదు.

కాని, బ్రిటిష్‌వారు మన దేశమును వదలుకొన నిశ్చయించుటకు వారి దౌర్బల్యమును, ప్రపంచపరిస్థితులు మారుటయు ప్రధాన కారణములని మనము గుర్తించినయెడల అట్లీ చేసిన ప్రకటనను వారు సామాన్యముగ మార్చుకొనజాలరని చెప్పవలసివచ్చును.

ఇపుడు మనము విమర్శించవలసిన విషయ మేది అనగా, "వారు అధికారమును ఏ భారతీయుల పరము చేయుటకు ఉద్దేశించియున్నారు?" అనుటయే.

అధికారమును వారు ఎవరివశము చేయుదురు? మొకటి పక్షము. దీనినిగురించి వారు ఇదమిత్థమని సూచించలేదు. ఇట్లు సూచించక, భిన్న మార్గముల ననుసరించతలచుటలోనే అట్లీ బ్రిటిష్‌వారియొక్క నీతికౌశలమును చూపియున్నారు. ప్రకటనలోని మాహాత్మ్యమంతయు ఇందులోనే ఇమిడియున్నది.

"ఏ భారతీయులు అధికారమునకు రావలయును" అను విషయములో అట్లీ నాలుగు మార్గములను, నాలుగు సందర్భములను సూచించి యున్నారు: (౧) అన్నిపక్షములవారు—అనగా కాంగ్రెస్, ముస్లింలీగు, సంస్థానాధీశులు—కలిసి రాజ్యాంగపరిషత్తులో సమాలోచన చేసి అందరి ఆమోదముమీద ఒక రాజ్యాంగవిధానమును ౧౯౪౮ జూన్‌నెలలోపుగ తయారుచేసినయెడల, ఆ విధానము ననుసరించి ఏర్పడు మంత్రివర్గమునకు తమ అధికారము నంతను ఇచ్చివేయుట మొదటి సూచన. ఇట్లు జరుగుటయే అందరూ కోరదగినది. కాని ముస్లింలీగువారు రాజ్యాంగపరిషత్తులో చేరు సూచన లేవియు కనుపించుటలేదు. ముస్లింలీగువారి ఆమోదములో పరిషత్తుద్వారా క్రొత్తరాజ్యాంగము ౧౬ నెలలలో ఏర్పడుటయు అసంభవమని చెప్పవలసియున్నది. దీనికితోడు సంస్థానాధీశులు కొందరు తాముకూడ రాజ్యాంగపరిషత్తులో చేరుట లేదని బెదరించుచున్నారు. రాజ్యాంగపరిషత్తు అన్నిపక్షముల ప్రతినిధులతో కలిసి పనిచేయగల సంస్థ అగునని చెప్పుటకు వీలులేదు. అయినప్పటికీ ఇప్పుడు అందులో చేరియుండు సభ్యులూ, నాయకులూ దేశమున కంతకూ వర్తించగలిగినట్టియు, ఆదర్శపూర్వకమైనట్టియు రాజ్యాంగమును నిర్మాణము చేయుదురనుట నిస్సంశయము. కాని ఆ రాజ్యాంగమును దేశమున కంతకు వర్తించునట్లు చేయుటకు బ్రిటిష్‌వారు అంగీకరించజాలరు. హిందువులు అధికసంఖ్యాకులుగ నుండు (౧) మద్రాసు (౨) బొంబాయి (౩) మధ్యరాష్ట్రములు (౪) ఒరిస్సా (౫) సంయుక్తరాష్ట్రములు (౬) బీహారు వీటితో కూడిన ప్రదేశమునకు మాత్రమే అది వర్తించునని బ్రిటిష్‌వారు వాదింతురు. బహుశః వీటితో (౭) అస్సాంకూడ కలియవచ్చును. గనుక ౧౯౪౮ జూన్‌నెలలోపుగా యావద్భారతఖండమునకు ఒక కేంద్రప్రభుత్వమేర్పడు సూచనలు కనుపించుటలేదు.

బ్రిటిష్‌వారి కౌశల్యమంతయు ఇందులోనే ఉన్నది. మంత్రిత్రయము వారు ౧౯౪౬ మే ౧౬ తేదీన చేసిన ప్రకటనలో దేశమును రెండు స్వతంత్రరాజ్యములుగా విభజనచేసి, పాకిస్థానమును, హిందూస్థానమును వేరువేరుగా ఏర్పరచుట శ్రేయస్కరము కాదని వాదించిరి. అట్టి విభజన శ్రేయస్కరము కాదని వా రిప్పుడుకూడ గట్టిగ చెప్పియుండవలసినది. అట్లీ తన ప్రకటనలో అట్లుచేయక బ్రిటిష్ అధికారమును ఒక కేంద్ర ప్రభుత్వమునకు గాని, లేక అనేక ప్రభుత్వములకుగాని ఇచ్చివేయునట్లు ఉద్ఘాటించెను. ఇంతవరకు ఎట్టి రాజ్యాంగవిధానము దేశమునకు నష్టకరముగ నుండునని లేబరుమంత్రి వర్గమువారు విశ్వసించిరో అట్టి రాజ్యాంగమును ఆమోదించుటకు వా రిప్పుడు సంసిద్ధులైరి.

లీగు పరిషత్తులో చేరని సందర్భమున బ్రిటను మూడు పద్ధతులను అనుసరింప దలచియున్నది: (అ) బ్రిటిష్ రాష్ట్రములలో కొన్నిటిని కలిపి, ఆ సముదాయముపై ఏర్పడు కేంద్రప్రభుత్వమునకు ఆ రాష్ట్రములపై అధికారమును ఇచ్చుట. అనగా హిందువులు అధికసంఖ్యాకులుగ నుండు ఆరు రాష్ట్రములకు కలిపి ఒక కేంద్రప్రభుత్వమును స్థాపించుట అని దీనికి అర్థము. (ఆ) తక్కిన ప్రదేశములలో రాష్ట్రప్రభుత్వములకు అధికారమును అప్పగించుట, అనగా బెంగాలు, పంజాబు, సింధు, వాయువ్య రాష్ట్రములలో ౧౯౪౮ జూన్ నాటికి ఉండు రాష్ట్రప్రభుత్వములకు సంపూర్ణాధికారము ఇచ్చుట అని అర్థము. (ఇ) ఈ రెండు మార్గములు గాక ఏది యుక్తముగ నుండునో, భారతీయుల శ్రేయస్సునకు ఎవరి అధికారము అనుకూలముగ నుండునో అట్టివారికి దేశముపై అధికారమును ఇచ్చుట. (అ), (ఆ) మార్గములు రెండునూ ఒక పక్షములో బ్రిటిష్‌వారు అనుసరింతురు. (ఇ) మార్గమును అది కానిపక్షములో అనుసరింతురు.

ప్రమాదమంతయు ఇందులోనే—ఈ ద్వైపక్షములోనే—ఉన్నది. ఆ ప్రమాద మెట్టిదో ఇప్పుడు పంజాబునందును, సింధురాష్ట్రమందును జరుగుచుండు చర్యలవలన మనకు స్పష్టమగుచున్నది. రాష్ట్రములందు అధికారములో నుండు ఏకపక్ష మంత్రివర్గములకు సర్వాధికారమును అప

గించినట్లు ప్రకటించుటవలన పంజాబులో గొప్పవిప్లవము ప్రారంభమైనది. అట్లీప్రకటనను చేసినరోజున పంజాబులో యూనియనిస్టు పార్టీకి చెందిన మిశ్రమంత్రివర్గము అధికారములో ఉండెను. ఈ పార్టీలో మహమ్మదీయులే గాక, హిందువులు శిక్కులు సభ్యులుగనున్నారు; అందుచేత ఈ మంత్రివర్గము ముస్లిం హిందూ శిక్కునాయకులతో కూడియుండినది. ఇదే మంత్రివర్గము ౧౯౪౮ జూన్‌వరకు అధికారములో నున్నయెడల బ్రిటిష్‌వారు పంజాబులో వదలుకొను అధికారమంతయు వీరి చేతులలోనికి రావలసినది. కాని లీగువారికి ఇది ఇష్టములేదు. బ్రిటిష్‌వారి స్థానమున పంజాబులో ఏర్పడవలసిన ప్రభుత్వము లీగుప్రభుత్వమని వారి సిద్ధాంతము. దానిని అనుసరించి వారు మిశ్రమమంత్రివర్గమును అధికారమునుండి తొలగించుటకై శాసనోల్లంఘనోద్యమము నొకదానిని లేవదీసి అధికారమునకు వచ్చుటకు విశ్వ ప్రయత్నము చేయుచున్నారు. కాని పాకిస్థాన్‌వాదులై, పంజాబును భరతఖండ కేంద్రప్రభుత్వమునుండి వేరుపరచి ప్రత్యేక స్వతంత్ర రాజ్యముగ మార్చుటయే ప్రధానోద్దేశముగా గల లీగుప్రభుత్వస్థాపనమును ఎన్నడుగాని సమ్మతింపని హిందువులు, శిక్కులు లీగుప్రభుత్వ స్థాపనకు విముఖత చూపుచున్నారు. వీరి వ్యతిరేకతను లీగువారికి అణచివేయుట సాధ్యముకాని పని. బ్రిటిష్‌వారు ఈ ౧౬ నెలలలో వారి సైన్యములతో లీగునకు సహాయపడిననూ అదిసాధ్యముకాదు. దీని పరిణామము ఎట్లుండునో చెప్పుటకు వీలులేదు. హిందువులు, శిక్కులు అధికసంఖ్యాకులుగ నుండు పంజాబుజిల్లాలన్నియు ప్రత్యేక రాష్ట్రముగ ఏర్పడగలవు. పంజాబునంతను లీగువారు ఏలుటకు బదులు, మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగ నుండు ప్రదేశములందు మాత్రమే వారు పరిపాలకులగుట జరుగును.

సింధురాష్ట్రమందు ప్రస్తుతమున్నది లీగు ప్రభుత్వమే. ఇక్కడ రాబోవు ౧౬ మాసములలో మార్పేమియు నుండుటకు వీలులేదు. ఇచ్చటి లీగువారు తమ రాష్ట్రము సంపూర్ణస్వాతంత్ర్యము ననుభవించు రాజ్యమగునని అపరిమితమైన ఉత్సాహములో ఉన్నారు. అనగా ఇచ్చట పాకిస్థానము స్థాపింపబడ్డ దన్నమాట.

వాయవ్యరాష్ట్రమందు ప్రస్తుతము కాంగ్రెస్ పక్షమునకు చెందిన మంత్రివర్గమువారు అధికారములో నున్నారు. ఇందలి పఠాన్ ప్రజలలో చాలభాగము ఇదివరకు కాంగ్రెస్ పక్షములోనివారే. కాని వీరిని లీగుపక్షములో చేర్చి, ఇచ్చటకూడ లీగ్ ప్రభుత్వమును స్థాపించి, ఈ రాష్ట్రమును పాకిస్థానముగ మార్చుటకు లీగువారు శాసనోల్లంఘనోద్యమము, ప్రత్యక్ష కార్యక్రమము (Direct Action) ను ప్రారంభించియున్నారు.

ఇక బెంగాలురాష్ట్రపు పరిస్థితులు ఎట్లుండునో ఊహించవలసియున్నది. పశ్చిమబంగాళమందలి జిల్లాలన్నిటియందును హిందువులు అధికసంఖ్యాకులుగ నున్నారు. వీరి సంఖ్య రెండున్నరకోట్లు ఉండును. ప్రస్తుతము బెంగాలునందు లీగుప్రభుత్వమున్నది. ఈ ప్రభుత్వముయొక్క ప్రోత్సాహముచేతనేమి, చేతకానితనమువలననేమి నవకాళీ దురంతములు జరిగినవి. లీగు ప్రభుత్వముక్రింద హిందువులు సుఖింతు రను ఆశ వదలుకొనవలసివచ్చెను. బ్రిటిష్‌వారు వారి అధికారమునంతను లీగు ప్రభుత్వ పరము చేయుట పశ్చిమబంగాళములోని హిందువులు ఎన్నటికికూడ సహింపజాలరు. పశ్చిమబంగాళము ప్రత్యేకరాష్ట్రముగ ఏర్పడవలెనని వారు సూచించుచున్నారు. ఈ సూచన ననుసరించి అచ్చటకూడ విప్లవ మొకటి బయలుదేరునని చెప్పుటలో సాహస మేమియులేదు.

అనగా అట్లీ ప్రకటన బెంగాలు పంజాబు వాయవ్యసరిహద్దురాష్ట్రములలో గొప్ప విప్లవమునకు కారణభూత మయ్యెనని చెప్పవలసియున్నది. "బ్రిటిష్‌వారు వారి అధికారమును వదలుకొంటున్నారు. వారి స్థానే ఎవరు అధికారమును ఆక్రమించుకొనుట?" అనుటయే ఈ రాష్ట్రములలోని విప్లవములకు మూలము.

అఖండహిందూస్థాన మనగా హిందువులకు మహమ్మదీయులు లోబడుటయే అను నవాదమును లేవదీసి పాకిస్థాననిర్మాణము దీనికి విరుగుడని ప్రచారముచేయు లీగువారు పాకిస్థాన మనగా పంజాబు బెంగాలు సింధు రాష్ట్రములలో అల్పసంఖ్యాకులగు హిందువులు, శిక్కులు మొదలైనవారు మహమ్మదీయులకు లోబడుట అను వాదము అన్యాయమని ఎట్లు చెప్పగలరు?

దీనినిబట్టి తేలిన సారాంశ మేమిటి? బ్రిటిష్ ఇండియా హిందూస్థానము, పాకిస్థానము అను రెండు స్వతంత్రరాజ్యములుగ ఏర్పడుటకు బదులు అట్లీ ప్రకటనవలన హిందూస్థానము, తూర్పుబంగాళము, పశ్చిమ బంగాళము, పశ్చిమపంజాబు, తూర్పుపంజాబు, వాయవ్యసరిహద్దురాజ్యము, సింధురాజ్యము అని ఏడు స్వతంత్రరాజ్యములుగ ఏర్పడు సూచనలు బయలుదేరినవి. దేశమును ఇన్నిరాజ్యములుగా చీల్చివేయుట బ్రిటిష్‌వారి ఉద్దేశము అవునో కాదో మనము చెప్పలేము. కాని ప్రకటనలోని సూచనవలన కలుగనున్న ప్రమాద మిదియే.

ప్రకటనవలన కలుగదగిన ప్రమాద మింతమాత్రమే కాదు. పై వివరణ మంతయు బ్రిటిష్ ఇండియాకు మాత్రము సంబంధించినది. అట్లీ ప్రకటనలో సంస్థానముల విషయమైకూడ రెండు ముఖ్యములైన సూచన లున్నవి. ప్రస్తుతము బ్రిటిష్‌వారికి సంస్థానములపై సంపూర్ణాధికారమున్నది. ఈ అధికారమును వైస్రాయి చెలాయించుచున్నారు. సంస్థానముల నేలు రాజులను సింహాసనముపై ఉంచుటకును, సింహాసనమునుండి తొలగించుటకును, వారి పరిపాలనావిధానమును విమర్శించుటకును, ఖండించుటకును, వారి కిష్టములేనివారిని కూడ మంత్రులుగ నియమించుటకును బ్రిటిష్‌వారి కధికారమున్నది. ఈ అధికారమునకు సార్వభౌమాధికారము (Paramountcy) అని పేరు. బ్రిటిష్‌వారు ౧౯౪౮ జూన్‌లో వారి అధికారమును బ్రిటిష్ ఇండియాలోనివారి పరము చేయునపుడు సార్వభౌమత్వము మాత్రము వారి పరము కాజాలదు, ఇది మొకటి సూచన. కాని సార్వభౌమత్వ మనునది ఉండనే ఉండదు. ప్రతి సంస్థాన పరిపాలకుడు సంపూర్ణ స్వాతంత్ర్యము కలవాడగును. అనగా హైదరాబాదు, మైసూరు, తిరువాన్‌కూరు, బరోడా మొదలగు రాజ్యములన్నియు ఇప్పటివలె దేశమందుండు ఒక కేంద్రప్రభుత్వమునకు లోబడక, దేనికి తోచిన మార్గములో అది నడుచు స్వాతంత్ర్యము కలది అగును. దేశములో సుమారు ౬౦౦ సంస్థానము లున్నవి. ఇవన్నియు స్వతంత్రరాజ్యము లగును.

౧౯౪౨ లో క్రిప్సు రాయబారిగ వచ్చినప్పుడు ఇట్టి సూచనలనే రాష్ట్రములను గురించియు, సంస్థానములను గురించియు చేసియుండెను. అట్లీ ప్రకటనకును, క్రిప్సు ప్రకటనకును అనేకవిషయములందు పోలిక లున్నవి.

వీటి అన్నిటియొక్క ఫలిత మేమి అనగా—౧౮ వ శతాబ్దమందు బ్రిటిష్‌వారి అధికారము దేశములో స్థాపింపబడుటకు పూర్వము ఎన్ని

స్వతంత్ర రాష్ట్రములు, ఎంత అరాచకము దేశమునందుండెనో, అంతకంటె విపరీతమైన పరిస్థితులను ఏర్పరచి, దేశమందుండి వెళ్లిపోవుటకు బ్రిటిష్ వారు సంసిద్ధులై యున్నారు. ముస్లింలీగువారికి, కాంగ్రెసుకు సామరస్యము కుదరక, లీగువారు రాజ్యాంగ పరిషత్తులో చేరనిపక్షమున దేశము ఇట్టి స్థితిలోనికి వచ్చుట తప్పదు.

కాని ఇంతమాత్రముచేత మనము నిరాశ చెందవలసినది లేదు. ప్రస్తుతము మనకు ముఖ్యముగ కావలసినది బ్రిటిష్‌వారి దాస్యమునుండి విముక్తి. వారు సామ్రాజ్యాధికారమును వదలుకొన్నయెడల మన స్థితిగతులను మనమే చక్కబెట్టుకొనుటకు వీలగును. అట్లీ ప్రకటన మూలమున మనకు ఈ లాభము తప్పక లభించగలదు.


అయితే దేశము ఒక కేంద్రప్రభుత్వమునకు లోబడక అనేకరాజ్యములుగా ఏర్పడుట నష్టకరమే. ఇదిగాక ఎవరు అధికారములో నుండుట అను విషయమై మహమ్మదీయులు అధికసంఖ్యాకులుగ నుండు రాష్ట్రములలో విప్లవములు, అంతర్యుద్ధములు బయలుదేరగలవు. ఇదికూడ నష్టకరమే. హిందువులు అధికసంఖ్యాకులుగనుండు రాష్ట్రములలోకూడ కాంగ్రెసుపక్షమువారికిని, సోషలిస్టులు కమ్యూనిస్టులు మొదలైన ఇతరపక్షములవారికిని కొంత సంఘర్షణ సంభవించవచ్చును. అనగా బ్రిటిష్‌వారు అధికారమును విసర్జించినతర్వాత కొంతకాలమువరకు మనము శాంతిభద్రతలకు దూరమగుదుమేమో! కాని ఇది తప్పదు. బ్రిటిష్‌వారు దేశమందున్నను ఇట్టి పరిస్థితులు తప్పవు. కాని ఇంతమాత్రముచేత అట్లీ ప్రకటనలో సూచించిన బ్రిటిష్ నిర్గమనము జరుగకూడదని వాదించువా రెవ్వరును ఉండరు.

దేశమందు స్వతంత్రరాజ్యము లనేకములు ఏర్పడినను అట్టి విధానము చాలకాలము సాగకుండునట్లును, దాని మూలమున విస్తారప్రమాదము కలుగకుండునట్లును మన నాయకులు తగిన చర్యను తీసుకొనవలెను. స్వదేశసంస్థానములలో అనేకములు ఈ విప్లవకాలమందు వాటి ప్రత్యేకతను నిలుపుకొనజాలవు. అవి సమీపమందుండు రాష్ట్రములలోగాని పెద్ద సంస్థానములలోగాని కలిసిపోవును. సంస్థానము లనేకములలో ప్రజలు రాజకీయవిజ్ఞానము కలవారై, నిరంకుశప్రభుత్వములను అడుగంటజేయ దీక్ష వహించియున్నారు. ఈ సంస్థానాధీశులకు బ్రిటిష్‌వారి సహాయము ప్రస్తుత ముండుటచేత ప్రజల ఉద్యమములను వారణచివేయగలవారై ఉన్నారు. బ్రిటిష్‌వారి అధికారము అంతరించినతర్వాత వీరు ప్రజలకు లోబడుట తప్పదు. సంస్థానప్రజల ఉద్యమమునంతను ప్రస్తుతము కాంగ్రెసు పక్షమువారు పూర్తిగ నడుపుటలేదు. కాని ఇకమీదట వారు నడపగలరు. దాని మూలమున సంస్థానములలో చిన్నవాటిమూలమున కలుగగల ప్రమాదము తగ్గిపోవును.

హైదరాబాదు, కాశ్మీరము మొదలైన పెద్దసంస్థానములుమాత్రము వాటి స్వాతంత్ర్యమును వదలుకొనుటకు అనుమానించవగలవు. కాని కాంగ్రెసుపక్షమువారు అన్నిసంస్థానములతో రాయబారములు జరిపి, వాటి నన్నిటిని ఒక కేంద్రప్రభుత్వమునకు లోబడి ప్రవర్తించునట్లు చేయవలసి ఉన్నది. ఇదంతయు జరుగుటకు కొన్ని సంవత్సరముల కాలము పట్టవచ్చును. ౧౯౧౭ లో రషియాయందు విప్లవము సంభవించినపుడు అంతకు పూర్వము రషియాలో చేరియుండిన రాష్ట్రము లనేకములు విడిపోయి స్వాతంత్ర్యమును ప్రకటించెను. కాని విప్లవప్రభుత్వమును స్థాపించిన కమ్యూనిస్టుపక్షమువారు తమ బలమును వృద్ధిజేసుకొని క్రమక్రమముగ ఈ రాష్ట్రములన్నిటిని రషియాలో చేర్చగలిగిరి. ఆదేవిధముగ హిందువులు అధికసంఖ్యాకులుగ నుండు రాష్ట్రము లన్నిటిలో ఏర్పడియున్న కాంగ్రెసుపక్షమువారు ఈ రాష్ట్రముల కలయికవలన ఏర్పడు రాజ్యములో తమ బలమును స్థిరపరచుకొని క్రమక్రమముగ ఇతరభాగములను తమ పలుకుబడిలోనికి తెచ్చుకొనుటకు ప్రయత్నించవలెను, కాంగ్రెసుకు లోబడియున్న హిందూస్థానము చిన్నరాజ్యముకాదు. దేశములో చాలభాగము ఇందులో కలిసియుండును. ౧౯ వ శతాబ్దములో బ్రిటిష్‌వారు చేయగలిగినట్టి పనిని దేశాభిమానపూరితులగు కాంగ్రెసు పక్షమువారు ౨౦ వ శతాబ్దములో చేయలేని పక్షమున స్వరాజ్యమునకు మనకు అర్హత లేదనియే చెప్పవలసి వచ్చును. బ్రిటిష్‌వారు వారి అధికారమును వదలుకొనినతర్వాతనే మనకు నిజమైన పరీక్షసమయము సంభవించనున్నది. మన చిక్కులన్నియు అప్పటినుండియే ప్రారంభము కాగలవు. సామ్రాజ్యమును నిర్మూలము చేయుటయందు మనము చూపిన శక్తిసామర్థ్యములకంటె ఎన్నియో రెట్లు ఎక్కువ శక్తిసామర్థ్యములను నిర్మాణకార్యక్రమమును సాగించుటయందు చూపవలసియున్నది.

ఇంతకూ బ్రిటిష్‌వారు వారిఅధికారమును బెంగాలు,పంజాబు మొదలైన రాష్ట్రములలో "ఇప్పుడున్న ప్రభుత్వముల" వశముచేయక, మరియొకమార్గమును వారనుసరింతురేమో అన్న సందేహమున కవకాశము లేకపోలేదు, భారతీయుల శ్రేయస్సునకు ఎవరి అధికారము అనుకూలముగ నుండునో అట్టివారి పరముగా బ్రిటిష్‌వారు వారి అధికారమును పరివర్తనము చేయునట్లుకూడ అట్లీ అతని ప్రకటనలో సూచించెను. దీనినిబట్టి వారీ విషయమునుగురించి ఇంకను ఆలోచించుచున్నారనియు, ఏ నిశ్చయమునకు రాలేదనియు చెప్పవలసియున్నది. ఇదిగాక, అట్లీ ప్రకటనలో మరియొకభాగమందు ఈ మాట లున్నవి: "బ్రిటిష్ ప్రభుత్వమువారు వారి అధికారమును ఎవరి హస్తగతము చేయదలచియున్నారో అట్టివారి ప్రతినిధులతో అధికార పరివర్తనము మూలమున సంభవించు వ్యవహారములను గురించి సంప్రదించెదరు." అని. అనగా ఇప్పటికే ఎవరికో తమ అధికారమును పరివర్తనముచేయ బ్రిటిష్‌వారు ఊహించియున్నట్లు స్పష్టమగుచున్నది. కాని వా రెవ్వరో అట్లీ బహిర్గతము చేయలేదు.

పక్షాంతరములలో ఏది అమలులోకి వచ్చునో నిర్ధారణ చేయుట కష్టసాధ్యము. కాని దేశమునందు అనేకరాజ్యము లేర్పడినను మనము నిరాశ చెందవలసిన ఆవశ్యకము లేదనిమాత్రము మనము తెలుసుకొనవలెను. క్రీ. శ. ౧౭౭౬ లో అమెరికావారు బ్రిటిష్‌వారిపై తిరుగుబాటుచేసి స్వాతంత్ర్యమునకై యుద్ధము చేయబూనినపుడు వారందరు ఒక కేంద్రప్రభుత్వము క్రింద ఉండలేదు. వారు పదమూడు స్వతంత్రరాజ్యములుగా విభాగమైయుండిరి. కాని యుద్ధము ముగిసి తర్వాత వారు ఈ విభాగము మూలమున అనేక అనర్థములకు లోబడవలసి వచ్చెను. వాటిని కొంతకాలము అనుభవించి తుదకు వాటిని తొలగించుకొనినగాని తాము బాగుపడజాలమని తలచి ౧౭౮౭ లో సంయుక్తరాష్ట్రములుగ నేర్పడి ఒక కేంద్రప్రభుత్వమును స్థాపించుకొనిరి. గనుక దేశాభిమానముతోడను, పట్టుదలతోడను మన నాయకులు పనిచేసినయెడల వెంటనే కాకపోయినను, కొద్ది సంవత్సరములలో అఖండహిందూస్థానమును స్థాపించుటకు వీలగును.



Making "West End" Watches for you
మీకొఱకు వెస్టెండ్ వాచీలు తయారుచేయుట
వెస్టెండ్ వాచ్ కంపెనీ, బొంబాయి-కలకత్తా.
రు. 107
రు. 113
రు. 87
రు. 104
WEST END WATCH CO.
BOMBAY
CALCUTTA



THE QUEEN OF TOILET SOAPS IN A *New Garb*

KERALA SOAP INSTITUTE, CALICUT


FAS-190

కేరళా సోప్ ఇన్‌స్టిట్యూట్, కాలికట్.



అతనిని నిరాశ చేశుకున్నారు

లివరు వ్యాధి తీవ్రదశలోనున్నప్పటికీ ఏ పిల్ల ప్రాణముదక్కదని అనుకోరాదు.
తెలియకనో, అశ్రద్ధవలననో లేక సరియైన చికిత్సలేకనో పిల్ల దుస్థితి చెందటంతోపాటు లివరుగట్టి పడటం, లివరుప్రదేశంలోనొప్పి. ఉష్ణోగ్రత, పసికర్లు (ఇందు వలన మూత్రము, కళ్లు, చర్మము పసుపుపచ్చగా వుండుట). పొత్తికడుపులో నీరుచేరటం. పొత్తికడుపు పెద్దదికావటం, పొత్తికడుపు



నరాలు ఉబ్బటం, కాళ్లు చేతులు, ముఖం; వాచటం ఈ మొదలైన లక్షణాలు కలుగుచున్నప్పుడుకూడ సరియైన శ్రద్ధతీసుకుని జమ్మి వారి లివర్ క్యూర్ "కాంప్లికేటెడ్" వాడినట్లయితే ప్రాణరక్షణకు అవకాశములున్నవి వేలకొలది పిల్లలను మృత్యువాతనుండి రక్షించటానికి జమ్మివారి లివర్ క్యూర్ 35 -సంవత్సరాలు పైగా ప్రఖ్యాతిగడించినది. పసిపిల్లల లివరు & స్ప్లీను వ్యాధులకు ఇదే దివ్యౌషధమని చెప్పటం అతిశయోక్తికాదు.

జమ్మి వారి
లివర్ క్యూర్

చంటి పిల్లల లివర్ మరియు స్ప్లీన్ వ్యాధులకు
అన్ని చోట్లను దొరకును.
ఉచిత ఆశ్రమములో వైద్యసలహా పొందుడు.
జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్
లివర్ క్యూర్ [illegible] అండు ఆపీసు.
మైలాపూరు, మద్రాసు. [illegible]
[illegible] బెంగళూరు సిటీ.

ఇదిగాక అధికారమును సంపాదించుటకును, అనుభవించుటకును ఏ భారతీయులకు అర్హతగలదో అట్టివారికే అధికారము లభించనున్నది గాని, బ్రిటిష్‌వారు ఎవరి కియ్యదలచెదరో వారికే అధికారము రానున్నదని అనుకొనరాదు. అనేకరాష్ట్రములలో ప్రస్తుతము కాంగ్రెసుపక్షమువారు అధికారములో నున్నారు. వీరి అధికారమునకు ప్రజాభిమానము కారణముగాని బ్రిటిష్‌వారి ఇష్టానిష్టములు కావు. బ్రిటిష్‌వారు అధికారమిచ్చుట, భారతీయులలో ఎవరో ఆ అధికారమును తీసుకొనుట అను మాటలకు అర్థములేదు. ప్రజాభిమానము మూలమునను, కార్యదక్షతవలనను ఏ పక్షమువారు ఏయే రాష్ట్రములందు అధికారమునకు రాగలరో అట్టివారే అధికారార్హులని బ్రిటిష్‌వారు పరిగణించవలసి యున్నది. వారిని కాదని మరియెవరికైన వారు అధికారమం దుంచినయెడల అట్టివారి అధికారము నిమిషమాత్రముకూడ నిలబడజాలదు. ౧౯౪౮ జూన్ నాటికి జరుగబోవునది భారతీయుల చేతులలో అధికారము క్రొత్తగ వచ్చుటకాదు. ఫలానా భారతీయులకు అధికారము వచ్చినదని బ్రిటిష్‌వారు ప్రకటించుట మాత్రమే.

అధికారము ఎవరి పరము చేయుట అను విషయమై బ్రిటిష్‌వారు ఈ ౧౬ నెలల మధ్యన మన దేశమందు జరుగబోవు చర్యలను గమనించి ఏదియో ఒక నిర్ణయమునకు రావలసియున్నది. ఇదిగాక ఈ మధ్యకాలమందు వారు కొన్ని వ్యవహారములను పరిష్కరించుకొనెదరు. ఆ వ్యవహారములు కొన్ని ప్రధాన విషయములకు సంబంధించినవి.

(౧) బ్రిటిష్‌వారికి బర్మా, మలయా మొదలగు వలసరాష్ట్రములందు ఇంకను సామ్రాజ్యాధికార మున్నది. ఇదిగాక ఆస్ట్రేలియా న్యూజీలెండులు ఆ సామ్రాజ్యములో చేరిన భాగములే. వీటిని శత్రుబాధనుండి రక్షించవలసిన బాధ్యతకొంతవరకు బ్రిటిష్‌వారిపై నున్నది. అందునిమిత్తము వారు ఇంగ్లండునుండి ఈ దేశములకు సైన్యములను, నౌకలను, ఆకాశ విమానములను, యుద్ధపరికరములను పంపవలసియుండును. ఇంగ్లండు, ఆస్ట్రేలియాల మధ్యన, మార్గములో అచ్చటచ్చట సైన్యాదులను ఉంచుకొనుటకు కావలసిన ప్రదేశములు, వసతులు వారు కల్పించుకొనవలెను. ఇట్టి సందర్భములో వారు మన దేశములో కొన్ని ప్రదేశములు, వసుపాయములు సంపాదించగోరుట సహజము. మనము ఆంగ్లేయసామ్రాజ్యములో కలిసియుండినను, లేక అందుండి విడిపోయినను, రక్షణవిషయములో ఇట్టి సహాయము వారికవసరము. ఇదిగాక మనకుకూడ రక్షణవిషయములో వారి సహాయము కొంతకాలమువరకు అవసరమగునేమో. ఈ వ్యవహారములకు సంబంధించిన అంశముల నన్నిటిని వారును మనమును పరస్పరము సంప్రతించుకొని ఏదో ఒక తీర్మానమునకు రావలసియున్నది. వారికిని, మనకును వీటి నిమిత్తమై ఒక ఒడంబడిక అవసరమగును.

(౨) ఇదిగాక వర్తకవ్యాపారముల విషయమైకూడ ఒక నిర్ణయమునకు రావలెను.

(౩) ఇంగ్లీషు ఉద్యోగస్థు లనేకులు మనదేశమం దిప్పుడున్నారు. వారు మన ప్రభుత్వముల ఉద్యోగమందు ౧౯౪౮ జూన్ తర్వాత ఉండుట కిష్టపడక పోవచ్చును. అట్టి సందర్భములో వారి కియ్యవలసిన పెన్షన్లను గురించి, నష్టపరిహారము క్రింద ఇయ్యవలసిన మొత్తములను గురించి నిర్ణయము జరుగవలసియున్నది.

(౪) ఇక్లే యుద్ధకాలమందు బ్రిటిషువారు మనకు ౧,౬౦౦ కోట్ల రూపాయలవరకు బాకీపడియున్నారు. ఈ మొత్తమును వారు మనకు చెల్లించవలసి ఉన్నది. దీనికే" స్టర్లింగు నిలవ" అని పేరు. ఈ బాకీని వారు ఎట్లు చెల్లించవలసినది, ఎంతకాలములోపల చెల్లించవలసినది—మొదలైన విషయములను గురించి వారూ, మనమూ ఒక ఒడంబడిక చేసుకొనవలెను. ఈలాటి వ్యవహారములు అనేకము లున్నవి. వీటి నన్నిటిని పరిష్కరించుకొనుటయే క్రొత్తవైస్రాయి అగు మౌంట్‌బాటన్ చేయవలసినపని.

దేశమున కంతకు ఒకే కేంద్రప్రభుత్వము ఏర్పడినయెడల ఈ ఒడంబడిక అంతయు బ్రిటిష్‌వారు ఆ ఒక్క ప్రభుత్వముతో చేసుకొనెదరు. లేనిపక్షమున దేశమందు ఎన్ని స్వతంత్రరాజ్యము లేర్పడునో వాటి అన్నిటితో ప్రత్యేకప్రత్యేకముగ వారు ఒడంబడికలు చేసుకోవలసిన అగత్యము సంభవించును. రక్షణవిషయమై వారు ప్రత్యేకముగ హైదరాబాదు, తిరువాన్కూరు, సింధురాజ్యము, బెంగాలు రాజ్యము, పంజాబురాజ్యము మొదలైన వేరువేరు రాజ్యములలోని ప్రభుత్వములతో పైన ఉదహరించిన వ్యవహారములన్నిటిని గురించి ఏదోఒక పరిష్కారమునకు రావలసియుండును. ఈ రాజ్యములలో అనేకములు చాల చిన్నవి. ఆర్థికముగ వాటికి ఎక్కువ వసతులు లేవు. అట్టి సందర్భములో వాటిని పాలించువారు బ్రిటిష్‌వారితో సరిసమానముగ బేరమాడి తమకు కావలసిన వసుపాయములను సంపాదింపగల స్థితిలో ఉండరు. వారిని మభ్యపరచి, వారిచేత తమకు అనుకూలములైన ఒడంబడికలకు అంగీకారము పొందుటకై బ్రిటిష్‌వారు ప్రయత్నింతురు. ఇందువలన దేశమునకు గొప్ప ప్రమాదము సంభవించవచ్చును. చిన్నచిన్న దేశములను పాలించు రాజులకు ఋణములనిచ్చి, వాటిని కాలక్రమమున వశపరచుకొనుట పాశ్చాత్య సామ్రాజ్యము లనుసరించు రాజనీతికి ఒక ప్రధానలక్షణము. ప్రస్తుతము అమెరికావారు గ్రీసు, ఇటలీ మొదలైన దేశములలో తమ పలుకుబడిని ఈ విధముగనే స్థాపించుకొన జూచుచున్నారు. అనేక చిన్నచిన్న రాజ్యములుగ మన దేశము చీలిపోయినయెడల మనకుకూడ ఇట్టి ప్రమాదము సంభవించవచ్చును.

ఏది ఎట్లు జరుగనున్నను రాబోవు ౧౬ మాసములు మన దేశ చరిత్రలో చాల ప్రధానకాలమని చెప్పవలసి యున్నది. బ్రిటిష్‌వారు మన దేశమునుండి నిర్గమించుట, మనకు స్వాతంత్ర్యము లభించుట, దేశమందు ఒకే కేంద్రప్రభుత్వము వచ్చుటయో, లేక అనేకప్రభుత్వములు స్థాపితములగుటయో నిర్ణయమగుట, కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టులు, సోషలిష్టులు, హిందువులు, శిక్కులు, సంస్థానాధీశులు, సంస్థాన ప్రజలు—వీ రందరు అధికారమునకై పోరుట, ఆపోరు విప్లవరూపమునుధరించుట—ఇదంతయు ఈ ౧౬ మాసములలో జరుగనున్నది. ఇది యుగసంధి. ఒక యుగము అంతరించి మరియొక యుగము ప్రవేశించు కాలము.

అమాత్యపథకం: ఉత్తరకాండ

*

— శ్రీ పోలవరపు శ్రీరాములు —

మన దేశస్వాతంత్ర్యసమరచరిత్రలో గత పన్నెండునెలలూ అతి ప్రధానమైనవి. ౧౯౪౬ మార్చిమొదలు ౧౯౪౭ మార్చి లోపుగా మన రాజకీయరంగంలో అనేక చరిత్రాత్మక సంఘటనలు జరిగినవి. బ్రిటిష్‌ప్రభుత్వపక్షమున అమాత్యత్రయం మన దేశానికి వచ్చి మూడునెలలకు పైగా వివిధపక్షాల నాయకులతోనూ రాయబారాలు జరిపింది, భవిష్యత్ రాజ్యాంగరచనకు ఒక పథకాన్ని సూచించింది, ఆ పథకానుసారం ప్రప్రథమంగా కేంద్రంలో ప్రజాప్రభుత్వస్థాపన జరిగింది, అదే పథకాన్ని అనుసరించి భారతరాజ్యాంగ పరిషత్తు కార్యక్రమం ప్రారంభమైంది—ఇదంతా ఈ పన్నెండుమాసాలలోనే.

ఇంతే కాదు. వీటన్నిటినీ మించిన మహత్తరమైన సంఘటన కూడా ఈ పన్నెండునెలల్లోనే జరిగింది. భారతదేశ స్వాతంత్ర్య సమస్యాపరిష్కారానికి బ్రిటిష్‌ప్రభుత్వం అనుసరించదలచిన నూత్న విధానాన్ని స్పష్టపరుస్తూ, ప్రధాని అట్లీ కామన్సుసభలో ౧౯౪౭ ఫిబ్రవరినెల ౨౦ వ తేదీన అతిప్రధానమైన ప్రకటన చేశాడు.

౧౯౪౮ జూన్‌నెలలోపుగానే భారతదేశ పరిపాలనాధికారాన్ని బాధ్యతాయుత భారతీయుల హస్తగతం చేయవలెనని బ్రిటిష్‌ప్రభుత్వం సంకల్పించుకున్నదని ప్రధాని ఆ ప్రకటనలో స్పష్టంగా చెప్పివేశాడు. రెండు ప్రముఖరాజకీయపక్షాలవారు ఈలోపుగా ఏకాభిప్రాయానికి వచ్చినా రాకపోయినా, ౧౯౪౮ జూన్ తర్వాత భారతదేశ పరిపాలనావిషయంలో తమకు ఏవిధమైన బాధ్యతా వుండబోవడం లేదని బ్రిటిష్‌ప్రభుత్వం ఈ కొత్తప్రకటన ద్వారా చెప్పివేసింది.

బ్రిటిష్‌వారు ఇప్పటివరకూ ఏప్రకటన చేసినా, ఏహామీ ఇచ్చినా, గత వాగ్దానభంగాలవల్లనైతేనేమి, తదితర కారణాలవల్లనైతేనేమి భారతప్రజానీకంలో అనేకమందికి అనుమానాలు, అపోహలు సహజంగా వస్తుండేవి. భారతదేశంనుంచి తమ నిష్క్రమణకు బ్రిటిష్‌వారు ఈవిధంగా ఒక స్పష్టమైన గడువును పెట్టుకొని దేశపరిపాలనాధికారాన్ని పర్యవసానంగా భారతీయులపరం చేసే లిచారంటే వాస్తవంగా ఇది అపూర్వమైన విషయమే. కాబట్టి [illegible]టిష్‌వారు ఇప్పటివరకూ చేసిన మిగతా ప్రకటనలన్నీ ఒక ఎత్తు; ఎన్ని అంతరార్థాలు, అవాంతరాలు వున్నప్పటికీ ఈ ఒక్క ప్రకటనా ఒక ఎత్తు.

ఇండియామంత్రి లార్డు పెథిక్‌లారెన్స్, బ్రిటిష్‌వ్యాపార శాఖామంత్రి సర్ స్టాఫర్డు క్రిప్స్, రక్షణశాఖామంత్రి ఏ. వి. అలెగ్జాండర్ ఈ అమాత్యత్రయం ౧౯౪౬ మార్చి మాసాంతాన మన దేశానికి వచ్చి ఏప్రిల్, మే, జూన్ మూడునెలలూ రాయబారాలు జరిపి, చివరకు మే ౧౬-వ తేదీన తమంతట తామే దేశ భవిష్యద్రాజ్యాంగ రచనకు ఒక పథకాన్ని సూచించారు. పథకప్రకటనవరకూ జరిగిన రాయబారాలను పూర్వకాండగా తీసుకుంటే ప్రకటనానంతరం జరిగిన తర్జనభర్జనలను, మీమాంసను ఉత్తరకాండగా ఎంచవచ్చు.

*   *   *   *

బ్రిటిష్‌ప్రభుత్వవైఖరిలో ఈ మార్పు రావడానికి కారణం ఏమిటి? ఇది ఎంతవరకు త్రికరణశుద్ధిగా చేసిన ప్రకటన? దీని ఆంతర్యమేమిటి? బ్రిటిష్‌వారు ఏవిధంగా అధికారాన్ని భారతీయుల హస్తగతం చేయబోతున్నారు? కాంగ్రెస్, ముస్లింలీగుల మధ్య రాజీకుదిరినా కుదరకపోయినా అధికారాన్ని అప్పగించివేస్తామంటున్నారుకదా, ఇందులోవున్న ప్రమాదాలేమిటి? ప్రయోజనాలేమిటి? అనే విషయాలను జాగ్రతగా, సాకల్యంగా పరిశీలించడం అవసరం. ఇందుకు భారతదేశ స్వాతంత్ర్యస్థాపన విషయంలో గత పన్నెండుమాసాలలో బ్రిటిష్‌ప్రభుత్వం అనుసరిస్తూవచ్చిన విధానాన్నీ, ఆయాసందర్భాలలో చేసిన ప్రకటనలనూ, వాటి అంతరార్థాన్నీ, పూర్వాపరాలనూ అవగాహన చేసుకుంటేనేగాని ఇది బోధపడదు.

*   *   *   *

అమాత్యత్రయం గతసంవత్సరం మే ౧౬ వ తేదీ రాత్రి భారతదేశరాజ్యాంగపథకాన్ని ప్రకటించింది. దీన్నే నేటికీ రాజకీయవేత్తలు బ్రిటిష్‌ప్రభుత్వపు 'స్టేట్ పేపర్' అని వ్యవహరిస్తున్నారు. ఇదే మన దేశరాజ్యాంగనిర్మాణానికి బ్రిటిష్‌వారు నిర్ణయించిన ప్రాతి

పథక. కాంగ్రెసుకు, ముస్లింలీగుకు రాజీ కుదరనికారణాన ముగ్గరు మంత్రులు బ్రిటిష్‌ప్రభుత్వ అనుమతితో స్వయంగా తయారుచేసి ప్రకటించిన పథకం ఇది. యావద్భారతదేశానికీ ఒకే ప్రభుత్వం ఉండడం శ్రేయస్కరమనీ, భరతఖండాన్ని హిందూస్థాన్‌గా, పాకిస్థాన్‌గా విభజించడం అనర్థదాయకమేగాక ప్రమాదహేతువనీ ఈ పథకంలో అమాత్యత్రయం స్పష్టపరిచింది. ౧౯౩౫ ఇండియా ప్రభుత్వచట్టం ప్రకారం కేంద్రప్రభుత్వానికి దాదాపు ౪౦ శాఖలపై అధికారం వున్నప్పటికీ, అమాత్యపథకంలో యూనియన్‌ప్రభుత్వానికి విదేశవ్యవహారాలు, దేశరక్షణ, రహదారులు, ఈ మూడుశాఖలపై మాత్రమే అధికారం ఇచ్చారు. ఈవిధంగా అతిదుర్బలమైన కేంద్రప్రభుత్వస్థాపనను బ్రిటిష్‌మంత్రులు సూచించారు. పాకిస్థాన్, లభ్యం కానందున అసంతృప్తి చెందే ముస్లింలీగును ఈ విధంగా సంతృప్తిపరచవలెనని బ్రిటిష్‌వారి ఉద్దేశము. యూనియన్ ప్రభుత్వానికి చెందని శాఖలన్నిటిపైనా రాష్ట్రప్రభుత్వాలకు అధికారం ఉంటుందన్నారు. యూనియనుకు ఒక కార్యవర్గం, ఒక శాసనసభ వుంటవి.

మనదేశంలో బ్రిటిష్‌వారి పరిపాలన ఏర్పడినప్పటినుంచీ రాష్ట్రప్రభుత్వాలనీ, కేంద్రప్రభుత్వమనీ రెండేరెండు అంతస్తులు వుంటూవచ్చినవి. అమాత్యపథకంలో యూనియన్ ప్రభుత్వం, రాష్ట్రప్రభుత్వాలే గాక, రాష్ట్రకూటాలనే మూడో అంతస్తును సృష్టించారు. దేశాన్ని 'ఏ', 'బి', 'సి' సెక్షన్‌లుగా విభజించి ఈశాన్యదిశన బెంగాల్, అస్సాం రాష్ట్రాలనుచేర్చి 'సి' గ్రూప్‌అనీ, వాయవ్యాన పంజాబు, సింధు, సరిహద్దురాష్ట్రాలను, బెలూచిస్థాన్‌ను కలిపి 'బి' గ్రూప్ అనీ అన్నారు. మిగిలిన ఆరురాష్ట్రాలూ కలిసి 'ఏ' గ్రూపు.

ఈ విధంగా ఏర్పాటయే రాష్ట్రకూటాలకు ప్రత్యేకరాజ్యాంగాలుసైతం ఉంటవనీ, ఆ రాజ్యాంగాలను, ఆ రాజ్యాంగాలకు వుండవలసిన అధికారాలను ఆయా రాష్ట్రాలనుంచి వచ్చే రాజ్యాంగ పరిషత్తు సభ్యులు నిర్ణయించాలనీ కూడా మంత్రిత్రయపథకం సూచించింది. రాష్ట్రవర్గీకరణంలో పాల్గొనడమో, మానడమో ఆయా రాష్ట్రాలే యథేచ్ఛగా నిర్ణయించుకోవచ్చునో లేదో అమాత్యపథకం ఆనాడు సందిగ్ధంగా వదిలివేసింది. ఈ విషయంలో ఉభయపక్షాలమధ్య భేదాభిప్రాయాలు ఏర్పడినవి. నిర్బంధ రాష్ట్రవర్గీకరణకు కాంగ్రెస్ ప్రతికూలం; ముస్లింలీగుకు కావలసింది నిర్బంధవర్గీకరణ. నిర్బంధంగా రాష్ట్రవర్గీకరణ ఏర్పాటుచేయడం పరోక్షంగా పాకిస్థాన్‌ను స్థాపించడమే అవుతుంది. పాకిస్థాన్‌కు ప్రతికూలంగావున్న వాయవ్య, అస్సాం రాష్ట్రాలను బలవంతాన ఆయారాష్ట్రకూటాలలో చేర్చడమే అవుతుంది.

భారతరాజ్యాంగ పరిషత్తుతో బ్రిటిష్‌ప్రభుత్వం ఒక ఒడంబడిక చేసుకుంటుందనీ, ఆ ఒడంబడిక కుదిరినతర్వాతగాని కొత్తప్రభుత్వానికి బ్రిటిష్‌వారు అధికారాన్ని అప్పగించరనీ అమాత్య పథకంలోని మరొకఅంశం. ఈ ఒడంబడిక స్వభావం ఎలా వుంటుందో బ్రిటిష్‌వారు తమ పథకంలో స్పష్టపరచలేదు. భారతదేశం ఇష్టమైతే బ్రిటిష్ కామన్వెల్తులో వుండవచ్చుననీ, లేకపోతే వుండ నవసరం లేదనీమాత్రం చెప్పారు. ఇదీ అమాత్యపథక స్థూలస్వరూపం.

*   *   *   *

ప్రజాపరిషత్తు నూత్నరాజ్యాంగాన్ని తయారుచేసి తదనుగుణంగా కొత్త కేంద్రప్రభుత్వం ఏర్పడేవరకూ 'దేశపరిపాలనాబాధ్యత నిర్వహించడానికి తాత్కాలిక కేంద్రప్రభుత్వస్థాపన జరుగుతుందని అమాత్యత్రయమే ప్రకటించింది. ముగ్గురుమంత్రులూ మన దేశంలో మకాంవేసివుండగానే, కాంగ్రెస్, ముస్లింలీగులను రెంటినీ కూడకట్టుకొని తాత్కాలిక కేంద్రప్రభుత్వస్థాపనకు మొదట సిమ్లాలోనూ, ఆ తర్వాత ఢిల్లీలోనూ కూడా రాయబారాలు జరిపారు. జిన్నా, నెహ్రూల సమావేశమైతే జరిగిందిగాని ఈ రాయబారాలేమీ ఒక ఫలితానికి రాలేదు. కేంద్రప్రభుత్వంలో ముస్లింసభ్యులందరూ లీగుకుచెందినవారే వుండాలనీ, జాతీయముస్లింసభ్యుడు వుండకూడదనీ, లీగ్ కాంగ్రెసులకు సమానప్రాతినిధ్యం అవసరమనీ జిన్నా మొండివాదన సాగించాడు. తమ సంస్థ యావద్భారత జాతీయప్రాతినిధ్యం గల ఏకైకసంస్థ కాబట్టి జాతీయముస్లింలకు ప్రాతినిధ్యం లేకపోతే తమ సంస్థ జాతీయస్వభావాన్నే కోల్పోయినట్లవుతుందని కాంగ్రెస్ వాదన సాగించింది. లీగ్ ప్రతిబంధకవైఖరివల్లనైతేనేమి, కాంగ్రెస్ పట్టుదలవల్లనైతేనేమి అప్పటిలో కేంద్రప్రభుత్వస్థాపన ఒనకూడలేదు.

ఇది ఇలా వుండగా అమాత్యపథకాన్ని ఢిల్లీసమావేశంలో ఆమోదించిన ముస్లింలీగు ౧౯౪౬ జూలై ౨౯-వ తేదీన బొంబాయిలో సమావేశమై తమ పాత నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ, పథకాన్ని తిరస్కరించడమేగాక పాకిస్థాన్‌లక్ష్యాన్ని సాధించడానికి ప్రత్యక్షప్రతిఘటనోద్యమాన్ని సైతం సంకల్పించి ఒక తీర్మానాన్ని చేసింది. ఆ విపరీత తీర్మాన దుష్ఫలితాలేమిటో దేశం నేటికీ అనుభవిస్తూనే వున్నది.

కాంగ్రెస్ కార్యవర్గం ఆగస్టు ౧౦-వ తేదీన ఢిల్లీలో సమావేశమై రాష్ట్రవర్గీకరణవిషయంలో తమ దృక్పథాన్ని స్పష్టపరుస్తూ అమాత్యపథకాన్ని పూర్తిగా ఆమోదిస్తున్నట్లు పునరుద్ఘాటనచేసింది.

అమాత్యపథకాన్ని ఎవరైతే ఆమోదిస్తారో వారికే తాత్కాలిక కేంద్రప్రభుత్వంలో పాల్గొనే అర్హత వుంటుందని కేంద్రప్రభుత్వనిర్మాణబాధ్యతను పూర్తిగాతనపై వేసుకున్న వైస్రాయి లార్డ్ వేవెల్ ముందుగానే స్పష్టంచేశాడు.

ఈ పరిస్థితులలో ౧౯౪౬ ఆగస్టు ౧౨-వ తేదీన అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు పండిట్ నెహ్రూ గాంధీజీతో ఏదోవిషయమై సంప్రతించేనిమిత్తం వర్ధాకు వచ్చివుండగా వైస్రాయిభవనంనుంచి ఈ కింది అధికారప్రకటన వెలువడింది!

"తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణం విషయమై అవసరమైన ప్రతిపాదనలు చేయవలసిందని సార్వభౌమ ప్రభుత్వంవారి ఆమోదంతో వైస్రాయి కాంగ్రెస్ అధ్యక్షుడైన నెహ్రూను ఆహ్వానించాడు. రాష్ట్రపతి ఇందుకు సమ్మతించాడు. తన ప్రతిపాదనలను వైస్రాయితో చర్చించడానికి పండిట్ నెహ్రూ త్వరలో ఢిల్లీకి రాబోతున్నాడు."

అమాత్య పథకాన్ని అఖిలభారత ముస్లింలీగు తిరస్కరించినందునా, దాన్ని ఆమోదిస్తేనేగాని కేంద్రప్రభుత్వంలో ఏ పక్షమూ పాల్గొనడానికి వీలులేనందునా బ్రిటిషు ప్రభుత్వానికి తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణం విషయంలో కాంగ్రెస్‌వారిని ఆహ్వానించక గత్యంతరం లేకపోయింది.

కొత్తగా ఏర్పడవలసిన తాత్కాలిక కేంద్రప్రభుత్వం దేశంలోని ప్రముఖ రాజకీయపక్షాలన్నిటి ప్రాతినిధ్యాన్ని కలిగివుంటేనే గాని ప్రయోజనం లేదనేవిషయాన్ని కాంగ్రెస్ గ్రహించకపోలేదు. ముస్లింలీగు సహకారాన్ని కూడా కోరుతూ నెహ్రూ వైస్రాయి వద్దనుంచి తనకు పిలుపువచ్చిన మరుసటిరోజున జవాబ్ జిన్నాకు వ్రాసినఉత్తరమే ఇందుకు నిదర్శనం. ఈ ఉత్తరం వ్రాయడంతో తృప్తిపడి వూరుకోక ౧౯౪౬ ఆగస్టు ౧౫ వ తేదీన నెహ్రూ వర్ధా నుంచి ఎకాఎకిన బొంబాయికి వెళ్లి లీగ్ అధ్యక్షుణ్ని కలుసుకొని ముఖాముఖిగా లీగ్ సహకారాన్ని కోరడముకూడా కోరాడు. కాని జిన్నా అందుకు సమ్మతించలేదు. అంతటితో గత్యంతరంలేక ఆ మరుసటిరోజునే ఢిల్లీకి బయలుదేరివెళ్లి వైస్రాయితో కేంద్రప్రభుత్వ నిర్మాణాన్ని గురించి సంప్రతించడమూ, ఒక నిర్ణయానికి రావడమూ కూడా జరిగింది. ఆగస్టు ౨౪ వ తేదీన కేంద్రప్రభుత్వంలో పాల్గొనే సభ్యులపేర్ల జాబితాను అధికారపూర్వకంగా ప్రకటించివేశారు. ఇది జరిగిన దాదాపు వారంరోజులకే సెప్టెంబరు ౨ వ తేదీనే కేంద్రప్రభుత్వ సభ్యులు అధికారాన్ని స్వీకరించారు.

రక్షణ, విదేశ వ్యవహారాల శాఖలతోసహా అన్నిటిపై అధికారంతో కేంద్రంలో ప్రజాప్రతినిధుల ప్రభుత్వం ఏర్పడడం భారతదేశ రాజకీయచరిత్రలో ఇదే ప్రప్రథమం. ౧౯౩౫ ప్రభుత్వచట్టం కింద అప్పటివరకూ కేవలం వైస్రాయి కార్యవర్గంగా మాత్రమే పని చేస్తున్న దానికి ఒకవిధంగా మంత్రివర్గస్థాయి లభ్యమైంది. ఈ మంత్రివర్గానికి నెహ్రూ నాయకుడు; ఆయనే ఉపాధ్యక్షుడు. ఏర్పడడమే తరువాయిగా ఈ కేంద్రప్రభుత్వం భారతీయుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక్క ఊపుతో పనిచేసుకుపోవడం ప్రారంభించింది. వైస్రాయిని నామమాత్రమైన ప్రభుత్వాధిపతిగా మాత్రమే వుంచి, నెహ్రూమంత్రివర్గం ముందుకుసాగిపోవడం మొదలుపెట్టింది. కాంగ్రెసుప్రభుత్వం అనుసరించవలసిన విదేశవిధానాన్ని నెహ్రూ స్వతంత్రించి నిర్ణయించ సాగాడు. వాయవ్యరాష్ట్ర కొండజాతి ప్రజల భవిష్యత్తును గురించి అత్యంత శ్రద్ధాభక్తులతో ఆలోచించడం ప్రారంభించాడు. ఇంతేగాక సాహసించి వాయవ్యరాష్ట్ర సంచార కార్యక్రమాన్ని సైతం ఏర్పాటు చేసుకున్నాడు.

* * * *

వైస్రాయి కార్యవర్గమవడానికి బదులు ఇది నెహ్రూప్రభుత్వమనే చెలామణీ కాసాగింది. తాను నియమించిన కేంద్రప్రభుత్వం సాహసోపేతమైన విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగిపోవడం చూసేసరికి వైస్రాయి లార్డువేవెల్‌కే కంటకంగా తోచినట్టున్నది. ఏదో విధంగా దాని కార్యకలాపాలకు అడ్డుతగిలితేనేగాని లాభంలేదని భావించినట్లున్నాడు. వెంటనే ఒక ఎత్తువేసి, జిన్నాను ఢిల్లీకి పిలిపించుకొని మంతనాలు ప్రారంభించాడు. ముస్లింలీగు అమాత్యపథకాన్ని ఆమోదించకపోయినప్పటికీ, కేంద్రప్రభుత్వంలో చేరవలసిందని ఆహ్వానించడం, ౧౯౪౬ అక్టోబరు ౨౫-వ తేదీన లీగుసభ్యులు కూడా నెహ్రూప్రభుత్వంలో చేరడం సంభవించింది. కేంద్రప్రభుత్వ కార్యనిర్వహణం యథేచ్ఛగా సాగకుండా అంతరాయాలు ఏర్పడడానికి అదే మొదలు. అమాత్యపథకాన్ని ఆమోదించే విషయంలో తమ బొంబాయి తీర్మానాన్ని తిరిగి రద్దుచేసుకుంటామనీ, రాజ్యాంగ పరిషత్తులో చేరడానికి కూడా ఇష్టపడతామనీ ముస్లింలీగు తనకు హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ ప్రతినిధులకు వేవెల్ తెలియజేశాడు. లీగ్ వైఖరి మారుతుందికదా అని కాంగ్రెసువారు నమ్మారు.

మీరట్ నగరంలో కాంగ్రెస్ మహాసభ నవంబరు ౨౨, ౨౩, ౨౪-వ తేదీలన జరిగినప్పుడు ముస్లింలీగుసభ్యులు కేంద్రప్రభుత్వంలో చేరినప్పటినుంచీ ప్రభుత్వనిర్వహణంలో ఎన్నెన్ని అవాంతరాలు ఏర్పడుతున్నదీ విషయనిర్ణయసభలో పండిట్ నెహ్రూ స్పష్టపరిచేసరికి భారతజాతీయవాదులకు విపరీతమైన ఆశ్చర్యం వేసింది. ఏరోజుకారోజు పరిపాలన దుర్భరంగానూ, దుస్తరంగానూ పరిణమిస్తున్నదనీ, ఇక పదిరోజులలో తాను, తనసహచరులు కేంద్రప్రభుత్వంలో వుంటామో లేదో సందేహాస్పదమైన విషయమనీ నెహ్రూ ఆనాటి సభలో అన్నాడు. ముస్లింలీగుప్రతినిధులు కేంద్రప్రభుత్వ రథచక్రాలనే తొలగించివేయడానికి ప్రయత్నిస్తున్నారనీ, ప్రభుత్వంలో 'రాజుగారి పక్షం'వలె ప్రవర్తిస్తున్నారనీ, కేంద్రప్రభుత్వ స్వతంత్రస్థాయిని విస్తరింపజేయడానికి బదులు సంకుచితపరిచి అడ్డుపడుతున్నారనీ కూడా చెప్పాడు.

నలభైకోట్లమంది భారతీయుల క్షేమాన్నీ, శ్రేయస్సునూ కాంక్షించి కేంద్రప్రభుత్వాన్ని నడపదలచినవారు కాంగ్రెసు ప్రతినిధులు; ఇక పోతే లీగ్ ప్రతినిధులు కేంద్రప్రభుత్వంలో ఎందుకు చేరిందీ 'క్వాయిదే ఆజాం', వారు చేరిననాడే మనస్సులో వున్నమాట వున్నట్టు చెప్పివేశాడు. కేంద్రప్రభుత్వంలో కాంగ్రెసు ప్రతినిధుల వైఖరిని వేయికళ్ళతో కనిపెట్టివుండడానికి కేవలం 'సెంటినల్స్'గా (రక్షక భటులుగా) మాత్రమే వారు చేరారని జిన్నా అన్నమాటలు పాఠకులకు జ్ఞాపకం ఉండవచ్చు. కాబట్టి లీగ్ ప్రతిని

ధులు కేంద్రప్రభుత్వ రథచక్రాలు తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని పండిట్ నెహ్రూ వర్ణించడంలో ఆశ్చర్యపడవలసిన దేమీ లేదు.

* * * *

కేంద్రప్రభుత్వ స్థాపన పూర్తిఅయిన తర్వాత సాధ్యమైనంత త్వరలో ప్రారంభం కావలసిన రాజ్యాంగ పరిషత్ సమావేశం అలా ప్రారంభం కాలేదు. ఒక నెలనుంచి మరొక నెలకు చాలాసార్లు వాయిదాపడింది. చివరకు ఎలాగైతేనేమి ౧౯౪౬ డిసెంబరు ౯ వ తేదీన పరిషత్ సమావేశం ప్రారంభించడానికి వైస్రాయి నిర్ణయించాడు. ముస్లింలీగు కేంద్రప్రభుత్వంలో చేరిందేగాని, రాజ్యాంగ పరిషత్తులో పాల్గొనేదీ, పాల్గొనందీ తేల్చకుండా వుండిపోయింది. అమాత్యపథకాన్ని తిరస్కరిస్తూ చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోలేదు.

రాజ్యాంగపరిషత్ సమావేశం ప్రారంభమయే రోజు దగ్గిర పడినకొద్దీ, అమాత్యపథకంలోని రాష్ట్రవర్గీకరణకు సంబంధించిన క్లాజు అన్వయం విషయమై దేశంలో తర్జనభర్జనలు, వాద ప్రతివాదనలు హెచ్చుపెరిగిపోవడం మొదలుపెట్టినవి. అస్సాం రాష్ట్రం ఈశాన్యవర్గంలోనూ, సరిహద్దు రాష్ట్రం వాయవ్యవర్గంలోనూ బలవంతాన కలిసిపోయి తమ వ్యక్తిత్వాన్ని, స్వతంత్ర ప్రతిపత్తినీ కోల్పోవలసిందేనా అనే సమస్య ఉత్పన్నమైంది. ఏది ఏమైనప్పటికీ అస్సాం తనవ్యక్తిత్వాన్ని పోగొట్టుకోకూడదని గాంధీజీ సైతం హెచ్చరిక చేశాడు.

ప్రజాపరిషత్తు సర్వస్వతంత్రాధికారాలు గల సంస్థ అనీ, అమాత్యపథకానికి కట్టుబడే అది నలభైకోట్లమంది ప్రజల క్షేమానికి అనుగుణంగా నూత్న రాజ్యాంగాన్ని తయారుచేయవచ్చుననీ, ఏవైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడుగాని, అన్వయాలు తెలుసుకోవలసి వచ్చినప్పుడుగాని ఫెడరల్ కోర్టు అభిప్రాయాన్ని తీసుకోవచ్చుననీ కాంగ్రెసు ఉద్దేశించింది. తాము చిరకాలంగా కోరుతున్న ప్రజాపరిషత్తు అమాత్యపథకంద్వారా, కొన్ని హద్దులకు లోబడినట్టిదే అయినప్పటికీ, ఏర్పడినందుకు కాంగ్రెసువారు మొత్తంమీద హర్షించారనే చెప్పవచ్చు. తాముకోరిన పాకిస్థాన్ కోరినట్లుగా ఎప్పుడైతే ఈ పథకంద్వారా లభ్యంకాదని గ్రహించారో, తాము కోరిన ప్రకారం హిందూస్థాన్‌కు ఒక రాజ్యాంగపరిషత్తు, పాకిస్థాన్‌కు మరొక రాజ్యాంగపరిషత్తు ఏర్పడడం అసంభవమనీ, బ్రిటిష్‌ప్రభుత్వం ఇందుకు పూర్తిగా ప్రతికూలమనీ ఎప్పుడైతే గ్రహించారో, అప్పుడే ముస్లింలీగు ఐనదానికీ, కానిదానికీ అడ్డుపడడం ప్రారంభించింది. కాంగ్రెసు అమాత్యపథకాన్ని సవ్యంగా ఆమోదించలేదని నెపం వేసి లీగు పరిషత్తులో పాల్గొన తిరస్కరించింది.

* * * *

అంతట గత సంవత్సరం నవంబరు మాసాంతాన బ్రిటిష్ ప్రభుత్వంవారు కేంద్రప్రభుత్వంలో పనిచేస్తున్న ఐదుగురు సభ్యులతో (ఇద్దరు కాంగ్రెసు, ఇద్దరు లీగు, ఒక సిక్కు) తక్షణమే లండనుకు బయలుదేరి రావలసిందని వైస్రాయికి కబురుచేశారు. ఏదో ముఖ్యమైన విషయాన్ని చర్చించదలచినట్లుకూడా బ్రిటిష్ మంత్రివర్గం ఈ ఆహ్వానంలో తెలియజేసింది.

అమాత్యపథకంవిషయంలో తమ వైఖరిని ఇంతకుపూర్వమే స్పష్టపరిచివున్నారు కాబట్టి ఇప్పుడు లండన్, రావలసిన ప్రత్యేక అవసరం ఏదీలేదని కాంగ్రెస్‌వారు ఈ ఆహ్వానాన్ని మొదట తోసివేశారు. ప్రధాని అట్లీయే ప్రత్యేకవిజ్ఞప్తి చేసినకారణంగా పండిట్ నెహ్రూ, సర్దార్ బలదేవ్‌సింగ్ గారలు, లీగ్‌తరఫున జిన్నా, లియాకత్ ఆలీఖాన్ గారలు కలిసి వైస్రాయి వేవెల్‌తో 'లండనుకు వెళ్ళి బ్రిటిష్‌ప్రభుత్వంతో దాదాపు వారంరోజులపాటు సంప్రతింపులు సాగించారు.

చివరకు ౧౯౪౬ డిసెంబరు ౬-వ తేదీన బ్రిటిష్‌ప్రభుత్వంవారు తాము ఏపనిమీద కాంగ్రెసు, సిక్కు, లీగునాయకులను లండనుకు పిలిపించారో ఆ మర్మమంతమాటనూ ఒక ముఖ్యమైన ప్రకటనద్వారా బయటపెట్టివేశారు.

ఈ ప్రకటనలోని ప్రధానాంశాలు ఇవి:

"నెహ్రూ, జిన్నా, లియాకత్ అలీ, బలదేవ్‌సింగ్ గార్లతో జరిపిన సంభాషణలు ఈ సాయంత్రంతో సమాప్తమైనవి. నెహ్రూ బలదేవ్‌సింగ్ గారలు రేపు ఉదయమే స్వదేశానికి తిరిగివెళ్ళుతున్నారు. రాజ్యాంగపరిషత్తులో వివిధపక్షాలవారూ పాల్గొనేట్లు చేసి, వారిమధ్య సహకారం ఏర్పడేటట్లు చేయడమే ఈ సంప్రతింపుల ఉద్దేశం. భారతప్రతినిధులు స్వదేశానికి వెళ్ళి తమతమ సహచరులతో ఆలోచించనిదే ఈ విషయంలో ఏవిధమైన అంతిమనిర్ణయానికి రాలేకపోయినారు. అమాత్యత్రయం మే ౧౬-వ తేదీన ప్రకటించిన రాజ్యాంగపథకం ౧౯ వ పేరాలోని ౫, ౭ క్లాజులవిషయంలో ముఖ్యంగా ఇప్పుడు చిక్కు ఏర్పడింది. ఇవి పరిషత్తు సెక్షన్లసమావేశానికీ, రాష్ట్రవర్గీకరణకూ సంబంధించిన క్లాజులు. సెక్షన్ల సమావేశంలో నిర్ణయాలను సాధారణపు మెజార్టీవోటునుబట్టే చేయవలసివుంటుంది. అమాత్యత్రయ ఉద్దేశం మొదటినుంచీ ఇదే. ఇందుకు భిన్నమైన ఒప్పందమేదైనా ఆయాపక్షాలవారు చేసుకుంటేనేతప్ప, పరిషత్తుసెక్షన్లు ఈ పద్ధతినే అవలంబించవలసివుంటుంది.

అమాత్యపథకంప్రకారం భారతప్రజలు రాజ్యాంగాన్ని తయారుచేయవలెనంటే, దాన్ని బ్రిటిష్‌ప్రభుత్వం పార్లమెంటు ఆమోదంకోసం ప్రతిపాదించడానికి అది అర్హతకలిగి వుండవలెనంటే, ఇప్పుడు మేము చెబుతున్న ఈ అన్వయాన్ని పథకంలో ముఖ్యమైన భాగంగా ఎంచవలసివుంటుంది. అందువల్ల రాజ్యాంగపరిషత్తులో పాల్గొనే వివిధపక్షాలవారు ఈ అన్వయాన్ని అంగీకరించితీరవలెనన్నమాట. పథకంలోని మిగతాఅంశాలు వేటికైనా అన్వయాలు కావలసి

వస్తే కాంగ్రెస్‌వారుగాని, ముస్లింలీగువారుగాని ఫెడరల్ కోర్టు నిర్ణయంప్రకారం నడుచుకొని యూనియన్ పరిషత్తులోనూ, సెక్షన్ల పరిషత్తులలోనూ అమాత్యపథకాన్ని అనుసరించవలసి వుంటుంది. అమాత్యత్రయం తమ అభిప్రాయం ఇది అని ఉద్ఘాటిస్తున్నప్పటికీ రాజ్యాంగపరిషత్తు ఈ ప్రాథమికాంశం విషయంలో ఫెడరల్ కోర్టు తీర్పును తీసుకోదలిస్తే, సాధ్యమైనంతత్వరలో అలా తీసుకొని, ముస్లింలీగు కూడా పరిషత్తులో చేరడానికి అవకాశం కలిగించాలి. అమాత్యత్రయం చెప్పే అన్వయంమాత్రం న్యాయంగా ఇదే. ఉభయరాజకీయపక్షాలకూ సమ్మతమైన విధానాన్ని అనుసరిస్తేనేగాని, రాజ్యాంగపరిషత్తు కార్యక్రమం జయప్రదంగా కొనసాగే అవకాశం ఏనాటికీ ఏర్పడదు. భారతప్రజానీకంలో ఒక పెద్దభాగానికి చెందిన ప్రతినిధులు పాల్గొనకుండానే రాజ్యాంగపరిషత్తు ఏదైనా రాజ్యాంగాన్ని తయారుచేసినట్లయితే, అట్టి రాజ్యాంగాన్ని దేశంలో విముఖంగా వున్న ప్రాంతాలకు వర్తింపజేసే ఉద్దేశం బ్రిటిష్‌ప్రభుత్వానికి లేదనే విషయం వేరే చెప్పనవసరంలేదు. ఈ విషయంలో కాంగ్రెస్ అభిప్రాయమూ ఇదే."

* * * *

సరిగా రెండు మూడు రోజులలో రాజ్యాంగ పరిషత్తు సమావేశమవుతుం దనగా బ్రిటిష్ ప్రభుత్వం ఈ అన్వయాన్ని చెప్పి, పరిషత్ సమావేశాన్ని సుళువుచేయడానికి బదులు తేలిపోని క్లిష్ట సమస్యలను తెచ్చిపెట్టింది.

ఇండియామంత్రి పెథిక్ లారెన్సు లార్డ్సు సభలో డిసెంబరు ౧౬ వ తేదీన ఒక ప్రకటన చేస్తూ రాష్ట్రవర్గీకరణ విషయంలో రాజ్యాంగపరిషత్తు సెక్షన్‌లు బ్రిటిష్‌ప్రభుత్వం చెప్పిన అన్వయానికే కట్టుబడివుండాలనీ, ఫెడరల్ కోర్టు తీర్పును పరిషత్తుసభ్యులు కోరదలుచుకున్నప్పటికీ తమ అన్వయాన్ని బ్రిటిష్‌ప్రభుత్వం మార్చుకోదనీ స్పష్టపరిచాడు. ఫెడరల్ కోర్టు తీర్పు అడిగి తెలుసుకోవచ్చునని కేవలం మాటవరసకు అన్నదిమాత్రమేనని కూడా తేల్చివేశాడు.

ఫెడరల్ కోర్టు అభిప్రాయాన్ని తీసుకోడానికి సర్వదా సంసిద్ధంగా వున్న కాంగ్రెసుకు బ్రిటిష్‌ప్రభుత్వం ఇంత ఖండితంగా తమ అన్వయాన్ని చెప్పివేసిన తర్వాత, అలా తీసుకోవలసిన అగత్యమే తొలగిపోయింది. గాంధీజీ చెప్పినట్లు మన ఫెడరల్ కోర్టు కూడా బ్రిటిష్‌వారు సృష్టించిందే కాబట్టి, అమాత్యత్రయం ఏ అన్వయాన్ని చెప్పిందో ఫెడరల్ కోర్టూ దాన్నే బలపరుస్తుందనడంలో ఆశ్చర్యమేమీ లేదు. అందుచేత కాంగ్రెసువారు ఉత్తరోత్తరా చేసే తీర్మానాలలో ఫెడరల్ కోర్టు అభిప్రాయాన్ని తీసుకునే ఉద్దేశాన్నే విరమించుకున్నారు.

వాస్తవానికి అమాత్యత్రయం డిసెంబరు ౬ వ తేదీన చెప్పింది అన్వయం కాదు; మే ౧౬ వ తేదీ ప్రకటనలో అదనంగా చేర్చిన అంశమే ననవలసివుంటుంది. ఇంతేగాక బ్రిటిష్‌వారు దీనివల్ల భారత రాజ్యాంగ పరిషత్తు స్వతంత్ర ప్రతిపత్తికి మరో భంగం కలిగించారు. ఈ కొత్త అన్వయాన్ని చెప్పి పరిషత్తు కార్యక్రమవిధానాన్ని పైనుంచిఆదేశించ బూనుకున్నారన్న మాట.

౧౯౩౫ ఇండియాప్రభుత్వచట్టం ప్రకారం వివిధరాష్ట్రాలకూ ఇచ్చిన స్వయంపరిపాలనాధికారాన్ని, అమాత్యపథకంద్వారా అపహరింపబూనుకున్నారని కూడా చెప్పవలసివుంటుంది.

పైగా, సర్వపక్షప్రాతినిధ్యంలేకుండా ప్రజాపరిషత్తు ఏదో ఒక రాజ్యాంగాన్ని తయారుచేసినట్లయితే, అట్టి రాజ్యాంగాన్ని ఇష్టంలేని ప్రాంతాలకు వర్తింపజేయబోవడంలేదని చెప్పి, బ్రిటిష్ ప్రభుత్వంవారు ముస్లింలీగ్ చూపుతున్న మొండిపట్టుదలకు మరీ ఎక్కువ ప్రోత్సాహం చేసినవారైనారు. రాజ్యాంగపరిషత్తులో చేరకుండా వున్నప్పటికీ తమకేమీ ఫరవాలేదనే ధీమా ముస్లింలీగుకు చిక్కింది.

* * * *

కాంగ్రెసుకార్యవర్గం తెలిపినట్లు బ్రిటిషుప్రభుత్వము డిశంబరు ౬న తెలిపిన వ్యాఖ్యానముద్వారా ఒక సిద్ధాంతాన్ని ఒక కార్యక్రమవిధానానికి ఎరచేసినది. అమాత్యపథకం "రాష్ట్రాలు వర్గములుగా ఏర్పడ్డానికి స్వాతంత్ర్యము కలిగివుండవలెను."అని తెలిపినది. ఈఅన్వయం రాష్ట్రఇష్టాయిష్టములతో ప్రసక్తి లేకుండచేసినది. ఇట్టి విపరీతవాదప్రతిపాదనలమధ్య, ప్రథమ భారతరాజ్యాంగపరిషత్ చరిత్రాత్మకసమావేశం ఢిల్లీలో ౧౯౪౬ డిసెంబరు ౯-వ తేదీన ముస్లింలీగుప్రతినిధులు పాల్గొనకపోయినప్పటికీ, యథావిధిగా, అనుకున్నప్రకారం, ప్రారంభమైంది. యావద్భారత ప్రజానీకానికీ ధర్మసమ్మతమైన రాజ్యాంగాన్ని తయారుచేయవలెననే అచంచలదీక్షతో దాని కార్యక్రమాన్ని అది సాగిస్తున్నది. అఖండ భారతావనికి సర్వతంత్రస్వతంత్ర ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని సిద్ధింపజేయడమే తమ ఉద్దేశమని పండిట్ నెహ్రూ ప్రతిపాదించిన పవిత్రలక్ష్యంతో పరిషత్తు పనిచేస్తున్నది. అనేకసంఘాలను, ఉపసంఘాలను నియమించి అమాత్యపథక ప్రతిపాదనలప్రకారమే రాజ్యాంగరచనకు పూనుకుంటున్నది. పరిషత్ కార్యక్రమం ముందుకు సాగిపోతున్నది.

బ్రిటిషుప్రభుత్వవ్యాఖ్యానాన్ని కాంగ్రెసు అంగీకరించిన ఆ పిమ్మట పరిస్థితిని గూర్చిఆలోచిం చుటకు లీగుకౌన్సిలును సమావేశ పరుస్తానని మాత్రము జిన్నా గారన్నారేగాని లీగు తన పూర్వనిర్ణయాన్ని మార్చుకొని పరిషత్తులో పాల్గొంటుందనిచెప్పలేదు. కాంగ్రెసుకార్యవర్గము డిశంబరు ౬ వ తేదీ బ్రిటిషువ్యాఖ్యానాన్ని అంగీకరించడమూ, తిరస్కరించడమూ అనేది నిర్ణయించడానికి అఖిలభారత కాంగ్రెసు కమిటీని సమావేశపరచదలచింది. ఒకవేళ ముస్లిములీగు తన వైఖరిని మార్చుకొని పరిషత్తులో చేరుతుందేమోననే ఆశతో ముఖ్యమైన సమస్యల చర్చను అప్పటికి పరిషత్తులో తేవద్దని కాంగ్రెసు తన పక్షీయులందరికీ తాఖీదు ఇచ్చింది. ౧౯౪౭ జనవరిమాసములో అఖిల భారత కాంగ్రెసుసంఘము సమావేశమై బ్రిటిషువ్యాఖ్యానాన్ని

ఆమోదించింది. అది సూచించినట్లుగా సెక్షనులో వ్యవహారచర్య జరుపవలసిందని రాష్ట్రప్రతినిధులకు తెలియజెప్పినది. అయితే "ఏ రాష్ట్రమును నిర్బంధించడంగాని, పంజాబులోని సిక్కుల హక్కులకు భంగము కలిగించడంగాని జరుగకూడదని విస్పష్టముగా గ్రహించవలెను" అని కూడా ఆదేశించింది.

కాని ఈ తీర్మానము లీగుప్రముఖులకు రుచించలేదు. కాంగ్రెస్ అంగీకారము నిర్దిష్టముగా లేదనీ, అనేక షరతులతో కూడి వున్నదనీ వారన్నారు. కొన్ని షరతులను చేర్చినప్పటికీ కాంగ్రెసు తీర్మానము సవ్యంగానే వున్నదని బ్రిటిషుప్రముఖులు, పత్రికలు వ్యాఖ్యానించినవి.

*　　*　　*　　*

చివరకు జనవరి ఆఖరున ముస్లింలీగు కార్యవర్గం కరాచీలో సమావేశమై, రాజ్యాంగ పరిషత్ కార్యకలాపం అశాస్త్రీయమైనదనీ, ౧౬ మే ప్రకటనహద్దులను మించి కాంగ్రెసు వ్యవహరిస్తున్నదనీ, అక్రమమైనదనీ, ఆ పరిషత్తును వెంటనే రద్దుచేయడం అవసరమనీ, వాస్తవానికి అది సవర్ణహిందూ కూటంగాని, రాజ్యాంగ పరిషత్తు కాదనీ బ్రిటిష్ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తూ తీర్మానించి, తన వక్రదృష్టిని వెళ్ళబుచ్చింది. పరిషత్తులో తాము పాల్గొనబోవడం లేదనీ, తమ బొంబాయి తీర్మానాన్ని ఉపసంహరించదలచలేదనీ ఖండితంగా చెప్పివేసింది. కాని అదివరకటిదాకా వెనుకాడుతున్న సంస్థానాధీశులు పరిషత్తులో పాల్గొనడానికి నిర్ణయించారు. ఈ సందర్భంలో కాంగ్రెసు చూపిన రాజకీయ చతురత బ్రిటిషువారికి ఆశ్చర్యము కలుగచేసినది.

అమాత్యపథకాన్నీ, ఆ పథకంలో రాష్ట్రవర్గీకరణ విధానంపై బ్రిటిషుప్రభుత్వం డిసెంబరు ౬-వ తేదీన చెప్పిన అసందర్భపు అన్వయాన్నీ కూడా ఆమోదించిన కాంగ్రెస్‌వారికి ముస్లింలీగ్ మొండివైఖరిని, విపరీతవాదనను సహించడం అసంభవంగా పరిణమించింది. అందువల్లనే ముస్లింలీగు రాజ్యాంగపరిషత్తులో పాల్గొనవైనా పాల్గొనాలి, లేదా తాత్కాలిక కేంద్రప్రభుత్వంనుంచి దాని సభ్యులు వైదొలగనైనా తొలగాలి అని కాంగ్రెసు బ్రిటిషుప్రభుత్వానికి తాఖీదు పంపింది; లీగుసభ్యులు కేంద్రప్రభుత్వంనుండి వైతొలగ తిరస్కరించారు. వారిని బర్తరఫుచేయడానికి బ్రిటిషుప్రభుత్వానికి ధైర్యము లేకపోయినది. కేంద్రప్రభుత్వంనుంచి లీగ్ ప్రతినిధులు తప్పుకొనకపోతే, కాంగ్రెస్ ప్రతినిధులే తప్పుకుంటారు సుమా అనికూడా కాంగ్రెస్ హెచ్చరిక చేసింది. వైస్రాయి లార్డు వేవెల్ ద్వారా నెహ్రూ పంపిన రెండు హెచ్చరికలతో బ్రిటిషు ప్రభుత్వానికి విపరీతమైన సందిగ్ధావస్థ ఏర్పడింది. తొందరపడి మాత్రము ఏ విపరీతనిర్ణయానికీ రావద్దని ఇండియామంత్రి పండిట్ నెహ్రూకు విజ్ఞప్తిచేశాడు. త్వరలో తమవైఖరి తెలుపుతామన్నాడు. ఆ మీదట ౧౯౪౭ ఫిబ్రవరి ౨౦ వ తేదీన కామన్సుసభలో బ్రిటిషుప్రధాని అట్లీ చరిత్రాత్మకప్రకటన చేశాడు. భారతదేశ స్వాతంత్ర్యసమస్యా పరిష్కారానికి బ్రిటిషుప్రభుత్వం ఇక అనుసరించదలచిన మార్గవిధానాన్ని ఈ ప్రకటనలో ప్రధాని స్పష్టపరిచాడు. ౧౯౪౮ జూన్ నెలలోపుగానే దేశపరిపాలనాధికారాన్ని బాధ్యతాయుత భారతీయుల హస్తగతం చేసేటందుకు బ్రిటిషు ప్రభుత్వం అవసరమైన కార్యకలాపాలను సాగించడానికి స్పష్టంగా సంకల్పించుకున్నట్లు అట్లీ తెలియజేశాడు. ఉభయపక్షాల సహకారంతో రాజ్యాంగపరిషత్తు ఈ లోపుగా ఒక రాజ్యాంగాన్ని తయారుచేయడం, దాని ప్రకారం ఒక కేంద్రప్రభుత్వం ఏర్పడడం జరగకపోయినట్లయితే (ఏర్పడుతుందనే ఆశలేదనే బ్రిటిష్‌వారి అభిప్రాయం) నిర్ణీతమైన తేదీనాటికి బ్రిటిషుఇండియాలో కేంద్రప్రభుత్వాధికారాన్ని ఎవరికి ఇవ్వాలి, మొత్తం బ్రిటిషుఇండియాకు కలిపి ఏదోఒక కేంద్రప్రభుత్వానికే ఇవ్వడమా, లేక కొన్ని ప్రాంతాలలో ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రప్రభుత్వాలకు ఇవ్వడమా, ఇవి రెండూగాకపోతే, భారతప్రజానీకానికి అత్యంత క్షేమదాయకమూ, అతిసవ్యమూ అని తోచిన మరేదైనా పద్ధతిలో ఇవ్వడమా అనే విషయాన్ని బ్రిటిషుప్రభుత్వం ఆలోచిస్తుందనికూడా అట్లీ అన్నాడు. పర్యవసానంగా అధికారదత్తతను ఆచరణలో పెట్టడానికి అనువుగా ఉత్తరోత్తరా శాసననిర్మాణం చేసి, ౧౯౩౫ ప్రభుత్వచట్టాన్ని సవరించవలసి వస్తుందని కూడా అన్నాడు. స్వదేశ సంస్థానాలపై సార్వభౌమాధిపత్యంకింద సంక్రమించిన బాధ్యతలను, అధికారాలను బ్రిటిషుఇండియాలో ఏర్పడే ప్రభుత్వానికి అప్పగించే ఉద్దేశం బ్రిటిషుప్రభుత్వానికి లేదనీ, ౧౯౪౮ జూన్‌లోపుగా ఒక్కొక్క సంస్థానంతో బ్రిటిషుప్రభుత్వానికి వున్న సంబంధాలను ప్రత్యేకఒప్పందాలద్వారా మార్చడానికి ప్రయత్నాలు జరిపే అభిప్రాయం వున్నదనీకూడా అట్లీ స్పష్టీకరించాడు. లార్డు వేవెల్ ఉద్యోగకాలం సమాప్తంగాకపోయినప్పటికీ యుద్ధసమయంలో జరిగిన అతడి నియామకాన్ని రద్దుచేసి, అతడి స్థానే లార్డు మౌంట్‌బాటెన్‌ను క్రొత్తవైస్రాయిగా నియమిస్తున్నట్లుకూడా బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించింది.

*　　*　　*　　*

బ్రిటిషువారు భారతదేశంనుంచి నిష్క్రమణకు ఈవిధంగా ఒక గడువుతేదీని నిర్ణయించడం అసాధారణమైన విషయమే. ౧౯౪౨ ఆగస్టులో గాంధిజీ నాయకత్వాన కాంగ్రెస్ ఆమోదించిన 'క్విట్ ఇండియా' తీర్మానానికి ఇది విజయమేనని చెప్పకతప్పదు. పండిట్ నెహ్రూ అన్నట్లు బ్రిటిషువారు భారతసమస్యాపరిష్కారం విషయంలో సాహసోపేతమైన, అతి సవ్యమైన నిర్ణయానికే వచ్చారు.


రెండువందల సంవత్సరాలుగా పారతంత్ర్యంలో పడివున్న యావద్భారతప్రజాకోటీ హర్షింపదగిన నిర్ణయమే. కాని, ఇందులోనూ బ్రిటిషువారు కొన్ని ప్రమాదకరమైన పేచీలను తెచ్చిపెట్ట

పోతున్నారు. యావద్భారతదేశ పరిపాలనాధికారాన్ని ఒకేఒక కేంద్రప్రభుత్వానికి అప్పగించడమో, లేక ప్రస్తుతం పనిచేస్తున్న రాష్ట్రప్రభుత్వాలకే ఇవ్వడమో బ్రిటిషుప్రభుత్వం ఆలోచిస్తుందట. ఇది దేశవిభజనకు దారితీసే అత్యంతప్రమాదకరమైన సూచన. సర్వ స్వతంత్రమైన రాష్ట్రాలు కొన్ని, తత్తుల్యమైన స్వదేశ సంస్థానాలు కొన్ని దేశంలో ఏర్పడబోతున్న వన్నమాట. దేశ భద్రతకు ఇది ఏమాత్రం వాంఛనీయంకాదు. మొఘల్ సామ్రాజ్యపతనానంతరం తాము ఏ అరాజకపరిస్థితులలో భారత దేశంపై సామ్రాజ్యాధిపత్యాన్ని స్థాపించుకున్నారో, అవే అరాజక పరిస్థితులలో భారతదేశాన్ని తిరిగి గాలిలో వదిలివేయవలె నన్నదే బ్రిటిషువారి తంత్రమా అని సందేహించవలసివస్తున్నది. దేశానికి సంభవించగల ప్రమాదాలలో ఇంతకంటే ఘోరమైనది మరేదీ వుండబోదు. బ్రిటిషుప్రభుత్వనిర్ణయంవల్ల స్వదేశసంస్థానాలవైఖరిలో ఎట్టిమార్పు వచ్చేదీ, ౧౯౪౭ జూలై ౧౫వ తేదీనుంచి తిరువాంకూరు సంస్థానం సర్వస్వతంత్రరాజ్యంగావుతుందని ఇటీవల ఆ సంస్థానప్రధాని సర్ సి. పి. రామస్వామిఅయ్యర్ గారు చేసిన ప్రకటనవల్లనే స్పష్టపడుతున్నది. కాబట్టి, నవశకోదయం కాబోతున్న ఈ క్లిష్టసమయంలో ఇటీవల కాంగ్రెస్ కార్యవర్గం చేసిన తీర్మానాన్ని శిరసావహించి, దేశంలోని వివిధపక్షాలవారు ముందుముందు ఏర్పడబోతున్న మహత్తరబాధ్యతలను సక్రమంగా ఎదుర్కొనడానికి, నలభైకోట్ల మంది భారతీయుల క్షేమాన్ని కాంక్షించి తమ తమ అభిప్రాయ భేదాలను కట్టిపెట్టి పరస్పరసహకార విధానాన్ని అనుసరించడం అవసరం. ముఖ్యంగా ముస్లింలీగువారు కాంగ్రెసు చేస్తున్న హృదయ పూర్వక స్నేహసూచనను పాటించి కార్యాచరణకు ఉపక్రమించి ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలి. కాని సంప్రతింపులకు ప్రతినిధులను పంపవలసినదనే కాంగ్రెస్ స్నేహ సూచనకు లీగు ఇంత వరకు సమాధాన మంపినట్లు లేదు.

భారతదేశంలో ఇక తమ పరిపాలనను సాగించడం దుస్తరమనీ, అసంభవమనీ గ్రహించినమీదనే బ్రిటిషుప్రభుత్వం ఈ ఆఖరు నిర్ణయానికి వచ్చి నిష్క్రమణకు గడువుతేదీ పెట్టుకొన్నట్లు ఈమధ్య కామన్సుసభలోనూ, లార్డ్సుసభలోనూ జరిగిన చర్చలవల్ల స్పష్టపడింది. ద్వితీయప్రపంచ సంగ్రామంఫలితంగా భారతదేశంలో జాతీయభావం విజృంభించిందనీ, పరిపాలనాధికారాన్ని భారతీయులకు అప్పగింతపెట్టడం వినా గత్యంతరం లేదనీ కామన్సుసభలో సర్ స్టాఫర్డ్ క్రిప్సు అన్నాడు. అధికారదత్తత విషయంలో ఇక ఆలస్యం చేయడం అత్యంత ప్రమాదహేతువు కాగలదనీ, బ్రిటనులో కార్మికప్రభుత్వం ఏర్పడింది మొదలు భారతదేశం ఏ క్షణంలోనైనా ప్రేలిపోయే అగ్నిపర్వతంవలె వున్నదనీ ప్రధాని అట్లీ వర్ణించాడు.

సుప్రసిద్ధుడైనా గ్రంథకర్త లిన్ యు టాంగ్ అన్నట్లు నిరంకుశాధికారం ఎక్కడ వుంటుందో అక్కడ శాంతివుండడం అసంభవం; ఇవి రెండూ సవతుల్లాంటివి—ఒకే ఇంట్లో ఇవి కాపురంచేయలేవు. బ్రిటిషువారు ఇప్పటికైనా ఈ విషయాన్ని గ్రహించి, భారతదేశ స్వాతంత్ర్యస్థాపనకై ఈ కడపటినిర్ణయానికి వచ్చినందుకు అభినందించవలసిందే. అమాత్యత్రయ రాయబారం వచ్చినప్పుడే, తమ ఈ నిష్క్రమణ నిర్ణయానికి గడువును ప్రకటించివుంటే, వివిధ రాజకీయపక్షాల సహకారానికి ఎంతో సహాయపడివుండేది.





Every Family in INDIA
is proud to own
THE NATIONAL FANS
మా ఖాతాదార్లకు, అభిమానులకు
నూతన సంవత్సరాభినందనలు
INDIA
BHARAT
FOR COMFORT & ECONOMY
THE PRIDE OF YOUR FAMILY

మంత్ర శాస్త్రము

నారాయణ సమారంభాం
విద్యాశంకర మధ్యమామ్
కల్యాణానంద పర్యంతాం
వందే గురుపరంపరామ్.

ఓం నమో బ్రహ్మాదిభ్యో బ్రహ్మవిద్యా సంప్రదాయ కర్తృభ్యో వంశ ఋషిభ్యో నమో గురుభ్యః.

గురుపరంపర త్రిమూర్త్యాత్మకమైనది. అంతే కాదు! అది సాక్షాత్తుగా పరబ్రహ్మ స్వరూపమే. అందువల్లనే ఆ సేతు హిమాచలము ఈ శ్లోకముతో గురుస్మరణ చేయుదురు:

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్పరబ్రహ్మ
తస్మై శ్రీగురవే నమః.

ఈ ధ్యానమువల్ల మంత్రానుష్ఠానము చేయువారి పరమతాత్పర్యము పరబ్రహ్మ ప్రాప్తి యని మన కవగతము కాగలదు. అట్టి మంత్రసాధన మేదియో అదియే మంత్రశాస్త్ర మనిపించుకొనగలదు.

కాని కేవలము పరబ్రహ్మ జ్ఞేయమే కాని ఉపాస్యము కాదు. కాబట్టి మంత్రోపాస్యమైన దేవతాస్వరూపము అపరబ్రహ్మ. జ్ఞేయ బ్రహ్మప్రాప్తికి ఉపాస్య బ్రహ్మోపాసన సాధనమగుటచే పరంపరగా పరబ్రహ్మ ప్రాప్తికే సాధనమగుచున్నది.

మంత్రస్వరూప మీ విధముగా నిర్వచించిన వెంటనే మంత్రశాస్త్ర గౌరవము మనము తెలిసికొనగలము. జాతకములు గుణించి తమ తమ యూహలకొలది ఫలితములు నిర్ణయించు వారిని జ్యోతిశ్శాస్త్రవేత్త లనుట యుచితము కాదు. ఆయుర్వేద జ్ఞానము లేక పెద్దలు సేకరించిన దివ్యౌషధముల సంపుటములు సంపాదించి ప్రయోగించువారికి వైద్యు లను సంజ్ఞ చెల్లదుగదా! అదేవిధముగా అనామకుడగు నొకానొక గురుబ్రువునివద్ద చెప్పికొనియో, ఇతరులు జ్ఞాపకార్థము వ్రాసికొనిన కాగితములు సంగ్రహించియో కొన్ని మంత్రకర్ణములు సేకరించినవారిని గూడ మంత్రశాస్త్రజ్ఞు లనుట సంభావ్యము కాదు. కాని లోకములో సామాన్యముగా నట్టివారికే మంత్రశాస్త్రజ్ఞులనియు, అట్టి సంగ్రహగ్రంథములే తంత్రము లను నామముతో మంత్రశాస్త్రములని యు గౌరవమును పొందుచుండుట నేటి మన దౌర్భాగ్యచిహ్నము. గ్రంథస్థమైన విషయములందు వివేకము లేనివారు అధిక గౌరవము చూపుట కూడ సర్వసామాన్యము. తంత్రగ్రంథము లను నామముతో అచ్చులో గాని, వ్రాతలో గాని యున్న పుస్తకములలో ఉత్తమరహస్యములు లేవనరాదు. కాని అట్టివానిని విచక్షణలేక ప్రమాణగ్రంథములుగా గ్రహించి ఆచరణలో పెట్టుట ప్రమాదకరమే కాక పతనహేతువు కూడ కాగలదని మనము తెలిసికొనవలసి యున్నది.

౨

వేదరాశియే మంత్రరాశి. ద్విజులందరును ఉపనయనమై గాయత్రీ మంత్రోపదేశము పొంది పిమ్మట యథాశక్తిగా వేదాధ్యయనము చేయుచున్నారు. శ్రౌతస్మార్తకర్మ

శ్రీ నోరి నరసింహశాస్త్రి

లకు ఉపయోగించుటకు అనుకూలమైన వరుసలో వేదరాశిని వేదవ్యాసుడు విభజించి మన కనుగ్రహించినాడు. శ్రౌతస్మార్తకర్మ లన్నియు మంత్రోపాసనలే. వాని విధానములను తెలుపు శాస్త్రములన్నియు మంత్రశాస్త్రభాగములే. కాని అట్లు విభజించిన మంత్రములకు గూడ ప్రయోజనాంతరము లున్నవి. అట్టివి శ్రీవిద్యారణ్యులు కొన్ని సూచించినారు. కాని వేదవ్యాసుడు విభజించగా కూడ మిగిలిపోయిన అపారమైన మంత్రరాశి యున్నది. అట్టి మంత్రప్రయోజనాంతరములకును, అవశిష్టమైన మంత్రరాశికిని సంబంధించిన ఉపాసనవిధిని మన శాస్త్రములకే లోకములో మంత్రశాస్త్ర మను ప్రసిద్ధి వచ్చినది.

ఆ మంత్రరాశిని వేదవ్యాసుడు విభజించలేదు. బోధాయనాపస్తంబాదులు నిబంధన చేయలేదు. చేసిన ప్రామాణిక పురుషు లున్నను వారి గ్రంథములు అప్పుడు ఉపలభ్యమానములుగా లేవు. ఈ అవకాశము పురస్కరించుకొని భారతవర్ష విద్వేషులు లోకకంటకులు ప్రబలి ధర్మభ్రష్టతను చేయు వాంఛతో నెన్నియో గ్రంథములు వ్రాసినారు. అవి పవిత్రమైన దేవతల పూజలు, మంత్రముల అనుష్ఠానములు అను పేర్లతో గోప్యముగా ప్రచారములో నున్నవి. కాని వాని నామములు తెలిసినంతగా వాని స్వరూపము పండితులకే తెలియదు. అందువల్ల కొన్ని గ్రంథములకు జనసామాన్యములో విశేష గౌరవము లభించినది, అట్టి వంచక గ్రంథములలో అగ్రగణ్యములు — ౧. కులార్ణవము, ౨. పరశురామ కల్పసూత్రము, ౩. నిత్యోత్సవము, ౪. సౌభాగ్యభాస్కర మను రహస్యనామ వ్యాఖ్యానము అనునవి. ఆ గ్రంథము లన్నిటితో సమస్త దేవతాపూజలను పంచమకారము లను ద్రవ్యములతో చేయవలెనను విధియే ప్రధానమైనది. అది శక్తి పూజలకు మాత్రమే అను భ్రాంతి మనము విడువవలెను. ఏ దేవతపూజయైనను—అంటే,

శివుడు, విష్ణువు, గణపతి, ఆదిశక్తి— ఏ దేవత పూజయైనను ఆ గ్రంథముల దృష్టిలో ఆ ద్రవ్యములతోడనే చేయవలెను. వానిలో ఆ ద్రవ్యములు ఎన్నెన్నియో సంకేత పదములతో ప్రదర్శింప బడియున్నవి. కాని, విప్పి చెప్పినచో అవి వరుసగా నివి: ౧. మద్యము, ౨. మాంసము(భూచర జంతువులది) ౩. మత్స్యము (జలచర మాంసము), ౪. ముద్ర (ఖేచర- పక్షి- మాంసము), ౫. మైథునము (పరస్త్రీ).

ఇందులో మొదటి నాలుగు మకారములను దోషరహితములని భావించువారు లోకములో నెక్కుడుగనైన నుండవచ్చును. కాని, పంచమ మకార సేవనమువల్ల విధిగా దేవతాప్రీతి కావించవలెనని చెప్పగల నీచులు ఏ కాలములోనైనను, ఏ దేశములోనైనను ఉండుట దుస్సాధ్యము. కాని ఈ గ్రంథములందుకును సాహసించినవి. "సువాసినిని రావించి ప్రథమసిక్తమైన ద్వితీయఖండమును తినిపించి......పంచమముచే గూడ సంతోషింపజేసి విసర్జింపవలెను" అను సంకేత వాక్యములతో ఈ విషయము పరశురామ కల్పసూత్రములో నున్నదని విజ్ఞులకు తెలిసినచో, వారది పరశురామీయము కాదు, కల్పము కాదు, సూత్రము కాదు అని సులభముగా నూహించగలరు. కులార్ణవము, జ్ఞానార్ణవము- ఇత్యాది తంత్ర గ్రంథములలో నిది మరింత గ్రామ్యముగా నున్నందున విరమించినాము. సౌభాగ్యభాస్కరములో వరుసగా 'యద్వా యద్వా' అని అర్థాంతరములు చెప్పుచు నియతముగా చివరనున్న యర్థములో దీనిని ప్రశంస చేయును.

ఈ దుర్మార్గములందు అమాయకులకు ప్రవృత్తి కలిగించుటకు ఆ గ్రంథములలో కొన్ని సద్విషయములుకూడ కూర్చినారు. కాబట్టి ఈ తంత్రగ్రంథములకు లోకములో కొందరిలో ఎంత ప్రసిద్ధియున్నను మనము కూడ భ్రాంతి పడరాదు. కావున నందులోని ఏ విషయమైనను గతిలేక మనము గ్రహించవలసి వచ్చినచో, ముందు అది శ్రుతి స్మృతి సదాచారములకు బాధ కలుగదని నిశ్చయించి కాని చేయరాదు.

౩

సన్మార్గములో మంత్రసాధన చేయుట వల్ల దేవతాప్రసాదము సంపాదించి తద్వారా మనము ఐహికాముష్మిక నిశ్శ్రేయసములు పొందవచ్చును. కాని ముందు మంత్ర మనగా నేమి?

మంత్రము కేవలము దేవతానామము. కాని సామాన్యముగా దేవతలకు కృష్ణుడని, రాముడని, హనుమంతుడని—అనేక నామములు మన మెరుగుదుమే, అవి కావా? అవును కాని అవి పూర్ణముగా దేవతా స్వరూపమును తెలుపు నామములు కావు. మంత్రమే అట్టి నిజమైన దేవతా నామము. ఉదాహరణకు ఈ క్రింది రెండు మంత్రభాగములు తిలకింపుడు:

౧. "...ఆపురె హనుమంత సుమీ
జావు అణు భూతాన్
పకళ్ళేవు బేగీ పకళ్ళేవు
బేగీ ఆవు బాబారే......"

౨. "బడే బడే హనుమంత
ధావళి హనుమంత......
లగావు లగావు గుద్దు గుద్దు
మీస్ మీస్......"

ఈ పైవి రెండును ఒకానొకరింటిలోని పెద్దలు వ్రాసికొన్న మంత్రముల కవిలెకట్టలోనుండి ఎత్తిన హనుమన్మంత్రాలు. కాని హనుమన్మంత్రములు అన్నియు నిట్లే యుండునని భావించరాదు. సాక్షాత్తుగా మోక్షవిద్యాపరమైన హనుమన్మంత్రములు లోకములోనవే కాక ఆ కవిలెకట్టలోగూడ అర్థవివరణతోకూడ వ్రాసియుండుట చదివితిమి. అవి అన్నియు హనుమన్నామముతో వెలయుచున్నను ఒకదానికొకటి సంబంధము లేదని సులభముగా గ్రహించవచ్చునుగదా! ఈ లోకములో హనుమంతుని పేరుతో వేదవేదాంగవిదుని వద్దనుండి నీచాతినీచుడైనవానివరకు అనేకజను లేవిధముగ నున్నారో మంత్రలోకములో కూడ అట్లే ఒకే పేరుతో అనేక దేవత లుందురు. దేవతా నామము తెలిసికొనవలె నన్నచో మంత్రమే తెలిసికొనవలెను. మంత్రమే దేవతాస్వరూప బోధకమైన నిజమైన నామము!

౪

మరి ఈ మంత్రోచ్చారణకు అధికారి ఎవరు? మంత్రము దేవతానామమైనప్పుడు అందరు ఏల మంత్రోచ్చారణ చేయగూడదు? జనాభాలెక్కలు తేల్చు సెన్సుసు ఆఫీసులోని గుమాస్తాలు చదువునట్లు అందరి పేర్లు మనము ఎందుకు చదువరాదు? చదువవచ్చును. కాని ఆ పేర్లన్నియు చదువుచున్నప్పుడు ఈ అశేష జనులును ఆ ఆఫీసులో ప్రత్యక్షము కారుగదా! అట్లే కేవలమంత్రోచ్చారణవల్ల దేవత ఆవిర్భవించదు. మంత్రశక్తిఫలము ననుభవించదలచినవారు అది సక్రమముగా సద్గురువులవలన ఉపదిష్టులై కాని అనుష్ఠానము చేయరాదు.

మంత్రము ప్రకృతిసిద్ధముగా శబ్దస్వరూపము గాన శ్రోత్రముతోడనే గ్రహింపదగినది. వేదమునకు శ్రుతియను సంజ్ఞ వ్యర్థముగా రాలేదు. వేదమాతయైన గాయత్రిని ప్రథమ పర్యాయము వటువు శ్రవణముతోడనే గ్రహించుచున్నాడు. వేద కూడ గురువు వద్ద చెప్పికొనుచున్నాడు కాని చదువుట లేదుగదా! మంత్రము లన్నిటికి నీ మర్యాదయే యన్వయించును.

దీనికి కారణము లేకపోలేదు. ద్విజన్ములైనవారికి ముందు కొన్ని సంస్కారములు చేసి మంత్రస్వీకారయోగ్యత కల్పించికాని గాయత్రి ఉపదేశించరు. స్వయముగా తాను గాయత్రిఉపాసకుడైనవాడు వటువునకు సంస్కారముచేత గాయత్రీస్వరూపము కల్పించి గాయత్రీనామము ఉపదేశించుచున్నాడు. అనగా, నీవే గాయత్రివి—అని మంత్రాక్షరములతో చూపించుచున్నాడు. ఉపదేశ మనగా చూపుట. ఆ చూపించినది సాధకుడు మననచేసిచేసి ఆ దేవతాభావము పొందుచున్నాడు.

ఏ మంత్రోపదేశము చేయుచున్నను, గురువు శిష్యునిలో ముందు ఆ మంత్రదేవతా

ప్రతిష్ఠ చేసి, ఆ పిమ్మట మంత్రము నుప
దేశించును. అనగా, నీ వీ దేవతవు సుమా-
అని నిర్దేశించును. మనస్సు పరిపెట్టుకొను
టకు ఎవరో ఒకరి నోటినుండిగా మనము
మంత్రము విని మంత్రోచ్చారణ సాగించినంత
మాత్రముచేత అది ఉపదేశము కాజాలదు.
గురువు శిష్యునిలో ఆ దేవతాప్రతిష్ఠ చేయ
వలెను.

అందుకనేకమార్గము లున్నవి. అందులో
నొక విధానములో హస్తమస్తక సంయోగ
మొక భాగము. అనగా 'నెత్తిన చేయి
పెట్టుట' ఇది ఒకరిని నాశనముచేయుటకు
పర్యాయవచనముగా లోకములో వ్యవహార
మున్నది కాబట్టి దాని కార్యవహార్థము
వచ్చువాటికి శిష్యులు నాశనము చేయు
గురువు లెందరు వెలసియుండిరో మన మను
మేయించవచ్చును.

అయితే సంస్కారాదులవలన దేవతా
ప్రతిష్ఠ సాధ్యమా? సాధ్యమే. కాని ఈ
విషయములో సందరిని ఒప్పించుట అసా
ధ్యము. కాని ఆస్తికులైనవారు ఇది రెండు
సందర్భములలో నిప్పటికిని ప్రత్యక్షముగా
చూడగలరు. శాస్త్రీయముగా ఉపనయ
నము జరుగు ద్విజుని ఇంటికి పోయి, ఉపన
యనము కాబోవు బాలకుని ముందుగా చూచి,
గాయత్రి ఉపదేశమైనపిమ్మట నాబాలునే
మరల చూచినచో వానిలో నొక కొత్త
వెలుగు స్పష్టముగా గోచరించును. అట్లే
దేవతా ప్రతిష్ఠలకు పూర్వాపరములలో
బాణములోనను, చక్రములోనను భేదము
స్పష్టమగును. అట్లు సంస్కారమువల్ల సంక్ర
మించిన కళనే చూచి ప్రాకృతజనులు
కల్యాణకళ వచ్చినదని తరచుగా ప్రశం
సించుచుందురు.

పై వచించినదానివల్ల మంత్రోపాసనకు
అవసరమైన దేవతాప్రతిష్ఠ చేయుటకు దక్షత
గల సద్గురువు అవసరమని స్పష్టమగును. కాని
అట్టి గురువెవరు? అట్టివాడు దుర్లభుడను
టలో నతిశయోక్తి లేదు.

మంత్రము పరబ్రహ్మప్రాప్తిసాధనమని
ముందుగా నిర్వచించితిమి గనుక తురీయాశ్ర
మము స్వీకరించిన బ్రహ్మనిష్ఠులే ఉత్తమ
గురువు లనుట నిశ్చయము. కాని గృహస్థులు
గృహస్థులవద్దనే కాని సన్యాసులవద్ద మంత్ర
స్వీకారము చేయుట పనికిరాదనువా
రున్నారు. ఇందులో నొక సూక్ష్మమున్నది.
సన్యస్తులైనవారిలో పెక్కురు గృహస్థులకు
ఉపదేశించదగిన మంత్రోపాసన చేయరు.
అట్లు చేయుట వారికి నిషిద్ధము. కాబట్టి అట్టి
సంప్రదాయముల సన్యాసులవల్ల మంత్ర
స్వీకారము చేయగూడదనుట న్యాయమే!
కాని శ్రీ శంకరాచార్యపరంపరలో నంత
టను భారతీసంప్రదాయ యతులే కనబడు
చున్నారు. వారిలో పారంపర్యముగా సర్వ
మంత్రోపాసనయు వచ్చుచున్నది. అట్టివారి
వల్ల మంత్రదీక్ష పుచ్చుకొనుట ఉత్తమ
పక్షము.

ఇంకను ఈ విషయమైన సందేహము
వదలనివారు ఒక సంగతి గమనించినచో నది
తీరగలదు. స్మార్తులందరు తమ గురుపరంపర
స్మరణచేయుచు ఆద్యంతము లెట్లున్నను
మధ్యస్తోత్రము 'విద్యాశంకరమాశ్రయామః' అని
గాని, 'శంకరాచార్యనమస్కారమ్' అనిగాని
ఆచార్యశంకరుని విధిగా స్మరించుచున్నారు.
పరమహంస పరివ్రాజకాచార్య వర్యులైన
శ్రీ శంకరాచార్యులు తమ గురుపరంపరలో
నున్నతర్వాత తురీయాశ్రములు గృహస్థుల
కుపదేశము చేయగూడదనుట అజ్ఞానకృతమని
స్పష్టమగును.

కాని పరమహంసలు గురువులుగా లభిం
చుట అందరకు సాధ్యముకాదు. కావున
కులీనుడు, శ్రోత్రియుడు, మంత్రతంత్ర విచ
క్షణుడు, దక్షుడు, ప్రసిద్ధుడు, ధ్యాననిష్ఠుడు
నగు గృహస్థునివద్దకూడ మంత్రస్వీకారము
చేయవచ్చును.

ఒక్కొక్క గురువు 'నెత్తిన చేయిపెట్టిన'
విశేషమువలన శిష్యునికి శుభపరంపరలు,
ఇంకొక గురువుచేయివలన అశుభపరంపర
లును గలుగుట లోకానుభవములో నున్నది.
ఇది కేవలము గురువులో నుండదు. గురువు
కంటె ప్రధానమైనది అతని సంప్రదాయము.
కొన్ని పరంపరలలో దేవతలు మద్యాది
పంచమకారద్రవ్యములతో అనుష్ఠించుట
యున్నదికదా! ఆ పరంపరలో నా దేవత
తద్ద్రవ్యలోభముగల ఉచ్ఛిష్టదేవతగా అవ
తరించును. గురువు స్వయముగా సదాచార
పరుడై ఆ ద్రవ్యములు ఉపయోగించక
పోయినను ఆ సంప్రదాయములో నున్నది
ఉచ్ఛిష్ట దేవతయే గనుక
అతని శిష్యునిలోనికిగూడ ఆ దేవతయే సంక్ర
మించి గంతులు వేయును. పూజా సమయము
లలో దేవత పూని అది రకరకములుగా కోరి
కలు ప్రదర్శించుట, అల్లరిచేయుట, అరచుట
చూచుచుందుము. అవి చాలభాగము ఇతరు
లను మోసగించుటకు ప్రయోగించు నటనలు.
అట్టి నటనకాక నిజమే యగునెడల ఉచ్ఛిష్ట
దేవతోపాసనఫలము లని అనుమేయించుట
సత్యదూరము కాదు. ఉత్తమోపాసనకు
శాంతముతో కూడిన ఆనందము లక్షణము!

కాని మంత్రోపాసన చేయునప్పుడు మరి
యొకవిధమైన యల్లరికూడ తరచుగా కాన
నగును. పిశాచావేశము కలవారు సదనుష్ఠాన
ము చూచి భరించలేరు. ఒకవేళ అట్టి వ్యక్తికి
మంత్ర దీక్ష ఇచ్చినను అనేక వికృతులు
బయలుదేరును. అట్టి వికృతులు
వేరు, గురుమంత్ర సంప్రదాయ దోష
ములవల్ల కలుగు వికృతులు వేరు. ఈ భేద
ములు అనుభవమువలన గాని తెలిసికొనలేము!

సంప్రదాయము ఉత్తమమైనచో గురువుల
సామాన్యదోషములను హరించగలదు. కాని
గురు వెంత యుత్తముడైనను సంప్రదాయ
దోషమును పోగొట్టగల సమర్థుడు కాడు.
సంప్రదాయ విజ్ఞానము నిమిత్తమే గురువు
ప్రసిద్ధుడు కావలెనని పెద్దలు నిర్ణయించిరి.

'గురుం ప్రకాశయే ద్ధీమాన్ మంత్రం
యత్నేన గోపయేత్!'

అయితే ఈ కాలములో గురు
నామము పరమరహస్యమని గోప
నము చేయుట సర్వసామాన్యము. అందుకు
అనుగుణముగా కోరికలు నడిపెదరు. కాని

అది శాస్త్రీయము కాదు. యుక్తియుక్తమును గాదు. ఈ దేహజన్మకు కారకులు తల్లిదండ్రులు. తండ్రి పేరు గోపనము చేయువారెట్టివారు? విద్యాజన్మకు ఆచార్యుడు తండ్రి వంటివాడు. సామాన్యముగా మంత్రమాతయగు గాయత్రి నుపదేశించునది తండ్రియే గదా! ఆ గురుని పేరు దాచువా రుందురా? వేదాధ్యయనము చేసినవారు, వ్యాకరణాది శాస్త్రములు అభ్యసించినవారు ప్రసిద్ధులైన తమ గురువుల నామములు ప్రకాశము చేయుదురు గాని దాచరు. గురునామ ప్రకటనవలన విద్యాప్రశస్తిని లోకము తెలిసికొనగలదు! వేదవేదాంగము లుపదేశించు గురువులకు అన్వయించిన విధి మంత్రోపదేశము చేయు గురువున కన్వయించనిచో నా సంప్రదాయము వేదవేదాంగములకు విరుద్ధమైన దనుటకు సందేహ ముండరాదు!

ఉపనిషత్తులలో, పురాణములలో ఎక్కడ చూచినను నిర్దిష్టనాముడగు నొకానొక శిష్యుడు నిర్దిష్టనాముడగు నొకానొక గురువునొద్ద విద్యారహస్యము తెలిసికొనినట్లుండును. శ్రీమద్రామాయణములో ప్రథమ శ్లోకములోనే వాల్మీకి నారదుని ప్రశ్నించినట్లున్నది. శ్రీ కృష్ణభగవానుడు గీతోపదేశసమయములో గీతాశాస్త్ర గురుపరంపర వివరించినాడు.

అనామోస్యులు గురుశిష్యులు పూనినప్పటి నుండియు గురునామ గోపనము దురాచారము లోకములో ప్రబలి దాని కనుకూలముగా శ్లోకములు ఘటించినటుల సందేహము లేదు.

సద్గురూపదేశతత్త్వమును శ్రుతి ఈ రీతిగా పలుకుచున్నది: "ఒకానొక గాంధారదేశీయుని కన్నులు కట్టి దూరదేశములో విడిచిరి. అతడక్కడ దిక్కు తెలియక పరిభ్రమించుచుండెను. అంతట నొక పుణ్యాత్ముడు అతని కన్నుల గంతలు విప్పి గాంధారదేశమున్న దిక్కు చూపి అటు వెళ్ళమని చెప్పెను. అంతట నతడు దారి వెంట నడుచుచు గ్రామమునుండి గ్రామము చేరుచు పండితుడును, మేధావియు గాన గాంధారదేశమునే ప్రాపించెను. ఆ విధముగానే ఆచార్యవంతుడైన వాడు తత్త్వము తెలిసికొనును."

౬

ఇట్లు సద్గురూపదిష్టమైన మంత్రము అక్షరమైన శబ్దస్వరూపము. మంత్రములకు ఋషి, ఛందస్సు, దేవత తెలిసికొనక ఉపాసన చేయరాదు. వానితోపాటు వినియోగము కూడ నెరుగవలెను. ఇవి మంత్రస్వరూపములో భేదములు తెలుపును. ఒకే మంత్రమునకు ఋషులు పలువు రుండవచ్చును. ఋషులు మంత్రద్రష్టలు. ఒకే మంత్రమునకు బ్రహ్మకాని, నారాయణుడుకాని, రుద్రుడుకాని ఋషి కావచ్చును. ఆదే మంత్రమునకు బ్రహ్మ ఋషియైన బ్రహ్మశక్తియు, నారాయణుడు ఋషియైన నారాయణశక్తియు, రుద్రుడు ఋషియైన రుద్రశక్తియు ఉపాసకులకు వేరువేరుగా సంక్రమింపజేయును. ఒకే మంత్రమునకు దక్షిణామూర్తి ఋషి అనియు, దానికే హయగ్రీవుడు ఋషి యనియు, దానికే ఆనందభైరవుడు ఋషి అనియు భావించువా రున్నారు.

ఋషిభేదమువంటిదే ఛందోభేదము. దీనివల్ల అర్థభేదమును, దానివలన మాహాత్మ్యమైన ఫలభేదమును వచ్చును. ఇట్టి విశేష విషయములు మంత్రములమీద సమన్వయించి గురుముఖముగా తెలిసికొనవలెనే కాని మరొకవిధముగా తెలిసికొన సాధ్యపడదు. అయితే ఒకే అక్షర సముదాయమును వేరు వేరు ఛందస్సులుగా విభజించుట సాధ్యమనుటకు తెలుగులో గర్భకవిత్వమే సాక్ష్యము. ఒక సీసపద్య పాదము ఆటవెలదిలో రెండు పాదములు కావచ్చును. అట్టియెడ దానిని ఆటవెలది యన్నను, సీసమన్నను కానరాదు గదా!

ఇక దేవత! సామాన్యముగా ఒక్కొక్క మంత్రమునకు ఒక్కొక్క దేవత నియతమని మన మనుకొనెదము. శివపంచాక్షరికి శివుడు, నారాయణాష్టాక్షరికి విష్ణువుమాత్రమే దేవత లనుకొందుము. కాని ఇది భ్రాంతిమాత్రమే. శివసహస్రనామములలో విష్ణు, హరి, బ్రహ్మ, త్రివిక్రమ, వాయు, రవి, అనిల, అనల— ఇత్యాదిగా అనేక దేవతానామము లున్నవి. అట్లే విష్ణుసహస్రనామములలో ఉగ్ర, శర్వ, శివ, స్థాణు, ఈశ్వర, ఆదిత్య, రుద్ర, ప్రజాపతి, కామఘ్న, స్రష్ట— ఇత్యాదిగా అనేక దేవతానామము లున్నవి. శివపంచాక్షరీ మంత్రమునకు శివసహస్ర నామములలో ఏ నామముతో దేవతానిర్దేశము చేసినను అభ్యంతర ముండగూడదు గదా! అదే విధముగా నారాయణాష్టాక్షరికి విష్ణుసహస్ర నామములలో కనబడు ఏ నామముతో దేవతను నిర్దేశించినను అభ్యంతర ముండగూడదు గదా! ఇదే కొంత పెంచిచో శివపంచాక్షరికి విష్ణువుకాని, హరికాని, బ్రహ్మకాని, వాయువుకాని, రవికాని, అనలుడుకాని, అనిలుడుకాని దేవత కావచ్చు; నారాయణాష్టాక్షరికి ఉగ్రుడుకాని, శర్వుడుకాని, శివుడుకాని, రుద్రుడుకాని, ఆదిత్యుడుకాని దేవత కావచ్చును.

ఈ వాదము పెద్దలు విపరీతముగా తలచుట సహజము. కాని మరియొక విషయము కూడ పర్యాలోచన చేసినచో ఇది సత్యమని ధ్రువపడును!

మంత్రములలో సర్వోత్తమమైనదానికి ప్రణవమను సంజ్ఞ కలదు. ప్రణవ మేదియో మనము విచారించనవద్దు. ప్రణవసంజ్ఞతో ఉచ్చరింపబడెడి బీజము లెన్ని యున్నవో ఆ భగవంతునకే ఎరుక! ప్రణవమేదైనను అది సర్వమంత్రములకు నాదిగా మనము భావించుచున్నాము. ప్రణవము ప్రతిమంత్రాదియం దుండుచో, ప్రతిమంత్రజన్మకు మూలకారణము ప్రణవమే యని స్పష్టమే కదా! ప్రణవప్రస్తారమే సర్వమంత్రగతి. ప్రణవము సర్వమంత్రస్వరూపము, సర్వవేద స్వరూపము, సర్వదేవతాస్వరూపము, సర్వ స్వరూపము! ఈ ప్రణవసామాన్యమును బట్టియే ఉత్తమ మంత్రములకన్నిటికి తత్సహస్ర నామములు సమస్తదేవతాస్వరూపమును ఘోషించుచున్నవి.

యంత్రములలో నెల్ల మాహాత్మ్యమైనది బిందువు. ప్రతీకలలో నెల్ల సత్తమమైనది

నర్మనలో లభ్యమగు ప్రాణములు, గంతలిలో నుండు పాంగ్రామములు—ఆ రెండిటికి రూపములు లేవు. ప్రణవములవలెనే అవియు సమస్త దేవతా స్వరూపములే.

౨

మంత్రములకన్నిటికి సామాన్యముగా బీజమని, శక్తియని, కీలకమని మూడుభాగము లుండును. ఈ బీజశక్తి కీలకములు మంత్రాక్షరములలోనవే కాని, వేరుగాకాని యుండవచ్చును. ఒకే మంత్రమునకు బీజశక్తి కీలకభేదమునుబట్టి వినియోగభేద ముండును. విశ్వసృష్టి మూలస్థానములో నొకటియే యైనను అది చీకటిని పోగొట్టి వెలుగు కలుగజేయుటకు, కాచుటకు, కాల్చుటకు, ఇంకను నెన్నియోవిధముల నుపయోగింప సాధ్యపడును గదా! అట్లే బీజశక్తి కీలకభేదమును బట్టి వినియోగము భేదించును. ఈ ఉపమానముచే పొడిగించి చెప్పినచో బీజము పవరుహౌసుయొక్క సామర్థ్యము, శక్తి వోల్టేజి, కీలకము స్విచ్చి, దాని వివిధోపయోగములు వినియోగములు అనవచ్చును. అట్లే ఇతర మంత్రాంగములను వివిధవర్ణములు కలిగించు గాజుసామగ్రితో పోల్చవచ్చును.

మంత్రసాధన మనగా దేవతాత్వప్రాప్తి సాధనము! మంత్రసిద్ధి యనగా ఆ దేవతా స్వరూపము చెందుటే! తంత్రగ్రంథములలో ఈమంత్రము ఇన్నిమారులు జపించినచో సిద్ధించునని యుండును. అదే నిజమైనచో ఈమంత్రోపాసకు లందరు ఎన్ని పర్యాయములో దేవతాత్వము పొందియుండవలెనే! కాని ఆ తంత్రవాక్యములు సత్యములుకావు. కొందరు ఎన్నిలక్షల పర్యాయములు జపించినను, వారికి దేవతాకళ లేశమును సంక్రమించదు. కాని కొందరికి ఒక్కమారు స్మరించినంత మాత్రముచేతనే దేవతాభావము పుష్కలముగా సంక్రమించును. దాని కారణము మరొక ప్రశంస!

౩

ఈ ఉపాసనచేయునది పంచభూతమయమైన ఉపాధిలో కూడుకొన్న శరీరికదా! ఈ పాంచభౌతిక శరీరమును దేవతాస్మరణ యోగ్యముగా చేయుటకు ముందుగా భూతశుద్ధి యను నద్భుతమైన క్రియ చేయుచున్నారు. ఆ ప్రక్రియావిధానము తెలిసిన వారికి దాని మహత్వము వర్ణింప నక్కరలేదు. అది ప్రాణాయామముతో కూడియుండి సమస్త భూతములను పరమాత్మలో లయము చేసి, పాపపురుషుని దహించి, ఆ భస్మమును అమృతముచే సజ్జీవింపజేసి దివ్యదేహము సృష్టించుటకు సాధనమని చెప్పినచో దాని స్వరూపము తెలియనివారు కొంత యవగతము చేసికొనగలరు.

భూతశుద్ధిచేత సాధకుడు దివ్యదేహము కల్పించుకొని న్యాసములు చేసికొనును. న్యాసమనగా నుంచుట. న్యాసములు అనంతములు. వీనిలో సాధకుడు తన స్థూలదేహమునో, సూక్ష్మదేహమునో, కారణదేహమునో దేవతాదేహముగా భావించి అందు మంత్రన్యాసము చేయును.

ప్రతిమంత్రమును మూడుభాగములు చేయవచ్చును. అందులో ఒకటి శిరస్సు, ఒకటి కంఠమువద్దనుండి కటిపర్యంత ప్రదేశము, మూడవది కట్యధోభాగము—అని న్యాసము చేయవచ్చును. అట్లుకాక మంత్రాక్షరము లన్నియు దేహములో ప్రధానాంగములలో న్యాసము చేయుట యున్నది. ఈ న్యాసములలో మిక్కిలి విపులమైనది సామాన్యముగా మహాన్యాస మను పేరిట అభిషేకములకు ముందు శతరుద్రీయ మను మహామంత్రమును న్యాసముచేయుట ఆస్తికు లెరిగినదే. అది పాటపాడుటవల్లను, చేతులు త్రిప్పుటవల్లను సిద్ధించునది కాదు. వాక్క్రియలతో పాటు భావనాబలమువల్లనే అది స్థిరపడును.

ఈ న్యాసములలో సర్వసాధారణమైనవి ఋషి, ఛందస్సు, దేవత, బీజము, శక్తి, కీలకము, కరహృదయాదిన్యాసము అనునవి. ఇందులో ఋషి బ్రహ్మరంధ్రమునను, ఛందస్సు వాక్కునను, దేవత హృదయమునను బీజశక్తి కీలకములు హృదయము చుట్టును న్యాసముచేయుదురు. ఇక కరహృదయాది న్యాసము అందరెరిగినదియే. కాని అందులో ఒకటి శిఖయందు న్యాసము చేయవలెను. మరి శిఖలేకుండ కత్తిరించుకొనువారు అది ఎక్కడ న్యాసముచేయుదురో మాకు దుర్జ్ఞేయము. అట్టివారి మంత్రాగ్ని శిఖలేకుండ పొగరాజుచుండుట చూడగలవారికి వారి ముఖములలో వ్యక్తమగుచుండును.

భూతశుద్ధిచే దివ్యదేహము సంపాదించి అందులో దేవతారూపము న్యాసముచేసి హృదయములో దేవతామూర్తిని ధ్యానము చేయుదురు. ఈ ధ్యానము అధికారినిబట్టి భేదించును. కొందరు అది స్త్రీరూపము గాను, కొందరు పురుషరూపముగాను, మరి కొందరు ఉభయాత్మకముగాను ధ్యానింతురు. అది అందరెరిగినదే. కాని దేవతకు స్త్రీపుంభేదమున్నదా? ఇది ఎరిగిన మహానుభావులు దానిని విరాట్స్వరూపముగాను, నిష్కళముగాను, సచ్చిదానంద విగ్రహముగాను ధ్యానింతురు.

యథాధికారముగా ధ్యానించి దానిని మానసికమైన ఉపచారములతో పూజించి సాధకుడు జపము ప్రారంభించును. ఆ జపములో గురువు, మంత్రము, దేవత, తాను ఏకమను భావన చేయవలెనట! అందులో గురువును కరచరణాద్యవయవము లున్న నరమాత్రునిగాను, మంత్రమును వర్ణసముదాయముగాను భావించువారికి ఎన్నికోట్ల జపము చేసినను మంత్రసిద్ధి ఉండదట!

ఈ ఏకభావనకే మనన మని పేరు. మననము చేయునది కనుకనే మనువు అను పేరు మంత్రములకు ప్రసిద్ధము. ఇది మంత్రశాస్త్రము యొక్క పరమ తాత్పర్యము, పరమ రహస్యము!

౪

కాని మంత్రశాస్త్ర మనగా లోకములో భూతవైద్యము, విషచికిత్స, రోగచికిత్స, మారణాది ప్రయోగములు, ఇంద్రజాలము, జలస్తంభనాదులగు నమానుషశక్తిప్రదర్శనములు— ఇత్యాదులకు సాధనభూతమైన శాస్త్రముగను భావమే ప్రసిద్ధముగా కలదు.

అభిచార మంత్రశాస్త్రములో భాగములు కాకపోవు. కాని వాని స్వరూపము తెలియుటకు ఉపాసనభేదములు స్థూలముగా వివరింతుము.

ఆది సాత్త్వికము, రాజసము, తామసము అని మూడువిధములు. వేరుకోరిక లేక దేవతాప్రీతివలన దేవతాభావము ప్రాపించుటే లక్ష్యముగా గలది సాత్త్వికము. ఇతరులకు బాధ లేకుండ తనకు అశుభములు తొలగి శుభములు కలుగుట ప్రధానముగా గలది రాజసము. శాంతి పౌష్టికములు, కొంత భూతవైద్యము, విషచికిత్స, రోగచికిత్స రాజసములోనే గణించవచ్చును. ఇక ఇతరులకు హింస, నీతి విరుద్ధముగా వశీకరణము ఇత్యాది హేయకృత్యముల నుద్దేశించునది తామసము. కాని ఈ విభాగము సూచనప్రాయమే కాని సంపూర్ణము కాదు.

మంత్రశక్తి బహుసూక్ష్మమైనది. శత్రువును చంపవలెనను దురుద్దేశము కలుగునెడల మంత్రమువల్లకంటె సులభముగా శస్త్రాదులతో ఆ పని నిర్వర్తింపవచ్చును. రాజదండము తప్పించుకొనుటకు పలువు రీ విధాన మవలంబింతురు. ఆ ప్రక్రియలు శవములతో, అస్థులతో, శ్మశానముతో, మద్యముతో, మాంసముతో, ఇనుముతో, మురికితో సంబంధించియుండును. ఇంత కష్టసాధనము సిద్ధించులోపల ఆ తామసశక్తి ప్రాదుర్భూతమై అతని ఛిద్రము వెదకి సాధకునే గ్రసించును. దేవత నెత్తి అడచినదని కొందరిని లోకములో చూపుచుందురు. అట్టివారియందు మనకు జాలి యక్కరలేదు—వారు దుష్టులు! ఏదో ఒక దురాగ్రహక్రియకు దేవతాశక్తి ప్రయోగింప ప్రయత్నించి విఫలులైన రాక్షసులు వారు!

ఒకవేళ ఈ ప్రయోగాదులవలన మారణాది దుష్టప్రయోగములు ఒకానొకడు సాధించినాడనుకొందము. అతడు దానికి రాజదండమునుండి తప్పించుకొనవచ్చును. కాని రాజదండము పొందిన హంతకునికంటె వాడు పరమనీచుడు. హంతకుడు రాజదండమువల్ల శిక్షితుడై పునీతుడగును. అట్టి పాపికి మరల శిక్ష లేదు. మంత్రతంత్రములవలన మారణాదులు సాధించిన పాపికి రాజదండము లేకపోవుటే అతని దౌర్భాగ్యము. అత డెన్ని జన్మలలో ఎంతకాలము ఆ పాపఫల మనుభవించవలెనో శిక్షవిధించు యమధర్మరాజుకే ఎరుక!

౧౦

ఇక రాజసోపాసనకూడ రాజమార్గము కాదు. కాని సంసారులైనవారు లౌకికమైన కష్టనివృత్తికొరకు, సుఖసాధనకొరకు సమస్త కార్యములు నిర్వర్తించుచున్నట్లే మానవప్రయత్నమునకు తోడుగా దైవప్రయత్నము కూడ సందర్భములకు కామ్యమైన రాజసోపాసన తరచుగా చేయుచుందురు. ఇది వ్యర్థమన వీలులేదు. నిషేధించినను మానరు. సద్గురువులు రాజసోపాసనతో ఉపక్రమించిన శిష్యులనే క్రమముగా సాత్త్వికనిష్ఠ కలవారినిగా చేయుదురు. అందువలన దీని స్వభావము చెప్పి కొన్నివిషయములు వివరింతుము.

లోకములో ఒక ప్రభువునో, ధనవంతునో, సామాన్యమానవునో మనము ఉపచారములవల్లనో, నమస్కారాదులనో, అనువర్తనచేతనో, సంతత సందర్శనమునో, చాటువాక్యములవలననో ఆశ్రయించి అతని అనుగ్రహము సంపాదించితి మనుకొందము. అతనితో మన కేమియు పనిలేకున్నచో నతని ప్రవర్తన మెట్లుండును? కార్యార్థులమై మన మతని వద్దకు వెళ్లినప్పుడు మనస్థితియు,నతని ప్రవర్తనము నెట్లుండును? ఈ తారతమ్యము మనన చేసినచో దేవతాప్రీతికొరకు నిష్కామముగా చేయు నుపాసనకును, కామ్యోపాసనకును భేదము అవగతమగును. కామ్యోపాసకుడు యాచకుడు, నిష్కామోపాసకుడు మిత్రుడు!

దేవతను యాచించి ఒక చిన్నఫలము పొందినచో దానికి తగిన శాంతి చేయవలెను. అట్టి కర్మలలో జపమేకాక పూజ, తర్పణము, హోమము, మార్జనము, బ్రాహ్మణ సంతర్పణము ఇత్యాదులు విధ్యుక్తముగా చేయవలెను. నియమము లెక్కువ. లేనిచో వెంటనే దేవతాగ్రహపాత్రు లగుదురు.

ఈ కామ్యక్రియలలో బహుళప్రచారములో నున్నది భూతవైద్యము. పిశాచాదులకు సూక్ష్మశరీరమే కాని స్థూలశరీర ముండదు. కాబట్టి అవి మన సూక్ష్మదేహమునే ఆశ్రయించును గాని స్థూలదేహము నాశ్రయించవు. మందు లందువలన భూతములమీద పనిచేయుట దుష్కరము. అందువలన మంత్రములు గాని, సూక్ష్మదేహముమీద పనిచేయు ఏవో ఇతరప్రక్రియలు గాని ఉపయోగించును గాని తక్కినవి నిష్ప్రయోజనములు.

ఈ సందర్భములో పిశాచచేష్టలు కలవారని చెప్పువారిలో నూటికి ఏబదిమందికి పిశాచబాధ ఉండదని ముందు గమనించవలెను. తరచుగా స్త్రీలు తమ వాంఛలను వేరువిధముగా తీర్చుకొనలేక పిశాచావేశతుల్యమైన చేష్టలవల్ల చేయించుకొనెదరు. అటువంటి పిశాచములు మంత్రములచే నివృత్తికావు. లోకములో భూతవైద్యులలో ప్రచారములో నున్న చీపురుదెబ్బలు, చెంపదెబ్బలే అట్టివానికి ఉత్తమ చికిత్సలు!

ఇక నిజముగా పిశాచావేశము కలవారి కందరికి అవి ఒకేవిధముగా శాంతించవు. ఒకని ఆస్తి మన మక్రమముగా హరించిన మీదట వతడు ఆ చింతతో చనిపోయి పిశాచమై మనల నావేశించినా డనుకొందము. మన మెందరు హనుమంతులను కొలిచినను వారు మనకు సహాయముచేయరు. ఆ పిశాచము కోరువిధముగా ఆద్రవ్యము నిశ్శేషముగా వ్యయముచేసిన పిమ్మట గాని చికిత్స సాధ్యము కాదు. అట్లే అంత్యేష్టి చక్కగా చేయనందున ప్రేతత్వము వదలక పట్టిన గ్రహములు మరల అకర్మ శాస్త్రీయముగా చేసిన గాని వదలవు. వైద్యశాస్త్రములో చికిత్సకు ముందు రోగకారణము విచారించవలెగదా!

జ్వరము వచ్చినంతమాత్రమున క్వినైనుగాని, శీతాంశు రసముగాని వాడినయెడల శాంతించునా? ఆ జ్వరము ఏ కారణమువలన వచ్చినదియు విచారించి నిదానముచేసి చికిత్స ప్రారంభించవలె! ఈ రాజవైద్యమర్యాదలన్నియు భూతవైద్యములోగూడ పాటింపదగినవే.

కాని సర్వసామాన్యవిధాన మొకటి యున్నది. మన దేహములో ఓజస్సు ఎక్కువ చేసికొనినచో ప్రత్యేకముగా మందులుసేవించక పోయినను మనదేహశక్తియే బహురోగములను నివారణ చేయగలదు. అదే విధముగా సర్వసామాన్యముగా మంత్రోపాసనవలన దేవతాత్వము వృద్ధినొందినకొలదియు నెమ్మదిగా పిశాచాదుల బాధ శాంతించును. అవి ఈ దేహములో సంకటము తమకు అనుకూలముగాలేక వేఱువసతి వెదకుకొనును.

పిశాచము లున్నవనియు మంత్రాదులవలన వని తొలగుననియు చెప్పినందున పాఠకులు భూతవైద్యులమీద గౌరవము చూపవలెనని ఉద్దేశము కాదు. 'భూతవైద్యము నా వృత్తి' అని తిరుగువారు పలువురు దాంభికులు. కాని కొందరు లోకవంచకులు. తరచుగా వారు ఒకానొక తుచ్ఛశక్తికలవ ఒకానొక పిశాచమును స్వాధీనముచేసికొని, దానిని మన మీదికి వారే పంపి, మనచేత ధనవ్యయము చేయించి, మరల దానివల్ల మనలను ముక్తులగా జేసి, భూతవైద్యులను ప్రసిద్ధి గడించుచుందురు. కాబట్టి భూతవైద్యము జీవనోపాధిగా గలవారికి విజ్ఞులు దూరముగా నుందురు గాక!

భూతవైద్యముతర్వాత ఎక్కువ ప్రచారము కలది విషచికిత్స! పాముకాటుకు మందులకంటె మంత్రములే ఎక్కువ ఉపకరించుట మన అనుభవములో నున్నది. అదే విధముగా తేలుకాటు! ఈ విషచికిత్సలే, మంత్రమహత్వమందు విశ్వాసము లేనివారికిగూడ, కొంత దీనిలో నేదియో యున్నదని సందేహము కలిగించుటకు ఆధారముగా నున్నవి. కాని విషచికిత్స మంత్రశక్తిలో బహు అల్పమైనదని బుద్ధిమంతులు గ్రహించవలెను.

ఇక ననేకమైన వ్యాధులకు మంత్రచికిత్స లున్నవి. ఆ వ్యాధినే దేవతగా భావించి ఉపాసనచేసి తద్భావమువల్ల చికిత్స సాధించు ప్రక్రియలు. అట్టివి ఇతరుల వ్యాధినివారణకు ఉపయోగించినను ఆ ఉపాసన చేయువానికి మాత్రము పతనహేతువులు. ఇవి రాజసములుగా కనిపించినను తామసములే!

ఇల్లే ప్రశ్నలు చెప్పుట, ఇంద్రజాలము, జలస్తంభనము ఇత్యాదులుగూడ రాజసములుగా కనిపించినను అవి తరచుగా తుచ్ఛవిద్యలు. వానిని సాధించుటకు విధించిన విధానములు అపవిత్రముగా నుండును. వానివల్ల జీవించువారు మమ్ము దూషింపకుందురు గాక!

తంత్రగ్రంథములలో ముందు మంత్రము, ఆ తర్వాత దాని అనుష్ఠాన విధానము, ఆ పిమ్మట షట్కర్మలలో దాని ప్రయోగవిధానము నుండును. ఈ షట్కర్మ లనునవి పేర్లు చెప్పకుండగ చాలవరకు ఇదివరకే వివరించినాను. వివిధ విధానములలో ఆసనము, జపమాల, పూజాద్రవ్యము, నైవేద్యము, హోమద్రవ్యము మొదలైన పరికరజాలము మారుచుండును. కొన్నికొన్ని వివస్త్రులై, అశుచిగా, శిఖ ఉన్నవారు జుట్టు ప్రేలవేసికొని, యజ్ఞోపవీతమున్నవారదె తొలగించి, శవాద్యాసనములపై గూర్చుండి, శ్మశానాదులలో ఉపాసనచేయవలెననియు, అట్లు చేసినచో మహాసిద్ధి కలుగుననియు ఈ తంత్రములు వర్ణించును. కొన్ని చేసినచో శారీలమూటలు పక్కలక్రింద తెల్లవారుసరికుందునని చెప్పును. అటువంటి సాధనలవల్ల సాధకుల కోరికలు సిద్ధించకపోగా వారు సర్వవిధముల భ్రష్టులై పతితులగుట మాత్రము సిద్ధము!

౧౧

సాత్వికోపాసకులు ఉత్తమోత్తములు. దేవతాప్రీతి కలిగించుటే కాని వారికి వేరు కామన యుండదు. అట్టివారికి దేవతాప్రీతి చేకూరుట సులభసాధ్యము. కాని అది శీఘ్రముగా చేకూరునని చెప్ప వీలులేదు. ఎన్ని జన్మలలోననో చేసిన అనేకకర్మల పరిపాకముగా సంభవించిన ఈ ఉపాధిమంత్రము చెప్పికొని జపముచేసినంతమాత్రముచేత అకస్మాత్తుగా దేవతామూర్తిగా మారిపోవునా? పరిపక్వబుద్ధుల కట్లే కావచ్చును. కాని అట్టివారు అరుదు.

ఈ ఉపాధిలో ఆచార్యుడు వెలిగించిన జ్యోతిని ఆరిపోకుండ భద్రము చేసికొనుచు, నెమ్మది నెమ్మదిగా ప్రజ్వలింపజేసికొని తమ దేహములు జ్యోతిర్మయములుగా చేసికొని పరంజ్యోతిగా భావనదృఢము చేయగలవారు సిద్ధులు. వారు కోరకుండగనే వారి అవసరములు సిద్ధించుచుండును. అట్టివారు ఋషులు! కాని దేవతాత్వము వెంటనే సంక్రమించలేదని సాధకుడు అధైర్యపడ నక్కరలేదు. సాత్వికముగా ఎంత దేవతోపాసన చేసినను, అంత దేవతాప్రీతియు నిశ్చయముగా కలుగును. ఎంత సిద్ధి కలిగినదో ఎవరికి వారు ఆత్మపరీక్షవలన తెలిసికొనదగినది కాని బాహిరపరీక్షలవలన తెలియలేము.

నిష్కాములగు యోగులకు కోరికలు తీర్చుటకు దేవతలు కనిపెట్టుకొని పరిచర్య చేయుదురు. శ్రీ కృష్ణభగవానుడు కుచేలుని అర్చించిన కథ అట్టి మహానుభావుల మహత్వమునే వర్ణించును.

సాత్వికోపాసకులు తరచుగా అన్నమాటలు జరుగును. వారికి వాక్సిద్ధియుండును. అట్టివారినిగూర్చియే భవభూతిభట్టు—

'ఋషీణాం పునరాద్యానామ్
వాచ మర్థోఽనుధావతి'

అని అనిపించినాడు. అటువంటివారిని మనస్సులో నెంచుకొనియే పెద్దన ప్రవరాఖ్యునిచేత—

'మీ మాటలు మంత్రంబులు,
మీ మెట్టినయెడ ప్రయాగ, మీ పాదపవి
త్రామలతోయము లలఘు
ద్యోమార్గధునీరాంబు పౌనరుక్త్యము
లుర్విన్'

అనిపించినాడు. కాని అక్కడ ఒక విచిత్రమున్నది. ప్రవరాఖ్యుడు కర్మిష్ఠి. స్వయముగా మహామంత్రసిద్ధుడు. కాని కేవలము ఘుటికాసిద్ధుని జూచి అతడే భ్రాంతిపడి, దాని ఫలముగా నానా యాతనలు సాయంకాలమువరకు ననుభవించి తా నర్చించిన అగ్నిహోత్రుని ప్రసాదమువల్ల నిత్యకర్మలకు బాధలేకుండ నిల్లు చేరినాడు! అంత మహానుభావునికే తుచ్ఛసిద్ధులను జూచి భ్రాంతి కలిగినచో నీ కాలములో ఎవరి నేమనగలము!

వీరపాంచాలి

"కరుణశ్రీ"

[రాయబారాలు భగ్నమైనవి. భావి కర్తవ్యనిర్ణయానికి పాండవ పరిషత్తు సమావేశమయింది. అజాత శత్రుడు సంగ్రామానికి సందేహిస్తూవున్న సందర్భంలో భారతవీరనారీమణి పాంచాలి పలుకుతున్నది.—]

మారని మాట లేటి కిటు మాటికి? కూటికి తోటి రాజుతో
బేరములాడుచే మిగుల పేలవ! మంతట బోక సంధికిన్
వారు తిరస్కరించి కరవాలము లెత్తిన నిర్నిమిత్తని
స్సారవిచారులై మెడలు సాచుట శోచ్యము నైచ్య మెంతయున్!

ఆమెను బోయె సంధి; ఇకనైనను నాయకు లాయుధమ్ములన్
దీయక ధర్మశాస్త్రముఁ ద్రిప్పట నమ్మినవారి గొంతుకల్
గోయుటకాదె - మీరు గయికొన్న యహింసలు హింసలయ్యె నా
త్మీయులయందు చాలు గురుతింపుడు పీడితజాతి యాతనల్!

పుట్టితి పూజ్యుడౌ ద్రుపదభూపతికిన్; జగజెట్టి పాండు స
మ్రాట్టుకు కోడలైతి; నభిమానధనుల్ ఘనులైన వారి చే
పట్టితి; శౌర్య ధైర్యగుణపాత్రుల పుత్రుల గంటి; నూడిగం
బెట్టుల జేయజాలుదు నిసీ! మగవారలు సిగ్గుమాలినన్!

అన్నయు నాన్నగారు చతురంగబలమ్ములతోడ నస్మద
భ్యున్నతి గోరివచ్చిరి - మహోదయు లీక్రియ సీళ్లుద్రింగ చర్మ
మిన్నులు చూచిరేని విసమించు పరిస్థితు - లైనవారిలో
చిన్నతనమ్ము మోయుదురె! ఛీ యని నల్వురు నవ్విపోవరే!

హింస యహింస యంచు నొకచో యొకచో తిరుమంత్రమేదో మీ
మాంసకు దెచ్చి మా రుధిరమాంసములన్ బలియిచ్చి యిష్టవి
ధ్వంస పథమ్మునన్ నడచు వైఖరి నేటికి చాలు - దుష్టవి
ధ్వంసన మాచరింప విలుదాల్పుడు! నిల్పుడు శస్త్రదీపికల్!

చాలితిరేని ముందునకు సాగి - సపత్నుల నాగి - పత్ని పాం
చాలికచాలి కూర్పుడు! విచారము దీర్పుడు! శౌర్యధైర్యముల్
చాలవయేని ధర్మములు చాలిక పెద్దలు మిన్నకుండుడీ
బాలురు దీర్తురీ సమరభారము భారతభాగ్యమూర్తులై !!!


మండితపాండవాన్వయుడు మా యభిమన్యుడు దండితద్విష
న్మండలు డా ఘటోత్కచ కుమారుడు చాలరె! ధార్తరాష్ట్రులన్
పిండియొనర్ప - హెచ్చుపయిపెచ్చులు నచ్చుకొనన్ ధనుష్కళా
పండితు డన్న లేడె! యుపపాండవు లేమి కృపాణహీనులే!!

"భారతవీరమాత" యగు భాగ్యము ప్రాప్తిలు అత్తగారి కం
చూరకె చూచి చూడనటు లుంటిమి; ఆమెకు దక్కకున్న ఆ
గౌరవలక్ష్మి లభ్యమగుగాక కుమారులగన్న మా హిడిం
బారమణీలలామకు - సుభద్రకు - ఈ ద్రుపదాత్మజాతకున్.


తాడిపత్రి దేవాలయంలోని శిల్పాలు

చిత్రకారుడు:

— శ్రీ తేజోమూర్తుల కేశవరావు —



1. తాడిపత్రిలోని శ్రీ చింతలరాయని జీర్ణ దేవాలయము.



2. ఆలయ అంతర్భాగము.

ములుగు పాపయారాధ్యకవి

— శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి —

పాపయారాధ్యుఁడు పురాతనకవివలెఁ దోఁచు మధ్యకాలపు కవి. సర్వమధురము, ఆంధ్ర దేవీభాగవతము అచ్చునకు వచ్చిన దాఁక నితని పేరుఁబ్రతిష్ఠలు కొంత మఱుఁగున నుండిపోయినవి. దేవీభాగవత మంత మహాగ్రంథము తెనుఁగులో అనన్యసామాన్య రీతి సంతరించిన యీ కవిసార్వభౌముని పేరు నేఁటిదాఁక చాటున నుండుట తెలుఁగువారి భాగ్యవుఁజేటు. ౧౯౩౨ లోకాని యితని దేవీభాగవత మావిష్కృతము కాలేదు. అంతకుముందు 'ఆంధ్ర కవుల చరిత్ర'లో శ్రీ వీరేశలింగము పంతులుగా రీతనిగూర్చి పది పంక్తులకు లోపుగ వ్రాసిరి. ఆ వ్రాఁత పాపయారాధ్యుల కవితా ఖ్యాతిని దిగనార్చునదిగా నున్నదికూడ. అది సరే.

అగ్రతాంబూలము :

దేవీభాగవతమును మొట్టమొదటఁ దెలుఁగులోఁ బెట్టిన కవివరుఁ డీ పాపయారాధ్యుఁడే. త్రిపురాన తమ్మయదొరగారు ద్వితీయులు. తృతీయులు తిరుపతి వేంకటకవులు. తురీయులు దాసు శ్రీరామ కవిగారు. తెలుఁగుసేఁతలోని పౌర్వాపర్య మిది. తమ్మయకవిగారి దొక్కటితక్క, మిగిలిన మూఁడును నేఁడు ముద్రణమునంది బయటికి వచ్చినవి.

పాపయారాధ్యులు గుంటూరు మండలములోని అమరావతి రాజధానిగ నేలిన వాసిరెడ్డి వేంకటాద్రి నాయుఁడు జమీఁదారుగారి సమకాలికు లనియు, తదాస్థాన కవిరత్నములలో నొకరనియు భూమికాపద్యములు తెలుపుచున్నవి. వేంకటాద్రి నాయుఁడుగారి కాలముననే కాక, వారి దత్తపుత్రులు శ్రీ జగన్నాథరావుగారి కాలమునఁగూడ నీ కవి వెలసియుండి, వారియనుజ్ఞచే దేవీభాగవతము తెనుఁగుపఱిచినటులు స్పష్టము. ఈ జగన్నాథ బాబుగారు ఇరువది యెనిమిదేండ్లవయస్సుకడదాఁటకుండఁగనే పరమపదించిరి. చూడఁగా, ౧౭౯౩ లో జన్మించి ౧౮౨౧ లో మరణించినటులు తెలియును. కావున, ఈయన పోయినపిమ్మటను మన పాపయారాధ్యులు పాతికేండ్లవఱకు బ్రతికియుండును.

జగన్నాధబాబుగారిని పెంచిన తండ్రి వేంకటాద్రి నాయుఁడును, మల్రాజు సుందరారాయుఁడును, మాణిక్యాల అప్పారావును, చల్లపల్లి అంకినీడును ఒకేకాలపువారన్నట్లు వారిని గుఱించి మెచ్చుకొనుకొన్ని యితిహాసములు చెప్పుచున్నవి. వేంకటాద్రి నాయుఁడుగారు ౧౭౬౧ లో పుట్టి, ౧౮౧౬ లో స్వర్గస్థులైరని 'సర్వమధుర' పీఠికాకారులు శ్రీ॥ శ్రీ॥ తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిగారు వ్రాసినారు. మన కా విషయమునఁ జిక్కు లేదు. ఈయనరాజధాని యగు 'అమరావతి' ఒకనాఁడు తెనుఁగునాఁ డేలిన శాతవాహన వంశీయులకు ముఖ్యపట్టణమై, కొండవీటి రెడ్లకాలమున, రాయలకాలమున మహావిభవ మనుభవించి .విజయనగర రాజ్యముతో పాటు పాడువట్టిన పట్టణము. వేంకటాద్రి నాయుఁడు దీని తొల్లిటి యౌన్నత్యము నెన్ని పునరుద్ధరించెను. ఉద్ధరించి ౧౭౯౬ ప్రాంతములో 'చింతపల్లి'నుండి తన రాజధాని నిటకు మార్చెను. తరువాత నాయుఁడుగారితో అమరావతి యస్తవ్యస్తమయ్యెను. ఈ విషాద గాథ యిపు డేల?

'వజ్రరత్న' బిరుదము:

నాయుఁడుగారి సంస్థానమున 'నవరత్నములు' అను పేరఁ దొమ్మండుగురు కవు లుండువా రనియు, వారిలో మన పాపయారాధ్యులే ప్రథమారాధ్యులై! మెలంగుచు 'వజ్రరత్న' బిరుదము వహించె ననియుఁ బ్రసిద్ధి. 'బుచ్చి వెంకు' అని పేరుగల భోగము జాతికవి యీ నవకములో నివాఁడే యని పెద్దలవలన వినుకలి. వేంకటాద్రి నాయుఁడుగా రీ కవిని "బుధజనాటవ్యటన్నంకు బుచ్చివెంకు" అని నిండుసభలో నే దో సందర్భమునఁ గొండాడిరనియు, అది సహింపని యొక యగ్రజాతికవి లేచి—

> క. కొంకక మీ రాడినయది
> బొంకేలగు వేంకటాద్రి భూపాలమణీ!
> వ్యంకేల! వానికిం గల
> రంకే నిలుపంగ నదియ రసవంతముగన్.

అని 'రంకు'శబ్దమును శ్లేషింపఁజేసి చమత్కరించె ననియు బహుశ్రుతులైన మా తాతగారు పలుసారులు చెప్పుచుందురు. దీనిని బట్టి నాయుఁడుగారి యాస్థానకవినవకములో పాపయారాధ్యులను గూర్చి విశేషముగాను, బుచ్చి వెంకునుగూర్చి మిక్కిలి కొంచెముగాను తెలియఁగంటిమి. తక్కఁగలవా రెవ్వరో యెఱుఁగము.

వేంకటాద్రినాయఁడుగారు సామాన్యుఁడు కాఁడు. పండితకవిపోషకుఁడు. దేవబ్రాహ్మణభక్తి విశేషముగఁ గలవాఁడు. గుంటూరుకడనున్న చేబ్రోలులో బ్రహ్మాలయము ప్రతిష్ఠాపించిన వాఁ డీయనయే. ఈ ప్రభువచట నూఱుదేవాలయములు స్థాపించె ననియు, నేఁటికిని కొన్నింటికిఁ బూజాపురస్కారములు జరుగుచున్న వనియు చెప్పుదురు. పాపయారాధ్యుల దేవీభాగవతమునకుఁ టీక వెలయించిన శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రులవారు ఈ ప్రభువునకుఁ, బాపయారాధ్యులకు సంబంధించిన గాథ యీ విధముగఁ బ్రకటించిరి.

ఇష్టదేవతానుగ్రహము :

"వేంకటాద్రినాయఁడుగారిని నాఁటి నైజా పేదోమిషమీఁద నాహ్వానించి బందీగా బంధించికూడఁ దగు మర్యాదలు జరుపుచుండెడివాఁడనియుఁ, బరమశివభక్తాగ్రేసరులును, మహాకవివతంసులు నగు పాపయారాధ్యులవారు ప్రతిదినమును శివపూజ నిర్వహించుకొన్న పిమ్మట పూజాపేటికలో సంస్థానక్షేమసమాచారములు వ్రాసి యా తాళపత్రము భద్రముగా నిడెడివారనియు, నయ్యది శ్రీ వేంకటాద్రినాయఁడుగారి శివపూజాకాలమునకుఁ బూజాపేటికలోనికి వచ్చియుండెడిదనియు, దానిం జదివికొని శివపూజానంతరము తమ క్షేమసమాచారములు వ్రాసి భద్రపఱుచువారనియు, నీ తాళపత్రము గూడ శ్రీపాపయారాధ్యులవారి కిదేవిధముగ నందుచుండెడి దనియు, నాయీవిషయ మప్పటి పాదుషాకు (తపిసీలుగా పేరుతెలియదు) తెలియవచ్చి యిది యెట్లు జరుగుచున్నదని నాయఁడుగారిని ప్రశ్నింపఁగా 'మా యిష్టదేవతానుగ్రహ'మని నాయఁడుగారు వచించి ప్రత్యక్షమొనరించిరనియుఁ, బిమ్మట వారి దేవతపేరిట నాకాలములో సా. కి సుమారు మూఁడువేల రూపాయీల రాఁబడి గల యగ్రహారము నొసఁగిరనియు, అయ్యది యిప్పటికిని ఆ దేవాలయమున జరుగుచున్నదనియు భక్తాగ్రేసరులగు శ్రీశరభయ్యగారు వచింపఁగా వింటిని."

ఈగాథవలన సంస్థానప్రభువు వేంకటాద్రినాయఁడును, సంస్థానకవి పాపయారాధ్యులును పరమశివభక్తులని యెఱుకపడును. పంచాక్షరీమంత్రోపదేష్ట యగుటచేఁ బాపయారాధ్యులను గురుభావమునఁ బ్రభువు గౌరవించువాఁ డనియు, ఈ కవికి నవరత్నకవులలో విశిష్టస్థానము కలదనియు, ఇతఁడు పోతనవలె భాగవతుఁడై దేవీసాక్షాత్కృతి గావించుకొన్నవాఁడనియు, వేంకటాద్రినాయఁడుగారి చివరికాలమునను, వారి దత్తపుత్రుఁడు జగన్నాథబాబు కాలమునకునుగూడ నుండి, తదాజ్ఞచే భగవదర్పణముగ దేవీభాగవతమున కాంధ్రపరివర్తనము గావించినవాఁ డనియు, ఇంచుమించుగ ౧౭౬౦–౧౮౨౦ సంవత్సరముల నడిమికాలపువాఁ డైయుండు ననియుఁ బాపయారాధ్యచరిత్రమున గుఱుతులో నుంచుకొనఁదగిన విషయములు.

నామాంతరము :

పాపయారాధ్యులకు సంగమేశ్వరుఁ డని మఱొక పేరున్నదఁట. ఆ పే రీతని పితామహునిది. ఈ పద్యము చూడుఁడు.

సీ. "పదపదార్థనిబంధ బంధురంబుగ ధరా
తల మెల్ల నెఱుఁగ శంతనుచరిత్ర
సరసశృంగారానుషంగముల్ కవణిఁ జూ
పఁగ నహల్యావధూపరిణయంబు
ధీమజ్జన స్తవ్య ధీమజ్జనోన్మేష
కరముగా నలరు ఘూర్జరచరిత్ర
లసదలంకార లాలన విశంకటముగాఁ
బరఁగు నింద్రాత్మజాపరిణయంబు
గీ. శతకపూజా స్తవంబు లసంఖ్యసంఖ్య
మీఱ నీవు పొసంగించు మేలి కావ్య
రచన మాకెల్ల సమ్మదార్ద్రితఁ బొనర్చు
సరసరుచిసాంద్ర ! సంగమేశ్వరకవీంద్ర !"

ఇది 'సోమనారాధ్యచరిత్ర'లోని దఁట. సంగమేశ్వరుఁడని పాపయారాధ్యులకు మాఱుపే రున్నటు లీపద్యము తెల్పుచున్నది. సాధారణముగ లోకమున భర్తపేరు భార్య పేరుకొనదుగావున మన ఆరాధ్యకవి నాయనమ్మ సంగమేశ్వరుఁ డన్న పేరితోఁ బిలువక 'పాపయ్య' అని పిలుచుచుండెడిదేమో ! ఆ పేరె క్రమముగ వ్యాప్తిలోనికి వచ్చియుండును. ఇట్టి యనేకము లిపుడు మనము కనుచున్నాము. దేవీభాగవతపీఠికలో శ్రీ వేంకటశాస్త్రిగారు "ఇది పాపాయి యను ముద్దుపేరునుండి వచ్చినదేమో" అనుచున్నారు. అది సంగతముగనున్నది. ప్రసిద్ధనామము పాపయారాధ్యు లని యున్నటులు గ్రంథావతారికలో రాజదంపతులచేఁ జెప్పించుకొనిన యీపద్యము తెలుపును.

సీ. శ్రీ సోమనారాధ్యసింహాసనంబునఁ
బేరెన్నికకు నెక్కి పేర్మిఁగలిగి
మన్మతసిద్ధాంతసారస్య సంగ్రహ
ప్రౌఢి రూఢికి నెక్కి పరిఢవిల్లి
వాసిరెడ్డికులాబ్జవనజాప్తులగు రాజ
సింహుల సన్నిధిఁ జెలిమిఁగాంచి
సరసకవిత్వ ప్రచారసామంజస్య
పరిపాటిఁ బూర్వుల ప్రతిభఁ దనరి
వెలయు విద్వత్కవీశ్వరుల్ విబుధవంద్య
వివిధలక్షణశిక్షావివేకదక్షు
లగు ప్రసిద్ధులు ములుగుపాపయ్యశాస్త్రు
లనుచు సత్కీర్తి ధరయెల్ల నలమికొనిరి.

క. మించితిరి సర్వపటిమన్,
గాంచితిరి కవిత్వతత్త్వకలనఁ గవితతిన్,
పంచితిరి మీ సమర్థత
కెంచం దరమౌనె ధరణి నెవ్వరికైనన్ ?

వంశావతారిక :

పాపయారాధ్యుల పితృపితామహక్రమము-సంతతియు నిటులు తెలిసికొనఁగూడును.

పితామహుఁడు సంగమేశ్వరుఁడు; పితామహి అక్కమాంబ. తండ్రి వీరేశ్వరుఁడు; తల్లి భ్రమరాంబ. భార్య లింగమ్మ. కుమారులు: జోగయ్యశాస్త్రి-విద్యయ్యకవి-బసవయ్యశాస్త్రి అని మువ్వురు. పుత్రికలు: శాంభవి–సావిత్రి యనువారలు. కొడుకులలో రెండవవాఁడు విద్యనారాధ్యుఁడు చక్కని కవి. పాపయారాధ్యులకు గురువు 'శంభులింగము'.

పోతనతో పోలికలు :

ములుగుమహాకవి పోతనవలె సహజపాండితీమండితుఁడైన కవి సార్వభౌముఁడు. కాళీసముపాసకుఁడగుటచే నీతని కభినవ కాళిదాస బిరుదముకూడ నున్నది. పోతనవలె నీయనయు నెక్కువ కలవాఁడు కాఁడు. రాజావలంబన మున్నవాఁడగుటచే బొత్తిగ లేనివాఁడును గాఁడు. తన దేవీభాగవతము రాజానురంజనమునకై యంకితము గావింపక, భగవదర్పితమే చేసిన సదాశయుఁడు. దీనినిబట్టి ఆ రాజ దంపతుల దైవభక్తియు, ఈ కవివరుని స్వతంత్రతారక్తియు అభివ్యక్తములు కాఁగలవు.

ఇప్పటి దేవీభాగవతాంధ్రీకర్తలలోఁ బ్రథమతాంబూల మీయ నదే. తరతమపరీక్ష కిది యదను కాదుకదా! శ్రీనాథునిలోని, పోతనలోని, యితర పూర్వకవులలోని కవితాలక్షణము లెన్నో పాపయారాధ్యులకుఁ బట్టువడినవి. కాఁబట్టియే యితని రచన కళగట్టినది.

"అమ్మలఁ గన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలఁ బెద్దమ్మ..." ఇత్యాదిపద్యమునఁ బోతన అంబాప్రార్థనము సేయఁగా, మన ఆరాధ్యకవి—

ఉ. తల్లికిఁ దల్లియైన తన తల్లికిఁ దానును దల్లియై ధరన్,
దల్లుల కెల్లఁ దల్లియయి తల్లి నమం గరుణింపు మన్నచోఁ
దల్లులు గానకీని మరుతల్లిని సజ్జనకల్పవల్లి మా
తల్లిని సన్నుతింతు జనతాఫలదస్మితమల్లి నెంతయున్.

అని దానిని సరిగ ననుసరించెను. ఇదిగాక, యిట్టి వెన్నో పోతనకవికనుసృతులుగలవు. మరియొకటి మాత్రమే ప్రకటింతును :

సీ. అఖిలాండజనని నిత్యార్చన లేనట్టి
కొంపగా దది కొల్లగంప గాని
త్రిపురసుందరిఁ దృప్తిదీర్పని యన్నము
సిరులుగా దవి కొండచలులుగాని
ఆదిశక్తినిగూర్చి యర్చసల్పనివాని
కేలుగా దది బండికీలుగాని
అంబిక నెప్పుడు నభినుతింపనివాని
నోరుగా దది కట్టెపేలుగాని
భగవతి కొసంగలేని దుర్భగుఁడు గూర్చు
ధనముగా దది నరకసాధనము గాని
ధారుణీశ్వరుఁ దెలియంగలేరు జనులు
తల్లి జగదంబ నతకల్పవల్లి సుమ్ము.

(తృతీయస్కంధము)

కవితా విశేషములు :

ఇతని కవిత తత్సమపదప్రచురమైయుండి, ధారాళతకుఁ దక్కువగాక, రసవిషయమునఁ గొఱఁతపడక యున్నది. ఎన్నఁదగిన విషయ మిందొక్కటి. ఈకవి భక్తిపరవశుఁ డగుటఁ దగిన ఘట్టములు తటస్థపడినపుడు, ఒకే యితివృత్తముఁ దీసికొని యొకే ప్రాసముతో మహాపరవశతతోఁ గొన్ని పద్యము లేకధాటిని వ్రాసికొని పోవును. (ప్రథమ స్కంధము: ౩౭౫-౩౮౫ హరియోగనిద్రా స్తుతి) "హరిని న్నిద్దురమేలుకొల్పు జగదంబా! శ్రీజగజ్జననీ!" అను మకుటముతో, నిరువది మత్తేభములతో యోగనిద్ర నభివర్ణించెను. కవిపరవశతా పరిస్ఫోరకములగు నిట్టి ఘట్టములు చాలపట్టులఁ గనవచ్చి, భక్తితన్మయత పోతనలోఁ బదిపాళ్ళున్నచోఁ బాపయారాధ్యులలో పండ్రెండుపాళ్ళున్నదా యనిపించును. కాని, అట్టిచోటులఁ గవిత కొంత నీరసముగాను, పునరుక్తిదూషితము గాను నున్నను నది పరిగణనీయము కాదు. ఆ ధోరణిలో రచించుకొనిపోవునపు డేవో ఒకటిరెండు చ్యుతసంస్కారములు దొరలినను 'గచ్ఛత స్ఖలనం న దోషాయ' అని మనము సమర్థించుకొనవలెను. కేవలము అవి అవ్యుత్పత్తికృతదోషములు కావు. కవిప్రతిభానవంతుఁడు. ధీవద్రక్షాధ్యక్షా–కృషీవంతులు–కాలీనము–దంపతి (హ్రస్వాంతముగ వ్యస్తావస్థలో వాడుట) జన్మ–కర్మ (మువర్ణవిరహితములు) ఇత్యాదులు కొన్ని శ్రీ దేవీభాగవత పీఠికాకారులు చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రులుగారు ఎత్తిచూపించిరి.

సలక్షణ కవి కాఁడా ? :

కందుకూరి వీరేశలింగము పంతులుగారు 'కవుల చరిత్ర'లో పాపయారాధ్యులను గుఱించి ఉటంకించిరి. ఇతఁడు సలక్షణకవి కాఁడని వారు తేల్చివ్రాయుటకు, పాపయారాధ్యుల కృతులు సరిగ ఆనాఁడు వారికి లభింపకపోవుటయు, ఆ లభించినవియైనను తప్పు వ్రాఁతలలో నున్న వగుటయుఁ గారణములై యుండును. పంతులుగారు పడిన యూహను పురస్సరత్ప్రమాణముగ 'సర్వమధుర' గ్రంథ పీఠికాకారులు తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు ఖండించి, 'పాపయారాధ్యులు సలక్షణ కవియే'యని సమర్థించిరి. ఈ సమర్థనము సరియైనదని విచక్షణు లంగీకరింతురు.

దేవీభాగవతపు కవితలోని తీరుఁదీయములు తీరిచి పేర్కొనుట కవకాశ మిచటఁ దక్కువ. సర్వమున కుదాహరణముగా రెండు పద్యము లిచ్చుచున్నాను.

ఉ. పెండ్లికిఁ బిల్వఁబోయి యిలువెళ్లు మటన్నటు లయ్యె జూడ నీ
కొండ్లి; నృపాజ్ఞచే సరసుసంఘముగా వచియింప నాకు నా
యండ్లును గండెనైనను సమీహిత మిందుఁ బొసంగదయ్యెఁ బూఁ
బోండ్లను గందు నెల్లెడ విభుత్వముచే నిటు గాన మెచ్చుటన్.

మ. ఒక కేలం జెనుగొండ వోని గదచే నుద్దండరై యట్టు లొం
డొకచేఁ జక్రముఁ బూని విష్ణురథపృష్ఠోల్లాస సంక్రీడనో
త్సుకతన్, దానవులం దరల్చి భయకృచ్ఛుండాహతిందుండి కా
రుక మొప్పార ననంతులం జిదుము గంతుల్ చూపుచున్, వ్రేఁగు
గన్.

ఇట్టి గ్రంథ మొక శతాబ్దిదాఁక మూలఁబడి ప్రచారములో లేక యుండిపోయినది. దేవీప్రేరణమున ౧౯౩౩ లో బెజవాడ వాస్తవ్యులు శ్రీ పుచ్చా కోటయ్య, చేతపూడి వీరభద్రయ్య యను ఉదారదేవీభక్తు లిరువురు శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారిచే పరిచూపించి పీఠిక వ్రాయించి వెలువరించిరి. దేవీభాగవతము గాక 'సర్వమధుర'మను అచ్చతెనుఁగు కావ్య మొకటి పాపయారాధ్యుల వారిది యిదివఱలో నచ్చుపడినది.

తక్కఁగల యితని కృతులలో నక్కడక్కడ నొకటి రెండు పద్యములుగాని, సంపూర్ణముగ దొరకినటులు లేదు. ఈ నిలిచిన రెండుకృతులును, కొన్ని చాటువులే యీ కవిశేఖరుని కీర్తి నిలఁ బెట్టుటకు సమర్థములు.

సంస్కృతకావ్యరచనలు :

ఈయన సంస్కృతభాషలోఁగూడ కావ్యరచన చేసిన వాఁడు. కళ్యాణచంపువు, ఏకాదశీవ్రత చంపువు, ఆర్యాశతీ శివస్తోత్రము అను మూఁడు గ్రంథములు రచించెనని వ్రాసి 'సర్వమధుర' పీఠికాకారులు వానిలోని వని యిచ్చిన రెండు శ్లోకములు నేనును చూపుచున్నాను.

శ్లో. కతి నహి భువనాని బ్రహ్మణా నిర్మితాని
ప్రథిత సుగుణశోభా భాసమానాని సంతి
తదపి సకలసంపత్పద్మ వేశ్మోఽంధరాశే
ర్వనిహితమణిపేటీ రాజతే మర్త్యలోకః.

(ఏకాదశీవ్రత చంపువు)

శ్లో. శాటీకృత చర్మాణం
ఘోటీకృత నిగమసముకర్మాణమ్,
కోటీరదమృతమాతిం
పాటీరదనంగభూతి మాటీశే.

(ఆర్యాశతీ శివస్తోత్రము)

చాటువులు :

పాపయారాధ్యులు భార్య లింగైక్యము నందినపుడు 'ముక్తిద్వారముతల్పు తీయఁగదె చాముండీ! జగజ్జీవనీ!' అను శీర్షకముగల ౩౮ పద్యములతో మహామాతను బ్రార్థించిరనియు, మిగిలిన తదాస్థాన కవులలోఁ గొంద ఱసూయాపరులు 'ఈ పద్యములకే ముక్తిద్వారపు తలుపులు తెఱువఁబడును గాఁబోలు'నని పరిహసించి నట్లును, ప్రభువు వేంకటాద్రినాయుఁ డా మాటలు విని "అంతదాఁక నెందులకు? మన అమ్మవారి దేవళపు తలుపులు తెఱువఁబడునేమో చూడరాదా" అని యా పండితులతో నన్నటులును, అట్లు చదివింపఁగా దేవళపుఁ దలుపులు బళ్లుమని తెఱువఁబడినటులును జనపరంపరలో నున్న వాడుక తా॥ వేంకటప్పయ్య శాస్త్రిగా రుదాహరించిరి. కవులలో నిట్టి శక్తిమంతు లున్నటులు చరిత్రములు తెలుపుచున్నవి. ఇదియు వానితోపాటే. కాదననేల!

ఆశుకవిత :

పాపయారాధ్యుల ఆశుకవితాస్రోతస్విని చవిచూచుటకై 'నక్షత్రమాల'లో నొకటే పద్యము వ్రాసెదను.

శా. సక్తంబయ్యె మదీయచిత్తము బృహత్సంసారపంకాబ్ధి న
వ్యక్తాతీతభవత్కటాక్షలహరీవాఃపూర సంప్రీతిచే
సిక్తంబౌనటు లార్చి కింకరతచే శిక్షావిధిం గూర్చి నీ
ముక్తిద్వారము తల్పుతీయఁగదె చాముండీ! జగజ్జీవనీ.

'అరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి' అని కడకాలములో కవిసార్వభౌముఁడు చెప్పుకొన్నతీరుగా, పాపయారాధ్యులును ౧౮ పద్యములు చెప్పెను. వానిలో నొక్క రెండు నివేదించి యిఁక చాలించెదను.

శా. ఆస్థన్ జాఠర పూరణార్థినయి విద్యాగర్వదుర్వ్యాప్తి రా
జాస్థానంబుల మల్లడింగొనుచు నీ శాసింపలే కన్యథా
వస్థం జెందుచుఁ ద్రాగి త్రెళ్ళినటులై వర్తిల్ల నెట్లో; మహా
ప్రస్థానావసరంబు డాసె దరిఁజేర్ప న్నిపెనూ భ్రామరీ!

శా. అస్థిస్రక్కులు, తారహారములు, భస్మాంకంబు, కాశ్మీరజ
వ్యస్థాగిత్వము, నింద్రజాలగతి గానంజేసె నేమందు న
మ్మా స్థిత్యంతర మే నెఱుంగను గదమ్మా యెట్టులమ్మా మహా
ప్రస్థానావసరంబు డాసె దరిఁజేర్ప న్నిపెనూ భ్రామరీ!

మధ్యారకం

[కథానిక]

శ్రీ వి. డి. ప్రసాదరావు

చెరువుగట్టంబడే చుట్టూ తిరిగి మళ్ళీ ఇంటికే పోదామనుకుంటున్నాడు. పొద్దు పూర్తిగా వాలలేదు. ఆ పల్లెటూళ్లో వాళ్ళింటికెళ్ళినా, ఏమీ తోచేటట్టు లేదు. అక్కయ్యమాట తీసేయలేకా, సెలవులకు అమ్మా నాన్నాదగ్గిరే కాకుండా ఎక్కడికన్నా వెళ్లాలన్న ఉబలాటంవల్లా ఆ పల్లెటూరు వచ్చాడు. పొద్దున్నే బావ ఊళ్లోకి పోయాడు. అక్కయ్యతో కాసేపు మాట్లాడాడుగాని, ఎంతసేపటికీ పొద్దుపోయినట్టే కనబడలేదు. వీథి అరుగుమీద చాప లేదు. అలికి ముగ్గులెట్టి శుభ్రంగా ఉన్నా తెచ్చుకొన్న రెండు తెల్లలాగూలూ మాసిపోతాయేమోనని కూలబడలేక ఒక చింకిరిచదర వేసుకొని కాసేపు కూర్చొన్నాడు. నేలమీదకంటే చదరమీదే ఎక్కువ మట్టి ఉంది. గేదెలను తోలుకొంటూ బుడ్డపంచె కట్టుకొని, కాపుకుర్రాడు చుట్టముక్క పీల్చుకొంటూ కఱ్ఱ బుజాన్ని అడ్డంగా రెండు చేతుల వెనక్కు పట్టుకొని, చుట్ట నోట్లోంచి తియ్యకుండా, వింతమృగాన్ని చూస్తున్నట్టు చూసి, "ఏ ఊరూ?" అని ప్రశ్న పారేశాడు. కాపుకుర్రాడికి తల పగలపొయ్యి కొట్టించినట్లుండి వెకవెకలాడ గాలికి ఎగురుతూంది. ఆ కుర్రాడితో మాట్లాడడానికి కూడా నిస్పృహ కారం తోచి, ఆ కుర్రాడి నిర్లక్ష్యానికి తన నిరసన మౌనంతో జవాబిచ్చుకొని తృప్తిపడ్డాడు.

"ఉలకడేం" అని వెగటునవ్వు నవ్వి గేదెలకుర్రాడు ముందుకు సాగిపోయాడు.

ఆ తర్వాత ఇంకేకుర్రాళ్ళనీ పలకరించలేక సాయంత్రందాకా ఇంటిపట్టున గోళ్ళుగిల్లుకుంటూ కూర్చుని, సాయంత్రం చెరువుగట్టుకే బయలుదేరాడు. ఒక్కరోజుకే విసుగెత్తుతూంది. అక్కడక్కడ తన యీడు కుర్రాళ్ళు కనబడ్డా, చొక్కా లేని రకాలే తప్ప తను మాట్లాడించదగ్గ అర్హత ఉన్నవా డొకడూ కనబడలేదు.

"ఒహోయ్".

ఇందాకా పలకరించిన కుర్రాడూ, మరి నలుగురు తన ఈడు వాళ్ళూ పంటబోదె కావతల కూర్చుని పులిజూదం ఆడుకొంటున్నారు. బోదెకాలవ అంత పెద్దది కాకపోయినా నడుందాకా దిగబడే నీళ్లూ బురదా ఉన్నాయి. ఒక్కచోటే తాటిపట్ట ఒకచోట ఇటునుంచి అటుకు ఉందిగాని, బురద జారుడుగానే ఉన్నట్లుంది.

అటూఇటూ పోటానికి తోచక అక్కడే వాళ్ళను చూస్తూ నిలబడ్డాడు.

"నులుసుండా యేం, తాటిపట్టమీం చిటు రా."

"కాలు జార్తాదేస్"అంటూ ఇంకొకడు వెటకారంగా అందర్నీ నవ్వించాడు.

పైకి పౌరుషంగా, లోపల వణుకుతూనే తాటిపట్టమీద బయలుదేరాడు. చివరికొచ్చాక కాలు జారింది. బిగిసిన బురదలో జారేలోపల ఒకకుర్రాడు ముందుకొచ్చి చెయ్యి ఆసరాయిచ్చి సులువుగా గట్టుకు లాగాడు.

"ఏఊరంటే ఇందాకా పలికావుకా వేం"అన్నాడు మొదటి కుర్రాడు.

పదిఏళ్ళ యీడున ఉన్న నల్గురు పాటికుర్రాళ్లతోనూ, ఎంత విభేదమనిపించినా, ఎంత తనకు తక్కువనిపించినా, మాట్లాడకుండా కలవకుండా, ఎంతోసేపు బిగబట్టుకు కూర్చోటం సాధ్యం కాదు.

"బస్తీనుంచా! ఏం సదూతుండావ్ ?"

"ఫిఫ్త్‌స్టాండర్డు"

"అంటే"

ఈ అజ్ఞానులముందర మళ్ళీ గర్వం సంతోషంగా తలచూపింది. ఒక ఏడాది ఎక్కువేసి ఆరోక్లాసన్నాడు.

తనకు చెయ్యందిచ్చిన కుర్రాడు జనపాలజుట్టూ, నవ్వు మొగంతో "నన్నూ పైయేడు ఫస్టుఫారంలో ఏయిత్తా నన్నాడు తమ్మన్నగారు మానాన్నతో. ఇనస్పేటరు ఒచ్చినప్పుడు కోతల్లో ఉంటే మా నాన్నను పిలిసి ఆరేల నన్ను బడికంపమన్నాడు. పైయేడు బస్తీలో ఫస్టుఫారంలో చేర్పిస్తానంటే నాన్న కాళ పుట్టింది. బస్తీ పంపిస్తానన్నాడు."

తక్కినవాళ్ళకంటే ఆకుర్రాడు కొంచెం దగ్గిరనిపించాడు.

"తమ్మన్నగారు మాశాపే. ఆయనకు బడిఉందా ?"

"నీకే తెల్దూ! ఎల్లా తెలుస్తుంది లే, ఏడాదికి మొత్తంరోజులన్నీ కలిపి ఓనెల మమ్మల్ని బడికి తోలుకెళ్తాడు. ఇవన్నీటను వచ్చినపుడు హంగామా సేస్తాడు. అందరం సేసేగా!"

"రంగా! మనమిని పెంటు చదివి అప్పుడే అయిదేళ్ళయింద్ది గాదురా!"

జనపాలకుఱ్ఱాడు నవ్వి "ఆ"అన్నాడు.

కబుర్లలోంచి తిండిమీదికి ఏవబడ్డది. "ఒరేయ్, తోపులో మామిడికాయలు కోసుకోందారి పదండ్రా. నాగయ్యా, సాంబారు కారం తెచ్చావా?"

వాళ్ళంతా నాల్గెక్కుతోంటే చేతకాక క్రిందే నిలబడి పోయాడు.

కాయలు తింటంలోగూడా వాళ్ళకు లొచ్చయిపోయాడు. కారం నోరుమండించి నుళ్లు ఎఱ్ఱబడేస్తూంది. ఊరికే తింటానికి పళ్ళు పులిసిపోతున్నాయి. వాళ్ళు రెండువిధాలా సునాయాసంగా తినేయగల్గుతున్నారు.

రంగడు ఇతని కవలిక కనిపెట్టి, "నోరు మండుతూందా?" అన్నాడు.

"చెరువులో నీళ్ళు లేనట్టున్నాయే?" అని బిక్కమొగంతో అడిగాడు.

"ఇయితిని నీళ్ళు తాగకూడదు. అప్పన్నా, కత్తితెచ్చావురా, రెండు గెలలు కోద్దాం."

రంగడు తాటి చెట్టెక్కి ముంజెలు కోసి ఇస్తున్నాడు.

పిలకకుఱ్ఱాడు ఎగతాళిగా "అతల సెట్టెక్కలేవా? సిన్నదేగా" అన్నాడు.

ఉడుకుమోతుతనంతో మాటరాలేదు.

ముంజెకాయ తను ఒకకన్ను తినేలోపల వాళ్ళు రెండురెండు కాయలు లాగేస్తున్నారు.

నీళ్ళు నోట్లోకిరాకుండా పెదవులనిండా అంటుకొంటూ బుగ్గల నిండా జిగురు అంటుకుంది.

"అల్లా కాదు తినేది" అని చిరునవ్వుతో రంగడు బొటన వేలూ, నోరూకలిపి ముంజెలు తింటానికి ఉపయోగించాల్సిన వీలు నేర్పాడు. రెండుమూడు కాయలుమించి తినలేకపోయాడు.

బావ ఇంకెవరితోనో ఆదోవనే ఇంటికి వస్తున్నాడు.

పిల్లలలో గౌరవం రాకపోయినా, బావతో వస్తూన్న పెద్ద ఆసామీలు తమ్మన్నగారి బావమరిదిని, బస్తీకుఱ్ఱాడిని మన్ననగా చూచి, తమ పిల్లలకు "వాణ్ని చూసి బుద్ధితెచ్చుకోండిరా" అంటంలో తన మనస్సుకు మళ్ళీ కొంచెం స్థాయిచిక్కి తన ప్రతిష్ఠ తనకు నిల్చినట్లుంది.

౨

స్కూళ్ళు తెరిచారు. క్లాసులో చివరి బెంచీలో కికిరిబాకిరిగా ఉన్న జనపాలు ముడిగా పేర్చుకొని, కాలిని తెల్లకంబె, ముతకలాగూ చొక్కాలు, చెవిపోగులతో రంగడు కూర్చుని ఉన్నాడు. "సత్యం!"అని ముందుబెంచీలో ఉన్న తనను కేక వేశాడు.

స్కూలు తెరిచి మొదటిగంటకూ మూడోగంటకూమధ్య సమయం. క్లాసంతా గింగిరిలెత్తుతూ అల్లరిగా ఉంది. తనపక్క ఉన్న కుఱ్ఱాళ్ళు పల్లెటూరి రంగణ్ణి వెటకారం మొదలుపెట్టారు. వెనక బెంచీలదాకా ఒకటే అల్లరి పాకింది. తను రంగణ్ణి ఎరిగున్నట్టు చిరునవ్వు నవ్వటానికికూడా గుండె చాలలేదు.

రంగడు మొగం ముడుచుకొని కుంచుకుపోయాడు. ఆ నాడు పల్లెటూళ్లో ఈ కుఱ్ఱాడికి లొచ్చయానన్న ఉక్రోషం ఏమైనా మిగిలి ఉండి ప్రేరేపించేదేమో- తెలియకుండానో, తక్కిన కుఱ్ఱాళ్ళు అల్లరి చేస్తూంటే, ఎదురు నడవటానికి ధైర్యం చాలకనో తనూ వాళ్ళతో పాటే అయాడు.

మూడోగంటతో రంగడికి కొద్ది పీక తగ్గిందికాని, ఆ బస్తీ మాస్టరుకూడా తన తెలివితేటలన్నీ రంగడిమీదే ఒలకపోసుకొని కుఱ్ఱాళ్ళ అభిమానం సంపాదించుకొన్నాడు.

ఆనాడు పల్లెటి కుఱ్ఱాళ్ళందరిలోకీ తనయందు సుహృద్భావం చూపించింది రంగడేనని మనస్సు కెలకేసింది. సాయంత్రం రంగణ్ణి ఒంటరిగా పలకరించాడు. రంగడిని తను ముందు చూడలేదనీ, అల్లరి చేసినవాళ్ళల్లో తను లేననీ అబద్ధపు సాకులు చెప్పుకొన్నాడు. రంగడికి నదిలో మునుగుతుంటే గడ్డిపరక అందినట్టయి, ఇందాకా ఆగడ్డిపరకకూడా తన్ను తోసేసిందన్నమాట మరిచిపోయి, పసిగుండెలో కల స్నేహవాంఛతో నిర్మలినంగా హత్తుకలుపుకొన్నాడు. ఆ కుఱ్ఱాళ్ళమధ్య ఎల్లాఎల్లా ఉండాలో అన్నీ రంగడికి బోధచేశాడు. కాని ఆ బోధలకంటే కూడా రంగడిలోనే ఉన్న సహజబలాలే రాను రాను తక్కినవాళ్ళు అతనిచుట్టూ చేరేటట్టే చేస్తూవచ్చాయి. ఈ స్కూలుఆటల్లో మొదట్లో కొత్తదనంవల్ల రూల్సు తెలియని రంగడిఆట ఎబ్బెట్టుగావుండేది. కాని చలాకీతనం బైటపడి, ఆటల రూల్సు సర్వసాధారణంగా అలవాటుపడేటప్పటికి రంగడే తనకంటే నయమనిపించుకొని అల్లరిచేసిన కుఱ్ఱాళ్ళే అభినందనం చేసేస్థితికి వచ్చాడు.

తనలోమాత్రం మొదటినుంచీ ఉన్న సామాన్యత్వమే మిగిలిపోయింది.

ఎవళ్ళైనా మంచి దుస్తులు, కొత్త శుభ్రంగా దువ్విన తలా, ఫాషన్లమీద మోజూ చూపిచ్చేటప్పటికి తనూ తనతోపాటు కుఱ్ఱాళ్ళూ వాడిని కాకిగోల చేసి వదిలిపెట్టేవాళ్ళు. తన ఊళ్ళోనే

చిన్నప్పటినుంచి తనతో చదువుకుంటూవస్తూన్న కుర్రాళ్ళందరిదీ ఆ తత్వమే. ఈ పల్లెటూళ్ళనుంచి వచ్చిన కుర్రాళ్ళే ఆ నూట్లమోజులు చూపించేవాళ్ళు. రంగడుకూడా అల్లాగే అయి మళ్ళీ తమలో అల్లరి పడేటప్పటికి, తన మనస్సుకు మళ్ళీ కొంత ఆత్మవిశ్వాసం చిక్కింది. కాని దొంగచాటుగా వాళ్ళల్లో ప్రతివాడూ, తనకూ ఆ దుస్తులుంటే బాసుండునని కోరుకుంటూన్నట్లే ఉండేది.

3

పట్టభద్రత్వము తప్ప మరేజీవిత భద్రత్వమూ ప్రసాదింపలేని బస్తీ వదిలి మహాపట్టణానికి పొట్ట చేత్తో పుచ్చుకొని వచ్చాడు. రైలు దిగినప్పటినుంచీ, కూలీలదగ్గరనుంచీ, తను పల్లెటూళ్ల వాళ్లంటే కూడా చూపించలేనంత నిరసనాన్ని చూపిస్తున్నారు. తన్ను మోసం చేసి, అల్లా చేసినవాళ్ళుకూడా తను మోసపడ్డ అర్భకత్వానికి, క్రీడ పురుగును చూసినట్లు చూస్తున్నారు.

రంగడు కనపడ్డాడు. రంగ డనుకోలేదు. ఆశ్చర్యంతో తెల్లబోయి చూశాడు.

రంగడు "హల్లో! ఎప్పుడు వచ్చావు" అన్నాడు.

ఆదరణా, నిరాదరణాకూడా లేవు మాటల్లో. పల్లెటి రంగడికీ, బస్తీ రంగడికీ, ఈ రంగడికి పోలికే కనబడటం లేదు. కాని ఆ కాస్త ఆశ్రయం వదులుకోలేక మాటలకు పాకులాడాడు. జనం రద్దీలో రంగడిని తోసుకొంటూ వచ్చిన ఒక సూటువాలా, రంగడికి వెంటనే క్షమాపణ చెప్పుకొని మళ్లీ కదుల్తూ వత్తిడిలో తనను తోసేస్తూ క్షమాపణచెప్పాల్సింది పోయి తీవ్రంగా చూస్తూ సాగిపోయాడు. రంగడిది గమనించటమే లేదు.

కాఫీ తాగటానికి రంగడు పిలిచాడు. హోటల్లో ప్రవేశిస్తూంటేనే "అటు గాదు ఇటు" అని రంగడు దోవచెప్పాడు.

తినటంలో, త్రాగటంలో, నడవటంలో సన్నసన్నగా రంగడు నిషేధాలూ, అనుసరణీయాలూ చెప్పాడు. బస్తీలో మొట్ట మొదట తనకు శిష్యుడు, ఈనాడు తనకు పట్టణంలో పాఠాలు చెప్పుతున్నాడు. లోపల అశక్తక్రోధము కుమిలిస్తూంది. ఆ పాఠాలు క్షణ క్షణ గండాలుగా ఉన్నాయి.

"మళ్ళీ కనపడతా. అన్నట్టు ఎక్కడ దిగావు?"

నీ రూముకు వస్తా నన్న ధైర్యం చాలకపోయింది. చివరికి సమయం దాటిపోతోందని కక్కుర్తిగా గతికాడు.

"రేపు ఇంటర్వ్యూకి వెళ్లాలి. అంతవరకూ నీ గదికి వస్తాను."

ఇంటర్వ్యూకి తను తెచ్చుకొన్న లాగూ, కోటూ విడివిడిని తొడుక్కుంటే చీదరించుకొని రంగడు తన సూటు తీసియిచ్చాడు. నఖశిఖపర్యంతమూ ఎరువు తయారయింది. సాయంత్రం ఇంటర్వ్యూ అవగానే బ్రతికి బైటపడి రంగడిని కలుసుకొన్నాడు. సినిమాకు బయలుదేరారు.

స్త్రీ పురుషులు కలిసి కూర్చున్న సీట్లల్లో నూటంటే అమరింది కాని కూర్చొనేటీరూ స్థాయీ చిక్కలేదు. బి. ఎ. చదివిన ఇంగ్లీషు ఉన్నా, సినిమాలో ఒక్కముక్క అర్థంకాలేదు. హాస్య దృశ్యం వచ్చినప్పుడు తన నవ్వు ఆ తరగతికంతకూ వెకిలిగా బైలుపడ్డది

మలుపుమలుపునా పట్టణం మక్కెలువిరగగొట్టింది. ఒక్కనాటితో పట్నం పేరుచెప్తే బీభత్సంకొల్పింది. ఆ అదురులో రంగడితో పోల్చుకొని చూస్తే అతనికీ తనకూ హస్తిమశకాంతరం కనపడ్డది. పల్లెటికుర్రాడు జీర్ణం చేసుకొన్న పట్టణం తనకు–బస్తీలో పుట్టిపెరిగినవాడికి కొరుకుడుపడక పళ్ళు విరిగేటట్టయింది.

రంగడు పుట్టింది పల్లెఅయినా, తక్కువతరగతిలో పుట్టినా, పల్లెకుండే స్తోమతతో జన్మించాడు. తరగతితర్వాత తరగతిగా మెట్లెక్కే అభ్యాసంలో జన్మించాడు. తను పుట్టిన బస్తీతరగతికి, మెట్టు ఎక్కగల దార్ఢ్యమే లేదు. ఉన్న స్థాయే ఉత్తమమనుకొని క్రిందికి చూసి ఈసడించటం తప్ప పైకిఎక్కడానికి బలంగాని తాహతుగాని కలగలేదు. కొత్త వాతావరణాలను జీర్ణంచేసుకొని వాట్లల్లో జీర్ణమవగల స్వభావమే కనబడలేదు. ఆనాడు పల్లెకీ పనికిరాలేదు, ఈనాడు పట్టణానికీ పనికిరాలేదు.

ఉండలేక ఊరుమొగం పట్టాడు. స్టేషనులో కూలీ మొదట అడిగినకూలీ ధరమార్చి డబ్బిచ్చాక పేచీపెట్టాడు. చివరికి రైలుకదలాక "పోడా గోంగూరై"అని ఈసడించాడు. వళ్ళంతా కుళ్ళిపోయినట్లయింది.

ఇంటికి చేరి నిట్టూర్పు విడిచాడు.


పొరుగమ్మతో తన భార్య సగర్వంగా "మాఆయన పట్టణం వెళ్ళొచ్చా"రని చెప్పుకుంటూంది. ఇరుగాలిడఆశ్చర్యవిభ్రమాలు తన లోపలి దుఃఖానికి బైటసంతోషాన్ని పూతపూశాయి.



స్వాగతము

శ్రీ తలమర్ల కలానిధి

వన్నెల జిలికీ
పరిమళ మొలికే
విరిసరు లానందముగ
వేణిలో దురిమి
వేపపూవుల రైకను దాల్చిన
వసంతలక్ష్మితో
నను జతగూర్చిన
ఓ ఉగాదిరో
స్వాంతము రంజిల
స్వాగత మిదిగో!
స్వాగత మిదిగో!!
ఉపగూహనలో
నుబ్బూతలూపే
మందపవనుని డెందము రంజిల
జీవసారపు చినుకులు రాలే
కోయిలపాటకు చెవియొగ్గే
వసంతలక్ష్మితో
నను జతగూర్చిన
ఓ ఉగాదిరో
స్వాంతము రంజిల
స్వాగత మిదిగో!
స్వాగత మిదిగో!!



నవ్యసాహిత్య సింహావలోకనము — —

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

ఆంధ్రసాహిత్య నవోదయం ఒక్క వ్యక్తియత్నంవల్ల గానీ, ఒక్కరోజులోగానీ వచ్చినది కాదు. రెండు మూడు దశాబ్దాలపాటు ఉపజ్ఞావసానులైన సాహితీపరులు ఒకవైపునా, బలీయములైన ఉద్యమాలు మరొకవైపునా ప్రోత్సహించడమువల్ల బయలుదేరిందీ కొత్తచైతన్యం. నేడు వెనక్కి చూసుకుంటే ఒక్కొక్కప్పుడు వ్యక్తులే ఉద్యమాన్ని నడిపినట్టూ, మరొకప్పుడు ఉద్యమాలే వ్యక్తుల్ని నడిపినట్టూ కనబడుతుంది. అవును, అలాగే వుండాలి మరి. వ్యక్తి సంఘాన్నీ, సంఘం వ్యక్తినీ పలకరించుకుంటూ పురోగమించడమే బ్రతికివున్న జాతికి జీవం.

రాజుల జీవితఘట్టాలే వస్తువుగానూ, పాండిత్యప్రకర్ష ముఖ్యాదర్శంగానూ ప్రవర్తిల్లిన క్షీణయుగకవిత్వానికి తిరుపతి వెంకటేశ్వరులు భరతవాక్యము పలికేరు. తాళపత్రగ్రంథాల్లోనూ, రాజసభల్లోనూ మాత్రమే అంతకుముందు నివసిస్తూండిన పద్యాన్ని పట్టుకొచ్చి ప్రజాబాహుళ్యానికి అందించింది వారే. వారితో విరోధించీ, వారిని సమర్థించీ రచనలు చేసినవారు వారిలాగే పద్యప్రచారానికి బాగా తోడ్పడ్డారు. ఆరోజుల్లో అక్షరాస్యుడన్నవాడికల్లా వారి పద్యాలు తప్పకుండా కంఠస్థమై యుండేవి. ఇదివరకు పద్యరచన చెయ్యనివా రెంతమందో వారిని చూచి పద్యరచన కుపక్రమించారు. వీరేశలింగము పంతులుగారికీ, క్షీణయుగానికీ నడుమ తిరుపతికవులు రాకపోయుంటే నవీనవాఙ్మయంలో కావ్యానికి ఇప్పుడున్నంత హోదా వచ్చి ఉండేదే కాదు.

పద్యానికి తిరుపతికవులు చేసిన సేవనే వీరేశలింగము పంతులుగారు గద్యానికి చేశారు. ఏకాక్షర రచనలతోనూ, ద్వ్యక్షర రచనలతోనూ (రసికజనమనోభిరామమువంటి రచనల్లో) కష్టతరమైపోతూండిన పద్యాన్ని సులభసాధ్యము చేసి తిరుపతికవులు ప్రజల కందించినట్లే, మారుమూల పదాలతోనూ, దుస్సాధ్యదండాన్వయంతోనూ కష్టతమమైపోయిన చిన్నయసూరివచనానికి కాలువా ఊడదీసి ప్రజాసేవ నేర్పారు పంతులుగారు. ఆంధ్రసాహిత్య నవోదయం ఆయనతోనే ప్రారంభమైందని నమ్మేవారు చాలామంది ఉన్నారు.

కాని పంతులుగారు ముఖ్యంగా దేశికులేకాని, కవులు కారేమోనంటాను. వారి గురి ఎంతసేపూ తెలుగువారి మనస్సుమీదనే; హృదయమ్మీద కాదు. వెలుగు చూపించాలనే వారి ప్రయత్నము; సౌందర్యం చూపించాలని కాదు. సంస్కృతిని అపారంగా ఇచ్చారాయన తెలుగువారికి; ఆనందాన్ని కాదు. ఆంధ్రవాఙ్మయాన్ని అనేకరీతుల్లో పెంచా రాయన; ఆంధ్రసాహిత్యాన్ని కాదు. వారి నవలలు నవలలు కావు; సంస్కారప్రబోధంకోసం ఆయన తన యిష్టము వచ్చినట్లు వంచిన కథలు. వారి కవిత్వము వారి సర్వతోముఖశక్తికి ఉదాహరణమే గాని హృదయాహ్లాదకారిమాత్రం కాదు. వారి స్వంతరచనలకంటె భాషాంతరీకరణాల్లో మనకి ఆనందము ఎక్కువ కనపడుతుంది. పంతులుగారు తెలుగువారికి విజ్ఞానసూర్యుడు; కళ్ళు చల్లబరచే చంద్రుడు కాదు. పంతులుగారి పంథాలలో రచన సాగించిన చిలకమర్తివారు ప్రహసనాల్లోనూ, నవలల్లోనూ కూడా ఆయనను శతధా మించిపోయారు. కాబట్టి ఆంధ్రసాహిత్య నవోదయం ఆయనే తీసుకొచ్చారనడము సత్యానికి దూరం.

ఈ శతాబ్ద ప్రారంభంలో తెలుగుదేశంలో పర్యటనము చేసిన పార్సీసాంగ్లికంపెనీవారి ప్రదర్శనాలు తెలుగులో స్టేజినాటకాల్ని లేవదీశాయి. అటు ధర్మవరం కృష్ణమాచార్యులుగారూ, ఇటు మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారూ నాటకాలు రచించి ఆడించారు. చిలకమర్తివారి ప్రసన్నయాదవాది నాటకాలు చాలా వెలిశాయిగాని పద్యాలూ పాటలూ ప్రవేశించి వీటిని కొంతవరకూ పాడుచేశాయి. ౧౮౯౨ నాటికే కన్యాశుల్కంకూడా తయారైపోయి రంగం ఎక్కింది. ఆనందగజపతి మహారాజు ఆజ్ఞానుసారం తీసిన బాల్యవివాహపు లెక్కలే కన్యాశుల్కనాటకానికి కారణాలయినవి. గురజాడ అప్పారావుగారు సమకాలిక పరిస్థితుల్ని దాటిపోయిన మేధావి. ఆయన కన్యాశుల్కం మూడు మహోద్యమాల కూడలి.

వందేమాతరోద్యమము దేశమంతటా వ్యాపించి ప్రతివారికీ మెరుపుకొట్టింది. మన దేశపు దీనదశా, మన అసహాయత్వమూ, భావదాస్యమూ చీకటి తెరల్లాగ మనవారి కళ్లముందు కట్టేయి. దానితో

మనల్ని బంధించిన సంకెళ్లన్నీ ఒకమారు గలగలలాడేయి. తెలుగు కవులు సంస్కృతాంధ్ర ప్రబంధాలలోని అలంకారాల్ని తెగగొట్టడము కట్టిపెట్టి తమ భావాల్నీ, ఆంగ్లకవుల భావాల్నీ ఖండకావ్యాలుగా రచించడము మొదలుపెట్టారు. ఆధునికవిత్వపు వరదల్లో అడ్డమైన గడ్డినీ, మట్టినీ కలుపుకున్న తెలుగుకావ్యాలు ఆ కలక తేరిపోయి తెలుగుభాషరుచిని ప్రతిఫలించాయి. ఈ కాలపు రచయితల్లో గురజాడ అప్పారావుగారు అగ్రగణ్యులు. వారి ఉత్తమరచన కన్యాశుల్కం క్రిందటి శతాబ్దంలోనే వెలువడడంనించి, పై ఉద్యమాలేవీ వారిని ప్రోద్బలించలేదని స్పష్టం. వారి సృష్టికి బ్రహ్మకిలాగే ఐదు ముఖాలు: సమకాలిక సాంఘిక సమస్యని తీసుకొని నాటకంగా రచించడమూ; హాస్యరచనా; జీవద్భాషారచనా; నేటిమాటలతో, జాతీయ ఛందస్సుతో కోమలమైన కవిత్వమూ; కథానికానూ. గురజాడవారు సాంఘికపరిస్థితుల్ని నాటకంలో బింబించిన కాలానికి పాశ్చాత్య దేశాల్లోకూడా ఇబ్సెన్, షా, గాల్స్‌వర్దీవంటి కవులు సాంఘికనాటకాల్ని రచించనేలేదట. వార్ల వెంకటేశ్వరరావుగారిదైన ఈ సాక్ష్యము కన్యాశుల్కాన్ని విశ్వసాహిత్యంలోకి లాగుతున్నది. ముఖ్యమైన ఇతివృత్తము కన్యాశుల్కగాథయే అయినప్పటికీ, వేశ్యాలోలత్వమూ, పిచ్చినమ్మకాలూ, స్వార్థపరత్వమూ వంటి పిశాచాలు కూడా కన్యాశుల్కానికి తోడై నాటకాన్ని ఒక ప్రపంచంచేసేశాయి. చూడండి, ఈ ప్రపంచంలో—ఒక ఛాందస వైదికుడూ, న్యాయవాది అయిన న్యాయవాదీ, ఒక ప్లీడరుగొట్టూ పరమలౌక్యుడయిన విధూషకుడూ, ఒక ఇంగ్లీషువిద్యార్థీ సంస్కృతవిద్యార్థీ, ఒక దాంభికుడూ ఒక లుబ్ధుడూ, ఒక సానిలంజా ఒక పూటకూటి విధవలంజా, ఒక పల్లెటూరి బాలవితంతువూ ఒక పట్నవాసపు విడో, ఒక పోలీసూ ఒక హవల్దారూ, ఒక సిద్ధాంతీ ఒక పూజారీ, ఒక పెతికశెట్టీ మేదకుడైన నౌకరూ, ఒక బైరాగీ ఒక సారాయిదుకాణదారూ, ఒక శైవజంగమూ ఒక సాతాని వైష్ణవుడూ, ఒక మునసబూ ఒక యోగినీ, ఒక తెలుగు ప్లీడరూ ఒక ఇంగ్లీషు ప్లీడరూ-సర్వమానవులూ వున్నారు. గురజాడ అప్పారావుగారి సరదా తీరడానికి ఇంతమంది వ్యక్తులు ఆడవలసివచ్చింది. ఎక్కడా ఏపాత్రని నిర్వహించడంలోనూ పట్టు జారిపోదు. ప్రపంచంలో ఆడినట్టే కన్యాశుల్క నాటకంలోనూ ఆడతారు వీరంతా. కన్యాశుల్కంతరవాత మళ్లీ అంతటి నాటకం నేటికీ రాలేదు.

గురజాడవారి హాస్యం ఆంధ్రభాషలాగే అందమైనది. అందులోని హాస్యరస్యం ఎలాగ పుట్టుతోంది అన్న జిజ్ఞాసకి వారే జవాబిస్తున్నారు 'ఆకాశరామన్న'లో: "స్నేహమూ, ప్రేమా అనే, అనాది అయివుండిన్నీ ఎప్పుడూ కొత్తగావుండే రెండువెలుగులను నరుని మీదికి తిప్పేకొంచితే వింతవింతసొగసులు బయలుదేరుతవి. సొగసు లేని మనిషే వుండడు" అని. మొక్కపాటివారు బారిష్టరు పార్వతీశమ్మీదా, మునిమాణిక్యమువారు కాంతంపతిమీదా, విశ్వనాథ కవిరాజు రకరకాల వ్యక్తులమీదా ఈ వెలుగుల్నే ప్రసరించారు. భమిడిపాటివారు ఈ వెలుగుల్ని వ్యక్తులమీదకంటె మాటలమీద ఎక్కువగా ప్రసరిస్తారు.

గ్రంథస్థభాషనే నవరచనలకి ఉపయోగించినట్లైతే అలాంటి రచనలకి క్రమంగా జీవశక్తి నశిస్తుందని గ్రహించి జీవద్భాషాచైతన్యం తెలుగుకి కలిగించడానికి తొలియత్నం చేసినవారు అప్పారావుగారే- బ్రతికిఉన్న అనుభవము బ్రతికివున్న భాషలోనేగాని, పుస్తకాలలో బిగించబడి వెనక్కి వెళ్లిపోయిన, లేక అలమారులోని కెక్కి కూర్చున్న భాషలో చైతన్యవంతంగా రాలేదని గుర్తించి తెలుగు భాషకికూడా సంస్కృతానికి పట్టిన (కావ్యభాషమాత్రమే అర్హ్య) దీనదశ పట్టకుండా తప్పించడానికి కార్యరూపేణా మొదటియత్నం చేసినవారు గురజాడ అప్పారావుగారు. వారు కన్యాశుల్కంలో ఎలాగ మాట్లాడుతునే భాషని అలాగే, వర్ణక్రమమేనా తప్పకుండా వాడినా, కవిత్వానికీ వ్యాసరచనకీ అలాంటి భాషకాక సంస్కరించుకున్న భాషనే వాడేరు. చిన్నకథలో సంభాషణలూ, స్వగతాలూమాత్రమే వాడుకభాషలోనూ, మిగతా కథనమంతా తొంభయి పాళ్లు గ్రాంథికంలోనూ రచించారు. సమర్థులైన సాహితీపరులు పది మండలాల భాష పరిశీలించి సంస్కరించుకుని కొత్త సాహిత్య భాషని నిర్మించుకోవాలని వారి ఆశయము. నేటి రచయితలలో గోదావరీమాండలికాన్ని వాడే శ్రీపాదా, మొక్కపాటీ, కృష్ణా, గుంటూరుమాండలికాన్ని ఉపయోగించే మునిమాణిక్యమూ, ఉన్నవా మాత్రమే భాషావిషయంలో శ్రద్ధాళువులు. తక్కినవారు అన్ని రకాలుగానూ భాషని తిప్పుతున్నారు. ఇటీవల రాళ్లపల్లివారుకూడా వ్యావహారికం గ్రహించడంతో అనంతపురమాండలికము సాఫుదేరి అందుతుందనే ఆశ కలుగుతోంది. నెల్లూరు, కడప మాండలికాలు మనకి అందడమే లేదు.

చదువర్లను హడలెత్తించే సంస్కృతసమాసాలతో నిండిన రచనే గొప్పరకపు కవిత్వంగా చెల్లుబాటయిపోయే రోజుల్లో తేటైన మాటలతో తాను స్వయంగా గుర్తించిన సౌందర్యాన్ని రచించిన కవి గురజాడ అప్పారావుగారు. సంస్కృతసమాసాల రచనలను ఈయన కొయ్యబొమ్మలన్నారు. కాదా మరి? అవి కావ్యాలలో తప్ప వినబడడము లేదాయెను. మరి వాటికి జీవభాషయొక్క కోమలత్వం ఎలా వస్తుంది?

"పాటపాడెను చెట్టుచామలు-కోటిచెవులను గ్రోలి యలరగ
తాటివనమున నాగి చంద్రుడు-తాను చెవియొగ్గన్."

అని నిశ్శబ్దాన్ని వినిపించి-

"అనగ కన్నియ, తిరిగి మెల్లన
నన్ను కన్నులు విచ్చి చూసెను."

అని కన్నియచూపులు మనకి చూపించి-

"దేశమంటే మట్టికాదోయి-దేశమంటే మనుషులోయి"
అని ఉపదేశించిన కవి తెలుగులో మరి యెవరున్నారు?

"ఆమని రాగా దుర్గకొలనులో-కలకల నవ్వెను తామరలు
ఆమని రాగా దుర్గవనములో కిలకిల పలికెను కీరములు"

అని తేటైన మాటలతో తామరల్నీ, చిలకల్నీ ఇంత చక్కగా కాన్పించిన కవి ఎవరున్నారు? తెలుగుభాష సంస్కృతంలాగ సమాస జటిలమూ ప్రవాహశీలీ కాదనీ, అజంతాలతో గజగామిని అయిపోయిన ఈ భాషకి వృత్తాలుకాక మాత్రాఛందస్సులే అనుకూలాలనీ మొట్టమొదట గ్రహించి రచించినది గురజాడ అప్పారావు గారే. కాని వీరి ఆచరణని ఇతరకవులు వెంటనే అనుకరించలేదు సరిగదా, ఎంతమందో, వీరుద్ధరించిన ముత్యాలసరాల్ని (రాయప్రోలు వారివలె) మళ్లీ పాతపద్ధతికి మళ్లించేశారు. అందువల్ల మాత్రాఛందస్సులే తెలుగుకి అనుకూలాలన్న వీరి సందేశం మొన్న మొన్నటివరకూ మరుగుపడిపోయింది. తిరిగి నేడు శ్రీశ్రీ, మల్లవరపూ, పాపా, తిలక్, ఆరుద్రాలు మాత్రాఛందస్సులలో వింతనడకలు చూపిస్తున్నారు. శ్రీ. శ్రీ. అనేక ప్రయోగాలు చేసి—

"ఏ దేశచరిత్ర చూచినా—ఏమున్నది గర్వకారణం
నరజాతిచరిత్ర సమస్తం-పరపీడన పరాయణత్వం."

అనీ,

"ఆనందం అంబరమైతే—అనురాగం అర్ణవమైతే
ఆనందపుటంచులు చూస్తాం-అనురాగపులోతులు తీస్తాం"

అనీ,

"మరోప్రపంచం మరోప్రపంచం—మరోప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి తోసుకు-పదండి పోదాం పైపైకి"

అనీ చక్కని కొత్తవరసలు కనిపెట్టారు. పఠాభిగారు వచన పద్యా లనే దుడ్డుకర్రల్తో పద్యాల నడుములు విరగదన్నేరు. 'టులాన్'లో తిలక్కూ, 'వగ్గు'లో విశ్వేశ్వర్రావూ, 'పురిటి పాప'లో పాపా, వచనంలోనే చిత్రగతులు చూపించారు. సీస పద్యం చాలాకాలమాయి కవిత్వంలోంచి మాయమైంది. వేములవంటి సంప్రదాయకవిరచనలోంచి శార్దూలమూ, మత్తేభమూ తప్పుకున్నాయి. వృత్తాలు కవిత్వంలోంచి తప్పుకుంటాయి. తథాస్తు. అది కోరదగినదే.

చక్కని కథకశిల్పంతో, కొసమెరుపుతో మొదటి కథానిక—'దిద్దుబాటు' అప్పారావుగారే రచించారు. ఆ కథలోని ప్రతీ అల్ప అంశమూ కథాపరిణామానికే తోడ్పడుతుంది గాని కాలక్షేపానికి కాదు. ఆఖరున 'మంచముక్రిందనుండి అమృతనిష్యందిని యగు కలకల నగవును కరకంకణముల హృద్యారావమును' మనకి కూడ వినబడతాయి. కేవలం కథనశిల్పాన్నే ప్రదర్శించే చిన్నకథలూ, పెద్ద కథలూకంటె ఈరకపు కథలు శక్తివంతమైనవి. ప్రఖ్యాత కథానికా రచయిత లందరూ చివ్వర మన గుండెమీద మోది నాదంపుట్టించే ఈ రకంకథల్ని రచించారు. దీక్షితులుగారి 'చెంచుదంపతులూ', శివరామశాస్త్రిగారి 'వలీ', గుడిపాటివారి 'హత్యవిచారణా', పాప 'తీర్థపుటుద్రేకాలూ' ఈరకం కథలు.

గురజాడవారి సృష్టి విశాలమైనదే. అయినా, "ఈనాటి వ్యావహారికరచనా, గేయాలూ, కథానికలూ వారి ఒరవడి ననుసరించే బయలుదేరాయంటే, ఆమాట సత్యం కాదు. దేశమొక్కటి మీద పుట్టిన చైతన్యానికి వారు కారణం అనడంకంటే వారు ప్రథమసంతానము అనడము ఎక్కువ నిజము. వందేమాతరోద్యమమూ, రవీంద్రుని కవితాజ్యోతీ ఆంధ్రరాష్ట్రోద్యమమూ దేనికది బలీయమై వ్యక్తుల్నెంతమందినో ప్రోత్సహించాయి. రాయప్రోలు వారి జడకుచ్చులూ, తెలుగుతోటా ఆంధ్రోద్యమంవల్లా, వారి కష్ట కమలా తృణకంకణమూ స్నేహలతాదేవీ రవీంద్రుని కవితావాణీవల్లా ప్రోత్సహించబడినట్లు కనబడతాయి. అబ్బూరివారికి కూడా రవీంద్రుని మెరుపే తగిలినట్లు కనిపిస్తుంది 'ఊహాగానము' వింటే. పింగళీ కాటూరికవుల 'తొలకరీ', బాపిరాజు 'తొలకరీ' ఆంధ్రోద్యమాన్ని ప్రతిఫలిస్తాయి లోంధయిపోల్లు. శక్తివంతాలైన పై ఉద్యమాలేకాక చిన్న చిన్న శక్తులు కూడా చాలాపని చేశాయి ఈ దశలోని సారస్వతాభివృద్ధికి. గున్నేశ్వరరావు, నాగేశ్వరరావు ప్రభృతుల నాటక కంపెనీలూ, నాటకప్రయోగపరీక్షలూ నాటకవిమర్శనీ, నాటకప్రదర్శనవిమర్శనీ బయల్దేరదీశాయి. ప్రవాసము విడిచి స్వదేశానికి వచ్చిన ఆంధ్రపత్రికా, దేశంలో వున్న త్రిలింగా, ఆంధ్రభారతీ, చింతామణీ, మనోరమాది పత్రికలూ నవరచనలకి దోహదం చేశాయి. కళావేత్త కూర్డ్రిదొర కవికొండలా, బాపిరాజూవంటి వర్ధమానులను గుర్తించి ప్రోత్సహించారు. రామలింగారెడ్డిగారు మొదటి విమర్శ గ్రంథము—కవిత్వతత్త్వవిచారము వెలువరించారు. ఇన్ని శక్తుల కూడలి వల్ల ఆంధ్ర సారస్వతస్రవంతికి వరదలు వచ్చాయి. అప్పారావుగారు ఈ వరదల తొలిపొర. వారు ఉపజ్ఞావసానులు. వారినే ఉద్యమమూ ప్రోత్సహించినట్లు కనబడదు. వారే ఒక ఉద్యమం.

౧౯౧౮లో యుద్ధం ఆగిపోవడంతో అన్ని దేశాలకీ కొత్త మెలుకువ వచ్చింది. సంపూర్ణస్వాతంత్ర్యోద్యమం మొట్టమొదటిసారి కారుచిచ్చులాగ వ్యాపించింది. ఈ ఊపుతో తన్ను బంధించిన సంకెళ్లనీ, మొగమాటాల్నీ తెంచిపారేసి కవి రెక్కలు కట్టుకుని ఎగిరేడు. రకరకాల స్వతంత్రరచనలు బయల్దేరాయి. శివశంకరశాస్త్రిగారి అధ్వర్యాన్న సాహితీసమితి స్థాపించబడింది. సంస్కృతాంధ్రకావ్యాలు వల్లించిన జ్ఞాపకంతో కాక, సొంత అనుభూతిని పురస్కరించుకుని రచించండని శివశంకరుల ఆదేశము. ఇతఃపూర్వపు రచనలలో ఆకవుల భావాలతోబాటు వారి ఊహాలూ, ఆలోచనలూకూడా అల్లుకుపోయి ఉండేవి. అందువల్ల వారి ఆలోచనల్ని చుట్టిఉన్న గిరి వారి రచనల్ని బంధించినట్లు కనబడేది. కృష్ణశాస్త్రిగారి రచనల్లో ఊహాలూ, ఆలోచనలూకూడా భావాలుగా మారిపోయి ప్రత్యక్షమౌతాయి. అతి సామాన్యంగా వుండే భావాలు—

"కైత యొకండు గా దిపుడు కాలము సర్వము మారె, వ్యర్థపుం
జాతురి హెచ్చె నల్పమగు సాహితిలో పెదపెద్దపాత్రముల్
జ్ఞాతురు తప్పదిద్దుదురు ఘోరత సచ్చె కవీంద్రులందు, నీ!
మాతులు గట్టి పెచ్చికొనబోలదె సత్కవులైనవారికిన్"

వంటివి—

"ఇపుడు ప్రళయమ్ము క్రమ్మినదేమొ కాక
దొరకదో నిల్వ నీడ నా చిరుతపాట
కింత ఇరుకౌని యిమ్మహోపంత విశ్వ
మలమికొను చీకటుల కలకలమువలన!
స్థాణువయ్యెనొ, పాషాణ జడథరమ్ము
గనెనొ, కదలదు మెదలదు కంఠరవము
నే డిదేమో తమోజననీపురాణ
గర్భకుహరమ్ము విదలించి కొరుచిచ్చు
మెరుపుమంట మూలంగేదొ యేదొ ప్రాక..."

అని శక్తివంతంగా వస్తాయి. అంతకుపూర్వము ఇంద్రియాల్లో దేన్నో ఒకదాన్నే స్పృశించి గిలిగింతపెట్టే వర్ణనలు ఈయన రచనలో జడపాయల్లాగ పెనవేసుకుని రెండుమూడింద్రియాల్ని స్పృశిస్తాయి. చూడండి: "ఈ నిశాంతమ్ము శూన్య, మిందెన్నడో రహశ్శిథిలసుప్తి గలవరమంది లేచి గుబులుకొను లేతనెత్తావిగుసగుసలెవో"; "లేనె లేటచినుకేని లేని యీ పాట"; "నీ వెలుగుచూపాకలేయి వికసించి వాసించి మిలమిలా తళతళా మెరసినది కురిసినది"; "హాలాహలాంధకారానలజ్వాల"; "కరుణార్ద్రి వీక్షణ పరిమళములు" వంటివి వారి రచనలన్నిటిలోనూ కనబడతాయి. వారి భాషకి వింతశక్తి నివ్వడానికి పగడాలు, బంగారు, రజతము, వలపు, కాటుక, కంటకము – వంటి పదాలు విశేషణాలవుతాయి. ప్రకృతి అంతా సిగ్గు, నిదుర, పాట, పులకరింపు, వలపు, దృక్కులు, యెల్లు మొదలైన మానవధర్మాలు అలవర్చుకుని మానవచైతన్యంతో తిరుగులాడుతుంది. వీరు గుర్తించే పోలికలు నన్నయగారి కవిత్వంలోని పోలికల్లాగ అంతటా కలవవు. మెరుపులాగ క్షణకాలమే పోలిక నిలుస్తుంది.

"సంజవేళల బవడంపుఁ జాయలటుల
జిరుతప్రాయంపు గోరికల్ చెదిరిపోయె
పర్వతశ్రేణి నిర్ఝరపంక్తులట్లు
ఆశయములెల్ల నడుగంటి యంతరించె."

అనే పంక్తులు చాలు ఈమాట నిరూపించడానికి. పైన చెప్పిన వాటినన్నిటినీ మించి వస్తుధ్వనీ, అది నిరూపించే రసధ్వనీ వీరి రచనల్లో తరుచు మెరుపుకొడతాయి, చూడండి:

"కరుణపట్టున కీ బిచ్చగాని చేయి
చూచికొనివాడ మృత్యుఘోష మెమ్మె మరచి
పట్టిబయలున నొక మోడుచెట్టువోలె
ఎత్తినది కరమెత్తినట్లే కృశించె.
వలపుటాకలి క్రుక్కి నాబదుకుమీద
ఇనుపపాదాల నిడి లోక మిపుడు నడచు"

కృష్ణశాస్త్రిదృష్టి ఎంతసేపూ మేఘాలమీదే. "తరులెక్కి యల నీలగిరు లెక్కి మెలమెల్ల చదలెక్కి...దిగిరాను దిగిరాను దివి నుండి భువికి" అనడం ఈయనకి సరదా. ఈయనకి హేమమణి రత్నగణము అక్కర్లేదు; 'లోకంపు విధము' ఈయనకి చిత్రంగా కనపడుతుంది. 'అమలమోహనసంగీతమందు హృదయదళనదారుణ రోదనధ్వనులు' వినపడతాయి ఈయనకి. కాని వేదుల సత్యనారాయణశాస్త్రిగారు మాత్రము భూపుత్రుడే. ఆయనఖండకావ్యాల్ని బట్టి చూస్తే. 'తొలకరిసారె యిడిన యార్ద్రిపుగగు పూవుల శాద్వలాంబరము ధరించిన ధారుణీ', 'పండి వ్రాలిన వరిపైరుపైని ప్రాకివచ్చు చిరుగాలితరగల వరుసా', మావితోపులపై దొలిమబ్బునీడలూ, శైలహృదయములోని నిర్ఝరమూ, గగనదుర్గపు తూర్పుబంగారు తలుపులూ, పశ్చిమాకాశ నికష సువర్ణరేఖలూ చూసి, ఆ మృదుచంద్రికా యవనికావృత నీలనభోనిశాంత శోభామయసీమలకి వెళ్లగోరినా, ఒక్క యామినిమాత్రమే తిరుగులాడడమే ఈయనకోరిక. కృష్ణశాస్త్రిగారి రచనకి ఆవేగముంటే, ఈయనరచనకి సౌందర్యముంది. కృష్ణశాస్త్రిగారి భావావేగము రెక్కలుకట్టుకు ఎగురుతుంది. ఆయన రచనాచిత్రంలో కుంచెపని ఎక్కువ. సత్యనారాయణశాస్త్రిగారి రచన తళతళలాడుతూ నదిలాగ మెల్లిగా సాగుతుంది. ఈయన రచనాచిత్రములో రేఖాప్రాబల్యము ఎక్కువ. మేళసంగీతములోని శక్తి కృష్ణశాస్త్రిరచనలోనూ, రాగసంగీతంలోని సౌందర్యం వేదుల రచనలోనూ ఉన్నాయి. వేదులలో కృష్ణశాస్త్రిపోకడలు చాలా కనబడతాయి. కాని ఒక కొత్త జిలుగు వాటికి వేరేరంగు పూసేస్తుంది. ఇవి అసలుభావాలకన్న చిక్కిలిచేసినవి కాబట్టి, సులువుగా పట్టుకుంటాయి. కృష్ణశాస్త్రి రచనల్లో అన్వయం తెలీదు ఒక్కొక్కప్పుడు. ఆంగ్లకవుల ప్రభావం ఎక్కువ ఆయనలో. 'కన్నీటి కరటాల వెన్నెలలా' చదివి 'దీనిభావ మేమి తిరుమలేశ' అన్నవారెంతమందో? ("ఈ మునిమాపులో నేమో విషాదమో సందేహమో నన్ను జ్వాలలయి దహియించు") "వెలుగులో చీకట్లా వీని కౌగిళ్లలో కనలుచే నల్లనల్లని వేడి రక్తాలు" అన్న పాదాలలో అర్థంకాని మాట లేదూ, అర్థంఅయ్యే భావం లేదూ నాకు. కృష్ణశాస్త్రిగారు ఇంగ్లీషు కవిత్వపు అన్వయాలు తెలుగులోకి దిగుమతిచేస్తారు. అందువల్ల ఒక్కొక్క చోట ఆయనరచనలలో (ఊర్వశిలో మరీని) ముసుగేగాని మోము కనబడదు. కాగా ఆ రోజుల్లో అర్థముకాని రచనకల్లా భావకవిత్వం అన్న పేరు రూఢిఅయిపోయింది. ఎలాగు వచ్చిందోకాని యతిప్రాసలు లేని రచనకికూడా భావకవిత్వ మని పేరువచ్చేసింది. "భావకవులకి నియమాలేవీ అక్కరలేదు. వారి కిష్టమువచ్చినట్టుగా ఏదో భాషలో రాస్తారు. అర్థమైతే సరే. లేకపోతే వారి నడిగి లాభంలేదు. "పరుల కర్థమ్ముకాని భావగీతమ్ము లవి." అనే ప్రతికూలభావం

చదువర్లలో వ్యాపించింది. యెంకిపాటలు రావడంతో ఈ ప్రతికూలత కోటకట్టి వారిమీద విరుచుకుపడ్డది. 'భావకవులు' అనబడేవారు 'గ్రాంథిక' భాషలోనే రాశారు. అయినా యెంకిపాటల 'దోషం' వారి నెత్తినే పడింది. యెంకి నాయుడికి పరకీయయేమో అన్న అనుమానం పుట్టించే రచనలు యెంకిపాటల్లో వున్నాయి. వీటినీ, ఆ పాటల్లోని గ్రామ్యమూ కాక నాగరికమూ కాక కలగాపులగ మధ్యే భాషనీ పట్టుకుని చాలా విమర్శ సాగింది. అదినారాయణ శాస్త్రులు గారంతటివారు సమర్థించుకువచ్చినా ఈ విమర్శ ఆగలేదు.

భావకవులు సమకాలిక 'అభావకవుల్ని' హేళన చేసేవారు. తామేదో మబ్బుల్లోంచి ఊడిపడ్డట్టు నడుచుకునేవారు. వీరి జీవిత పద్ధతులుకూడా అనుమానాస్పదంగా కనబడేవి. దానితో ప్రతికూల శక్తులు బలం కూర్చుకుని 'నేటి కాలపు కవిత్వం', 'విచారణ దినము', 'దాంభికుడు', 'కళాభాయి' మొదలైన రచనలుగా వచ్చాయి. సాహితీసమితివారి 'సఖి' ఆగిపోయింది. ఏ కారణంచేతో 'భారతి' వంటి పత్రికల్లో వారి రచనలు మరి రాలేదు.

చిన్నకథలు

భావకవిత్వంతోపాటు చిన్నకథా, ఏకాంకికా కూడా పొడ చూపి పెరిగేయి. చిన్నకథని దీక్షితులుగారు చిత్రచిత్ర గతులతో నడిపించారు. నేడు కొడవటిగంటి, బుర్రా, పాపా, బుచ్చిబాబుల చేతుల్లో కొత్తనడకలు నేర్చిందిగాని ఆ రోజుల్లో చిన్నకథని నడిపించినవారు దీక్షితులుగారే. వీరి కథలు ఆలోచనకి బాగా పని చెప్తాయి. దేశభక్తి, చెంచుదంపతులూ, దాసరిపాటా మన కథానికా వాఙ్మయానికే కాదు, విశ్వసాహిత్యానికికూడా చక్కని అలంకారాలు. దీక్షితులుగారి భాష వ్యావహారికమేగాని అక్కడక్కడ చెక్కుతుంది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి భాషకి లోటులేదు. నిర్మలమైన గోదావరీమాండలికాన్ని వారి కథల్లో చూడవచ్చు మనము. వారి ఇతివృత్తాలుమట్టుకు కేవలం కాలక్షేపానికేగాని ఆలోచన రేపడానికి శక్తిచాలనివేమోనని నా అభిప్రాయము. వారు కథలకి పెట్టేపేర్లలో ఎక్కువ శక్తి కనపడుతుంది నాకు కథలలోకంటే. 'కచ్చితమైన జవాబు', 'పెళ్లాడతగ్గ మొగాడేడీ' మొదలైన శీర్షికలు శక్తివంతంగా వినపడతాయి; కథలు చదివితే 'కచ్చితమైన జవాబు ఇదీ' అనీ, 'ఇలాంటిదాన్ని పెళ్లాడతగిన మొగాడేడీ' అనీ అనిపించలేదు నాకు. కథలుమాత్రం గుడిపాటివారి రచనల్లాగ చివరిదాకా లాగుతాయి. అయిపోయినతర్వాత మనస్సులో నిల్చివుండేది ఏమీ కనబడలేదు...గుడిపాటివారి కథల్ని ఎరగనివారు అక్షరాస్యులు ఆరోజుల్లో ఎవరూ లేరు. వారి భాష చాలా శక్తివంతమైనది. ముక్కుకి తాడు వేసి లాక్కుపోయినట్టు లాక్కుపోతాయి వారి రచనలు. తెలుగులో ఆయన వ్రాసినంత శక్తివంతంగా వచనం వ్రాసినవారు కనపడలేదు నాకు. మాటలు వింతచాకిరీ చేస్తాయి ఆయనకి. గురజాడవారి హాస్య రచనకి ఉదాహరణ లిచ్చినట్టే గుడిపాటివారి భాషాశక్తికి ఉదాహరణ లివ్వడమంటేనూ. వారి కథావస్తువు స్త్రీలకి స్వేచ్ఛవుండాలి అనీ, గర్భవిచ్ఛిత్తికి హక్కు ఉండాలనీ, సామాజిక నియమాలకి ఎదురుతిరిగి విశృంఖలావృత్తిలో అడుగుపెడితేగాని స్త్రీజీవితం అసంపూర్ణమనీని. జీవితంతో ప్రయోగాలు చేస్తూ ఫలితాన్నిబట్టి మారిపోగల వ్యక్తులపట్ల వారి ఊహలు ఫలించవచ్చునుగాని, జీవిత స్రవంతిలో ఒడుదుడుకులు లేకుండా ప్రయాణించవలసిన మొత్తపు సమాజానికి ఆరోగ్యమైనవి కావేమో అని నా నమ్మకం. మొదటి పద్ధతిలో వ్యక్తే ప్రధానుడు. సమాజము అన్నది కేవలము కట్టుతాడే గాని ప్రయోజనకారి కాదు. ఒక మానవుడు తన సుఖజీవనానికి మరొక మానవునిపైన ఆధారపడే నేటిరోజుల్లో ప్రతీ మానవుడికీ స్వతంత్రవర్తనమే ఉంటే ఎవరి జీవితమూ సుఖప్రదంగా వుండదు. స్వార్థసాధనే ప్రతివాడికీ పరమకర్తవ్యమైపోతుంది. జగడాలు పుట్టుకొస్తాయి. "సొంతలాభం కొంత మానుకు పొరుగువాడికి తోడుపడవోయి" అన్నదే నడవడికని దిద్దాలిగాని, 'అలరుపసంతి చక్కిలిగింత పెట్టి, విరిచేడె పులకింప సరసను ఆడి, మరియొక్క వనతోడ మంత నంబాడి, వేఱొక్క సుమకాంత క్రీడ బోగొట్టి' పూవుపూవుకీ పోయే కళాభాయీతత్వం అందరికీ ఎక్కుందంటే చెప్పేదేమిటి అలాటి సమాజపు పరిస్థితులూ?...వేలూరి శివరామ శాస్త్రిగారి కథానికా భాష వ్యావహారికం కాదు. వారి రచనలు పెళ్లీ, పెంపుడుచిలుకా, ప్రౌఢాపరివ్రాజక వివాహమూ చదివేను నేను. వారి భాషకి మంచి జిగి వుంది. కథలో ప్రవాహగతి లేకున్నా భాష లాగుతుంది చదివే వారిని చివరిదాకా. చివ్వర మాత్రం ఆశ్చర్యసంఘటనంతో పూర్తి చేస్తారీయన. అందువల్ల వీరి కథలు జ్ఞాపకముండిపోతాయి.

ఏకాంకికలు

తెలుగుఏకాంకికని ఎంతమందో పెంచారు. రావడము మొట్ట మొదట సఖిలోనే వచ్చింది ఏకాంకిక. కాని తరవాతి వృద్ధిమాత్రము సాహితీ సమితివారి చేతుల్లో జరగలేదు. నోరి నరసింహశాస్త్రిగారు చాలాఏకాంకికలు రాశారు. కాని 'ఖేమాభిక్కుని' లాగ ఒకటీ లేదు. శిరోమణిగారు 'సఖి'లో వచ్చిన రెండు ఏకాంకికలతోనే ఆరకపు రచన కట్టిపెట్టేశారు. కృష్ణశాస్త్రిగారు రసఘట్టాల్ని సంభాషణారూపంగా రచించారు వారి 'రేడియోనాటిక'ల్లో. అవి శ్రవ్య కావ్యాల్లాగే కనబడుతున్నాయి నా దృష్టికి. శివశంకరశాస్త్రిగారు మట్టుకు రాజదర్శనమూ, వేణీసంహారమూ, స్త్రీవిరోధీ అని మూడు ఏకాంకికలు రచించారు. మొదటిది రేడియోనాటిక. రెండోదానిలో సంభాషణ చక్కగా వుంటుంది, కాని అన్నీ వాదోపవాదాలే. కథఏమీ లేనూలేదూ, నడవనూనడవదూ. 'స్త్రీవిరోధి' బాగుం టుంది. విశ్వనాథకవిరాజూ, జస్టిస్ రాజమన్నారూ, నార్లా ఏకాంకికారచనలో చాలా అనుభవం గడించారు. విశ్వనాథ కవిరాజువి అన్నీ పరిహాసనాటికలు. హయ్యరుగ్రేడ్ ట్రెయినింగు టీచరూ, కిరాయినటుడూ, ఆంగ్లవిద్యార్థీ, ఆంధ్రాషెర్లక్ హోమ్సూ, ఆయుర్వేదవైద్యుడూ, దురాశాపరుడూ - వారేమిటి వీరేమిటి,

అగ్రౌండు యాక్టరూ, కంట్రాక్టునాటిక నేపథ్యమూ, కంట్రాక్టు నాటకప్రదర్శనమూ, కోర్టుపతులూ, పేరు ప్రసరించే జ్యోతిలో చిత్రంగా ఆడతారు. ఆదిలోనే గట్టిచిక్కు పెట్టేసి కథని లాక్కుపోతూ, చివర్ర 'ఏమీ లేదు, ఇదిగో' అని పిడికిలి విప్పి చూపించేస్తారు. కథలోని గోప్యతవల్ల ప్రేక్షకుల అపేక్ష చివరిదాకా నిలుస్తుంది. కథని నడుపుతూనే కొండఅంచుదగ్గిరకి తీసుకుపోతా రాయన. 'మరి ఒక్క అడుగు పడిందా, ఇక అగాథంలోకే' అన్న పరిస్థితిని తయారు చేసి, ఆ అడుగువల్లనే తేల్చేస్తారు కథనంతటినీ. ఈ శిల్పం మెచ్చుకోతగ్గది. కథలోని చిక్కూ, క్లిష్టంగావుండదు. పెళ్లాన్ని ఇంట్లో వుంచి బుద్ధిగా వుండమని చెప్పి నిక్షేపంలాగు తలుపుతాళం వేసుకుని వీధిలోకి వెళ్ళిన సన్యాసిరాజుపంతులు తిరిగివచ్చేసరికి తాళం అక్కర్లేకుండా తలుపువచ్చేస్తుంది; కిరాయివేషం వేసి పాతికరూపాయలు మిగిల్చి ఇదివరకే తానిచ్చిన పాతికా ఉన్నాయా లేవా అని వీధిలోంచే అడిగేడు భార్యని రంగారావు. ఆవిడ ఏదో కొనేశానంది; దొంగని పట్టుకోడానికి పూనుకున్న ట్రూపుకి నాయకుడుగా పని చేసే ప్రకాశరావు ఇంటికే దొంగ వచ్చాడు; వారసులు లేని చలమయ్యశాస్త్రి లాంచీతో మునిగిపోయాడని వార్తచదివి, తయారయిన వారసుల్ని పరిశీలించడానికి కలెక్టరు చేసే కచేరికి ఆ చలమయ్యశాస్త్రిగారే వచ్చి సాయపడతారు. ఇలాంటివే ఆయన ఇతివృత్తాలు చాలానూ. ప్రదర్శనానికీ, హాస్యానికీ, ఏకాంకికాశిల్పానికీ కూడా విశ్వనాథకవిరాజు నాటికలు ఎంచుకోతగ్గవే. రాజమన్నారు ఏకాంకికలకి ప్రత్యేకవైలక్షణ్యత ఉంది. ఆదర్శయువకుని ప్రేమా, తల్లి అభిమానమూ, వేశ్యపాతివ్రత్యమూ, పురుషుల వేశ్యాలోలుపత్వమూ, దొంగాచార్యుల తెలివితేటలూ ఎంతవరకూ వెళ్ళగలవని మన మనుకుంటామో అంతవరకూ తీసుకువెళ్ళి, అక్కడ మరో అడుగు వేయిస్తారాయన. ఆ అడుగే పతాక (**climax**) అయి మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది. వీరి దృష్టి ఘటనలమీదకంటె పాత్రల శీలముమీదే ఎక్కువగా మొగ్గుతుంది. 'దయ్యాల్లంక' వీరి రచనల్లో మిన్న. 'సుధ' పాత్రపోషణ గొప్పగా వుంది. వీరి ఏకాంకికలు చాలా చిన్నవిగానూ, చిక్కగానూ వుంటాయి. ప్రదర్శనము జరగవలసినంతసేపు వుండదని ఒక అభిప్రాయము ఉంది. అది నిజమైతే కావచ్చుగాని అసలు ఏకాంకికలే చిన్నవి. అందులో ప్రేక్షకులకు బోధపడాలని వివరణ ప్రారంభిస్తే రచన పల్చనైపోతుంది. ఏకాంకికని ప్రదర్శించాలంటే ప్రతివాక్యమూ, ప్రతీమాటా చక్కగా బలంగా పలికి నటించగల నటులూ, ప్రదర్శనం వాస్తవంగా నడిచిపోతోందా అనిపించడానికి సాయంచేసే రంగభూమీ, నిశ్శబ్దంగా ఉండి వినగల ప్రేక్షకులూ లభ్యపడాలి. బజారుప్రేక్షకుల్ని పట్టుకోడానికి ఏకాంకికలకి పొడుగు చాలదు. పట్టుకోవాలని ప్రయత్నం చేస్తే చిక్కదనం తక్కువౌతుంది. నార్లవారి నాటికలు చూడండి. కొత్తగడ్డ, ద్రోహమూ, సంహారీ, ప్రారబ్ధమూ, శకునపక్షీ — చాలా రాశారు. ఇవన్నీ జీవితఖండాలు. "మ'రే; అవును మరి; మంచిపని అయింది" అనే మాటలు అప్రయత్నంగా వస్తాయి మననోటినించి ఇవిచూస్తే. కాని ఈనాటికలు చెప్పే సత్యాలకి లోతు తక్కువ. ఒకరకంగా పరమార్థ ప్రహసనాలనవచ్చునేమో వీటిని(**serious farces**). హాస్యరచన ఆట్టే వుండదుగాని వ్యక్తుల లోట్లనే ముక్తాయించి కనపరిచే ప్రయత్నమే ఎక్కువగా కనపడుతుంది. సమకాలికవ్యక్తుల జీవితమ్మీద కంటె సమకాలికసంఘజీవనమ్మీద విమర్శ అయితేగాని నాటిక పట్టుకోదు. రాజమన్నారుగారి ప్రయత్నం చాలామట్టుకు వ్యక్తుల గుణాల్ని సాంఘికంగా మార్చిచూపిద్దామని. నార్లవారిది వ్యక్తిమీదే కేంద్రీకరించి పోతోంది.

సర్గబంధాలు

౧౯౩౦ మొదలు ౧౯౪౨ దాకా నవ్యసాహిత్యానికి ప్రవాహదశ. గిడుగువారి వాదానికి ప్రజాబాహుళ్యం స్వాగతం చెప్పింది. పెద్దలంతా నవ్యసాహిత్యపరిషత్తు స్థాపించారు. జ్వాలపత్రికలాగ 'ఏదైనాసరే ఏదో ఒక అయోమయం, ఒక తిరుగుబాటు, ఒక బాకుపోటు' రాయమనకుండా ఒక ఉద్దేశంతో రచించినవారందరికీ ప్రతిభ తావిచ్చింది. పరిషత్తులో లేనివారుకూడా జగ్గూ నిగ్గూ వుండే రచనలు చెయ్యడానికి యత్నించారు. సెట్టి లక్ష్మీనరసింహముగారి ప్రభాసశాపవిమోచనమూ, పింగళి కాటూరి కవుల సౌందరనందమూ, కొమరవోలు సుబ్బారావు ప్రత్యూషమూ, వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారి మునిత్రయచరిత్రమూ—సర్గబంధాలు—వచ్చాయి. సెట్టివారి కలము అతిసాహసి. పద్యాన్ని ఎక్కడో అక్కడ ప్రారంభించేసి నడుచుకుపోతుంది. పింగళి కాటూరి కవుల పద్యం ఉద్యానవనసరోవరంలాగ చక్కని కత్తిరింపూ, అలంకారమూ, రేఖల తీర్పుతో ముచ్చటగా నడిచింది సౌందరనందంలో. కొమరవోలురచనకి ధారావేగం కనబడుతుంది. దయ్యపుకథనికాక ఐతిహాసికగాథని తీసుకుని పెంచి రచించివుంటే ఎలా వుండునో. వెంపరాలవారు అష్టదిగ్గజాలలోనివారు. ఆలస్యంగా వచ్చారు తెలుగుదేశానికి. మునిత్రయచరిత్రము మంచి ప్రబంధరచనతో నిండివుంది. "కథాసౌందర్యముకూడా దీనికి తోడైవుంటే?" అన్న ఆశకి వీరి 'శంకరవిజయం' జవాబుచెప్తుం దనుకుంటాను. ఈ కుటుంబంలోనివే మొన్నమొన్నటి, శివాజీప్రబంధమూ, రాణాప్రతాపసింహ చరిత్రమున్నూ. భాస్కరరామాయణం జ్ఞాపకానికొచ్చింది ఇవి పఠిస్తే. విశ్వనాథవారి 'రామాయణ కల్పవృక్షము' ఈ సర్గబంధాల్లో ఆఖరిదీ, మేటిదీను. "చాలా శ్రమించి మెరుగుపెట్టారు సత్యనారాయణగారు" అని వింటున్నాము. కావలసినదే. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వచనంలో రామాయణం రాస్తున్నారని విన్నాను. అయితే అది పారాయణగ్రంథమైపోతుంది తెలుగువారికి. వాల్మీకికథకి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వచనం! 'బంగారం ఘుమఘుమ లాడిపోతుంది.'

నవలలు

సుదీర్ఘమైన నవలలు—చెన్నపట్టణములో, మాలపల్లి, వేయిపడగలు, నారాయణరావు, పరిణామమూ వచ్చాయి. శేకుమళ్ళ

రామచంద్రరావుగారు చక్కగా పాత్రపోషణ చేసుకుంటూ నడిపారు మొదటిదాన్ని. కాని కథ కొంత అడ్డం తిరిగిందేమో అని అనుమానం తట్టింది నాకు. వేయిపడగల్లో రసమయఘట్టాలు చాలా వున్నాయి. సత్యనారాయణగారి కల్పనాశక్తికి ఈనవల మంచి విహార భూమి అయింది. కాని అబ్బూరి రామకృష్ణరావుగారు అన్నట్టు పడగలేగాని పా మెక్కడా కనబడదు. 'నారాయణరావు' రంకు పురాణం. రామరామ, ఒక్కమాటైతే పరవాలేదంటూ రీయన. 'పరిణామం' చదవవలసిన నవల. తొలిరోజుల్లో జాషువాకవిత్వంలాగే శ్రీమతి కావేరీబాయి హిందూయువతిలో చూపించిన పరిణామము మరుగుపడిపోయింది. 'తమసో మా జ్యోతిర్గమయ'—ప్రతిధ్వని సకాలంలో గుర్తించుకోకపోవడము తెలుగువారి నెత్తురులోని గుణమే.

నాటకాలు

నాటకాలు నిన్న మొన్నటివే కొత్తరకాలు. అయినా, నవ్య సాహిత్యానికి ఉచ్ఛదశలో వెలువడినవి కాబట్టి వాటిని పరిశీలించుకోడం అవసరం. విశ్వనాథవారు 'నర్తనశాల'లో భారతంకంటె ఎక్కువగా, యుధిష్ఠిరుడికి తంత్రశక్తి, కీచకునికి రసికతా, ఉత్తరకి హృదయమూ ఇచ్చారు. పద్యాలు బంగారుపిచ్చిక గూడుకట్టినట్టు జాగ్రత్తగా సంతరించారు. ఈ నాటకాన్ని జాగ్రత్తగా తయారుచేసి ప్రదర్శిస్తే చూడాలి. ఉన్నవవారి 'నాయకురాలు' ఇతిహాసంలాగే నడిచిందనిపిస్తోంది. సుబ్రహ్మణ్యశాస్త్రిగారి 'రాజరాజు' నన్నయభట్టునీ, చిత్రాంగినీ ప్రత్యేకంగా నొక్కి మెరుగుపెట్టి చూపించింది. రాజరాజూ, రత్నాంగీకూడా ఫరవాలేదు. రత్నాంగి మాటల్లో శాకులు చూపిందట రాజుమీద! సారంగధరుడులోమాత్రం నాటకమంతటామానవత్వంకంటె మానసత్వం పొడుచుకు వస్తుంది. మాటకి మాట కసిమని జవాబుచెప్పించే శాస్త్రిగారి పట్టుదలలో సారంగధరుడు మానవత్వం కోల్పోయి శాస్త్రార్థ పండితుడుగా తయారయాడు. స్వగతాలు చూస్తే రసోత్పన్నం అవుతుందని ఆశ పుట్టింది. కాని ఎదటికి మరోమనిషి వచ్చేసరికి శాకు చూపి తయారయిపోతారు వీరి పాత్రలు. రాఘవాచార్యులుగారు 'పరిపడని సంగతుల్లో' స్వాములారినీ, ప్లీడరుగారినీ, భార్యనీ చక్కగా తయారుచేశారు. నాటకంనిండా హృదయాల్ని దూసుకుపోయే లోకోక్తులులాంటి వాక్యాల్ని విరజిమ్మారు. ప్రతిపాత్రనీ సజీవంగా, లోటుపాట్లతోనూ ఆదర్శగాంభీర్యంతోనూ (పోలీసు!) చూపించారు. సాంఘికనాటకం సృష్టించడానికి 'పరిపడని సంగతులు' చక్కని ప్రయత్నం. 'ఆంధ్రజ్యోతి', 'విడాకులు', 'ఆకలి' ఇవి—గుళ్లపల్లి నారాయణమూర్తిగారు జాత్యభ్యుదయాకాంక్షతో రచించారు. మూడింటిలోనూ బ్రతికున్న మూడు సమస్యల్ని చర్చించారు. నాటకశిల్పమూ, ఐక్యతా అనే విమర్శపుస్తకాల్లోని మాటలకి తలఒగ్గక, బ్రతికున్న సమకాలిక జీవితాన్ని చూపించారు. వాదోపవాదాల్లో చాలాసేపు విసిగించారనే అభిప్రాయం పడుతుందిగాని, వారు తాము కల్పించుకున్న సమస్యలకి చక్కగా పరిష్కారం చేశారనికూడా అనిపిస్తుంది. 'ముందడుగూ', 'పరివర్తనా' ఈ రకానికే చెందుతాయి గాని, దారంతీసినట్లు తిన్నగా (అడ్డు లేకుండా) సాగిపోడంనుంచీ, మానవుల తగవులకేగాని, హృదయానికి చెందిన రచన వీటిలో అంతగా లేకపోడంనించీ "ఎన్నాళ్ళు రంజిస్తాయి ఈ నాటకాలూ?" అనిపిస్తోంది. నాటకంలో అందరూ యోధులే. స్త్రీలున్నప్పటికీ, స్త్రీ హృదయం అంతగా కనపడని (మల్లమ్మ వినా) వీర బొబ్బిలీ, గయోపాఖ్యానాల్లాగ కనపడతాయి. వీటి ఘనత ఏమిటంటే, ఎదురుగా కనబడే సమస్యని పట్టుకుని, తమకి నచ్చినవిధంగా రచించారు కవులీ నాటకాల్ని. విమర్శ కవుల్ని శాసించడానికి కాదు. దారిచూపడానికి. ఈదారులు విడిచేసి కవి కొత్తదారి తొక్కి రథాన్ని నడిపించుకుపోగలిగితే అంతకన్నా కావలసిందేమిటి? ఈ నాటకాలు ఆదారి చూపిస్తున్నాయి.

శ్రీమంతుల సారస్వతం

శ్రీమంతులు రచించిన సారస్వతం ఈ స్వర్ణయుగంలో ఒక ప్రత్యేకఘట్టం. 'వాలుజడ' శ్రీమంతుల కలల్లోని కలకలాన్ని వినిపిస్తుంది. 'స్వార్థత్యాగమూ', 'ఆలోకముమండి ఆహ్వానమూ' శ్రీమంతుల జీవితాల్లోని విషాదఘట్టాల్ని పెంచి రచించిన నాటకాలు. రామచంద్ర అప్పారావుగారి ఖండకావ్యాలు "బీభత్సరసాన్ని" మొదటిసారి నవకవిత్వంలో ప్రవేశపెట్టాయి. వారి రక్తహారతి మన గుండెల్లోంచి పొమ్మన్నాపోదు. చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదువారి 'ఆధునికాంధ్ర వాఙ్మయమూ - స్త్రీలూ' అన్న వ్యాసాలు విమర్శశాఖకి అందంతెచ్చే పూలు. విజయసారథిగారి 'పల్లెపట్టు' లక్ష్మీపుత్రుని అందిపుకల.

'కల్పవృక్షపు పూల జల్లులు
  కామధేనువు పాలధారలు
భాగ్యదేవత తెల్లగొడుగులు
  పల్లె కర్షకులు'
'గువ్వపిట్టలు చేరుచున్నవి
  గూటికని తమ వరుసలాడగ(?)
సీత సిగ్గిలి మగని చాటున
  చేరి చిరునవ్వుగ.'

ఆనేవి ఆ కలలోని రెండు నవ్వులు.

అధివాస్తవికత

అధివాస్తవికత (స్వకేశజం) ఈ స్వర్ణయుగంలోని మెరుగు. ప్రబంధరత్నావళి చదవగా చదవగా అన్నీ ఒక అచ్చుదిగినట్టుండి విసుగుపుట్టిస్తాయి. వెంకట పార్వతీశ్వరుల 'మధుర కవిత్వమూ' ఆధునిక కవుల ప్రేమగీతాలూ పాడిందే పాటయిపోయాయి. శ్రీ. శ్రీ. వ్యుత్పన్నుడు. మేధావి. పాతపద్ధతుల్ని బద్దలు కొట్టాలని—

"కురాయి కంటె ఆ- కురాయి కంటె కీ
  చురాయికంటె- హిమాంశురాయి గొప్పవా"

డన్నాడు.

"కుక్క పిల్లా- సబ్బు బిళ్లా- అగ్గి పుల్లా
హీనంగా చూడకు దేన్నీ- కవితామయమేనోయి అన్నీ!"

అని చతురస్రంలో ఇమిడే పాదాలు రచించాడు.

"ఇవేమిటీ వింతభయాలు?
  ఇంట్లో చీకటి
ఇవేమిటీ అపస్వరాలు?
  తెగింది తీగ

ఆవేమిటా రంగుల నీడలు?
　　చావూ బ్రతుకూ!
ఎక్కడిది కళ్ళా పీరాత్రి?
　　అవతలి గట్టుకు."

అని తక్కువ పదాలతో ఎక్కువ భయం పుట్టించాడు. ఇవన్నీ ఎంతోకొంత అర్థమౌతాయి. కాని,

"ఎర్రజాలువ కప్పుకొని మా
　　యింటి కొచ్చిం దొక రివాల్వర్
బాధలో బెంగై మనీసా
　　ప్రేమలో డైమానురాణీ"

అంటే ఏమిటో తెలీదు. శబ్దాలని బద్దలుకొట్టి, చీరచింపి, మోకాలు బుజాలకి తగిలించీ, పీపువైపు తలకాయ మెలిపెంచీ ప్రయోగాలుచేసినవారిని మనం నిరసించరాదు. హాలాహలం తర్వాతేఅమృతం.

పఠాభిది ప్రత్యేకదృష్టి. అతనికి పట్నమే సత్యము. పట్నవాసికి పల్లెటూరూ, కోయిలకూతా, జాబిల్లీ ఇవన్నీ కలలోని సామగ్రి. కాబట్టి పఠాభి రచనల్లో ప్రకృతిలోని (పూర్వకవుల అందాం) "సుందర సామగ్రి"కి పట్నవాసపు డ్రాయింగురూమూ, ట్రాముదోడ్డుల సామగ్రితో పోలిక పుట్టుతుంది.

"తగిలింప బడియున్నది జాబిల్లి
　　చయినా బజారు గగనములోన పయిన"
"పాతబడినటువంటి
　　బస్సులలాగ బడబడయనుచున్నవి నల్లమబ్బుల సంఘ"
"మద్రాసు నగరమ! నీ మీద బ్లూ బ్లాక్
　　సిరాలాగ పడింది రాత్రి."
"నీమీద కళ్లు నిల్పుట
　　బలేహాయి, డీలక్సు కుషన్ సోఫాలమీద
కూలబడినట్లుండును- ఓ నవ్యస్త్రీ"

గోరాశాస్త్రిగారు అందమైన కలల్ని అచ్చులోకి తెద్దామనే యత్నం చేస్తారు. 'సాకేస్' యతిప్రాసల దండలోని సూత్రాన్ని ఊహించమంటారు. స్వగతాల్లోని సూత్రం తెంచేసి అక్కడో ముక్క ఇక్కడో ముక్క అంటూ, విరహోత్కంఠిత భావాల్ని, ప్రేయసుల జగడాన్ని మూతపెట్టిన మద్దెలగా వాయిస్తారు. 'ఆరుద్ర' సుండెకాయని పైకితీసి పిండిచూపిస్తాడు అగ్నిహోత్రంలాగు వ్యాపించే ఆలోచనలతో రేపి.

"అప్రతిష్ఠతో నిందలతో- తడిసిన జీవితాన్ని విప్పి
　　లోకంమీద ఆరవేస్తాను."
"సభ్యత విడాకు లిచ్చిన- సత్యాలను నేసి ధరిస్తాను."

అన్న వాక్యాలు ఇదివరకు నవకవుల వాచ్య గాంభీర్యతలో బయటపడ్డ—

"మోహనవినీల జలధరమూర్తి నేను
　　ప్రళయ ఝంఝూప్రభంజనస్వామి నేను"

అన్న పాదాల్ని శక్తివంతంగా ధ్వనించడము లేదూ? కానయితే, ఒక్క హెచ్చరిక. ఇది తెలుగుతెలుగు. అది పుస్తకాల్లో చదువుతున్న ముక్కలు.

అభ్యుదయోద్యమం

— అభ్యుదయోద్యమం నవ్యసాహిత్య స్వర్ణయుగానికి కిరీటము. పాతబడ్డ ప్రబంధభావాల్ని వదిలి సమకాలికభావాల్నే తిరుపతి కవులూ, పుస్తకాల్లోని భావాలు కాక సొంత అనుభూతిని పురస్కరించుకుని పుట్టిన భావాల్ని కృష్ణశాస్త్రీ, ప్రాచీనాంధ్ర వైభవాన్ని తలుచుకుంటే జనించే నిర్వేదాన్ని విశ్వనాథా, హృదయేశ్వరి నుద్దేశించిన భావాలు శివశంకరులూ ప్రదర్శించారు. కాని 'ఇవి ఎవరి కోసము?' అన్న ప్రశ్న వాడు పుట్టలేదు. వెనక్కి వెళ్లిపోయిన ప్రపంచపు సమాధిదగ్గర కార్చిన అశ్రువులూ, పక్షినయ్యెద నేను ఋక్షమయ్యెదను అంటూ చదలెక్కి దిగిరాను దిగిరాననే జపం చేసుకునే తత్వమూ ప్రజాభ్యుదయానికి దోహదం చెయ్యవు. దిన శ్రమ ముగించుకుని సాయంకాలం హాయిగా పడకకుర్చీలోనో, సముద్ర సైకతాలమీదో పేమువాల్చి కావ్యం విప్పితే,

"నాకు గాదులు లేవు నా
　　కుమస్సులు లేవు నేను
హేమంత కృష్ణానంత శర్వరిని
　　నాకు కాల మెక్కిడే కారు
రూపు నా శోకమ్మువలెనె నా
　　బ్రతుకువలెనే నా వలెనె"

అని ఒక కవి!

'ఈ నాగావళీ వంశధారా జలములు తెల్లని నదులెల్ల పొంగెత్తి ప్రళయవారిధీ తెల్లనేల ముగించనిమ్ము' అని మరో కవి!

"ప్రళయకాలంపు తొలి ముహూర్తమ్మునందు
　　నిదుర మేల్కను రుద్రుని నిష్ఠురంపు
టావులింతల పొగల పయ్యాట లాడు
　　ప్రేయసీ ఒకమారు విచ్చేయుము మిటకు"

అని ఇంకో ప్రేయసుడు!

పొరుగింటి ఇల్లాలు 'మీ ఆవిడ ఎప్పుడు వస్తా'రని అడిగితే అది తనతో ప్రసంగించడానికి ఆవిడ ఎత్తిన ఎత్తని అపోహపడి చెయ్యీ చెయ్యీ కలిపేయడానికి యత్నించే నీలకంఠం! ఇదీ కవుల కలాల్లోంచి బయటకు చిందుతున్న హాలాహలం!

ఇది కాదు, మీ కర్తవ్యం! "ఆకులందున అణగిమణగీ కవిత కోకిల పలుకవలెనోయి, పలుకులను విని దేశమం దభిమానములు మొలకెత్తవలెనోయి!" అని చెప్పాలి అభ్యుదయ రచయితల సంఘం. కాని "తాజమహల్ నిర్మాణంలో రాళ్లెత్తిన కూలీ లెవ్వరు" అని కావ్యాల్లోనూ సమ్మెకట్టడమే నిత్యకర్తవ్యమని నాటకాల్లోనూ ఘోషిస్తున్నారీ అభ్యుదయ రచయితలు. ఎంతసేపూ ఏదో ప్రచారమూ, పూర్వకవులు చేసింది ప్రచారమే అని సమాధానమూను. ఏ రచనేనా ముందు కళ కావాలి. అంటే చదువర్లని పట్టుకోవాలి. తరవాతే అది అభ్యుదయానికా, అనభ్యుదయానికా దారితీస్తోంది? అనే ప్రశ్న. కళలేని శుష్కప్రచారముకంటె ప్రబోధము లేని కళ ఉత్తమము. అయితే కళారీతుల్ని అభ్యుదయాకాంక్ష తెరచాపలాగ కాక చుక్కానిలాగ నడిపితే నవ్యసాహిత్య స్వర్ణయుగానికి వసంతం ఆవేశిస్తుంది.

ఆఫ్రికా నుండి
ఫిజీ వరకూ
వాడబడుచున్నవి

కుష్ఠు ★ బొల్లి

తెగ, సవాయి మొదలగు సకల మేహ, రక్తవ్యాధులకు
గ్యారంటీ చికిత్స!

సిమ్లా నుండి
సిలోన్‌వరకూ
వాడబడుచున్నవి

మా ఔషధ రాజములే!

శ్రీ కృష్ణాశ్రమము

మా ఆశ్రమమునకు వచ్చువారికి సకల సదుపాయములు చేయబడును. గుణము నిదానించువరకు చికిత్స

ఉచితము!

ట్రేడ్ మార్కు



10భాషలలో క్యాటలాగులు, యోగ్యతాపత్రములుఉచితము. నేడేకార్డు వ్రాయుడు. నకలు మందులు, నకలు కంపెనీలుచూచి మోసపోకుడు. అనాదినుండి అమలులోనున్న అసలు కంపెనీ మాది మాత్రమే!

విదేశీయుల యభిప్రాయములు

ద. ఆఫ్రికా

ఎమ్. ఏంతోని ప్రిటోరియా

ప్రఖ్యాతిచెందిన మీ ఔషధముల గురించి వినియున్నాను. కాంతా మదహారి లేహ్యం తక్షణం పంపగోరుచున్నాను.

తూ. ఆఫ్రికా

ఎస్. మేస్క్విటా ఉగాండా, కెన్యా. 20-6-28

మీరు వ్రాసిన 604 నెం. గల ఉత్తరమున్నూ మందుల పార్శెలున్నూ అందినవి. ఈ వూరి నుండి నాకు బదిలీ అయినది. నేను నా కొత్త విలాసము తెలిపేవరకు నాకు మీరు ఉత్తరము వ్రాయవద్దు.

తూ. ఆఫ్రికా

ఎస్. ఎ. హెచ్.

టాంగనీకా టెర్రిటరీ. 6-5-39

మీరు దయతో పంపిన 120బొల్లి మాత్రలు చేరినవని సంతోషముతో తెలుపుచున్నాను.

న్యూజీలన్డ్

బి. సింగ్

చాలమంది ఇంగ్లీషు డాక్టర్లవద్ద మందు పుచ్చుకున్నాను. ఏమియు లాభములేదు. మీ క్యాటలాగులు దయచేసి తక్షణం పంపుడు.

ఫిజీ

ఎం. ఎస్. శామ్యూల్. 26-8-45 బా-ఫిజీ

............మాకాగాయ్ వైద్యశాలనుంచి నేను డిస్‌చార్జి చేయబడినప్పుడు, నాకు స్వస్థత చేకూరలేదు.........పరమేశ్వరుడు మిమ్ము అనుగ్రహించుగాక.

సరా:-ఒరిజినల్ ఉత్తరములు మా ఆఫీసు వేళలలో ఎప్పుడు ఎవరు వచ్చినను చూపబడును.

స్వదేశీయుల యభిప్రాయములు

పంజాబ్, డీహైడ్రేషన్ ఫ్యాక్టరి

ప్ర. చ. శర్మ అంబాలా 25-9-44

బొల్లి మొదటితరగతి మాత్రలు రోగికి ఇచ్చినాను. తెల్లమచ్చలు మామూలు రంగులోనికి మారినవి.

బొంబాయ్

ఎం. ఎ. ఇరానీ మాల్యాన్. 4-1-44

............ఎరుపుమచ్చలు మామూలు రంగులోనికి వచ్చుచున్నవి నరముల నొప్పి మటుమాయమైనది....

కలకత్తా

పి. యస్. యన్. మూర్తి. కలకత్తా.

........నూటికి 75 పాళ్లు కుదిరినది. కుష్ఠునకు మీచికిత్సకు మించిన వేరు చికిత్స లేదని నానమ్మిక....

హైదరాబాద్

జె. ఆర్. మూర్తి. నిటల్‌వాడి. 1-4-45

............చాలాకాలము ఇంజక్షనులు పుచ్చుకొని విసిగి, ఏమియు గుణములేక మానివేసితిని............మీ చికిత్స ప్రారంభించిన మొదటి నెలలోనే మచ్చలయందు స్పష్టమైనమార్పు కనబడెను. పాదముయొక్క వాపు తీసెను. అన్ని విధములా రోగములో మార్పు కల్గుచున్నది.

సిలోన్

ఎం. వి.వేల్. కెనడా కెడా. 8-2-46

............కుష్ఠు బొల్లి వ్యాధులకు రెండు ఫస్ట్ క్లాస్ పెట్‌లను తక్షణం పంపగోరుచున్నాను.

సరా:-ప్రముఖుల యోగ్యతాపత్రము లన్నియును గల ఫోల్డరు కోరిన వెంటనే ఉచితముగాపంపగలము.

రెడ్డి & కో., (రిజిస్టర్డ్.)

గోపాలపురం (వయా)

తణుకు-తా. గోదావరి

బ్రాంచి ఆఫీసులు:

బెజవాడ	సికందరాబాద్
గాంధినగర్	3550 కింగ్సువే
*	*
వాల్తేరు	కటక్
R. S. పోస్టు	బక్సిబజార్

సీత కాపరం

[కథానిక]

"దంతావధానం అయిందా బావా?" అంది సీత వాకిలిముందు రథంముగ్గు వేసి సావిట్లో కొస్తూను.

"మీ అక్కయ్య లేదుగా మరి...రాత్రి......" అన్నా నేను, మొహంమీదికి వాలిన జుట్టు పైకి తీసుకుంటూ కనుకొలకుల్లోంచి చూసి.

"నేనున్నాగా సిళ్ళివ్వటానికి?" అంది కొంచెం కోపంగా చూస్తున్నట్లు కళ్లు అదోలా పెట్టి. అయినా పెదిమెలమీద కొంటెనవ్వు తళతళ కనిపిస్తూనేవుంది.

"అయితే వరసలు తప్పినట్టున్నాయి 'తావధా' లికి" అన్నా బింకంగా. కొంచెం ధైర్యం చిక్కింది.

"తప్పక్కర్లేదు. నిన్న సాయంత్రం కారపు శనగలు పెట్టాగా!" అంది పక్కున నవ్వి. అంత అమాయకపునవ్వు ఎలా చేతైందీ! నాలో ఏదో మాలిన్యం వుందేమో! మళ్లా ఇంకో మెట్టెక్కిస్తూ—

"కాని నఖాలుమాత్రం సోమరిపోతుల్లా కూర్చున్నాయి." అన్నా, గుండె బిక్కుబిక్కు మంటున్నా కూడా. సూక్ష్మంగా సీతకళ్లల్లోకి చూస్తూ. ఆఅమ్మాయి ఎంతో ధీమాగా "నిజమే, జాజిమొగ్గలు కోయిస్తే సరిపోయేది వాటితో" అంది. నాకు సందు చిక్కలేదు.

"...ఓడిపోయా......" నన్నా విజయగర్వంతో.

"నేనుమాత్రం గెలిచానా, బావా?....నా నోరు పడిపోయిందికదా ఈ నాలుగేళ్లనుంచీని......ఎన్నాళ్ళయిందీ సరసమైన మాట విని?" అంటూ బొటబొటా కన్నీరు కార్చింది. నాకు బాగా అర్థం కాలేదు. నాలో ఎవరో "నువ్వు తప్పు చేశావేమో, క్షమాపణకోరుకో" అని తొందర చెయ్యటం మొదలెట్టారు. కంగారుగా "...సీతా, ఎందుకలా ఏడుస్తావు? నేను మాటవరసకి అన్నా... తప్పుంటే క్షమించు..." నామాట పూర్తికాకమునుపే నా పెదిమెలికి తాకీతాకనట్లుగా, తామరమొగ్గలాంటి తనచేతిని అడ్డంపెట్టి "ఎంతమాట, బావా! నన్ను ఒక్తీపశువుకింద కట్టేశావా?...... ఎండి మోడైపోతున్న యీ కట్టెకి మళ్లా చిగిర్చేందుకు జీవజలం పోశావు నువ్వు, యిప్పుడు..." అంది. నక్షత్రాల్లాగా మెరిసే కళ్ళల్లో, కదుల్తున్న హృదయవేదనా బాష్పం బాష్పకణమై కొలకుల్లోంచి జారి నున్నని కపోలం మీదుగా గుండీఊడిన జాకెట్టుపువ్వుని తడిపి గుండెల్లో కలిసిపోయి తన వలయాన్ని పూర్తిచేసుకుంది. ఆ వలయంలో సుళ్లుతిరిగిపోతున్న నేను "హరే రామ, హరే రామ!" అనే ధ్వనికి ఉలిక్కిపడి పక్కకి తిరిగేసరికి, కాలవలో స్నానంచేసి తడిబట్టల్తో తిరిగివస్తున్న సీతఅత్తగారు కనిపించింది. సీత లోపలి కెళ్లి ఎంతసేపయిందో నాకు తెలీదు. ఏమిటీ ఈఅనుభవం ? !

అత్తగారు వస్తూనే "ఇంకా మొహం కడుక్కోలేదు నాయనా ?" అంటూ "ఒసేయి, మీ బావకి తాటాకూ, కచ్చికా యివ్వవే!..." అని ఓకేక పెట్టింది కోడలికి వినిపించేటట్టుగా.

"అక్కర్లేదు పిన్నీ, నా దగ్గిర టూత్ పేస్టూ, బ్రష్షూ వున్నాయి. నీళ్లుమాత్రం చాలు..." అన్నా.

సీత గుండుచెంబుతో నీళ్లు తెచ్చియిచ్చింది.

"ఏమో నాయనా, మాకు కచ్చికా, తాటాకే అలవాటు. పల్లెటూరుకదూ !... మరిచిపోయా, కాఫీ కావాలిగా నీకు!... ఒసే సీతా, నీకు మీ ఊళ్లో అలవాటేగా?...పాడి దొరకదు కామాలు ఈ ఊళ్ళో!... పోనీ, బిళ్లలకాఫీ బాగుంటుందా!..." అంటూ, నామాట

కథకుడు :

శ్రీ రా. సి. ఆంజనేయశాస్త్రి

వినిపించుకోకుండానే చాకలాడితో కాఫీబిళ్ళలు తెమ్మని పురమాయించి దొడ్లో కెళ్లిపోయింది సీతఅత్తగారు.

కూలీల ఎద్దడి జాస్తీగా వుండడంచేత ఆ ఏడు నూర్పిళ్లు, సంక్రాంతి వెళ్లినాకూడా, పూర్తి కాలేదు. సీతమొగుడు తెల్లారుఝామునే పొలం వెళ్లిపోయాడు కూలీలతోపాటు... వెండిగ్లాసులో కాఫీ నాముందు పెట్టి వెళ్లబోతుంటే "...నువ్వు తాగావా సీతా?" అన్నా. ఒక్కక్షణం ఆగి, వెనక్కి తిరక్కుండానే "అలవాటు తప్పింది" అందిబరువుగా. "ఇవాళిటికి తాగరాదూ ?....." అన్నానంకోచిస్తూ. గిరుక్కున వెనక్కి తిరిగి తీక్షణంగా నా మొహంలోకి చూస్తూ "నిజంగా అంటున్నావా, బావా?... ఇంత ఆదరణగా ఇలా నన్ను అడిగినవాళ్లేరీ?" అని యింకోగ్లాసు తెచ్చి, సగం దాట్లో పోసుకుని ఎంతో ఆప్యాయంగా తాగసాగింది. తృప్తిపడ్డ కళ్ళతో, కాఫీగుక్క శంఖంలాంటి ఆఅమ్మాయి కంఠంలోంచి జారి అదృశ్యం అయ్యేదాకా చూస్తూ నెమ్మదిగా నేనుకూడా చెంచాలోంచి కొంచెం కాఫీ చప్పరిస్తుంటే "...బావా...కాఫీ బాగుందా?" అని ప్రశ్నించింది మామూలు ధోరణిలో. "ఓ, దివ్యంగా వుంది. నువ్వుకూడా తాగటంవల్ల మరీని" అన్నా. "నేను చేసినపనికి సంతోషించేవాళ్లు యీ ప్రపంచంలో ఒక్కళ్ళన్నా ఉన్నారని నా కిప్పుడే తెలిసింది..." అంటూంటే సంతోషం కనపరుస్తూనే వున్నాయి బుగ్గలు. కాని కళ్లు మాత్రం అశ్రుకణాల్ని విడవటం మానలేదు.......

మధ్యాహ్నం భోజనానికి నేనూ, సీతమొగుడూ కలిసే కూర్చున్నాం. చిన్నప్పుడు కలిసి చదువుకున్న రోజుల్లో గోడుబిళ్ళ లాడడం, ఆబిళ్ల అతని కంటికి తాకటం, అప్పుడు జరిగిన పోట్లాటలూ, పంతులుగారి చదరని చాకుతో కోస్తే, మా యిద్దర్నీ చపుకుతో బాది కోదండంవేయించడం- అన్నీ గుర్తుచేశాడు. ఎంతో చనువుగానూ, సంతోషంగానూ మాట్లాడుతున్నాడు. సీతఅత్తగారు వడ్డిస్తోంది.... దోసకాయపచ్చడి ఉప్పు కషాయం!

"ఇంత ఉప్పు పోశావేమిటమ్మా?" అన్నాడు సీతమొగుడు.

"ఇద్దరం వేశామల్లే వుంది...." అని చప్పున నాలిక కరుచుకొని, "మరిచిపోయి రెండుమాట్లు వేశాకామాలు" అని నీళ్లునమిలింది. సీతమొగుడు ఉగ్రుడై "అది చేసిన పచ్చడి నాకు వేశావా?... జ్ఞానం లేదూ? దవడ రాలకొడతా" నంటూ విస్తరి చింపేసి, చెయ్యెత్తి అమాంతం తల్లిమీదికి దూకపోతుంటే, నేను నిశ్చేష్టుడినై "రామం!..." అని మాత్రం అన్నా. అంత వరకూ, పరాయివాణ్ణి, నేను ప్రక్కనున్నాననే సంగతే అతనికి తట్టలేదు ఆకోపంలో. నామాట వినేసరికి అతనికి పాపం చచ్చినచావైంది. తలెత్తి నావైపు చూడలేకపోయాడు. రెండంగల్లో దొడ్లోకెళ్లి చెయ్యి కడుక్కుని చకచకా పొలానికెళ్లిపోయాడు. పక్కగదిలోంచి సీతఏడుపు వినిపిస్తోంది. సీతఅత్తగారు ఏమీ అనలేక తల ఒంచుకునే "చారు పొయ్యమన్నావా, నాయనా" అంటుండగానే ఉత్తరాపోసన పట్టి నేనూ లేచా. నాకుమాత్రం ఎలా సయిస్తుంది అన్నం?... ఎవరూ అన్నం తిన్నట్లు కనిపించలేదు ఆ పూట...

మూడేళ్లయింతర్వాత యిప్పుడేగా నేను ఏడ్జె నుంచి మూడు నెలల శలవు తీసుకువచ్చింది? రైతులూ, వాళ్లూ చాలామందొచ్చారు. వాళ్ళతో మాట్లాడి మాఇంటికి లోపలికొచ్చేసరికి చాపమీద బోర్లగిలా పడుకునుంది సీత. "మీ అత్తగారెక్కడ సీతా?..." అన్నా... ఉలిక్కిపడి లేచి, పమిట సవిరించుకుంటూ కళ్లు తుడుచుకుంది. కళ్లు వాచివున్నాయి. మొహంఅంతా నలిగి చెరువులోంచి కోసి పారేసిన కమలమల్లే వుంది. రేగినజుట్టు మనస్సులోని చిక్కులికి సూచికల్లే భయపెడుతోంది.... "పురాణానికెళ్లారు..." అని నాప్రశ్నకి సమాధానం చెప్పి, లోపలికి తప్పుకోటానికి ప్రయత్నిస్తుంటే నేనే ఆపి "మధ్యాహ్నం భోజనాలముందర ఏమిటా బీభత్సం?" అని అడిగా. చెప్పక తప్పలేదు. చెబుతూ ఏడ్చింది. ఏడుస్తూనే నవ్వింది కాసేపు. కొంత దాచింది. చెప్పక్కర్లేంది కొంత చెప్పింది. తన్ను తాను తిట్టుకుంది. సంఘాన్ని తిట్టింది. ఆ పట్టువిడుపులికి కారణం నాకు యిప్పుడే కొంచెంకొంచెం తెలిసింది. సీతచేత్తో ఒండిన అన్నం తినడట మొగుడు. దానితో మాట్లాడడుట. మొహంచూస్తే అసహ్యించుకుంటాడట. అత్తగారు మాత్రం ఎంతో ప్రేమగా వుంటుంది. అన్నపానాల కేమీ లోటులేదు. నగానాణెమూ ఎలా వున్నా, బట్టకీ పాచకీ ఏమీ ఇబ్బంది పెట్టరు. అత్తగారు

ఒకత్తే పనిచేసుకోలేకపోతే, చాటుగా వచ్చేడీ, అదీ చెయ్యడం, వడియాలు వేయించడం కద్దు సీతకూను. కాని ఆ సంగతి తెలిస్తేమటుకు నానా రాద్ధాంతం చేసి తల్లిని కొడతాడట. సీతనిమాత్రం ఏమీ అనడు.

"నీలోపం ఏమీ లేదా?" అని ప్రశ్నించక తప్ప లేదు నాకు అన్నీవిన్నాక. "లేకేం? నే నీపుటక పుట్టడమే లోపం! చదువుకోటం మరీని." అంటూ మళ్ళా ఎక్కెక్కిపడటం మొదలెట్టింది. నేను అనవసరంగా పాపం ఆ అమ్మాయిని కలవరపెడుతున్నానేమో! "అది కాదు సీతా, మాటవరస కన్నా.... నిజానికటువంటి మొగుడితో ఎల్లా మెలగటం... నీలోపం ఏముంటుంది?.. ఏదో అన్నా తప్పితే?!"...అని ఓదార్చబోయా. "నిజం చెబుతున్నా బావా! నా తప్పు నేను ఒప్పుకుంటున్నా నీదగ్గిర,...నాగుండెల తాళం తీసేశావు నువ్వు మళ్ళీని...నాలుగేళ్ళ క్రితం వినాయక చవితినాడు, మావూళ్లో వినాయకుడి బొమ్మవెనుక నాచేతిలో చెయ్యేసి నువ్వు చెప్పిన మాటలు గుర్తున్నాయా?" అంది. సీతచూపులు నా హృదయంలో గుచ్చుకొని వేదన కలిగిస్తున్నాయి. "అవును సీతా, నాతప్పు క్షంతవ్యంకాదు...కట్నానికి ఆశపడి వేరే సంబంధం చేసుకున్నా- నీకిచ్చిన వాగ్దానాన్ని భంగంచేసి..." అన్నా తలొంచుకొని. "కాని నీకూ ఉన్నసంబంధం ఒచ్చిందికదా, సుఖపడతావనుకున్నా తప్పితే..." అని యింకా ఏమో అనబోతుంటే, రోషంగా చూస్తూ "ఎంత పూడిపోయింది బావా, నీ హృదయం! స్త్రీహృదయం ప్రేమించిన వస్తువుని మరిచిపోలేదు బావా! పరిసరాలు బలవంతంచేసి మరిపింప చూచినా, ఆ వస్తువు స్థానంలో మరోవస్తువుని వుంచుకోటం అసాధ్యం స్త్రీకి..." అంది. ఊపిరి త్వరత్వరగా విడుస్తూ ముక్కుపుటాలెగరేస్తోంది. నేనేమీ మాట్లాడలేక పోయా. మళ్లా సీతే అందుకొని..."నాకాశ్చర్యంగా వుండేది, అక్కగారితో ఎలా మెలిగేవాడివా నువ్వు అని... బహుశా యిక్కడ నామాదిరే నువ్వూ బాధపడుతున్నా వనుకుని సంతోషిస్తూ వుండేదాన్ని...అది ఏడుపేనేమో !...కాని నిరుడు నీకు మొగపిల్లాడు పుట్టాడని వినగానే...నాకు నీ మీద అంతులేని అసూయ పుట్టింది...అమితమైన అసహ్యం కలిగింది... ...లేదు, లేదు బావా!....అసహ్యం కలగలేదు బావా!...... నా మీదే నాకు ద్వేషం పుట్టింది ...... నాకు చావు రాదేం?" అని మళ్ళా ఏడవటం మొదలెట్టింది. నేను కొయ్యబొమ్మల్లే నిలబడిపోయా. నాకు తెలీకుండానే నేను ఒకరి జీవితంలో ఎంతటి తుపాను రేకెత్తించా? నాపెళ్ళయిన కొత్తలో కొద్దిరోజులేమన్నా సీతవిషయం గుర్తువచ్చేదేమో. మేము కలిసిమెలిసి ఆడుకున్న ఆటలూ, పాడుకున్న పాటలూ, మాట్లాడుకున్న మాటలూ, చేసుకున్న వాగ్దానాలూ అవీని. కాని నాభార్య కాపరాని కొచ్చినవెంటనే అవన్నీ తేలిగ్గానే మరిచిపోయా. కాని, సీతో? అన్ని స్మృతుల భారాన్నీ పాపం ఆ లేతహృదయం మోసుకు తిరుగుతోందే! నాకు హృదయం వుందా అసలు? నానైచ్యం నాకు అవగతమవుతోంది కొంచెంకొంచెంగా.

"క్షమించు సీతా!...అదే కారణమా?... అన్నా వుండుపడ్డ గుండెతో.

"అవును బావా! నీతో నాకు రహస్యంలేదు. ఉన్నా దాచలేను...ఆర్నెల్లు ఆయనెంతో సహనం పట్టారు. అనునయించారు. ప్రార్థించారు. క్షమించారు. ...కాని నాకు మొదటినుంచీ ఆయనంటే చిన్నచూపే ...పెద్దచదువు లేదనీ...పల్లెటూరనీ...రూపం లేదనీ... ఇంతకీ చెప్పానుకదూ!...ప్రేమించిన ఒక వస్తువు స్థానంలో ఇంకోవస్తువుని వుంచుకోటం స్త్రీహృదయానికి చేతకాదని...సిగ్గువిడిచి చెబుతున్నా. బావా...తాకనియ్యలేదు నేను..."అంటుంటే సిగ్గుతో ఎర్రబారిన బుగ్గలు దుఃఖంతో గజగజలాడాయి.

కళ్లు చెమ్మగిలాయి. గాద్గదికతో..."ఎంత ఘోరం సీతా!..." అన్నా...సీత గంభీరంగా ఒక్కక్షణం ఊరుకుని "తరవాతతరవాత ఆయనకే అసహ్యం వేసి, నేను వొండిన అన్నం తిననని శపథంపట్టారు... నాలోని వాంఛలన్నీ పడుకుని దీర్ఘసుషుప్తి పొందే కాలంలో నీ పుత్రోదయవార్త వాటికి మళ్లా గిలిగింత పెట్టింది. అయితే ఏం? నాలోని అహంభావం వాటిని తలెత్తనియ్యకుండా జయప్రదంగా తొక్కిపట్టింది. మా అత్తగారి ప్రేమ నాశరీరాన్ని, మన మధురస్మృతులు నా మనస్సునీ బతికిస్తూఒచ్చాయి"...ఊ-మాత్రం కొడుతూ నేను ఆత్రంగా వింటున్నా. సీత కథనం సాగించింది

మధ్య మధ్య ఎగపీలుస్తూ, దుఃఖపుగుక్కలు మింగుతూను. "అకస్మాత్తుగా నువ్వురావటం నన్ను కవ్వించింది. ఈ నాలుగేళ్లూ అనంతంలో కలిసిపోయి, ఆ వినాయకచవితి వెళ్లిన పంచమే యివాళ అనిపించింది కాని యీ నాలుగేళ్లూ చెరిపేసి, ఆపంచమినుంచీ జీవితం మొదలెట్టటానికి వీలుంటుందీ?..." అంటూ మళ్లీ వెచ్చని కన్నీళ్లు కార్చింది.

ఇన్నేళ్లనుంచీ పేరుకునివున్న నేను మొయ్యాల్సిన భారం ఒక్కసారిగా నామీద పడినట్టనిపించింది. ఇన్నేళ్లూ నేను పొందటానికి అర్హతలేని సౌఖ్యం పొందాను. ఇహ నాకు తహతహ పుట్టింది. నేనేం చెయ్యాలి యిప్పుడు? "వీలుంటుంది సీతా, తప్పకుండా. జీవితమే ఒక కష్టకరమైన రాజీ. నేను క్షమించరాని తప్పు చేశానని యిప్పుడు నువ్వు చెప్పేదాకా నాకు బాగా తెలీలేదు. కాని నువ్వు చేసిన తప్పూ తక్కువది కాదు. రెండుజీవితాలు యింతవరకూ బాధపొందాయి. ఇలాగే జరిగితే యింకా రెండుజీవితాలు భ్రష్టంఅవుతాయి..." అన్నా గంభీరంగా. ఉలిక్కిపడి "అదేమిటి బావా?" అంది, అసలే పెద్దకళ్లని యింకా పెద్దవిచేసి ఆదుర్దాగా చూస్తూను.

"అవును సీతా, నాకూ మీ అక్కయ్యకీ ఇహ సంబంధం వుండదు." అన్నా అదేధోరణిలో.

"ఏ జన్మలోనో చేసుకున్నది యిప్పు డనుభవిస్తున్నా. ఈ జన్మలో మళ్లా యింకో పాపకర్మమా?" అంది లేనినవ్వు తెచ్చుకొని శుష్కంగా.

"నేనూ శపథం చేస్తున్నా, నీకాపరం కుదటపడందే, నేను సుఖంగా వుండడానికి నాకు హక్కులేదు కనుక నేను చెప్పినట్లు నువ్వు చేసితీరాలి."


అని లేచా. సీత తెల్లబోయి చూస్తూనుంచుంది. నేను వీథిగుమ్మం దిగుతుంటే సీతఅత్తగారు పురాణం నుంచి తిరిగి ఒస్తోంది. ఆవిడతో టూకీగా రెండుముక్కలు చెప్పి సరాసరి రామందగ్గిరి కెళ్ళా పొలానికి.

అతను పాపం చింతచెట్టుక్రింద దిగాలపడి కూచునివున్నాడు. నేను వీపుమీద చరిచి అన్నీ గుచ్చి గుచ్చి అడిగా. సీత చెప్పిందంతా నిజమే. ఇప్పటికీ ఆ అమ్మాయంటే ప్రేమే ఆతనికి. కాని అతనుమాత్రం ఏం చేస్తాడు? అతన్ని ఒప్పించా

* * * *

ఆ రాత్రి సీతే వంటచేసింది. తనే వడ్డించింది. నేనూ, రామం కలిసే భోజనం చేశాం—రాత్రి గదిలో కెళ్లేటప్పుడు నాకుకూడా నమస్కారం చేసిందిసీత. పాపం, ముసలమ్మ సంతోషానికి మేరలేదు...తెల్లారి సీత సిగ్గుతో నాకు కనిపించకుండా తప్పుకొని తిరుగుతూంటే "...దంతావధానం అయిందా ?" అన్నా నవ్వుతూ. గట్టిగా కళ్లుమూసుకుని పళ్లుచూపిస్తూ లోపలికి వెళ్లిపోయింది.





మన సంగీత వాద్యాలు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

సంగీతానికి పనికివచ్చే వాద్యాలను మన ప్రాచీనులు నాలుగు విధాలుగా వింగడించినారు: తతం, సుషిరం, అవనద్ధం, ఘనం అని. తంతులను పరచి కట్టిన వాద్యాలు తతజాతివి: వీణ, కిన్నరి మొదలైనవి. నాళానికి పై భాగంలో రంధ్రాలు వేసి వాటిలో వాయుసంచారం మూలంగా నాదం సృష్టించేవి రెండవ సుషిరజాతి: పిల్లంగ్రోవి, ముఖవేణు, సన్నాయి మొదలైనవి. చర్మంతో నోరుమూసి కట్టి వాయించవలసినవి అవనద్ధ తరగతివి: మృదంగం, తబలా, కంజీరా ఇత్యాది. లోహం, మాను మొదలైనవాటిచే తయారైనవి ఘనంగుంపులో చేరేవి. తాళాలు, చిటికెలు, జాగట, ఘంట మొదలైనవి.

వీటిలో తతాలు, సుషిరాలు ఈరెండూ ఇష్టం వచ్చినట్టు అన్ని స్వరాలనూ, గమకాలనూ వాయించే అనుకూలం కలిగి, నాదకళా రచనకు ముఖ్యంగా ఉపయోగిస్తున్నవి. మూడవ అవనద్ధ వాద్యాలలో కొన్ని షడ్జపంచమనాదాలు గలిగి, పాట శ్రుతిలో లయించీ, కొన్ని శ్రుతిలేక తాళంతోమాత్రం లయించీ, పాట కనుకూలంగా నడిచేవి. శ్రుతిమేళం లేక, భిన్నమైన పలుకులూ లేక, తాళంలోని సశబ్దక్రియలలోమాత్రం చేరేవి ఘనవాద్యాలు. 'తతసుషిరాలలో గీతంపుట్టితే అవనద్ధం దానికి రక్తినిస్తుంది; ఘనం దాన్ని కొలుస్తుంది' అన్నాడు నిశ్శంక శార్ఙ్గదేవుడు (సంగీ. రత్నా. వాద్యా. 3-8). రేకులమూలంగా తిత్తుల సహాయంతో భిన్న స్వరాలను సృష్టించే హార్మోనియం, పియానో మొదలైన పాశ్చాత్యవాద్యాలు సూక్ష్మంగా చూస్తే తతసుషిరాలు కలిసిన తెగకు చేరుతున్నవి.


ఇది స్థూలమైన విభాగం. ఇంకా కొన్ని తెగలుగా గూడా విభజించవచ్చును. అది ఉండనిస్తాం. సంగీతకళకు ఉపయోగించేవి, ఉపయోగించనివి అని ముఖ్యంగా రెండు తెగలుగా వాద్యాలను విభజించవచ్చును. కొమ్ము, భాంకీ, తిరుచున్నాలు, నగారా, శంఖం మొదలైన వాద్యాలు స్వరలయలలో దేనినీ స్పష్టంగా చూపలేక, రచనావైవిధ్యాని కవకాశం లేక కేవల స్థూలశబ్దమయంగా వుండి సంగీతకళకు దూరంగా ఉంటుంది. గనుక వాటిని వదలి ఆ కళతో సాక్షాత్సంబంధం కల వాద్యాల సమష్టివిచారణకు మాత్రం సంబంధించిన కొన్ని మాటలు ఇక్కడ చెప్పదలచినాము. వాటిలో ఒక్కొక్కవాద్యం విషయంగానూ దాని ప్రత్యేక చరిత్ర, గుణాలు, లోపాలు, వ్యాప్తి, భవిష్యం మొదలైన విషయాలను గూర్చి అధికారం కల పండితులు చర్చించి తెలుపవలసివుంటారు. నాకా అధికారం లేదు. నాది సముదాయంపైన బహిరంగమైన చూపు. లోతుకు దిగి పరిశోధన కాదు.

మీదచెప్పిన నాల్గురకాల వాద్యాలలో ఒక్కొక్కటీ పూర్వకాలంలో ఎన్నిరకాలుగా వుండేనో మన కిప్పుడు ఊహించడానికి గూడా అవకాశం చాలదు. మద్రాసు, కలకత్తా మొదలైన మహానగరాల్లోని ప్రాచీన వస్తు ప్రదర్శనశాలల్లో ఎన్నో ప్రాచీనవాద్యాలను పెట్టి చూపుతున్నారు. వాటిలో పెక్కింటిని ఎట్లు వాయించేది అనే విషయమే ఇప్పుడు తెలుసుకోవడం సాధ్యంగా లేదు. కాని వాటి వైవిధ్యం ఆశ్చర్యకరంగా వుంటుందని చూచినవారు చెప్పతారు. సాహిత్యంలో చూచినప్పుడైతే, ఇప్పుడు మన వస్తుప్రదర్శనశాలల్లోనైనా మిగిలివుండే వాద్యాలు నశించినవాటిలో ఎన్నోపాలో చెప్పడంకూడా కష్టంగా తోస్తుంది. ఉదాహరణంగా సుప్రసిద్ధమైన వీణావాద్యాన్ని గ్రహిస్తే: ఇప్పుడు మనకు కర్ణాటకవీణ, హిందూస్తానీవారి రుద్రవీణ అని రెండేరకాలు సామాన్యంగా తెలిసినవి. ఐతే పాల్కురికి సోమనాథుడు బసవపురాణంలో, సకలేశ మాదిరాజయ్య శివస్తోత్రగానం చేసే వేళలో ముప్పై రెండు ప్రాచీనరాగాలతో అన్ని వేరేరకాల వీణలను మేళగించి వాయిస్తూవుండెనని వ్రాసినాడు! లావణ్యవీణ, బ్రహ్మవీణ, కైలాసవీణ, ఆకాశవీణ ఇత్యాదిగా పండ్రెండు వీణల పేర్లుగూడా చెప్పినాడు.

గీతనృత్యవాద్యాల కూడికయైన సంగీతకళ ఇంటా బైటా అన్నివిషయాలలోనూ వ్యాపించి ముఖ్యధర్మంగా వుండిన ప్రాచీన భారత జీవనంలో మూలమూలల్లోనూ కొత్త కొత్తగా నిర్మాణోత్సాహం నిండితొణుకుతూవున్న కాలంలో ఇటువంటి అనేక వాద్యాలు సృష్టికి వచ్చినవంటే ఆశ్చర్యమేమీా లేదు.

ఇప్పుడు అవన్నీ ఆదరించేవారు లేక ముక్కాలు మువ్వీసం నష్టమై పోయినవి. సుమారు నాల్గునూర్ల యేండ్ల కిందట ఈ పరిణామం ప్రబలినట్టుగా తోస్తుంది. పాశ్చాత్యులైన సంగీతరసికులు ఎవరు మన దేశానికి వచ్చి చూచినా వారికి మన యీ వాద్యాల వైవిధ్యదారిద్ర్యం ముఖ్యంగా కానవస్తుంది. చరిత్రదృష్టితో చూస్తే అసంఖ్యంగా ఉండిన వాద్యాలు మన దేశంలో ఇప్పుడు ఇంతదూరం ఎందుకు నశించి పోయినవి? ఇది అందరూ వేసే ప్రశ్న. ప్రాచీన వాద్యాలలో కల్లా మన పాలి కిప్పుడు మిగిలివుండేవి నాలుగైదు వాద్యాలు మాత్రమే: వీణ, పిల్లంగోవి, సన్నాయి, మృదంగం, ఘటం ఇత్యాది. ఉత్తరదేశంలో గూడ కొంచెం మించుమించుగా ఇట్లే కానవస్తుంది. పాశ్చాత్యుల వాద్యాల వైభవాన్ని చూచిన కంటితో మనవాటిని చూచుకొంటే మన దారిద్ర్యం స్పష్టమౌతుంది. దీనికి పరదేశీయుల సంస్కారానికి తలవంచి, స్వాభిమాన శూన్యులమై, ఉత్సాహం, ఉద్యోగం అనే జీవధర్మాలనే చాలవరకూ పోగొట్టుకొన్నాం కాబట్టి, మనకు పాతది పోయెనే అనే చింతగానీ, కొత్తది రాలేదనే ఉత్కంఠగానీ చాలా దుర్బలమై పోవడంచేత, తక్కిన ఆచారవ్యవహారా లన్నిటిలోవలెనే ఈ కళాశాఖలోనూ స్వతంత్రసృష్టీ, మొనగాణితనమూ మందమై పోయింది అని ఒక కారణం చెప్పవచ్చును. కాని దీనికన్నా బలిష్ఠమైన ఇంకొక కారణంగూడా ఉందని మనం చూడవచ్చును.

సంగీతం మనలో అనాదిగా ప్రవాహిగా పెరిగిన కళ. ఇది వ్యాపించినంత విస్తారంగా, దిగినంత లోతుగా మన జీవితంలో ఇంకే కళ ప్రసరించిందో నాకు తెలియదు. భారతీయ జాతిజీవనంలో ఇది ప్రధానధర్మంగా వున్నది. అంటే నిన్న మొన్నటిదాకా ఉండింది. ఇటీవల దాని ప్రాబల్యం పలచబడుతూవుండేది నిజం. అది వుండనీయండి. జనులలో నాదలయరచనలోని సూక్ష్మసూక్ష్మతరమైన అనుభవాలు పెరిగినట్లల్లా వాద్యాల శక్తియుక్తుల వ్యాసంగమూ పెరుగుతుంది. మన దృష్టిలో వాద్యం మనుష్యశారీరానికి ప్రతిబింబం. దాన్ని అనుకరించడమూ, సాధ్యమైతే దానికి సలహోలియ్యడమూ దీని పని. పాటతో మేళగింపని పట్టివాద్యం వాయింపుకు 'శుష్కం' అని నామకరణం చేసినాడు నిశ్శంకుడు! (రత్నాకరం. వాద్యా. ౧౬) ఒక విధంగా ఆదృష్టి మనకిప్పుడు మారింది. ఇప్పుడు పాటలేని వాద్యాన్ని మూడునాల్గు ఘంటలకాలమైనా వినగలము. ఐనా ఇప్పటికీ మనపాలిటికి వాద్యం పట్టి యంత్రంకాదు. దాని పని సజీవమైన చేతనకార్యమే. అర్థంలేని, రాగాలాపన, స్వరకల్పన మొదలైన వాటిని గాయకుని నోట విన్నప్పుడు మనకు ఏ దృష్టి, ఏ అనుభవం కలుగుతుందో అదే దృష్టీ, అనుభవమే 'శుష్క' వాద్యంలో గూడా ఇప్పుడు కలుగుతుంది. కాబట్టి, మనలో వాద్యాలను సృష్టిచేసినవారంతా, సంస్కరించినవారంతా, ఈ దృష్టితోనే చేయవలసి వచ్చినారు. తక్కిన వన్నె, రూపం, కొలత, అలంకారం మొదలైనవన్నీ కేవలం వినోదప్రపంచానికి చేరినవి. స్థాయిత్రయంలోనూ సజీవమైన గంభీరనాదం, వినడానికి ఇంపు, గమకాలన్నిటినీ స్పష్టంగా పలికించే అనుకూలం, చూడడానికి మొత్తంగా అందమై చదరమైన ఆకారం-ఇవే వాద్యరచనలోని ముఖ్యవస్తువులు. దేశంలో జనులకు ఒక సమాజంగా కూడి బదికే అవకాశాలు తక్కువగా ఉన్నప్పుడు, ప్రయాణసౌకర్యాలు చాలక పరస్పరం పోల్చుకొని తమతమ లోపాలను దిద్దుకొనే అదృష్టం స్వల్పంగా వున్నకాలంలో, ఉత్సాహం ఉద్యోగం గల జనులలో లెక్కలేక దేశం మూలమూలల్లోనూ వాద్యాలు తయారైనా, అవన్నీ ఒక్కొక్కటి అసంపూర్ణంగానే, అతృప్తికరంగానే నిలిచివుండేవి. ఐతే పరిపూర్ణంగా నాదలయరచనకు ఉపయోగించే వాద్యాల ఆవశ్యకతా, దానికై ప్రతిభావంతులు పరిశ్రమించడమూ, అఖండంగానే అనువర్తించివస్తూవుండెను. ఈవుద్యోగం దక్షిణదేశంలో కర్ణాటకసామ్రాజ్యంలోనూ, వారి అనుయాయులైన మధుర, తంజావూరు, మైసూరు మొదలైన మండలాల్లోనూ కాంతి, ప్రోత్సాహం, గౌరవం, సంప్రదాయం మొదలైన అనుకూలపరిస్థితులు హెచ్చడం





చేత ఏకముఖంగా పెరిగింది. ఆ సన్నివేశం లోనే వట్టి వాద్యాల సంఖ్య, వైవిధ్యం-వీటితో కళకేమీ లాభం లేదనే తత్వం రసికుల కర్థమయింది. ఉత్తమవాద్యాలను ఇంకంత ఉత్తమపరచే ప్రయత్నం అప్పుడే నడిచింది. మనుష్యజీవితంలో కళకు స్థూలంగా మూడు స్థానాలుంటాయి. మొదటిది ఇల్లు, రెండవది సభ, మూడవది రచ్చ. ఇంటిలో జనసంఖ్య స్వల్పమనీ, అంతకంటె ఎక్కువగా సభలలోనూ, దానికి మించి బైటనూ విని ఆనందించే జనం చేరుతారనీ చెప్పనక్కరలేదు. ఈమూడు సన్నివేశాలకూ తగినట్లు వాద్యాలను మనవారు సృజించుకోవలసివచ్చింది: సృజించుకొన్నారు.


ఇంటికి ముఖ్యంగా వీణ. దీని నాదసౌకుమార్యం, గాంభీర్యం, సూక్ష్మస్వరాలను పలికించే శక్తి, గమకాల స్ఫూర్తి - అన్నీ అసాధారణమైనవి. నాదలయాల మాధుర్యానికి దీన్ని మించిన వాద్యాన్ని మనుష్యుడింకా సృష్టి చేయలేదు. సరస్వతీదేవి మనుష్యుల కిచ్చిన వరప్రసాద మిది అనేది కథ. మనుష్యులు సరస్వతికి సమర్పించిన సాటిలేని కానుక ఇది అనేది నిజం. వాద్యనిర్మాతకు ఇందులోనే దివ్యత కానవచ్చింది. 'వీణానామ అసముద్రోత్థితం రత్నం' అన్నాడు రసికరాజు శూద్రకుడు.


మరి సభకు తగిన వాద్యం వేణువు. వేయూరుమంది కూర్చొని విని ఆనందింపదగినది. శ్రీకృష్ణునికి మన ఉపాయనం. సహజంగా దీని నాదంలో 'ఖణిక' ఎక్కువగా వుండినా శ్వాసనియమనాన్ని సాధించిన వైణవికుని చేతిలో ఇది ఎంతో మృదుమధురగంభీరం కాగలదు. దీనికి తోడు మృదంగం. ఇప్పుడు వీణకుగూడా మృదంగం లయవాద్యంగా ఉపయోగిస్తున్నారు; కాని ప్రాచీనుల నాదసౌకుమార్యాభిరుచి దాని కవకాశ మిస్తూవుండలేదని విన్నాను. మృదంగ వాదకుడు ఎంత మంచిసాధకి ఐనా, ఎంత మృదువుగా వాయించగల్గినా, అసలు వాద్యం పెద్దవస్తువు గనుక, ఇప్పటి కచ్చేరీలలో దాని ధ్వని వీణానాదాన్ని మించుతూనేవుంటుంది. అట్లాగాక వేణువువంటి వాద్యాల ధీరనాదరచనకు తోడు లయరచన మేళగింపవలసివుంటే దానికి మృదంగాన్ని మించిన వాద్యం ఇంకొకటి లేదు. కేవలతాళ లయవాద్యాలలో స్వతంత్రమైన రచనాశక్తిని ఈగలిగినది ఇప్పటికి దొక్కటే. కాళిదాసుకు ఈవాద్యమంటే పంచప్రాణాలూ లేచివస్తుంది.

ఇంక రచ్చకు తగిన వాద్యం సన్నాయి. లక్షల కొలదిగా జనం విని ఆనందించవలసింది. దీని జతకు డోలు. శ్రుతిలేని వాద్యమైనా ఈడోలు 'స్నిగ్ధగంభీరనిర్ఘోషం'. సర్వం కషమైన సన్నాయి స్నిగ్ధగంభీరస్వావంతో చేరితే అఖండ కోలాహలపు తాండవానందం అనుభవించి మాత్రం తెలియతగింది.

కర్ణాటక సంగీత పద్ధతిలో మన ప్రాచీనుల ప్రతిభ ఎంత దూరం వ్యాపించిందో అంత దూరమూ వాద్య మార్గంలో స్ఫురింపజేయడానికి పైవాద్యాలు చాలివున్నవి. కనుక గాయకులూ, రసికులూ తృప్తులైరి. తక్కిన చిల్లరవాద్యాలమీద ఉదాసీనం కలిగింది. స్వాభావికంగా అవి క్రమంగా నశించినవి. ఏ వాద్యాన్ని సాధించవలసినా దేహమనస్సులకు కలిగే శ్రమ ఒకటే. అట్లున్నపుడు మన మనస్సులోని భావాలను పూర్తిగా వెలువరచలేని వాద్యాలకై ఏల శ్రమపడవలెను?-అనే ప్రశ్న సహజమైనది. కనక మనలో పూర్వకాలంలోని అనేకవాద్యాలు ఇప్పుడు నష్టమైనవి అంటే, దానికి మనం అవమానంగాని, దుఃఖంగాని పడవలసిన పని లేదనేది ఇప్పటి కర్ణాటకసంగీతగాండ్ల భావం. ఇది తప్పనడం కష్టం.

మన వాద్యాలు ఎంత పూర్ణంగా వుండినా ఒక్క కొరత వుండేది. మనుష్యుల గాత్రంతో సరిగా మేళవించే వాద్యం మనలో సిద్ధంకాలేదు. వీణనాదం 'సంచు' గాత్రం కలవారికిమాత్రం కొంత పనికివచ్చేది. ఇంతే కాదు. వీణజతలో పాడే వాడుకపడి ఎందరో తమ గాత్రాన్ని చాలా కృత్రిమంగా సన్నగించుకోవలసివచ్చిరి. కీ. శే. వీణధనంపాట విన్నవారందరూ దీన్ని ఎరుగుదురు. ఇంకా, వీణ మీటేవాద్యంగనక దానిలో అఖండనాదం సాధ్యంకాదు. కాబట్టి గాత్రానుకరణం తృప్తికరంగా ఉండలేదు. అందుచేత చాలాకాలం మనలో పిల్లంగ్రోవే పాటకు పక్కవాద్యంగా పని తూగించింది. శ్వాసవాద్యంగనక దీర్ఘస్వరాలు దానిలో సాధ్యమైనా 'సీస్కు' నాదం కాబట్టి మనుష్యుల—అందులోనూ మగవారి గాత్రంతో సరిగా మేళగిస్తూవుండలేదు. మరిన్నీ వేణువు శ్రుతిసిద్ధమైంది. కొంచెం







కూడా బదలాయింపు సాధ్యంకాదు. పాడే వారందరూ వేరువేరుపిల్లంగ్రోవులనుసిద్ధంగా వుంచుకోవలసివుండెను. ఈ లోపాన్ని పాశ్చాత్యుల 'ఫిడేలు' వాద్యం వచ్చి చేరి తీర్చింది. సుమారు ౧౫౦ ఏండ్లక్రింద మన వారు దీన్ని స్వీకరించిరి. సాధించిరి. సొంతంచేసుకొనిరి. దీని మూలరూపం మనవారు కనిపెట్టిందే అనీ, ధనుర్వీణ అనికాబోలు దాని పూర్వనామమనీ, నేటికీ ఉత్తరభారతంలో ప్రచారంలో వుండే 'సారంగి' వాద్యమే ఫిడేలుకు తల్లో అవ్వో కావలెననీ చెప్పేవారున్నారు. ఆ చారిత్రకదృష్టి అట్లుండనీయండి. పాశ్చాత్యులు ఆ వాద్యాన్ని చాలా చక్కచేసినారు. చేస్తూవున్నారు. దానిలో స్త్రీపురుషుల శారీరానుకరణానికి తగిన తంతులు నిత్యనూత్నంగా సృష్టిచేస్తున్నారు. వింటితో వాయించే వాద్యంగనక అఖండస్వరాన్ని చూపడం దీనిలో సులభం. అందుకే ఈ నాటయాభైయేండ్లలో కర్ణాటక గాయకులలో దీనికి వచ్చిన వ్యాప్తి అసాధారణమైనది; ఆశ్చర్యకరమైనది; కాని అర్హమైనది. ఇది పరదేశవాద్యమనే అసహ్యం లేక వేలకొద్ది ఈ వాద్యానికై తమ జీవమానమంతా శ్రమించినారు. శ్రమిస్తున్నారు. పాశ్చాత్యులకే తెలియని విషయాలెన్నో దీనిలో కనుక్కొన్నారు.


ఇప్పుడు మనకు కావలసినది భిన్నభిన్న వాద్యాల హెచ్చుసంఖ్య కాదు. మరేమంటే, ఇప్పుడుండే ఉత్తమవాద్యాలను ఇంకా ఉత్తమంగా సంస్కరించే ప్రయత్నం. ప్రతివాద్యంలోనూ కొన్ని కొన్ని లోపా లున్నవి. వీణలో అఖండస్వరం లేదు. వేణువులో శ్రుతిభేదానికి అవకాశం లేదు. ఫిడేలుతో మాధుర్యగమకాలను పట్టి చూపడం పరమప్రయాస—ఇత్యాది. వీనిని సవరించే ప్రయత్నమూ అందందు నడుస్తూ వున్నది. మైసూరులో కీ॥ శే॥ శ్రీ నాల్వడి కృష్ణరాజేంద్రుని ప్రోత్సాహంతో శ్రీ సుబ్రహ్మణ్యయ్యరు గారు 'సుబ్రవీణ'ను సృజించిరి. ఇది హార్మోనియంవలె పలకలమీద వేళ్లనొత్తి వాయింపదగినది. శ్రీ హాలుగూరు కృష్ణాచార్యులు 'శ్రీకృష్ణరాజేంద్రసర్వమేళవీణ'ను తయారుచేసినారు. ఇందులో నాలుగైదు విధాల వాద్యాల లక్షణాలు మిళితమైవున్నవి. ఉత్తరదేశంలోని చితారు, సారంగి మొదలైన వాద్యాలకున్నట్లే మన కర్ణాటకవీణకూ వాయించే తీగలక్రింద అనురణనానికి ఎన్నో తంతులు కట్టి, అందు మూలాన వీణానాదరాశి హెచ్చించేప్రయత్నం ఎందరో చేసిరి. శ్రీ చౌడయ్యగారు ఫిడేలునాల్గుతంతుల నాదం కూడా చాలదని మరిమూడుతంతులు చేర్చి, ఎంత తక్కువశ్రుతికైనా పక్కవాద్యంగా దానిని పనికివచ్చేట్టు చేసినవిషయం సుప్రసిద్ధమే. ఎన్నో శతమానాల తరబడిగా పెరిగివస్తూవుండే వాద్యాలమేల్మికై స్వల్పమైన మార్పు చేయడంకూడా కష్టమైనపని. పైప్రయత్నాలు ఎంతవరకూ సత్ఫలాన్ని ఇచ్చిందనే చర్చ నాకు ప్రకృతంకాదు.

మనలో ఇటీవల కొత్తకొత్త వాద్యాలు సృష్టికిరాకపోయినా, పరదేశాలనుంచీ ఎన్నో వచ్చినవి. హార్మోనియంమాట చెప్ప పనిలేదు. బుల్ బుల్ తరంగం, కళారట్టు, కన్సర్టినా, అగ్నితరంగం, కాష్ఠతరంగం, పిశాచపిల్లేళ్ళు, రాక్షసపియానోలూ-ఇంకా ఏవేవో వింతవింతలవి మన రంగానికి ప్రవేశిస్తూవున్నవి. వాటి నవ్యతకు మరులుగొని, ఎందరో సాధించడమూ జరుగుతూవుంది. ఐతే ఖర్చుకు మార్గంలేక డబ్బు కుళ్ళుతూ వుండే మహాత్ముల ఇండ్లలోనో, లేక అర్థంలేని 'ఆర్కెస్ట్రా'లలోనో, మన సంగీతపు మట్టాని కెక్కలేక అవి కుంటుతూనే కాలక్షేపం చేస్తున్నవి.

కర్ణాటకసంగీతం దృష్టి ఇట్లుండేంతకాలమూ కొత్తవాద్యాల గతంతా ఇంతే. పాశ్చాత్యుల సంగీతకళ, మనదానివలె స్వరాల క్రమవ్యాప్తిగా వుండక, ఏకకాలంలో భిన్నస్వరాలను జోడించేమేళపద్ధతి గనుక, వారికి బహువాద్యాలు, బహువిధములైనవి కావలెను. మన కిప్పటికి అవి అనావశ్యకం. కర్ణాటకసంగీతాన్ని మేళపద్ధతి క్రిందికి దించవలెననే ప్రయత్నం అగత్యము లేనిదిమాత్రమే కాదు; అనర్థకారికూడా. ఇప్పటి మనదేశంలోని 'ఆర్కెస్ట్రా'అనేవన్నీ నక్కవాతలవంటివి. పాశ్చాత్యుల మేళపద్ధతి బ్రహ్మాండంగా వర్ధిల్లిన కళ అంటారు. కాదనే అనుభవంగాని, అధికారంగాని, ఆవశ్యకతగాని నాకు లేదు. ఆపద్ధతినే మనం సాధిస్తే, అప్పటివారిలోవలెనే బహువాద్యాలు వద్దన్నా మనలోనూవచ్చి చేరుతాయి.







వేమా రెడ్డి

[నాటిక]

సంజాయిషీ.

వ్రాయదలచుకున్నది వేమనకవితమీద. తయారైన వస్తువు కామినీకాంచనాలు అనుభవించి విడిచి పెట్టిన వేమారెడ్డి విముక్తి. కథానాయకుడు ప్రత్యక్షం కాలేదు. సూక్ష్మంగా గోచరించాడు.

ఇందులో వ్యక్తులు

ఇద్దరు వేగులవాండ్రు పెద్దరెడ్డి పంపుమీద వేమారెడ్డికోసం వెదుకుతూవుంటారు. ఇద్దరు సాధకులు: వేమారెడ్డి శిష్యులు. రసవాదంలోంచి గురుపూజలోకి దిగుతారు.

ఇద్దరుస్త్రీలు-వేమారెడ్డి వలపుకత్తె కామంలోంచి మోక్షగామిగా మారుతుంది - విశ్వసుందరి; ఆవిడ తల్లి.

మూడే రంగాలు

అడవి, ఉద్యానవనం, పర్వతగుహాముఖం.

శ్రీ కపిల కాశిపతి

తొలిరంగం

[అర్ధరాత్రివేళ. అడవిలో. చీకటి. ఇద్దరు సాధకులు చితుకుల మంటమీద బంగారం వొండుతూ వుంటారు. కాగడాలతో ఇద్దరు భటులు ప్రవేశిస్తారు.]

ఒకటో భటుడు—అర్ధరాత్రివేళ అమావాస్యచీకట్లో అగ్గి మంట వేసే దెవరయ్యా మీరు?

ఒకటో సాధకుడు—కారడవిలో కొరివిదెయ్యాలలాగ కాగడాలతో మీ రెవ్వరు?

రెండోభటుడు—మేం పెద్దరెడ్డికొలువవాండ్రం.

రెండోసాధకుడు—మేం వేమారెడ్డిశిష్యులం.

1. భటుడు—వెదకబోయిన తీగె కాలి కడ్డంబడింది.

2. భటుడు—మీ గురువుగా రెక్కడ?

1. సాధకుడు—ఆ పరమాత్మ నడుగు.

2. భటుడు—వొళ్లు పొగరుగా మాట్లాడుతున్నావ్! జాగ్రత. తెలుసునా? ఎవరనుకున్నావ్?

1. సాధకుడు—మీజోలి కొచ్చామా, మీ శొంఠికొచ్చామా నాయనా? మమ్మల్ని ఈ నట్టడవిలోనైనా ఆకూ అలమూ తిని కడుపునింపుకుని కాలం వెళ్లబుచ్చుకోనియ్యరూ?

2. భటుడు—వూళ్లో వుండి, తిని తీరి కూచోలేక, ఈ వనవాసం ఎవరు చెయ్యమన్నారూ, పైగా ఈ అపసోపాలెవరు పడమన్నారూ?

2. సాధకుడు—వూళ్లో దిక్కూ దివాణం లేకనేగా, ఈ రాళ్లూరప్పలూ పట్టుకు తిరుగుతున్నాం.

1. భటుడు—దిక్కెందుకు లేకపోయింది?

1. సాధకుడు—అన్నమో రామచంద్రా, అలో లక్ష్మణా అని, ప్రజ, మింగడానికి మెతుకు లేక, కట్టుకోడానికి గుడ్డ లేక అల్లాడిపోతోంటే, ఎవరు దిక్కొచ్చారు, ఏ దివాణం కనిపెట్టింది నాయనా? పైగా, చచ్చి స్వర్గాని కెళ్లినా సవితిపోరు తప్పదన్నట్టు, చెట్లూ పుట్టలూ పట్టినా ఈ రాచపోరు తప్పదన్నా మాకూ?

1. భటుడు—పోరేమిటయ్యా! పోరూ పొక్కూనూ! వేమారెడ్డి ఎక్కడున్నాడు చెప్పమంటే, ఏదో పాఠం చదువుతావు!

2. సాధకుడు—పైగానా? నోరున్నవాడిది రాజ్యంట. మొగుణ్ణి కొట్టి మొరపెట్టుకుందిట వెనకటి కోభాగ్యశాలి, నీబోటిదే.

2. భటుడు—అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పరేం?

1. సాధకుడు—అడిగేవాడికి చెప్పేవాడు లోకువట. మీ రేమడిగారు, మేం ఏం చెప్పలేదు?

1. భటుడు—వేమారెడ్డి ఎక్కడున్నాడు?

1. సా—ఏ వేమారెడ్డి?

2. భ—పెదరెడ్డిచిన్నకొడుకు.

2. సా—మాకేం తెలుసును?

1. భ—ఇప్పుడేగా వేమారెడ్డిశిష్యులం అన్నారు.

1. సా—అయితే, ఆయ నెక్కడున్నాడో మాకెల్లా తెలుస్తుంది?

2. భ—శిష్యులికి గురువుఆచోకీ తెలియదూ?

1. సా—అది తెలిస్తే, ఈపాట్లన్నీ ఎందుకు నాయనా? సద్గురువుస్థానం తెలిసిన పరమశిష్యు డింకా ఈకాలంలో పుట్టలేదు.

2. భ—వేమారెడ్డి ఎక్కడున్నాడంటే వెర్రివేదాంతం చెబుతా వేమిటి?

1. సా—వెర్రివేదాంతం కాదు నాయనా, వేమారెడ్డి వెర్రివాడు. ఆయన చెప్పేది వెర్రివేదాంతం.

1. భ—వేమారెడ్డి ఏం చెప్పాడు?

2. సా—

ఎంత సేవచేసి ఏపాటు పడినను
రాచమూక నమ్మరాదు రన్న
పాముతోడి పొందు పదివేలకైనను
విశ్వదాభిరామ వినర వేమ.

2. భ—వినరా వేమా - అంటావు. ఇది వేమారెడ్డి నీకు చెప్పాడా, నువ్వు వేమారెడ్డికి చెప్పావా?

1. సా—ఎవరూ వినకపోతే వేమారెడ్డి తనకి తానే చెప్పకున్నాడు.

1. భ—చెప్పకుంటోండగా నువ్వు విన్నావా?

1. సా—విన్నానంటే, కంటితో కానకుండా చెవితో ఎల్లా విన్నావని అడుగుతావా?

1. భ—ప్రశ్నకి ప్రతిప్రశ్నేగాని అసలుసంగతి చెప్పరేమయ్యా?

1. సా—అసలుసంగతి తెలిస్తే, ఈ తాపత్రయం ఎందుకయ్యా?

2. భ—తాపం ఏమిటి, త్రయం ఏమిటి?

1. సా—నువు కొస్త గుర్రాన్ని కట్టేసి, కోప్పడకుండా వుంటే చెబుతాను. సావధానంగా వింటావా?

1. భ—నీకు పుణ్యం వుంటుంది నాయనా. పదిరోజులైంది ఇల్లు విడిచిపెట్టి. కళ్లూ, కాళ్లూ కాయలుకాసిపోయాయి. వెదికి వెదికి వేసారిపోతున్నాం. వేమారెడ్డిజాడ కొస్త చెప్ప బాబూ, మళ్ళీ జన్మలో నీకడుపున పుడతా. పెద్దరెడ్డికి తిండీ తిప్పలూ లేవు.

1. సా—వూళ్లో అందరికీ పెద్దరెడ్డి తిండిపెడతాడా?

1. భ—అందరికీ తిండెట్టడం బ్రహ్మదేవుడి తరమా?

1. సా—అయితే జనం అంతా అన్నం, నీళ్ళూ లేక చావాల్సిందే?

2. భ—ఎవరు చావమన్నారు?

1. సా—అన్నం లేకుండా నువ్వు బతికించగలవా?

1. భ—కాయకష్టపడితే కూడొస్తుంది.

1. సా—నువు చెప్పిన కష్టం చేస్తాను, నాకు ముప్పొద్దూ మూకుడుకూ పెడతావా?

1. భ—పొద్దస్తమానం కొలువు చేస్తేనేగాని నాకే కూడు లేకపోతే నీ కెక్కడ తెచ్చేది?

2. భ—తాను దూర సందులేదు, మెడ కోడోలంట.

1. సా—అయితే, ఇందాకా బ్రహ్మదేవు డన్నావు. ఆదేవుడు అందర్నీ చావడానికే పుట్టించాడా?

1. భ—చావక ఎల్లకాలం బతికుంటారేంటి?

1. సా—బతుకుతా మన్నట్టిగా కూడపెడతారు, మీ రాచోళు. సెట్లు, రైతులూనూ.

2. భ—వాళ్ళ ఖర్మం వాళ్ళదయ్యా బాబూ, వేమారెడ్డి ఎక్కడున్నాడో చెప్పవయ్యా, నాచర్మంతో చెప్పులు కుట్టిస్తా.

2. సా—నీచర్మం ఎందుకు, కరువుతో, కాటకంతో సచ్చినాళ్ల, సవాలక్ష వుండగా?

1. భ—వాళ్ళ నందర్నీ మేం చంపేశామంటావా?

1. సా—మీరు కాకపోతే, మీ రెడ్లు.

1. భ—రెడ్లేం చేశారయ్యా?

1. సా—కలిగినవాళ్ళు పండిన గింజలన్నీ గాదుల్లో బిగించుకుంటే, లేనివాళ్ళు తినే దెల్లాగ?

1. భ—ఎవళ్ల ఖర్మం వాళ్ళది, ఆగోడవ మన కెందుకంట.

2. సా—ఆయనఖర్మం ఆయంది, వేమారెడ్డిగొడవ మీ కెందుకయ్యా?

1. భ—మా కెందుకయ్యా, ఆయ నెట్టాపోతే. పెద్దరెడ్డి వెతికి తీసుకురమ్మన్నాడు; దొరక్కపోతే మమ్మల్ని తిరిగిరావొద్దన్నాడు.

2. సా—వూళ్లో పెద్దమాలకొడుకు తిండిలేక చచ్చిపోయాడుగదా. వా ణ్ణెవరు తీసుకొస్తారు? మీరేనా?

2. భ—మీ మిట్టవేదాంతం చూస్తే, చీకాకేసుకొస్తోంది. వేమారెడ్డి ఎక్కడున్నాడో మీకు తెలుసునా, తెలియదా?

2. సా—ఆక లెక్కడుంటే అక్క డుంటాడు. రోగ మెక్కడుంటే అక్కడుంటాడు. దరిద్రం ఎక్కడుంటే అక్కడుంటాడు.

2. భ—వెయగావెయగా వెర్రాడే గెల్చాట్ట.

1. సా—వేమారెడ్డి చెప్పేదీ అదే.

"అనగనగ రాగ మతిశయిల్లుచునుండు
తినగతినగ వేము తియ్యనుండు."

2. సా—నీళ్ళతో పెట్టుకుంటే, మూకుడుకింద నిప్పారిపోతోంది.

1. భ—ఆ మూకుట్లో ఏమిటి వొండుకుంటున్నారు?

2. సా—ఏమిటి చెప్పుకో?

1. భ—చింతంబలి.

2. సా—నీ కెల్లా తెలిసింది?

1. భ—వాసన తెలియడంలేదూ?

2. సా—పసిగట్టాడ్రోయ్!

1. సా—పసిగడితే ఏం? వాళ్లూ వొండుకుంటారు.

1. భ—చింతంబలి తాగాల్సిందే, వేమారెడ్డి దొరక్కపోతే.

2. సా—దొరికితే?

1. భ—నావోళ్ళల్లా బంగారంకాదూ?

1. సా—ఎల్లా?

1. భ—పెద్దరెడ్డి సంతోషంతో మా కతురలతులిచ్చేస్తాడు.

2. సా—ఇప్పుడు సంతోషం లేదా?

1. భ—చిన్నకొడుకోసం మంచంపట్టి మగ్గిస్తోంటే.

2. సా—కొడు కెక్కడికి పోయాడు?

1. భ—రామాయణం అంతా విని, రాముడికి సీత ఏమవుతుంది అన్నట్టుంది! పెద్దరెడ్డి చిన్నకొడుకు వేమారెడ్డి ఇల్లూ వాకిలీ, పెళ్లాం పిల్లల్నీ విడిచిపెట్టి లేచిపోయాడయ్యా. బైరాగుల్తో తిరుగుతున్నాడు. ఆయన్ని పట్టుకుని మమ్మల్ని తీసుకురమ్మన్నారు. ఇంతేనా మీకు తెలిసింది, మీ గురువుసంగతి?

1. సా—

"వెదుకవెదుక దొరకు వేదాంతవేద్యంబు
వెదుకువాని దాను వెదుకుచుండు;
వెదుక నేర్చినట్టి వెరవర్లు గలరొకో
విశ్వదాభిరామ వినర వేమ."

2. భ—నీ కాలు మొక్కుతాను బాబూ, వేమారెడ్డి విషయం చెప్పమంటే, వెర్రివిస్సన్న వేదాంత మెందుకయ్యా మాకూ?

2. సా—మీకే కాదయ్యా, లోకానికంతకీ ఈనాడు కావలసింది వేదాంతమే. అది లేకే ఈ కరువూ, ఈకాటకం.

1. భ—అయితే వేదాంతం, వేదాంతం అంటావు. వున్నదంతా వూడ్చిపెట్టి నీకిచ్చి, తరవాత నోట్లో దుమ్ముకొట్టుకు పొమ్మంటావా? వున్నవాడి సొమ్ము పోతే వాడి మొహం చూసేదెవరు?

2. ధ—తాచెడ్డ కోతి వనమెల్లా చెరిచిందని, నువ్వు బూడిద పూసుకున్నావని లోకమంతా బూడిదబుస్సన్న లెల్లా అవుతారు ?

2. సా—

"ఇచ్చేవారల సంపద
హెచ్చేదేకాని లేమి ఏలా కలుగున్;
అచ్చెలమ నీళ్లు చల్లిన
విచ్చలవిడి నూరుచుండు వినరా వేమా!"

1. సా—

ధనము గూడబెట్టి ధర్మంబుసేయక
తాను దినక లెస్స దాచుగాక
తేనె నీగ కూర్చి తెరవరి కియ్యదా
విశ్వదాభిరామ వినర వేమ!

1. ధ—ఈ పద్యాలన్నీ మీ కెవరు చెప్పారు ?

1. సా—చింతంబలి చెయ్యమన్న వారే.

2. ధ—ఎవరికీ అర్థంకాకుండా మాట్లాడమనికూడా వాళ్ళే చెప్పారా ?

2. సా—చెవులు మూసుకుంటే వినబడదు. కళ్ళుమూసుకుంటే కనబడదు. బుద్ధిలేకపోతే అర్థంకాదు.

1. ధ—మీతో వాదనేసుకుంటే భళ్లున తెల్లార్తుంది. వేమారెడ్డి దొరకడు గీమారెడ్డి దొరకడు.

2. సా—ఆయన మీకు దొరకడు.

1. ధ—ఎందుకని ?

2. సా—మాకే దొరకలేదు కనక.

1. ధ—అయితే మీ గురువన్నారు ?

1. సా—దొరక్కపోతే గురువు కాకూడదా ?

2. ధ—మరి మీ కీపద్యాలన్నీ ఎవరు చెప్పారు ?

1. సా—ఆనోటా ఆనోటా విన్నాం.

1. ధ—మీరు వేమారెడ్డిని చూడలేదన్నమాట.

1. సా—ఎన్నిమాట్లు చెప్పాలి ? మేం చూడలేదు.

2. ధ—ఈసంగతి మొదటే చెబితే ఈగొడవంతా లేక పోయేదిగా ?

1. సా—ఇప్పు డేం గొడవొచ్చింది ?

2. ధ—ఈపాటి కింటికి పోయేవాళ్ళంగా.

2. సా—ఇంటి కెళ్ళడానికేనా పెద్దరెడ్డి మిమ్మల్ని పంపించింది ?

1. ధ—దొరికితే బంగారంకణికెలిస్తానన్నాడు. దొరక్కపోతే నరుకుతానన్నాడు.

1. సా—ఆ బంగారం మేమిస్తాం, వేమారెడ్డి కనబడితే మాకు చూపిస్తారా ?

2. ధ—బతుకుతెరువు లేక బలుసాకు తింటున్నారు. బంగారం పంచిపెడతార్ట! మీకేం చెలచిత్తమా ?

1. సా—చిత్తం నిలపగలిగితే, వేమారెడ్డి మీకూ అక్కర్లేదు, మాకూ అక్కర్లేదు.

2. సా—వేళాకోళం అనుకుంటున్నారా, బంగారం చేసి చూపిస్తే ఏమిస్తారు ?

2. ధ—బంగారం చేసేవాడికి మే మేమిస్తాం? పట్టపురాజే ఇయ్యలేడు.

1. సా—బంగారం చేసేవాడు పట్టపురాజుకంటె గొప్పవాడని ఒప్పుకుంటారన్నమాట?

2. ధ—చెయ్యగలిగితే.

1. సా—చేసి చూపిస్తే?

2. సా—ఇప్పుడు మేం చేసేది అదే. వాసనచూసి చింతంబలన్నావే, ఆ చింతంబలే బంగారు. ఉప్పూ, పులుసూ కలిసి కుత కుత వుడుకుతోంటే కమ్మగా తిందామనుకున్నావు.

2. ధ—చింతపండుతో బంగారం చెయ్యగలిగితే ఈ కరు వెందుకు, కాటక మెందుకు?

1. సా—వేమన్న చెప్పిందికూడా అదేనోయి పిచ్చివాడా!

"ఉప్పు చింతపండు నూరిలో నుండగా
కరువ దేల వచ్చె కాపులార
తాళకంబు పెరుగరో తగరంబు పెరుగరో
విశ్వదాభిరామ వినుర వేమ."

1. సా—

"బింబఫలము లుండ బిగువైన రస ముండ
పనికిరాక తిరిగి పాట్లుపడిరి
సత్తు పెచ్చుచేసి సాధింపలేరొకో
విశ్వదాభిరామ వినుర వేమ."

1: సా—

"ఇంగిలీక మహిమ హేమించనేరక
చిత్రపటము చేసి చెరచినారు
బొంత జెముడుపాల బొంగించనేరరు
విశ్వదాభిరామ వినుర వేమ."

1. ధ—వెర్రికుదిరినది, రోకలి తలకి చుట్టమన్నట్టుంది వీళ్ళ ధోరణి. మనదార్ని మనం పోదాం రారా బాబూ.

2. ధ—వుండరా కాసేపు. అయితే చేసిన బంగారం ఏం చేస్తారు?

1. సా—అన్నం లేనివాళ్ళ కిస్తాం.


హింద్
హిందూ దేశములో తయారు చేయబడినవి
హిందూ దేశము కొరకు తయారు చేయబడినవి
హిందూ దేశస్థులచే తయారు చేయబడినవి
క్రొత్త హింద్ సైకిళ్లు యుద్ధపూర్వముకంటే ఎక్కువ పటిశవము లతో ఇప్పుడు తయారుగా వున్నవి.
హిందూ దేశమందు విరివిగా సైకిళ్లను తయారుచేయు కంపెనీలలో మిక్కిలి పెద్దదగు హింద్ సైకిల్స్ లిమిటెడ్ వారిచే తయారు చేయబడినవి.
HIND CYCLES LIMITED BOMBAY
HIND India's Own
హింద్ సైకిల్సు లిమిటెడ వారిచే తయారు చేయబడుచున్నది.
మదరాసు రాజధాని సోల్ ఏజంట్లు (సంస్థానములు సహా)
డీలక్స్ ట్రేడింగ్ కంపెని. 44 అర్లిమాక్ వీధి తిరుచునాపల్లి.
బ్రాంచి : 11 బ్రాడ్వే. మద్రాసు.
అన్ని చోట్లను దొరుకును
HC. 12—TL

డి. డి. టి. తో

మంచి ఫలితములను పొందు విధము



★

1 క్రిమి నాశనమునకు డి డి టి ని ప్రవేశ పెట్టుటకు మూలపురుషుడగు జె. ఆర్. గైగి తెల్పిన విధముగా తయారుచేయబడిన న్యూసిడ్ పొడరులో నూటికి 10 వంతులు డి డి టి గలదు ఆసుపత్రులలోను, పాఠశాలలలోను ఉపయోగించుటకు అనుకూలముగా న్యూసిడ్ పొడరు అన్ని మంచి స్టోరుల యందును 2 ఔన్సులు, ½ పౌను లేక 1 పౌను డబ్బాలు దొరకును. 28 పౌనుల డబ్బాలు ఆస్పత్రులకు, పాఠశాలలకు యితర సంస్థలకును దొరకును.

2 వంట శాలలలోను, పురుగులు చేరుతదితర తావులలోను న్యూసిడ్ పొడరును విరివిగా చల్లవలయును. నిష్ఫలితముగా అనేకమార్లు ఉపయోగించుట కంటే, ఒకే పర్యాయము మేడలో అన్ని గదులయందును పూర్తిగా చల్లుట మంచిది. ఇట్లు సరియగు పద్ధతిలో పొడరును చల్లి కొద్ది రోజులుంచినచో బొద్దంకులు, ఈగలు, చీమలు, దోమలు, నల్లులు మొదలగు కీటకములు చేరకయుండును. అవసర మయినచో పొడరును తిరిగి ఉపయోగించ వచ్చును.

న్యూసిడ్

పొడరును వాడుడు మరియు దానిని సక్రమముగా ఉపయోగించుడు.

గైగి ఇన్సెక్టిసైడ్స్ లిమిటెడ్

Geigy

నెవిల్లె హౌస్, నికల్ రోడ్డు, బల్లార్డ్ ఎస్టేట్, బొంబాయి.

DJK. 6313

హైదరాబాదు స్టేటు, దక్షిణమండలాలకు డిస్ట్రిబ్యూటర్లు : మెసర్సు మహమ్మద్ రహిం ఖలీల్, 99 బి, ఉస్మాన్ జాహా రోడు, బెంగుళూరు సిటీ.

దక్షిణ ఇండియాలో డిస్ట్రిబ్యూటర్సు : మెసర్సు ఆడిసన్ అండ్ కో., లిమిటెడ్, మౌంట్ రోడ్, మద్రాసు.

కొనండి

మా హొసైరీ అల్లికమెషినులు

క్యాలెండరు, వైండింగ్ మెషినులు

Hosiery Knitting
&
Calendar and Winding Machines

మీ గ్రామంలోనే, మీరు స్వంతంగా
హొసైరీ ఫ్యాక్టరీ స్థాపించుకొని
మీ ఆర్థిక సమస్యను మీరే పరిష్క
రించుకొన గలిగెదరు. సచిత్రమైన
మా క్యాటలాగుకొరకు వ్రాయండి.

SHANKAR ENGINEERING WORKS Ltd.
171-A, Harrison Road, CALCUTTA.

2. భ—బంగారం తింటారా?

1. సా—వెర్రివెంగళప్పా, బంగారంతో అన్నం సంపాదిస్తారు.

1. భ—మీకు ఇదికూడా వేమన్నే చెప్పాడా?

1. సా—అహా! ఆ మహానుభావుడు లోకాన్ని వుద్ధరించడానికి శిష్యులికి హేమకారవిద్య చెబుతున్నాడు.

2. భ—అందుకేగావును, ఇంట్లో బంగారం అంతా నాశనం చేశాడు.

1. సా—ఆయనకి బంగారం ఎందుకయ్యా?

2. భ—భోగందాని కియ్యడానికి.

2. సా—పిచ్చివాడా, ఏదోవిధంగా బీదవాళ్లకి బతుకు తెరువు చూపించడమే ఆయనమతం.

"ద్రోహబుద్ధినైన దొంగరికమునైన
కటులనైన సాహసమునవైన
సంపదధికులవలన సాధించి ధనమును
బడుగునకు నొసంగ బాగు వేమ."

1. భ— గద్దల్ని కొట్టి కాకులి కేసినట్టు, కరణాన్ని కొట్టి కాపు కెయ్యమంటాడు.

2. సా—

"కాపు బల్మియున్న కరణాని కది బల్మి
కరణము బలిమెల్ల కాపుబల్మి
కాపు సంతసంబు కరణము సంతోష.
మరసిచూడ లోకమందు వేమ."

1. భ—రావేసి పోదాం. ఆళ్లకి మతిపోతే నీకూ మతి పోయిందా? ఈ దొంగబైరాగిముండావాళ్లు లోకమంతా చెరుస్తున్నారు. పానికొంపలన్నా వెదుకుదాం రా, అక్కడుంటాడేమో!

1. సా—

"ఎద్దునైనగాని ఏడాది చెప్పిన
మాట తెలిసి నడుచు మర్మమెరిగి
మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ వినర వేమ!"

మలిరంగం

[పున్నమనాటి వెన్నెల. రాజవేశ్య ఉద్యానవనంలో సరోవరతీరంమీద చంద్రకాంతపీఠంమీద కూచుని నవయవ్వనవతి విశ్వసుందరి వీణాగానం చేస్తూవుంటుంది. తోడిరాగంలో విశ్వసుందరి తన్మయమయివుంటుంది. [ప్రవేశం తల్లి]

తల్లి—నిండుపున్నమినాడు పండువెన్నెట్లో కూచుని ఏమిటమ్మా ఆ ఆలాపన?

విశ్వ—(వీణ వాయిస్తూనేవుంటుంది.)

తల్లి—పిచ్చిపిల్ల! ఆ పిచ్చిరెడ్డాయనకోసం వాపోతోంది. ఎన్నాళ్ళో?

విశ్వ—(వీణ వాయిస్తూనేవుంటుంది)

తల్లి—విశ్వం, విశ్వం, పిలుస్తోంటే పలకవేమే? నీ తన్మయత్వం బంగారంగానూ. ఏమేవ్! పిల్లా!

విశ్వ—ఎవరదీ? వొచ్చావా? వేమారెడ్డీ! ఎన్నాళ్లకెన్నాళ్ళకి? నీకోసమే కనిపెట్టుకుని కూచున్నాను ఇన్నాళ్ళనుంచీ. వొచ్చావా! వొచ్చావా!

తల్లి—వెర్రిపిల్లా! కలగంటున్నావేమిటే? నేనే. వేమారెడ్డిని కాదు. ఇల్లా చూడు.

విశ్వ—నువ్వా అమ్మా! రెడ్డిగారెక్కడే? ఇల్లావొచ్చారు.

తల్లి—అది నీ భ్రాంతి తల్లీ. రెడ్డీలేదు గిడ్డీలేదు. ఆయనెందుకొస్తాడమ్మా?

విశ్వ—వొచ్చారే. ఇప్పుడే ఇల్లా వెళ్లారు.

తల్లి—ఏ పెద్దరెడ్డివేసులవాళ్ళో! అతనికోసం ఆకాశం, భూమీ గాలిస్తున్నారు.

విశ్వ—కాదమ్మా. మంచిగంధం, మల్లెపువ్వు కలిసిన చల్లని సువాసన విరజిమ్ముతూ, జరీకండువా జీరాడుతూ ఇల్లా వెళ్లారమ్మా, రెడ్డిగారు ఇప్పుడే.

తల్లి—చాదస్తపుపిల్లా. నలకా నల్లపూసే, ఆజానుబాహుడైన ఆ మనిషి నాకంటికి కన్పడకుండా ఎక్కడికి పోతాడే? అసలాయన మళ్లీ ఎందుకొస్తాడే?

విశ్వ—వొస్తారమ్మా, వొస్తారు. తప్పకుండా వొస్తారు. ఈ క్షణంలో నాపాట వింటున్నారు, ఎక్కడో కూచుని.

తల్లి—నీ కెల్లా తెలుసు?

విశ్వ—ఆయన చెప్పారమ్మా వెళ్ళిపోయేటప్పుడు. పౌర్ణమినాడు తోటలో కోనేటిదగ్గిర చంద్రకాంతవేదికమీద పట్టుచీర కట్టుకుని, తలలో పారిజాతపూలు పెట్టుకుని, వీణమీద తోడిరాగం వాయించమన్నారు.

తల్లి—వాయిస్తే?

విశ్వ—తాను ఏ పర్వతారణ్యసీమలోనో వుండి, ఆ నిండు చంద్రుడికేసి చూస్తూ, ఆ చంద్రఫలకంలో నా ప్రతిబింబం చూస్తూ, ఆ వెన్నెలరాత్రిలో ఆకాశంలోంచి ప్రసరించే నా దివ్యగానం వింటానన్నారు.

తల్లి—అయ్య ఎక్కడో దూరంగా వుంటే నీ పాటాయన కెల్లా వినబడుతుందే?

విశ్వ—ఆయన యోగాభ్యాసం చేస్తున్నారమ్మా. దూరశ్రవణం సాధిస్తే ఎక్కడే శబ్దం కలిగినా వినబడుతుంది.

తల్లి—చాదస్తం.

విశ్వ—కాదమ్మా! చూడు, అదుగో, ఆ చంద్రబింబంలో ఆయనప్రతిబింబం కనబడ్డంలేదూ?

తల్లి—ఎంత అమాయకపు పిల్లవే తల్లీ! చంద్రుడిలో మచ్చ చూసి వేమారెడ్డిచిత్రం అంటావేమిటే?

విశ్వ—అవునమ్మా! నీకు తెలియదు. వీణాగానం అంటే ఆయన కెంతో యిష్టం. అందులోనూ, నేను తోడిరాగం వాయిస్తూ వుంటే ఆయన మనిషీ, మనసూకూడా అల్లాడిపోయేవారు. "విద్యలలోపల నీతియు, వాద్యంబులలోపల వీణ" అనేవారు. వోమాటు సభలో నేను తోడి వాయిస్తోంటే సభవారికి అంటలేదు. రెడ్డిగారు మాత్రం ఎంతో మెచ్చుకున్నారు. సభవారి కింపుకానిది మీ కెల్లా వచ్చిందన్నాను. "దున్నపోతునకును తోడిరాగం చేల"అన్నారు.

తల్లి—తోడే ప్రాణాలు తోడే, అదేం రాగమే అయాసపు రాగం. సుఖమైన సావేరి, గంభీరమైన కాంభోజి వుండగా.

విశ్వ—అమ్మా! చిత్తవృత్తినిబట్టి రుచులు. సంగీతంలో కూడా అంతే. ఆధ్యాత్మిక సాధనకి అసంతృప్తి కారణం. పరమ కల్యాణవసతి ఈ ప్రపంచంలో వున్నవన్నీ చాలక, ఏదో లేనిదాని కోసం, స్థూలదృష్టికి లభించని, చెప్పలేని ఏదో అవ్యక్తవస్తువుకోసం పెనుగులాడే యోగిహృదయంలో వున్న అతృప్తి ప్రకటించడానికి తోడిరాగంకంటే మరోరాగం లేదంటారు వేమారెడ్డిగారు. అంతే కాదు. అందులో జుగుప్స వుంది, మానవజీవితం పరిమితివల్ల కలిగే అశక్తిలోంచి జన్మించిన దైన్యం, అంతటితో వొదిలిపెట్టని కార్యదీక్ష, అన్నిటినీ మించిన ఆత్మస్వాతంత్ర్యానురక్తి ప్రకటించడానికి తోడికి తోడెవ్వరమ్మా!

తల్లి—ఇన్ని శ్రీరంగనీతులూ చెప్పే పెద్దమనిషి సానివాడ కెందుకొచ్చేవాడే?

విశ్వ—సంగీతం వినడానికి, నృత్యం చూడడానికి; సానలలో సరసాలకి కాదు.

తల్లి—మరి గంటలకొద్దీ మీరిద్దరూ తోట్లో ఏం చేసేవారే? పెద్దరెడ్డి చిన్నకొడుకుగదా, ఈవేళ కాకపోతే రేపు, తొందరేమిటని వూరుకొన్నాను. పిచ్చిముండా!

విశ్వ—నీకు తెలియదమ్మా! నీవిద్య అంతా విటులకోసమే అనుకుంటావు. అసలు విద్య రసికులకోసం. రసికులంతా విటులు కావలసిన అవసరం లేదంటారు వేమారెడ్డిగారు. అసలు స్త్రీలంటేనే ఆయనకి అసహ్యం.

"చదువులందు పాడిపెండువులందును స్త్రీల
పెదవులందు రాజ్యపదవులందు
ఆశ లుడిగినట్టి యయ్యలు ముక్తులు"

అన్నారు వోమాటు. మొదట నాసంగీతం విని మనింటి కొచ్చారు. తర్వాత మా ఇద్దరికీ మంచి స్నేహం అయింది. మోహంలో పడిపోతున్నారు స్వామీ అంటే:

"కామి గానివాడు కవిగాడు రవిగాడు
కామిగాని మోక్షగామి గాడు."

అన్నారు.

తల్లి—వోమాటకీ వోమాటకీ పొత్తు కుదరకుండా అనేమి నీకు లమ్మా! నువ్వు మెచ్చుకోవలసిందే.

విశ్వ—అమ్మా! నీరోజుల్లో నువ్వు నిజంగా ఎవర్నన్నా రసికుల్ని చూశావా?

తల్లి—వీళ్ళంతా పెద్దరెడ్డితంత్రికంటూ రసికులంటావా? వేలకి వేలు సప్పించేవాడు.

విశ్వ—వేలు కాదమ్మా. నీ విద్య మెచ్చుకుని, అందులో లీనమై తన్మయత్వం పొందినవార్ని.

తల్లి—నీమాటలు నా కర్థంకావడం లేదే. ఏదో నేనున్నన్నాళ్లూ ఎల్లాగో బతుకుతావు. తర్వాత నీగతేమిటో?

విశ్వ—నీకు తెలియదమ్మా! నువ్వెప్పుడైనా వొళ్ళు మర్చిపోయి వీణె వాయించావా?

తల్లి—నే నెప్పుడూ నీకుమల్లే వొళ్ళు మర్చిపోలేదు.

విశ్వ—అదేనమ్మా! వేమన వలచిన విశ్వసుందరికీ, లోకంలో సామాన్యసుందరీమణులకీ భేదం. మా గురువుగారు వొళ్ళు మర్చిపొమ్మన్నారు.

తల్లి—సరి! సరి! విటుడైంది, రసికుడైంది. ఇప్పుడు గురువుగారా?

విశ్వ—

"గురువు లేక విద్య గుఱుతుగా దొరకదు
నృపతి లేక భూమి తృప్తికాదు."

తల్లి—నీకథంతా చిత్రంగా వుందే.

విశ్వ—ఇంకా చిత్రం చూతువుగాని:

"నందనసంవత్సరమున
బొందుగ కార్తీకశుద్ధపున్నమనాడే
వింధ్యాద్రి సేతుబంధన
సందున నొక వీరు డేలు చాటర వేమా!"

కదరంగం

[ఉదయరాగంలో పర్వతారణ్య సీమ. గుహాముఖంలో వో ఆశ్రమం. మొదటిరంగంలోని ఒకటవ సాధకుడు రాతి తిన్నెమీద దిగంబరుడైన సన్యాసిగా ఆసనంమీద వుంటాడు. పక్కనే రెండవ సాధకుడు శిష్యుడై సూర్యోదయం చూస్తూవుంటాడు. పక్కన పూలవనంలో మాలదాసరి మొక్కలకి నీళ్ళుపోస్తూ వుంటాడు. ప్రవేశం ఇద్దరు వేగులవాండ్రు.]

సన్యాసి—

వేమ నవగ యోగి వెలసె లోకములోన
పూజ లిడుడు పుణ్య పురుషులార
పూజ లిడిన యంత భుక్తిముక్తుల నిచ్చు
విశ్వదాభిరామ వినర వేమ!

ఒకటో వేగులవాడు—పీర్ల తస్సాదియ్యా! ఎక్కడికెళ్లినా వీళ్లేరా. ఇంకా తెల్లారలేదు, అప్పుడే ఈ కొండగుహాకాడెవడో "వినర వేమ" అంటున్నాడు.

రెండో వేగు—ఎవరయ్యా మీరు? ఈ కొండగుహలో ఏం చేస్తున్నారు?

శిష్యుడు—ఇది శ్రీ వేమనయోగి మాయమైనచోటు. వారు ఈ గుహలోపలికి వెళ్ళి తిరిగి రాలేదు. అందుకని మేం ఇక్కడ మఠం ఏర్పాటుచేసుకొని వుంటున్నాం. మేరు వేమనయోగివద్ద ఉపదేశం పొందిన శిష్యులు.

ఒకటో వేగు—ఏం ఉపదేశం?

శిష్యు—తత్వం.

ఒకటో వేగు—అంటే?

శిష్యు—అదే! నువ్వు అదే నన్నమాట. నేనూ అదే నన్నమాట.

ఒకటో వేగు—నువ్వేమిటి? నేనేమిటి? అదేమిటి? ఇక్కడాడ దెవరూ లేదే?

శిష్యు—ఆడది కాదయ్యా. అది ఎవరికీ అందనిది.

రెండో వేగు—ఆయన మాట్లాడ్డేం?

శిష్యు—వారు యోగులు. అనవసర ప్రసంగం చెయ్యరు. వేమనయోగిసందేశం శిష్యులికి బోధచేస్తారు.

ఒకటో వేగు—పొద్దున్నే చలేస్తోంటే గుడ్డాగిడ్డా లేకుండా అల్లా కూచున్నాడేం?

సన్యాసి—

తల్లి గర్భమందు తా బుట్టినప్పుడు
మొదలు బట్టలేదు తుదను లేదు
నడుమ బట్టగట్ట నగుబాటు గాదొకో
విశ్వదాభిరామ వినర వేమ.

శిష్యు—వారు దిగంబరస్వాములు.

ఒకటో వేగు—ఆయన ఏం చేస్తారు?

శిష్యు—ఇందాకా చెప్పలేదూ? వేమనయోగిమతం లోకంలో ప్రచారం చేస్తారు.

రెండో వేగు—ఇదో కొత్తమతమా?

శిష్యు—కొత్తదే, అనుసరిస్తే.

ఒకటో వేగు—అనుసరించడాని కేం చెయ్యాలి?

శిష్యు—కొన్ని చెయ్యాలి, కొన్ని చెయ్యకూడదు.

రెండో వేగు—చెయ్యవలసిన వేమిటి?

శిష్యు—గురువుని నమ్మాలి.

రెండో వేగు—ఎవ రా గురువు?

శిష్యు—వేమనయోగి.

ఒకటో వేగు—ఆయ నేడీ?

శిష్యు—ఈ గుహలోకి వెళ్ళివున్నారు.

ఒకటో వేగు—వెళ్లినట్టు నాకు గుర్తేమిటి?

శిష్యు—వెడుతోండగా మేరు చూశారు.

రెండో వేగు—మాకు నమ్మకం ఎల్లా?

శిష్యు—నమ్మకంలేని వారికి సుఖం తక్కువట. నమ్మకం లేకపోతే మతమే లేదు.

ఒకటో వేగు—ఆ నమ్మకానికి ఆధారం అక్కర్లేదూ?

శిష్యు—భక్తి ఉంటే సరి.

రెండో వేగు—ఎవరిమీద?

శిష్యు—ఈశ్వరుడి మీద.

ఒకటో వేగు—వుంటే?

శిష్యు—మంచిది.

రెండో వేగు—ఎవరికి?

శిష్యు—అందరికీనూ. లోకానికి.

రెండో వేగు—లోకంమంచి నా కెందుకయ్యా?

శిష్యు—నువ్వే లోకంగనక. నీలోనే ఈశ్వరు డున్నాడు గనక.

రెండో వేగు—నాలో ఈశ్వరుడుంటే నాకు కనబడడేం?

సన్యాసి—

"నిన్ను జూచెనేని తన్ను తా మరచును
తన్ను జూచెనేని నిన్ను మరచు
నే విధమున జనుడు నెరు నిన్ను దన్నును
విశ్వదాభిరామ వినర వేమ!

ఒకటో వేగు—వా డెవడు, నీళ్లు తెస్తున్నాడు?

శిష్య—వాడు మాల దాసరి. ఈ ఆశ్రమంలో వుంటాడు.

రెండో వేగు—మాలాళ్లూ, మాదిగాళ్లూకూడా ఈ మతంలో చేరొచ్చునా?

సన్యాసి—

"మాలవాని నేల మహిమీద నిందింప
నొడల రక్తమాంస మొకటిగాదె
వానిలోన మెలగువాని కులం బేది
విశ్వదాభిరామ వినర వేమ."

రెండో వేగు—అల్లా అయితే బాపనోళ్లూ గీపనోళ్లూ ఈ మతంలో ఎల్లా చేర్తారు?

శిష్య—ఇందులో కులాలు లేవు.

సన్యాసి—

"ఉర్వివారి కెల్ల నొక్క కంచము బెట్టి
పొత్తుగుడిపి కులము పొలియజేసి
తలను చేయిబెట్టి తెగనమ్మ జెప్పరా
విశ్వదాభిరామ వినర వేమ."

రెండో వేగు—ఇన్ని పద్యాలు ఇంత చక్కగా చెప్పాడు, వేమన కవీశ్వరుడా, యోగీశ్వరుడా?

శిష్య—జ్ఞాన ప్రచారానికి కవిత్వం ప్రయోగించిన యోగీశ్వరుడు.

రెండో వేగు—ఈయనకి గురు వెవ్వరు?

శిష్య—లంబికాశివయోగి.

రెండో వేగు—అంటే?

శిష్య—అదో పేరు. లంబికా యోగం అంటే నాలుక ముక్కులో ప్రవేశపెట్టడం.

ఒకటో వేగు—పశువుల్లా అదేమిటయ్యా?

శిష్య—పశువులు పైనించి ప్రవేశపెడతాయి. లంబికా యోగులు లోపల్నించే నాలుక నాసికారంధ్రంలో ప్రవేశపెడతారు.

ఒకటో వేగు—పెడితే?

శిష్య—అది హఠయోగంలో వో భాగం. నాలుక శిరోరంధ్రంలో ప్రవేశపెడితే భ్రూమధ్యమందు రొమ్ముప్రక్క చంద్రస్థానం వుంటుంది. ఆ చంద్రస్థానం నాలుకకి అంటితే వోఅగ్ని పుడుతుంది. ఆ వేడితో అక్కడవుండే అమృతం కరిగి స్రవిస్తుంది. అది తాగితే యోగికి రోగం, రొష్టూ వుండవు.

రెండో వేగు—అది చేసే దెల్లా?

శిష్య—అదే సాధన.

ఒకటో వేగు—ఇది అందరూ చెయ్యగలరా?

శిష్య—సుశ్రూషవల్ల చెయ్యొచ్చును. పూర్వపుణ్య పరిపాకం వల్లకూడా సాధనలేకుండా సిద్ధి లభించవొచ్చు. అనేకరకాల సాధన లుంటాయి. ఇవన్నీ ముక్తికి మార్గాలు. ఎవరిమార్గంలో వారు ముక్తి సాధించవొచ్చును.

ఒకటో వేగు—ముక్తి అంటే?

సన్యాసి—

"బయలువ సర్వము బుట్టును
బయలందే లీనమగును బ్రహ్మంబనగా
బయలని మదిలో దెలిసిన
బయలందే ముక్తి బట్టబయలగు వేమా!

శిష్య—తన్ను తా నెరిగిన తానె బ్రహ్మంబు.

ఒకటో వేగు—ఎరగలేకపోతే?

శిష్య—సంసారంలో కర్మయోగిగా వుండడం మంచిది. దానికి వేమనయోగి ఏడు నియమాలు చెప్పాడు.

రెండో వేగు—అవి ఏమిటి?

శిష్య—ఇందాకా వొకటి చెప్పాను. ఈశ్వరుణ్ణి ఆరాధించాలని. అది చెయ్యవలసినపని. చెయ్యరానివి కూడా వున్నాయి.

రెండో వేగు—ఏమిటి!

శిష్య—దొంగతనం; హింస; కోపగించుకోడం; ఇత్యాదులు.

రెండో వేగు—అటువంటివాళ్లు వుంటారంటావా!

సన్యాసి—

భూమిలోన పుణ్యపురుషులు లేకున్న
జగము లేల నిల్చు పోగులుగాక
అంత తరుచు దొరక రాడనాడనుగాని
విశ్వదాభిరామ వినర వేమ.



మీరు భీమా చెయ్యకపోయినా, తక్కువగా చేసినా

బొంబే లైఫ్ అష్యురెన్సు కంపెనీ లిమిటెడ్.

లో ఒకపట్టా ఇప్పుడే తీసికొనండి.

ఎందువల్లంటే

1. జీవిత భీమాపట్టా మీ వృద్ధాప్యానికీ, మీరు ప్రేమించే మీ దగ్గిరవారికీ రక్షణ యిస్తుంది.
2. మీరీరోజు భీమా చెయ్యదగిఉంటే రేపు భీమాచెయ్యడగి ఉండకపోవచ్చు.
3. ఆరోగ్యానికి పూచీలేదు గాని మృత్యువు ఎవరినీ విడిచిపుచ్చదు.
4. మరణంగాని, ముసలితనంగాని తధ్యం.
5. జీవిత భీమా మృత్యువువలన వచ్చేచేటు మాన్పటమే గాక, ఆ అరిష్టాన్ని వాయిదావేస్తుంది.

కాబట్టి నేడే భీమాచెయ్యటం మీకు ప్రయోజనకరం.

1946 లో కొత్తవ్యాపారం రు. 3,28,20,200 లు

ఇతర వివరములకు క్రిందివారికి వ్రాయగోరెదము :

మెస్సర్సు: కొచికర్ బ్రదర్సు, లిమిటెడ్.

స్వదేశీ సంస్థానములతో సహా దక్షిణఇండియాకు చీఫ్ ఏజంట్లు :

పోస్టుబాక్సు 337, మద్రాసు 2 30, హాంటర్‌రోడ్డు.

లేదా

ఈ క్రింది ఆఫీసులు :— మంగుళూరు, ఉడిపి, కాలికట్, త్రివేంద్రం, బెంగుళూరు, బొంబాయి, మధుర.

క్రొత్త సంవత్సరమున మా కానుక

"సుస్సీస్"

స్త్రీలపాలిటి కల్పవృక్షము

పురుషులచే కొనియాడబడే వంటకములు చేయవలసినయెడల

"సుస్సీస్"

సాంబారు పొడి
చారు పొడి
అన్నంలోని పొడిసే

ఎల్లప్పుడు వాడవలయును.

ప్రతియింట వుండవలసిన వస్తువులు **'సుస్సీస్'** ప్రతిపూట భోజనములోనికి కావలసినవి

అన్నిచోట్లా దొరకును.

డీలర్సు:—


బెజవాడ	స్వామి ఎంపోరియం, గాంధీనగరం.
వైజాగ్, గంజాంజిల్లాలకు	వీనస్ కంపెనీ, వైజాగ్.
చిత్తూరు, కడప, ఉ. ఆర్కాడు జిల్లాలకు	నేషనల్ ట్రేడింగు ఏజన్సీస్, తిరుపతి.
శేలం, కోయంబత్తూరు, తంజావూరు జిల్లాలకు	ఇంపీరియల్ ట్రేడింగు కంపెనీ, శేలం.
బొంబాయి	దునియా ట్రేడర్సు P. B. No. 6644, బొంబాయి 19.
రంగూను	A. M. మెహతా, స్లవర్ స్ట్రీటు, రంగూను.

వివరములకు:— మిగత జిల్లాలకు ఏజంట్లుకావలెను.

సుస్సీస్ మ్యానుఫాక్చరింగు కంపెనీ, గాంధీనగరం, బెజవాడ.

పారిశ్రామికులకు మంచి తరుణము

మిల్లులు నూతనపద్ధతులతో నిర్మించి సాధ్యమైనంత తక్కువ కూలీ ఖర్చులో ఎక్కువ లాభములు పొందుటకు మా వైజ్ఞానిక నిపుణులసలహా మీకు మిక్కిలి సహాయపడును. అన్నిరకముల ఆయిలు ఎక్స్‌పెల్లర్లు, వాటి స్పేరుపార్ట్సు, ఆయిలు యింజన్లు, స్టీము యింజన్లు, స్పేరుబాయిలర్లు, వర్కుషాపు మెషినరీ, పంపింగు సెట్సు, డికార్టికేటర్సు, ఫిల్టర్ ప్రెస్సులు, సీడుక్రషర్సు వగైరా మిల్లుస్టోర్సు సామానులు సప్లయిచేయగలము.



ఎట్టి ఇండస్ట్రీస్ సంస్థాపకులైననూ మా వైజ్ఞానిక నిపుణుల సలహా పొందినచో అధిక లాభములు పొందగలరు.

ఇప్పటికే దక్షిణభారతదేశమున అనేకమాడర్న్ ఆయిల్ మిల్సులో మా "ఈగిల్ బ్రాండ్" ఆయిల్ ఎక్స్‌పెల్లర్లు తృప్తికరంగా పనిచేయుచున్నవి. ఇవి లోగడషాఫ్టు ఎలైన్‌మెంట్ సెల్ఫురింగ్ ఆయిల్ బేరింగులుగాక బాల్ బేరింగులుకూడ ఫిటింగ్ చేయబడిన ఇంప్రూవ్డ్ డిజైన్లు కలవి.

ఫ్రిస్కో ఇంజనీయర్సు & ట్రేడర్సు, బెజవాడ.

టెలిగ్రాం "Frisco" BEZWADA.

[illegible]

[కథానిక]

— శ్రీ శ్రీనివాసశిరోమణి —

ఆ జయిలులో కోటయ్యను మించిన హోదా కలవాడు మరొకడు లేడు. అతడు కాన్విక్టు వార్డరు. జయిలుకు వచ్చి పథ్నాలుగు సంవత్సరాలు అయింది అని విన్నాను. తెల్లవారుఝామున నక్షత్రాలు అస్తమించక పూర్వమే నిద్రలేచేవాడు. దిక్కులు పిక్కటిల్లిపోయేట్టుగా "ఏ తీరున నను దయజూచెదవో ఇనవంశోత్తమ రామా!" అనే కీర్తనపాడడము మొదలుపెట్టేవాడు. ఆ కీర్తన పాడడము అయిపోగానే స్నానము చేసి పట్టెవర్ధనాలు తీర్చిదిద్ది పెట్టుకొనేవాడు. ఉదయభానునికి ఎదురుగుండా నిలుచుని చేతులెత్తి నమస్కరించి ఏదో లోపలలోపల గొణిగేవాడు. ఆపాళంగా ఇక లాఠీ తీసుకొని తన వార్డుఖయిదీలమీద పెత్తనము చేయడానికీ, ఆయా పనులు పురమాయించడానికీ కోటయ్య తయారుఅయ్యేవాడు. ఖయిదీలందరికీ యమునివాడికి మల్లే తోచేవాడు. వయస్సు బాగా ముదిరింది. కాని దేహము సడలలేదు. అతను మాదిగకులమువాడని అందరికీ తెలుసును. కాని అందరూ అతనిని గౌరవించి 'కోటయ్యగారూ' అని సంబోధించేవారు.

నేను జయిలుకు వెళ్లినరోజునే అతనిని చూచినాను. వారము రోజులు అయ్యేసరికి కోటయ్యతో సావాసము చేయవలె ననే బుద్ధి పుట్టింది. మాకు ఇద్దరికీ బాగా సావాసము అయింది. చీకటిపడగానే లాంతరుతో తయారు అయ్యేవాడు. అతని కోర్కెమీదనే రామాయణము చదివి అర్థము చెపుతూఉండేవాడిని: అతను అత్యంత శ్రద్ధతో వింటూఉండేవాడు. మధ్యమధ్య ఉత్సాహమురాగానే రామదాసు కీర్తనలు పాడుతూఉండేవాడు.

పదిమాసాల సావాసము అయిపోయింది. నా రోజులు అయిపోతున్నవి. ఈ కోటయ్య ఎందుకు-ఏమి నేరము చేసి వచ్చినాడో తెలుసుకోవలె ననే జిజ్ఞాస నాకు చాలా రోజుల కిందటనే కలిగింది. అడుగుదామని చాలాసార్లు అనుకొన్నాను. కాని అడగడానికి కోటయ్య యీ పదిమాసాలలోనూ అవకాశము ఇవ్వలేదు. ఆ రోజున రామాయణము ఇంకా అప్పటికి మొదలుపెట్టలేదు. కోటయ్య రాగానే "ఏం కోటయ్యా, రామాయణము పూర్తిచేయకుండానే జయిలునుంచి నేను వెళ్లిపోతానేమో" అన్నాను. "అవును, ఇంకా మీరు ఉండేది పదిహేను రోజులు—నాకు రామాయణము పూర్తిగా వినే అదృష్టము లేదు"—అంటూ ఒక పెద్ద నిట్టూర్పు విడిచి గోడకు చేరగిలబడ్డాడు కోటయ్య. అతని ముఖము వివర్ణము అయింది. కండ్ల వెంట జలజల కన్నీటి బిందువులు రాలుతూఉన్నవి. పెదవులు తన బడుతూ ఉన్నవి. అతనిలో అంత తత్తరపాటు కిందటి పదిమాసాలలో నాకు ఎన్నడూ గోచరించలేదు. నేనూ కంపించిపోయినాను. "ఏమి కోటయ్యా—ఎందుకు అంత విచారము?" అని ప్రశ్నించినాను."

గద్గదస్వరము తో "నాకూ రోజులు సమీపిస్తున్నవి. ఒక సంవత్సరములో నన్నూ విడుదల చేస్తారు" అన్నాడు.

"అట్లా అయితే సంతోషపడడానికి బదులు దుఃఖపడతావేమిటి?" అన్నాను.

"దుఃఖము ఏమీ లేదు—బయటికి పోవడము అంటే ఏం చేయడము అనే చిక్కు నన్ను మహా బాధపెడుతూ ఉంటుంది— అందుకే సూపరింటును సంవత్సరము అయినతరువాత ఏదయినా యీ జయిల్లోనే ఉద్యోగం చెప్పించమని అడిగాను. అనుకూలముగా జవాబు చెప్పలేదు."

"అదేమిటి, ఎంతోకాలము ఈ జయిలులో ఉన్నావు—ఇక నయినా నీ పెండ్లాముబిడ్డలను పోయి చూడవలెనని నీకు లేదా"

"నేను ఒంటరివాణ్ణి. నాకు ఎవరూ లేరు."

"అయితే మరీ హాయి."

ఈ మాటకు కోటయ్య పెద్దపెట్టున నవ్వినాడుకాని బ్రహ్మాండము అయిన విచారము అతని ముఖములో కనిపించింది.

"అయితే నీ స్వగ్రామము పోవడము నీకు ఇష్టము లేదన్న మాట."

"అవును" అన్నాడు. అతనిముఖము వికసించింది.

"అయితే మావూరు రా, నా దగ్గిరఉందువు గానీ—"

"రోజా రామాయణము చదువుతారా?"

"ఓ."

"అయితే సంతోషముగావస్తాను. కాని—"

"కోటయ్యా, నీవు పెండ్లిచేసుకోలేదా?"—

"అదంతా అడగనూవద్దు, నేను చెప్పనూవద్దు."

"ఫరవా లేదు. నేను నీకంటే చిన్నవాణ్ణి అయినా చెప్తున్నాను, విను. చాలావిషయాలు దిగమింగినకొద్దీ బాధ ఎక్కువ అవుతుంది. ఆ బాధ మానసికముగానూ, దైహికముగానూ మనిషిని కుంగదీస్తుంది. అందువల్ల ఆ బాధ ఏదో మరిఒకరితో - అందులో ఆత్మీయులతో చెప్పుకొంటే తీరిపోతుంది. పయిగా కర్తవ్యము బోధపడుతుంది."

"ఏమో—నిజమే నేమో. కాని చెప్పను. చెప్పలేను."

"ఎందుకు అంతభయము? నాతో చెప్పడానికి సంకోచము ఎందుకు?"

"ఏం చెప్పమన్నావు పంతులూ?"

"నీవు అసలు ఏం నేరము చేశావు?"

కోటయ్య తల పంకించి "ఖూనీ చేశాను."

"అది మహాపరాధముగా తోచి బాధపడుతున్నావా?"

"నాకు తెలియదు. నేను చేసింది తప్పుకాదేమోను అనీ అనిపిస్తూ ఉంటుంది."

"అయితే ఏదయినా అన్యాయము భరించలేక ఖూనీ చేశావా?"

"పంతులుగారూ, ఎందుకు ఇన్ని ప్రశ్నలు వేయడము! తప్పో ఒప్పో—ధర్మమో అధర్మమో—పుణ్యమో పాపమో చెప్పివేస్తాను. ఇంతకాలమూ ఎవరికీ చెప్పలేదు. నా సంగతి అంతా వినండి. ఆ తరువాత అందుకు పరిహారము ఏమిటో సెలవు ఇవ్వండి." అంటూ కోటయ్య నాముఖమువంక తేరిపారచూచినాడు.

అతని కథ వినడానికి నేను ఆసనశుద్ధిగా కూర్చున్నాను. 'వినండి' అన్నట్టు చూచి కోటయ్య ఈ విధముగా మొదలుపెట్టినాడు.

* * * *

ఆఊరికి వారు కరణాలు. మేము పెద్దమాదిగవాండ్లము. చెరువుకింద అయిదుయకరాల మాగిలిభూమి-మరి అయిదుయకరాల జరీబు భూమి-ఇంకొక అయిదుయకరాల మెట్టభూమి-ఒక మూడుయకరాల పసువులబీడు వారికి ఉండేది. రెండుకాండ్ల వ్యవసాయము. నేను పెద్దకమతగాడిని. నాకింద నల్గురు జీతగాండ్లు కాపులూ రెడ్లూ ఉండేవాండ్లు. కరణముగారి కమతము నాకు ముందు మావంశమువారు ఎన్ని తరాలకిందట ఆరంభించినారో నాకు తెలియదు. పధ్నాలుగు పురుషాంతరాలబట్టీ వారు ఆ గ్రామానికి కరణీకము చేస్తూఉన్నట్టూ, మేమున్నూ అన్నితరాలబట్టీ వారి కమతము చేస్తూఉన్నట్టూ మాకరణముగారే చెప్పినారు. మా తాత-మా నాయనా వారి కమతము చేయడము మాత్రము నేను ఎరుగుదును. మా కరణముగారు కరణీకానికి రావడమున్నూ, నేను కమతములో చేరడమున్నూ కొంచెము ఇంచుమించు ఒకేసారి జరిగింది.

నాకు బాగా వయస్సుముదిరేవరకూ నేను పెండ్లిచేసుకోలేదు. మా కరణముగారే నన్ను పెండ్లిచేసుకోమని ప్రోత్సాహపరచి మాకులమువాండ్లుఅందరితోనూ చెప్పి రెండుసంవత్సరాలు మాకులములో ఆయా సంబంధాలు స్వయముగా విచారించి, నాకు ఈడూ జోడూ అయినదాన్ని చూచి స్వయముగా నడుముకట్టుకొని నిలుచుని నా పెండ్లి చేయించారు.

మా కరణముగారు నాకంటే అయిదారుసంవత్సరాలు చిన్నవారు. వయస్సుకు చిన్నవారేకాని వారు చాలా సమర్థులు, బుద్ధిమంతులు. ఈతప్పు మాకరణముగారు చేసినారు అనడానికి వీలులేదు. ఆయనఇల్లాలు ఆయనకంటే మరీ మంచితనము. ఆ మహాయిల్లాలు చేతితో కానీ, నోటితో కానీ 'లేదు' అని ఎరగదు.

నా పెండ్లామున్నూ మంచిదే. నన్ను ఎన్నడూ దేనికీ కష్టపెట్టిఎరగదు. అసలు దానిపోలే మంచిది. మా కరణంగారికి తెగ పిల్లలు పుట్టినారు. ప్రతిరెండుసంవత్సరాలకూ పిల్లవాడో పిల్లో వారి ఇంట్లో పుట్టుకొనిరావలసిందే. నాకు పిల్లలు లేరనే విచారము కలగలేదు. కాని పదిసంవత్సరాలు అయ్యేసరికి మా ముసలిదానికి పిల్లలు లేరే అని విచారము విపరీతముగా బాధపెట్టింది. చెట్లకూ పుట్టలకూ మొక్కుతూఉండేది. నా పెండ్లానికి కడుపు వచ్చింది. నెలలునిండేసరికి దాని ఒంట్లో ఏకో రుగ్మత ఏర్పడ్డది. మాకరణముగారే బలవంతముచేసి అది నీళ్లాడడానికి బస్తీలో ఆసుపత్రికి పంపించినారు. నాపెండ్లామునీళ్లాడింది. ఆడపిల్ల పుట్టింది. కాని ఎన్ని మందులు వేసినా లాభము లేకపోయింది. అది అయిదోరోజున చచ్చిపోయింది. పసికందు మాత్రము మిగిలింది. ఆ పసిబిడ్డను తీసుకొనివచ్చి ఎట్లా పెంచినానో భగవంతుడికి తెలియవలెను. పెంచినా, దానికి అయిదారు ఏండ్లు వచ్చేవరకూ నాకు మహాఅవస్థ అయింది. నన్ను అనేకసార్లు మళ్ళీ పెండ్లిచేసుకోమని మా కరణముగారు చెప్పినారు. కాని నాకు మరొక ఆడదానిమీద మనసు పోలేదు. నేను పెండ్లిచేసుకోలేదు. ఆ ఆడపిల్లను పెట్టుకొనే కాలము గడుపుతూ వచ్చాను.

అది చిచ్చింత్రీలాంటి పిల్ల. దానికి మా కరణంగారే జోతి అని పేరు పెట్టారు. అందరూ దాని తెలివితేటలకూ, దాని చాకచక్యానికీ మెచ్చుకొంటూ ఉండేవారు. తెలివితేటలే కాకుండా అది అందమయిన పిల్ల. ఉక్కుముక్కకు మల్లే ఉండేది. ఎంత పని అయినా ఇట్టే చేసివేసేది. దానికి ఏడోఏడు వచ్చేసరికే నాకు ఉడకవేసి పెట్ట సాగించింది. నేను పొలముపనిలో ఉంటే నాతోపాటు అది నాకు ఏదోసాయలా చేస్తూ ఉండేది.

అయిదుయకరాల మాగిలిపొలములోనూ నాతో నిమిత్తము లేకుండా పదిమంది ఆడవాళ్ళకూ తీసుకొని రెండోరోజు చీకటి పడేసరికి వరినాటు అంతా అదే పూర్తిచేయించేది. నేను మెట్టచేలో జడ్డిగముతోలుతూ ఉంటే అది ఒడికట్టుకొని గింజలు పిడతలో బీరుపోకుండా వదిలేది. సాయంత్రానికి యకరమూ ఎదపెట్టడము పూర్తి చేసేవాండ్లము.

మాజోతి మంచెమీద నిలుచుని వడిసాల తీసుకొని గిరగిర తిప్పిందో-మహామొనగాడి దొంగపిట్టలు కూడా మూడుఆమడ పారిపోయేవి. దాని వడిసాలరాయి తగిలితే గింగిరాలు తిరుగుతూ పిట్ట నేలమీదపడి తన్నుకొని చావవలసిందే. మరి తిరుగు ఉండదు. దాని గురి అటువంటిది. ఊరుంపాలేల రైతులు మాచేను కాపలాకు రమ్మంటే మాచేను కాపలాకు రమ్మని బతిమలాడేవారు. వరహా యిస్తామనీ, మొహరీ ఇస్తామనీ ఆశపెట్టేవారు. నేను కానీ, నాజోతికానీ డబ్బు చూసుకోలేదు. మేము డబ్బుఅవసరము ఎరగము. అన్నీ కరణముగారే సార్లాచేసేవారు. ఇది లేదు అనేది మేము ఎరగము. మా కులము వేరు కాని వారి ఇంట్లో పండగ అయితే మాకూ పండగే. వారి అంతస్తుకు తగిన గుడ్డలు వారిఇంటికి వస్తే మా అంతస్తుకు తగిన గుడ్డలు మా ఒంటిమీదికి వచ్చేవి. వారు పెరుగుతాగితే మేమూ పెరుగు తాగినాము. గారెలు, బూరెలు, అరిసెలు, పరమాన్నము వారి యింట్లో ఆడవారుకష్టపడి వండేవారు. మాకు ఆ కష్టము ఏమీ లేకుండా చక్కగా రుచిచూసి రుచులు చెప్పేవాండ్లము.

ఇట్లా చూస్తూ ఉండగానే జోతికి పదిహేనుసంవత్సరాలు వచ్చినవి. చీరె గీరె కట్టుకొని గుమ్మటముకు మల్లే నాతోపాటు చేలో పాటు చేస్తూఉండేది. సరిగా వేళకుపోయి ఇంత ఉడకవేసి ఇట్లా చూసేసరికి దుత్త నెత్తిన ఎత్తుకొనివచ్చేది. ఇద్దరమూ ఒక గిన్నెలోనే కలుపుకొని తినేవాండ్లము. దానికి ఇంత వయస్సు వచ్చింది అని కానీ, దానిని మరిఒక అయ్య చేతిలో పెట్టవలెనని కానీ నాకు తోచనేలేదు. అసలు ఆఊహే రాలేదు.

మా కరణంగారే ఒకనాడు "ఒరే కోటా—జోతికి పెండ్లి ఎప్పుడు చేస్తావురా" అన్నారు. అంతటితో నిద్రమెలకువ వచ్చినట్టు అయింది. జోతి నాదగ్గర ఉండకుండా మరి ఒకడికి యిల్లాలుగా పోతుందని తోచేసరికి నాకు ఆశ్చర్యమూ విచారమూ రెండూ ఒక్కసారి పెనవేసుకొన్నవి. ఇందుకు కాబోలు తలిదండ్రులు మొగ పిల్లలకోసము తాపత్రయపడేది అనుకొన్నాను. వెంటనే "దొరా, జోతిపెండ్లికి తొందరేమి వచ్చింది? చైత్రమాసములో చిన్నదొర పెండ్లిచేయించండి" అన్నాను. మాదొర నావంక ఎగాదిగా పరకాయించి చూచి "నిజమే" అన్నారు. ఆయన ఎందుకు అట్లాఅన్నారో నాకు అప్పుడుసరీగా తెలియలేదు.

చిన్నదొర అంటే మాకరణముగారి జ్యేష్ఠపుత్రుడు. మద్రాసులో మా కరణముగారి పెద్దఅల్లుడిగారి ఇంట్లో ఉండి ఇంగ్లీషు చదువుకొన్నాడు. పద్దెనిమిదో ఏడు వచ్చేసరికి మాపెద్ద దొర చిన్నదొరను చదువుమానివేయమన్నాడు. పెద్దపెద్ద చదువులు చదివితే కరణీకముచేయడని మా పెద్దదొర అభిప్రాయము. అందుకోసము చదువు మానుకొని రావలసింది అన్నాడు. చదువు మానడము చిన్నదొరకు ఇష్టములేదు. అయితే పెద్దదొర చండశాసనుడు. భయపడి చదువు మానుకొని చిన్నదొర ఇంటికిచేరినాడు. ఇంట్లో కూర్చుంటే మా చిన్నదొరకు తోచేదికాదు కాబోలు, తెల్లవారుతూనే పొలము వచ్చేవాడు. కొద్దిరోజులు అయ్యేసరికి పొలముపాటు స్వయముగా చిన్నదొర అజమాయిషీచేయడము మొదలుపెట్టినాడు. అంతటితో నాబాధ్యత చాలావరకూ తప్పింది. యజమానే స్వయముగా చూచుకొంటూఉన్నాడు కాబట్టి నాపూచీ చాలావరకూ తగ్గిపోయినట్టే అయింది. చిన్నదొర వ్యవసాయములోకి దిగేవరకున్నూ నేను పగటివేళ నిద్రపోయి ఎరగను. అటువంటిది మధ్యాహ్నము అప్పుడు కాస్త కూరుకుతీయడము మొదలుపెట్టినాను. అంతేకాదు. నా జవాబుదారీ అనేది లేకపోయేసరికి సందెవేళ అయ్యేసరికి నాకు నిద్రవస్తూఉండేది. హాయిగా సొమ్మసిల్లి నిద్రపోతూఉండేవాణ్ణి.

మెట్టపంట దైవాధీనపు పంట. దైవము అనుకూలిస్తే పండుతుంది, లేకపోతే ఎండుతుంది. మాగాణిపంట చెరువులో నీరు సమృద్ధిగా ఉంటే పండుతుంది. అయితే మా చెరువు ద్వాదశవర్ష క్షామము వచ్చినా వట్టిపోదు. అందువల్ల ఏపంట పండినా ఎండినా మాకు తిండిగింజలు ఉండవనే బాధకానీ, మా పశువులకు పశుగ్రాసము ఉండదనే బాధకానీ లేదు. ఇక జరీబుపయిర్లు మనుష్యప్రయోజకత్వాన్ని పట్టి పండుతూ ఎండుతూ ఉంటవి. అది అంతా ఎద్దుమెడమీది వ్యవసాయము. ఒకఎద్దులు బావిలోనీళ్ళు తోడడముతోటే సరిపోదు. దానికి మొగవాడూ, ఆడదీకూడా తంటాలుపడవలెను. నేను మోటతోలేవాణ్ణి—నేను మోటతోలినంతసేపూ నాకూతురు మళ్ళకు నీళ్ళుకట్టేది. ఈజరీబు సాగుమీద మా చిన్నదొరకు మోజుపుట్టింది. "మోటకాదు. ఇంజనూ, పంపూ పెడుతాను. ఏటికి ఏడాదీ జరీబు సాగించవలసిందే" నన్నాడు. బావికి ఇంజనూ పంపూ పెట్టినారు. ఇంజను ఆడించడము చిన్నదొర నాకూతురు జోతికి చూపించినాడు. నా జోతే ఇంజన్, ఆడించేది. కొనలోనుంచి వచ్చినట్టు ఏకధారగా

పంపు నీళ్ళు కుమ్మరిస్తూఉండేది. పుట్లకు పుట్లు ఉల్లిపాయలూ, బంగాళదుంపలు బండ్లు పోగాకూ, జల్లలకు జల్లలు వంకాయలూ తెల్లవారే సరికి బస్తీకి మా జటీబులోనుంచి వెళుతూఉండేవి. సాయంత్రము అయ్యేసరికి మాదొరఇంట్లో టంకశాలమాదిరిగా రూపాయలు మోగుతూ ఉండేవి. అంతా మాడుపూలూ ఆరుకాయలూ మాదిరిగా సాగిపోతూఉంది.

జోతికి అన్నము ఇమడడము లేదు. తిన్నదంతా కక్కుకొనేది. ఎప్పుడూ తలనొప్పి అని పడుకొనేది. లేవలేక పోయేది. మాపాటిలో వైద్యుడికి చూపించినాను. వాడేదో అన్నాడు. కాని నాకు నచ్చలేదు. ఏవేవో మందులు తింటూనే ఉండేది జోతి. "నేను ఈబాధ పడలేను. చచ్చిపోతాను" అని జోతి నాతో అనటము మొదలు పెట్టింది. రాత్రింబవళ్లూ కండ్లు మిటకరించుకొని పడుకొని చూస్తూ ఏదో తదేకముగా ఆలోచిస్తూఉండేది. మాట్లాడించినా మాట్లాడేది కాదు. ఆ రోగము ఏమిటో తెలియలేదు. ఏదయినా గట్టివైద్యము చేయించవలసిందని పెద్దదొరతో చెప్పినాను. బస్తీనుంచి డాక్టరు దొరసానిని పెద్దదొర పిలిపించినాడు. డాక్టరు దొరసాని వచ్చి చూచింది. నన్ను బయటికి పొమ్మని పరీక్ష చేసింది. "నీ కూతురికేమీ భయము లేదు. హాయిగా ఉంటుంది" అని నాతో చెప్పి దానితో ఏదో చాలాసేపు మాట్లాడి వెళ్లిపోయింది. సంగతేమిటో అంతుపట్టలేదు.

చీకటిపడేవరకూ నిబ్బరముగా ఊరుకొన్నాను. పెద్ద దొరతో మాట్లాడి తెలుసుకొందామనుకొంటూ ఉండగా ఆయనే వచ్చినాడు. మేము ఇద్దరమే ఉన్నాము. మరి ఎవ్వరున్నూ లేరు. "ఏమిరా కోటా-జోతి తప్పుచేసింది. దానికి మూడో నెల కడుపు అని దొరసాని చెప్పింది" అన్నాడు పెద్దదొర. నేను నమ్మలేక పోయినాను. ఉత్తర క్షణములో నాగుండెలు పగిలిపోయే దుఃఖము వచ్చింది. మనస్సును చిక్కబట్టలేకపోయినాను. "దొరా, ఏమి చేయమంటావు" అని ప్రశ్నించాను.

"కోటా-తొందరపడకు. దాని ముందుగతి ఏమిటో జాగ్రత్తగా ఆలోచింతాము. ఇప్పుడప్పుడే దాన్ని ఏమీ అనకు" అని దొర సలహా చెప్పినాడు. కాని నాకు కాలు నిలవలేదు. నేనిక ఆయనతో మాట్లాడలేక పోయినాను. ఆయన ఇంకా ఏమయినా చెప్పినాడేమో నాకు వినిపించలేదు. హుటాహుటీ ఇంటికి వచ్చాను. జోతి అన్నము వండుతూ ఉంది. నన్ను చూచి నివ్వెరపోతూ నిలుచుంది. నేను బీటిలోనుంచి వచ్చినాను. నా బుజాన గొడ్డలి ఉంది. ఆ గొడ్డలితో జోతిని తెగవేయవలెననిపించింది. చెయ్యి అప్రయత్నముగా గొడ్డలిపిడి పట్టుకొంటున్నది. జోతి వలవల ఏడ్చింది. ఆ ఏడుపుకు నా పూనిక మారిపోయింది.

"నీరోగం ఏమిటో తెలిసింది"

జోతి మాట్లాడకుండా తల వంచుకొంది.

"ఇటువంటి భండాలపు పని చేస్తావనుకోలేదు."

జోతి మాట్లాడలేదు.

"నీవు మోసపోయినావా—నీవే మోసపుచ్చినావా ?"

జోతి మాట్లాడలేదు.

"ఇటువంటి పాడుపనికి నీవు ఎట్లా ఒప్పుకున్నావు?"

మాటలేదు.

"చెపుతావా-ఈగొడ్డలితో నీశిరస్సు పగలకొట్టమన్నావా?"

"నేను ఒప్పుకోలేదు-బలవంతాన అయిపోయింది."

"ఆ బలవంతము చేసినవాడెవడో చెప్పు"

"చిన్నదొర"

"ఆఁ ఆఁ" అన్నాను. నమ్మలేక పోయినాను. క్షణలేశము ఆలోచించినాను. "ధగడీ, నిజము చెపుతున్నావా" అని గర్జనము చేసినాను.

"నాయనా—నిజము చెప్పినాను. ఆయన గాబట్టి వదలించుకోలేక పోయినాను. మరొకడు అయినట్లయితే......" అని జోతి వలవల ఏడ్చింది. క్రిందపడి దొర్లడము మొదలు పెట్టింది. నాకు పిచ్చెత్తినట్టు అయిపోయింది. నేను చతికిలబడిపోయినాను. నా దేహమంతా తుకతుక ఉడికిపోతూఉంది. "ఛీఛీ - ఇక నీ చేతి అన్నము తినను" అంటూ ఆ గొడ్డలితో ఆ అన్నభాండము పగలగొట్టినాను. "నా కడుపు చెడబుట్టినావు. నీతల్లి దొడ్డది. నేను పరాయి ఆడుదాన్ని కన్నెత్తి చూడలేదు. నీవు కులనాశకపుముండవు పుట్టావు." నీవు-నీవు చచ్చిపోరాదూ" అన్నాను. నాకు ఏడుపు వచ్చింది. ఆపుకోలేక పోయినాను. పెద్దపెట్టున ఏడ్చినాను. ఆ తరువాత ఏమయిందో తెలియదు.

బారెడు పొద్దు ఎక్కింది. జీతగాడు వచ్చి కేకలు వేస్తే నిద్ర మెలుకువ వచ్చింది. లేచి చూచినాను. జోతి లేదు. యిల్లంతా బావురుమంటూ ఉంది. మనస్సు పరిపరి విధాల పోయింది. అట్లాగే లేచి పొలము పోయినాను. ఏ పనీ చేయ బుద్ధి పుట్టలేదు. జీతగాండ్లకు ఆయాపనులు పురమాయించి బీటిలోకి పోయి దూడలనూ, ఆవులనూ మేపడము మొదలుపెట్టాను. జోతి ఏమయిపోయింది అనే ఆలోచన పట్టుకొంది. మధ్యాహ్నము దొర యింటినుంచి అన్నము వచ్చింది. తినను అన్నాను. సాయంత్రము దొర వచ్చి అన్నము తినమన్నాడు. "ఇక అన్నము ఈ జన్మకు తినను" అన్నాను. దొర ఎంతో చెప్పాడు. నా చెవుల కాయన మాటలు ఎక్కలేదు. ఆరాత్రి గొడ్ల కొట్టములో పడుకొన్నాను. మరునాడు లేవ బుద్ధిపుట్టలేదు. అట్లాగే పడుకొన్నాను. రెండు రోజులూ ఉపవాసముతోనే ఉన్నాను. మూడోరోజు తెల్లవారుతూనే జీతగాడు వచ్చి "జోతి బావిలో తేలింది" అన్నాడు. పూరు మాట్లాడకుండా బయలుదేరినాను.

అంతకాలమూ నేను మోటతోలిన బావిదగ్గరకు పోయినాను. కోతిని బావిలోనుంచి బయటికి తీసినారు. చూచినాను. నా కాళ్లు నన్ను అక్కడ నిలవనీయలేదు. నా కండ్లు బైర్లు కమ్మినవి. పరుగెత్త బుద్ధిపుట్టింది. పరుగెత్తుకొని వస్తున్నాను. ఎదుట కంపతోడుగులకు గుచ్చిన రాగోలలు కనిపించినవి. నేను స్వయముగా చేయించిన రాగోల ఒకదాన్ని ఆ కంపతోడుగులోనుంచి బయటకు ఊడబెరికినాను. ఆ రాగోల బుజాన పెట్టుకొని నురుగులు కక్కుకొంటూ దొరఇంటిపై పుకు పరుగెత్తుతున్నాను. ఎదురుగుండా చిన్నదొర వస్తూఉన్నాడు. "వస్తూ ఉన్నావా—నీ కోసమే వస్తూ ఉన్నాను" అన్నానో లేదో నా బుజముమీదినుంచి రాగోల లేచింది. రెండు చేతులతోనూ చిన్నదొర నెత్తిన బాదినాను. పుర్రె దానిమ్మపండులాగా పగిలిపోయింది.

ఆ కళేబరాన్ని బుజానవేసుకొన్నాను. వేడివేడి నెత్తురుతో స్నానముచేస్తూ గ్రామ మునసబు ఇంటికి పోయినాను. "ఓ మునసబూ! ఈ బ్రాహ్మణుడు నాకూతురిని చెరిచాడు. నా కోపానికి అదిపోయి భావిలోపడి చచ్చింది. నేను బ్రాహ్మణ్ణి చంపాను. ఇక నీవు చేసే దేదో నీవు చేయి. నన్ను ఉరితీయించు బాబూ" అని ఆ కళేబరాన్ని అక్కడ పారవేశాను.

*   *   *   *

జడ్జీతో ఎన్నివిధాలో చెప్పుకొన్నాను. నేనే మంచివ్యక్తతతో చంపివేసినాననీ, నన్ను ఉరితీయించమనీ వేడుకొన్నాను. ఆ జడ్జీ నా మాట వినలేదు. నా కోర్కె మన్నించలేదు. తాత్కాలిక చిత్తభ్రమణమువల్ల ఖూనీ చేసినాడు అనీ, జీవితాంతముశిక్ష అనీ చెప్పినాడు.

ఇందువల్ల ఈ జయిలుకు వచ్చాను. ఇప్పుడు విడుదలచేస్తే ఏఊరు పోయేది—ఏమిచేసేది?"

"కోటయ్యా, మా ఊరు రా. నా దగ్గిరఉండువు గాని. నీవు ఏమీ చేయ నక్కరలేదు" అని నేను అన్నాను.

కోటయ్య కొంతసేపటికి నవ్వుతూ "పంతులూ, నీవు చాలా చదువుకొన్నావు. చెప్పు—నేను చేసింది ధర్మము అంటావా అధర్మము అంటావా?"

"ఓయి వెర్రివాడా—ఈ ప్రపంచములో సుఖదుఃఖాలూ, ధర్మాధర్మాలూ, పుణ్యపాపాలూ నులకతాడుకు మల్లే పెనవేసుకొని ఉన్నవనీ, ఇక్కడికి ఇది సుఖము ఇక్కడికి ఇది దుఃఖము అనీ, ఇంతవరకూ ధర్మము, ఇంతవరకూ అధర్మము అనీ విడదీయడానికి వీలు లేదని అన్నారోయ్ పెద్దలు."

"అట్లానా—బాగుంది" అంటూ కోటయ్య తూర్పుదిక్కుచూచి "అరే! తెల్లవారవస్తూఉంది. పొద్దు కండెలువిచ్చుతూ ఉంది"అంటూ "ఏ తీరున నను దయ జూచెదవో ఇనవంశోత్తమ రామా—నా తరమా భవసాగర మీదను" అంటూ దిక్కులు పిక్కటిల్లి పోయేట్లుగా పాడడము మొదలుపెట్టినాడు.



'సత్యకాముఁడు'

❀

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

౧

మున్నొకచోట నొక్క మునిముఖ్యుఁడు సంకరజాతిబిడ్డ తా
నున్నది పర్ణశాలగ మహోన్నతధోరణి యోగవిద్యలో
నెన్నికనెందె; నాతనికి నెక్కటి సందియ మొక్కఁడు క
ల్గె న్నిలువెల్లఁ గంపనము గీల్కొన డెందము కొందలంపడన్.

౨

ఆతని సత్యకాముఁ డని యందురు-వానిని దల్లిమాత్రమే
ప్రీతిగఁ జూచు; నాప్తులిఁక వేఱెవ రెక్కడ లేరు, వాని దే
జాతియొ లోకమే యెఱుఁగఁజాలదు: తల్లివినా పదార్థ మే
రీతిదొ యాకళింత కొక రేఖయు రాదు విషాదవృత్తమై.

౩

తల్లి మదీయ జన్మకథ తప్పక చెప్పకపోదు సంశయం
బెల్లను దీఱ-దాన నిజ మేదియొ తేలు నటంచు నాతఁ డ
ల్లల్లనఁ దల్లి దగ్గఱి యథార్థముగా వచియింపు మమ్మ నా
యుల్లములోన సందియము మాని తపించుచునుందు సర్వదా.

౪

నాజనకుం డెవండు! మఱి నా కుల మెయ్యది! యింతదాఁక నే
యోజను దాఁచియుంచితివి! యొప్పునె నీకిది, తప్పుగాదె! నీ
నైజము నాకుఁ దెల్పుమన నవ్వుచు నాయమ, యోరి కుఱ్ఱ, యీ
రోజున - ఈ విశేషమును రోయుట కేమికతంబు కల్గెరా!

౫

అన విని యాతఁ డిట్టులనె నమ్మ మునీశ్వరవర్గ మెంతయో
చనవున నన్నుఁ బిల్చి తమ సన్నిధి నున్న సతీర్థ్యు లెల్లఁ 'బ
క్కున' నొకవంక నవ్వ నిది కూడని ధోరణివోలె నీకులం
బును వచియించుమం చడిగె, భ్రాంతిగఁ దేలికనైతి వారిలో.

౬

బిడ్డా, యేమని పల్కుదాన, మదిలోఁ బ్రేమస్వరూపంబుగా
నడ్డంబైన పదార్థ మీవె యిఁక నా కన్యత్ర దిక్కేది యీ
గడ్డన్ లే దిది పూర్వజన్మ కృతమా కర్మంబె కాఁబోలు నా
బిడ్డన్ జూపిన దైవమే యుభయులన్ బ్రేమించి రక్షింపఁడా!

౭

జవ్వనమట్లు నన్ను విరసంబగు త్రోవకు నెట్టె ప్రేమలో
మవ్వము సూపి నన్నొక యమాయికచిత్తను జేసె, నిత్తఱిన్
గవ్వకుఁ గాక లోకము పకాపక నవ్వఁగఁ జీకుచింత చే
నివ్వసుధన్ వసించి తిఁక నెబ్బెతికం బయిపోయె జీవమే.

౮

నీ కుల మిట్టిదం చెటులు నీ కెఱిఁగింతును బాబు, పేరికిన్
నా కుల మగ్రజాతిదియె, న్యాయముగా ననుఁ జెట్టపట్టువాఁ
డెకడ లేఁడు, కంటి కొకయింపును మాత్రమె చూచి యేదియో
పోకడవోయి యుందనుక బుద్ధికి బుద్ధిని జెప్పనైతిఁగా.

౯

కంటికి నింపుగా నెవఁడు కన్పడునో యతఁడే ప్రియుండుగా
నింటికి వచ్చు - నాఁటి కతఁడే పతి; యట్టులు నాదు సౌఖ్య మే
మంటనొ మట్టినో కలిసె, మన్నన చేసెడి దిక్కు మ్రొక్కు నా
యింటను నేఁడు లే దెవరి నెంతును దండ్రిగ నీకుఁ బుత్త్రికా !!

౧౦

ఇది గుఱుతించి నీ జనకుఁ డెవ్వఁడో నీ కులమేదో లెన్నఁగా
మదికిని దెచ్చుకొ మ్మవల మానవసంఘములోఁ బరిస్థితిన్
బదిలముచేసికొ మ్మిపుడు బాధ్యత చూపెడివారు లేరు నీ
కిదియె మహోపదేశముగ నిత్తును గైకొనుమయ్య బాలకా!!

౧౧

వాఁ డిది చక్కఁగా విని వివర్ణముఖుండయి కొంపగోడు మా
టాడకపోయి గౌతముని యాశ్రమమందు వసింప నయ్యెడన్
గూడిన మౌనిబృంద మిది కూడని వృత్తిగఁ బల్కు రోఁతగాఁ
జూడఁగ నంత గౌతముఁడు జోక్యము గైకొని వారి కిట్లనెన్ ——

౧౨

ఇతనిది తప్పు లే దితరు లెవ్వరో చేసిన దుండగాలలో
నితనికి నెట్టి బాధ్యతయు నెన్నఁడు కానఁగరాదు, వీని సం
గతి మన కేమి సెబ్బరయుఁ గల్గదు - వీని ప్రవర్తనంబులో
వెతకిన దోస మన్న దొకవీసము లేదు; నిషేధ మేలొకో !!

౧౩

కులముల వంకతో నొకని గూల్చుట త్రొక్కుట పాడిగాదు, లో
కుల కది సాజమై నడచు కుత్సితభావము కాన మీరు మీ
పలుకులు మాని న్యాయ్యమగు పద్ధతినే పరికించి దాని స
త్ఫలముల నారగింపవలె బాలుని వీని ననుగ్రహింపరా !!

౧౪

అని యా బాలున కాశ్రయం బొసఁగి తద్వ్యామోహమం దున్న త
క్కిన మౌనీంద్రుల కెల్ల బుద్ధి సరిగాఁ గీల్కొల్పి నిత్యంబు వా
నిని యోగంబునఁ జేర్చి గౌతముఁడు తన్నిచత్వ మీరీతిఁ ద్రో
సి నిదానంబుగ బ్రహ్మవిద్య గఱపెన్ శ్రేయంబు చేకూర్చుచున్.

౧౫

ఈ భావం బిపు డెవ్వరేనిఁ దెలుపన్ హీనంబుగాఁ దోఁచి యే
దో భారం బది నెత్తికెత్తినటులే యూహించి లోకంబు సం
క్షోభంబైనటు లేడ్చిపోదు రయినన్ క్షుద్రాత్ములా వార లే
లా భావంబులు మార్చుకొందు రకటా ! లాభంబు లేకున్నచో.



అచలబోధలు

— శ్రీ కపిల వెంకటరావు —

"ఏమి జన్మము, ఏమి జీవనమూ
ఏమి జన్మము,ఏమి జీవన
మేమిశాశ్వత మేమి నా ప్రారబ్ధకర్మము
స్వామి నన్నిటు జేసి మరచెను" ॥ఏమి॥
(యడ్లరామదాసు హరికథ)

అని యిహజన్మమును నిరాశతో నిందించుచునో,

"ఈ జన్మ మిక దుర్లభమురా, ఓరి
సాజన్మసాకార సద్గురుని గనరా;
పంచాక్షరి మంత్రంబు పఠనజేయరన్న
పఠనచేసితె యముడు పారిపోనన్న" ॥ఈజన్మ॥
(కాలజ్ఞానతత్వములు)

అని తరణోపాయము నాశతో వందించుచునో బిచ్చగాండ్రు పాడు పాటలు తెలుగునాడు నాలుగుమూలల నిండ్లముందును, ఉత్సవములలోను, సంతలలోను, పడవలరేవులలోను, మోటార్ల కూడలుల లోను, ముఖ్యముగా రైలుబండ్లలోను వినబడుచుండును. వీనిలో నచలమార్గమును బోధించు కీర్తన లెక్కువ. గ్రామ్య మనబడు సామాన్యజన వ్యావహారికభాషలో నుండి, యివి సామాన్యులనే మిక్కిలి యాకర్షించును. అగ్రవర్ణములవారు నచలకీర్తనల నాదరించు వా రున్నారుగాని, తక్కిన వర్ణములవారికి వీనిపై చాల యాదరము. అచలమార్గబోధకములగు నిటువంటి తత్వములు తెలుగులలోవలెనే తమిళకన్నడ ప్రాంతములందును ప్రచారములో నున్నట్లు వినికిడి. ఆ పేరు గల మతమును తెలుగుదేశములో మొదట నెలకొల్పినవా రెవ్వరో తెలియదు. వేమన్నగారు నీ మతమును చాటినవాడే. ఆయనపేరున గూడ కొన్ని కీర్తన లున్నవి. అవి యాయన వ్రాసి నట్లుమాత్రము రూఢిగా తెలియదు. లభించినంతలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మముగారిచే మొట్టమొదట ప్రచారములోనికి వచ్చినట్లు కన బడగలదు. అట్టి తత్వములను చెప్పిన తెలుగువారందరు దాదాపుగ నాయనశిష్యులే. 'శ్రీ వీరబ్రహ్మముగారి కాలజ్ఞానతత్వము'లను పేరు గల కీర్తనల సంపుటి యొకటి యున్నది. అందు కొంత ద్విపదకూడ నున్నది. అచలమార్గావలంబకులలో చాలమంది కిది ప్రమాణగ్రంథము వంటిది. దీనిలోని కృతులు కొన్ని వీరబ్రహ్మముగారు స్వయముగా చెప్పినట్లున్నవి. కొన్ని యాయనశిష్యులలో ముఖ్యుడైన దూదేకుల సిద్ధయ్యగారు చెప్పినవి. వీరబ్రహ్మముగారి మనుమరా లీశ్వరమ్మ గారు చెప్పినవి కొన్ని. వీరబ్రహ్మముగారి శిష్యుడైన పాలెకులజుడు యాగంటి లక్ష్మప్పగారు చెప్పినట్లు కొన్ని యున్నవి. శిష్యులలో, భక్తులలో యయిన పూదోట రామన్నగారు, చిత్తూరు నరసింహదాసు గారు, కాలువ కోటయ్యగారు, కొమమస్వారి వీరరాఘవులుగారు, తాడిచర్ల చలమయ్యగారు, మహమ్మదు హుశేనుగారు, నాసరయ్య గారు, తరిగొండ భ్రమరాంబ, నరహరిగార్లు మున్నగువారు చెప్పిన తత్వములనుగూడ చేర్చి పరిమి వీరాచార్యు లనునత డిది కూర్చినట్లు కనబడును. వీరబ్రహ్మముగారి భక్తుడు, మద్రాసువాసి యగు పోకల శేషాచలనాయుడుగారు కొన్ని తాము వ్రాసిన తత్వములుకూడ చేర్చి యొక పుస్తకము నచ్చొత్తించినారు.

శ్రీగురు పీర్ మొహియుద్దీన్‌గారి శిష్యుడును,ధవళేశ్వరమువాడు నైన గుజ్జుల నారాయణదాసుగారు వ్రాసిన 'తారకామృతసార' మను కీర్తనల గ్రంథ మచలతత్వబోధకమే. కాకినాడవారైన యడ్ల రామదాసుగారు కొన్ని యచలతత్వములను ప్రచురించినారు. అచల మార్గమును బోధించు గ్రంథములను పాటిబండ సుందరరామయ్య గారును, చల్లా సుబ్రహ్మణ్యశర్మగారును వ్రాసినారు. కడపటి యాయన యొకచోట తన పేరు 'తక్రసుబ్రహ్మణ్య' మని చెప్పు కొనెను.

పిఠాపురవాసి శ్రీ హుసన్మియా సాహెబుగారు 'తత్వజ్ఞాన రసాయనంబను వేదాంత కీర్తనలు' పుస్తక మొకటి 1920 లో ప్రక టించినారు. వీరి వంశములోనివారైన కీ॥ శే॥ ఉమరలీషా కవిగారు 'సూఫీ వేదాంత దర్శన'మను గ్రంథమును వ్రాసినారు. వీరిరువురి సిద్ధాంతములును వీరబ్రహ్మముగారి సిద్ధాంతమునే పోలియున్నను,

వీరి గురుపరంపర వేరు. వీరి కాదిగురువు అఖలలీషాయోగి. గుల్బర్గాకు షాజీబందే నవాబ్ గారు, కర్నూలునకు షాహుశ్శైన్ గారు, విశాఖపట్నమునకు హిష్మక్ మదీనాగారు, నాగూరునకు మీరా సాహెబు అను పేరులు గల సూఫీలు, పిఠాపురమునకు అఖల్ అలీషా అను సూఫీయును విదేశములనుండి వచ్చిరట.

చిప్పగిరి భంభంగురుయోగీంద్రుల శిష్యులైన భంహుశ్శైన్ యోగిగారి తత్వములు బెంగుళూరులో నచ్చయినవి. వానిలో కొన్ని తెలుగు, కొన్ని కన్నడము. అవియు సచలతత్వములే.

శ్రీ వీరబ్రహ్మముగారి జీవితమును తాడికొండ రాఘవాచార్యులు 'వీరాచార్య చరిత్రము' లోను, జవంగుల నాగభూషణదాసు 'శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి చరిత్ర'లోను వర్ణించియున్నారు. వీరబ్రహ్మముగారు విశ్వబ్రాహ్మణులు. కర్నూలు మండలమునకు సంబంధించిన బనగానిపల్లెలో గరిమరెడ్డి యచ్చమ్మగారి యింట పశువులు గాయుచు బాల్యము గడుపుచుండగనే వీరనేక మహిమలు చూపిరి. తాను తోలుకొనిపోయిన పశువుల నీయన గాయడు. బయలులోనికి గొనిపోయి యచ్చట నొక గిరిగీచి వానిని విడువగా నవి యా గిరి దాటకుండ గడ్డిమేయును. క్రూరమృగము లా గిరి దాటిరావు. ఆయనమాత్రము దట్టమగు నడవిలోనికి బోయి యొక యేకాంతస్థలములో తపస్సు చేయుచుండును. ఆయన యొక చచ్చిన యావును, చనిపోయిన మనుష్యులను బ్రతికించెను. గ్రామదేవర యుత్సవములో గ్రామాధికార్లకు బుద్ధిచెప్పుటకై తా నూరివారెల్ల చూచుచుండగా నా దేవతచేరనే చుట్టకు నిప్పు తెప్పించుకొనెను. జడివానలో నిలిచి తడియకుండ నావలకి వచ్చెను. మహమ్మదీయుడైన సిద్ధయ్యకు పాడు వేదాంతము గరపి మతభ్రష్టుని చేసినందులకై మహమ్మదీయు లీయనమీద నవాబునకు నేరములు చెప్పగా నాత డీయనను పిలిపించి చూచి శిక్షించుటకు మా రెంతో గౌరవించెను. వీరి భార్య గోవిందమ్మగారు. అయిదుగురు పుత్రులు, నొక పుత్రికయు గలిగి వీరు సుఖముగా గృహస్థధర్మము నిర్వహించుచు నొక వైశాఖ శుద్ధ దశమినాడు జీవసమాధిలో ప్రవేశించిరి. ప్రియశిష్యుడైన సిద్ధయ్య యెచ్చటికో పోయి తిరిగివచ్చునప్పటి కప్పుడే సమాధియైపోయినది. విశేషదుఃఖసంతప్తుడై యాతడు—

ఓ వీరబ్రహ్మానంద! ఈశ, పరాక! మహేశ, పరాక!
  ఏమయ్య, యేమయ్య, ఏమని పలుకవు! ఏమో
నా మనవి యే మాయెనయ్య?

౧. తనువుతోడుత నన్ను పూలకు పొమ్మని
  నిందు సమాధిలో పండియున్నావా॥
౨. అంటని కులమని దూదేకివాడని
  ఒంటిగాణ్ణి చేసిపోతి వేమయ్య॥

(కాలజ్ఞాన తత్వములు)

అనియు, 'తల్లి లేనిబిడ్డ నైతి గాదయ్య' యనియు, 'నెప్పుడు గురుసేవ తప్పక నే నుంటి' ననియు, 'చప్పుడు కాకుండ చెప్పి పోరాద'యనియు నెలుగెత్తి విలపించెను. ఎవరు చెప్పిన వినక సిద్ధయ్య యట్లే యంగలార్చుట చూచి మూడుదినములకు వీరబ్రహ్మముగారు సమాధిలో నుండి బయటికివచ్చి* యాతనికి కొన్ని బోధలు చేసి యోగదండము మొదలైన నాలుగు వస్తువుల నిచ్చి తిరిగి సమాధిని చేరిరి.

సమాధియైన సంవత్సరముమాత్రము చరిత్రకారు లిద్దరు నిరు తెన్నుల తెలుపుచున్నారు. రాఘవాచార్యులు క్రీ. శ. ౧౬౯౩ అనుచుండగా నాగభూషణదాసు క్రీ. శ. ౧౭౦౮ అనుచున్నారు. వీరబ్రహ్మముగారి సమాధి కందిమల్ల య్యపాలెములో నున్నది. ఇప్పటికి నసంఖ్యాకజను లచ్చట నేటేటజేరి గొప్పగొప్ప యుత్సవములు జరుపుచున్నారు. ఆ ప్రదేశము ప్రకృతిసౌందర్యముచేతగాని, జనము నాకర్షించు మరి యే యితర కారణముచేతగాని స్వతః చూడదగినది కాదట. అది చేరుటకే యెంతో ప్రయాసయట. వీరబ్రహ్మముగారి మీద భక్తియే యన్ని వేలజనుల నచ్చటి కీడ్చుకొని పోవుచుండును. చాలమంది మ్రొక్కులుకూడ మ్రొక్కుకొందురట.

దూదేకుల సిద్ధయ్యగారుకూడ మహిమలు చూపించిరి. మతాంతరుడైన సిద్ధయ్యగారిమీద వీరబ్రహ్మముగారికి పుత్రులమీదకంటె నెక్కువ ప్రేమ యుండెనట. సిద్ధయ్యగారి కాయన తల్లియు, తండ్రియు, గురువును, దైవము. శ్రీ రామకృష్ణపరమహంస నరేంద్రులవలె వీరబ్రహ్మము, సిద్ధయ్యగార్లు ఆదర్శగురుశిష్యులు. "బ్రహ్మముగారివంటి గురుడులేడు, సిద్ధయ్యవంటి శిష్యుడు లే"డని యొక సామెత యున్నది.

వీరబ్రహ్మముగారికి గురువు అల్లారపల్లెలో నున్న దేవాలయములో వీరభద్రస్వామిగా వేంచేసియున్న సాక్షాత్తు భగవంతుడే యని కొందరు నమ్ముచున్నారు. రాఘవాచార్యులుమాత్రము వీరభద్రస్వామి యను నొక మహనీయుడు పృథివిపై జీవించియుండి వీరబ్రహ్మముగారికి వలయు నుపదేశము నొసగి పరమపదించగా నాయనపేర నల్లారపల్లెలో నాలయము కట్టబడియుండెనని తెలుపుచు, దన యూహకు హేతువుల నిచ్చియున్నారు. 'కాలజ్ఞాన తత్వముల' ప్రతి మొదటిలో "శ్రీగురు అల్లాడుపల్లె వీరభద్రవేనమః" అని యున్నది.

"నళినీదళగతజల మతితరళమ్,
  తద్వ జ్జీవిత మతిశయచపలమ్

* ఈ వృత్తాంతమును విని Elmore అను నమెరికను మిషనరీ క్రైస్తవబోధలను విన్నవా రెవరో యీ కథ కల్పించియుందురని వ్రాసినారు. క్రీస్తు బోధలకును, వీరబ్రహ్మముగారి బోధలకును చాల భేదము లున్నవి.

విద్యావ్యాధ్యభిమాన గ్రస్తమ్
లోకం శోకహతంచ సమస్తమ్"

అను నిశ్చయమునకు తప్పనిసరిగా వచ్చి, శంకర భగవత్పాదులు 'కా తే కాంతా, క స్తే పుత్రః' అని తీవ్రముగా ప్రశ్నించి, తాము సాధించిన సమాధానమును మనకును జెప్పినారు. ఆయనకు పూర్వము, నాయనకు బిమ్మట నా ప్రశ్నలే తమ్ము వేధించగా ననేక మహనీయులు తమకు దోచిన యుత్తరము లిచ్చినారు. ఎన్ని యుత్తరము లున్నవో యన్ని మతములై, వానిలో మరల నుపమతములును బుట్టినవి. సామంతునికి వలెనే సామాన్యునికిని జన్మముపై విసువుపుట్టి

"ఎందుకొచ్చి చిక్కితివే జీవామా,
బొందె నిశ్చయము గాదు సుమ్మా
బొందివంటి దేహము నమ్మెరమ్మా
ముంద నేకులు మోసపోయేరమ్మా
౧. ఆలిపిల్ల లెందరు కలిసున్నా
కాలిసంకెళ్ల నుకోరన్నా
కాలమొచ్చి పోయేటప్పుడన్నా
రేమి చెప్పారు ఎవరురారన్నా
౨. మూత్రకొంప లోపల నుండుటాకా
ఛీ, ఛీ, హితవు ఎట్లులయ్యె నీకూ
వాతపైత్య మనుభవించుటాకా
ధాత వ్రాసెను కాబోలునీకూ."

(తారకామృత సారము)

అని చింతించుచు నీ దుఃఖసముద్రమునుండి దరిజేరు నుపాయమునకై వెదకును. ఆ దేవుని కీ దేవునికి మ్రొక్కుకొనుట కిది తాత్కాలికమైన దేహవ్యాధి కాదు. బుద్ధికే పుట్టిన బాధ. సంసారము చేయుచు, మన్నంత తిని పడియుండనీయని బాధ. ఇది యందరికిని బుట్టదు. ఏ జన్మమునాటిదో వాసనయుండి యీ జన్మములో దల యెత్తును. ఆ బాధ కలుగనివా డదృష్టవంతుడే. వాడు కట్టె కొట్టి తెచ్చి తిని త్రాగి సుఖముండును. అమ్మవారి జాతరలో నొక కోడిపిల్ల నిచ్చి యింత కుంకుమ మిచ్చినయెడల పరమార్థము తనంతట తానే రాగలదని వాని ధైర్యము. శంకితుని మనసునకు శాంతి లభించుట యెట్లు? శాస్త్రై చదువుకొని తరించెదనన్న వానికి జదువేరాదు. వచ్చినను తెలుగు చాలదు. సంస్కృతముకూడ వచ్చియుండవలెను. ఇంక నేమిగతి? బ్రాహ్మణుల నడుగవలయును. వారి కెంత యహంభావము! ఎంత కులగర్వము! పైగా వారిలో వారి కెన్ని యభిప్రాయభేదములు! ఎన్ని యాచార భేదములు! వైష్ణవుని చూచిన శైవుడు స్నానముచేయవలెను. వీరిరువురిలో నెవరినైన జూచిన స్మార్తు డూరువిడిచియే పోవలయును. అయిన నేమి చెప్పునో యడిగి చూచెదమని యొకనినడిగిన నొక్క తెలియని యంశ మడుగగా నిరువది తెలియనియంశముల జెప్పి వితండవాదములో ముంచును. అర్థము కాలేదనగా, నీ కధికారము లేదుగావున నర్థము కాలేదని యాక్షేపించి, నీకు తగునట్లు నగ్రవర్ణములను పూజించుట, యాత్రలకు బోవుచుండుట, వీలుకలిగినప్పు డంతయు దక్షిణ లిచ్చుచుండుట యని ముగించును. అన్నియు జేసి చూచినను నీ మనస్సంకటము వదలుట లేదు. మోక్ష మెందున్నదో గాని—

'లేదు లేదు సుమీ యిందునా మోక్షం'

౧. నీళ్లలో మునిగిన పక్షివలెను ఉదయము స్నానముచేసినగానీ
తెల్లగుమ్మడిపండువలె దేహమునకు భస్మము పూసినగాని,
౨. కాయలు గాచిన రేగుచెట్టువలె రుద్రాక్షలు ధరియించినగానీ
బకమువలెను పంజి పంజిగా ద్వాదశనామము దిద్దినగానీ,
౩. కోసిన కాకరకాయవలెను దేహమునకు ముద్రలు వేసినగానీ
పండిన పెదురాకువలెను గోపీచందన మలంకరించినగానీ,
౪. ఏనుగు జల్లిన నీళ్లవలెను హస్తములో నర్ఘ్యము విడిచినగానీ
వర్షాకాలం కూసేకప్పవలె తేవారములు పాడినగానీ,
౫. అడవిలో మేసే పసువువలెను కందమూలములు తిన్ననుగాని
చలనములేక కొండపామువలె నొక్కచోట పడియున్ననుగానీ,
౬. బొక్కలోనున్న పందికొక్కువలె గృహములోపల దాగున్ననుగానీ
మర్రియూడవలె తలవెంట్రుకలు జడలు దాల్చి శిఖవేసినగానీ,
౭. మానిప్రతిమవలె నాహారములేక మౌనముగా నున్ననుగానీ
అడవిలో తిరిగే మృగరాజువలె దేశదేశములు తిరిగినగానీ,
౮. ధరణిలోన పీర్ మొహిదీన్
మాటనువిని వైరాగ్యముగా నుంటేగానీ॥

ఒక్కదెబ్బతో ద్వైతాద్వైత, శివాద్వైత, విశిష్టాద్వైతములను నన్నివిధముల సాధనములను గొట్టివైచినాడు. మరి శంకా నివృత్తి యెట్లు?

ఏదోయొక మతము నాశ్రయించుకొని శిష్యబృందముతో నివసించుచు, గురుపూజ లందుకొనుచు గొందరు, నెండ వానలకు జంకక, యాకలిదప్పులకు లోనుగాక, దేహభావములతో పనిపెట్టుకొనక నొక కుండపెంకుమాత్ర మాస్తిగా గలిగియుండి యూరూర దిరుగుచు నేమఱ్ఱిచెట్టుక్రిందనో చేరుచు నొక యూరని, పల్లెయని లేని యోగులు కొందరు సాధారణముగా కనిపించుచుందురు. వీరును వారును స్వయముగా సాధనముచేసి సిద్ధిని బడసినవారు. వారు దేహము నేవేవో కట్టుబాటులకు లోనుజేసి స్థిరమైన యారోగ్యమును గల్గించుకొనినవారు. దీర్ఘరోగ పీడితులు వచ్చి వేడిన నేదో యొక వేరిచ్చి క్షణములో నారోగమును మాన్పించగలవారు. వారి నింకను సేవించినయెడల దివ్యౌషధముల నిచ్చెదరు. వార్ధక్యము రాకుండ, మరణము రాకుండ రసాయనము లిచ్చెదరు. ఇంతే కాదు, రాగిని బంగారముచేయు విద్యయును వారికి తెలియును. వారి కేచింతయును

లేనట్లు మనస్సుకు శాంతిని చేకూర్చుకొన్నట్లు నగపడుదురు. ఇట్టివారి యొద్దకు బోయి యడిగెద వని చిత్తశాంతిలేనియాత డరిగి యడిగిన వారు కొంత కామనశ్యము జూపించెదరు. వారికి కులభేదములు, మతభేదములు నెంతమాత్రము లేవు. కాని,

సీ. అటువంటి గురువును నిటువంటి యోగంబు
    నింతింత శిష్యుని కివ్వరాదు,
శిక్షించి కాంచి పరీక్షించి తన శిక్ష
    నొప్పినవానికి (తత్వంబు) జెప్పవలయు,
తన శిక్ష యొప్పని తామసాత్మునకును
    మంత్రంబు జెప్పిన (వాడె) మందుడగును
చేమ భావములచేత విక్రమీగుచెగాని
    వాడు తత్వజ్ఞుడు కాడుగనుక
తొలంత నీవిట్టి శిష్యుని దుర్గుణములు
చూచి తిట్టుచు గొట్టుచు సుగుణములను
చెప్పగావలె తన శిక్ష కొప్పకున్న
మరక శాంతిని బొంది తా నుండవలయు.

(కాలజ్ఞాన తత్వములు)

శిక్షించి యేదో చేర్పెద నన్నారు గాని దూరముగ బొమ్మన లేదు. ఇదియును మంచిదే గదా. గురుశుశ్రూష చేయగా చేయగా—

"దేవుడు తనలో దండిగ ఉండగ—తెలియదు మానవ పశువులకు
సంశయ ముడుగక శ్రద్ధతో మేరకు—సర్వము తానని తెలియవలెన్,
సర్వము తానని తెలిసేటందుకు—గురువుపదేశం కలుగవలెన్,
గురువుపదేశం కలిగేటందుకు—నిలకడగా మతి నిల్పవలెన్,
నిలకడగా మతి నిలిపే సరసుడు—విరసము విడుచుట తెలియవలెన్,
విరసము విడిచి తెలిసి సమాధిలో—నున్నతంబుగ తా నుండవలెన్,
ఉన్నతముగ తా నుండేటందుకు—తార్కాణంబుగ గురి తగుల
                                                        వలెన్,
తార్కాణంబుగ గురి తగిలేటందుకు—ఉచ్ఛ్వాసంబులు నిలుప
                                                        వలెన్,
ఉచ్ఛ్వాసంబులు నిలిచేటందుకు—సాధకముగ సాధించవలెన్,
సాధకముగ సాధించేటందుకు—తారక పరిశోధించవలెన్,
తారక పరిశోధించేటందుకు—ఏకాంతంబున చేరవలెన్,
ఏకాంతంబున చేరేటందుకు—సంసారస్తుతి యుడుగవలెన్,
సంసారస్తుతి యుడిగేటందుకు—దేవుని కృప దా కలుగవలెన్,
దేవుని కృప దా కలిగేటందుకు—నెరుక గలిగి తా నుండవలెన్,
ఎరుక గలిగితే యోగంటేశుని—మరుగున తా నుండవలెన్,
మరుగున చేరియు మరియానందము—మహిలో పొందుచు
                                                        నుండవలెన్,"

(కాలజ్ఞాన తత్వములు)

యోగంటివారు చెప్పినది యుచ్ఛ్వాసంబులు నిలుపుమని, యందులకై సాధకము సాధించుమని. ఈ సాధకమే యోగము. దానిని గురించి కొంత తెలిసినగాని తత్వములు అర్థముగావు.

మనుష్యదేహములో వెన్నెముక నాశ్రయించుకొని, యాసన సమీపమున మూలాధారమును, దానికి పైగా స్వాధిష్ఠానమును, దానికి పైగా నాభిదగ్గర మణిపురమును, నదిదాటిన తరువాత హృదయ ప్రదేశమున ననాహతమును, నా పైని కంఠమున విశుద్ధమును, కనుబొమల నడుమ నాజ్ఞయును నను పేరులు గల యారు చక్రము లున్నవి. సహస్రార మను నేడవచక్రము శిరస్సులో నున్నది. ఈ చక్రములను కమలము లనియు నందురు. మూలాధారము మొదలుకొని యీ చక్రములకు వరుసగా నాలుగు, నారు, పది, పండ్రెండు, పదునారు, రెండు, వేయిదళము లుండును. ఈ దళముల కక్షరసంజ్ఞ లున్నవి. మూలాధారమునుండి కుడియెడమలను ఇడాపింగళ లను రెండునాడులును, వానినడుమ సుషుమ్న యను నింకొక నాడియు బయలుదేరును. ఇడాపింగళలు సుషుమ్నకు ప్రదక్షిణముగా తిరుగుచు, జక్రస్థానములందానిని కలిసికొనుచు, నాజ్ఞాచక్రమువరకు వ్యాపించియుండును. సుషుమ్నమాత్రము బ్రహ్మస్థాన మనగా శిరస్సులోనికే పోవును. పంచప్రాణములలో మొదటిదైన ప్రాణము సాధారణముగా నిడాపింగళలందు ప్రసరించును. సాధకము చేయుటవలన మూలాధారమందు నిద్రించుచుండిన యొక శక్తి మేల్కొనును. ఆ శక్తి పామువలెనుండి, చుట్టలు చుట్టుకొని మూలాధారమందు శిరస్సుంచి నిద్రించుచుండును. దాని పేరు కుండలినీశక్తి. అది మేలుకొన్నందువలన ప్రాణవాయువు మునుపటివలెగాక సుషుమ్నద్వారా ప్రసరించుట మొదలుపెట్టును. కుండలిని లేచి యొక్కొక్క చక్రమునే భేదించుచు భ్రూమధ్యమువరకు వచ్చును. అది యొక పెద్ద మెట్టు. అచ్చటినుండి క్రమముగా బ్రహ్మరంధ్రముకూడ భేదించబడినప్పుడు హంస యను జీవుడు బ్రహ్మ మను పరాత్పరునితో నయిక్యమగును. ఇంతకుపూర్వమే యీ సాధకున కణిమాదిగ నెనిమిది సిద్ధులు, మహిమలు లభించును. వానితోనే తృప్తిపొంది కొందరు సాధక మింక జేయరు. అది కూడని పని.

ఈ యోగము సాధించదలచినవాడు సద్గురుని జేరి యాశ్రయించి కారణమును పొందవలెను. అనగా ఉపదేశము పొందవలెను. తాను కొన్ని కట్టడులలో నుండవలెను. అవి యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధులు. అహింసాపరుడై, యొరుల సొమ్ము నాశింపక, స్త్రీ సుఖమును కాంక్షింపక, దేనిని బుచ్చుకొనక యుండుట యమము (౧) దేహ మనోశుద్ధులు, తపస్సు, సంతుష్టి, వేదాధ్యయనము, నిష్ఠ, దైవమందలి భక్తి గలిగియుండుట నియమము (౨) ఆసనముల (౩) నభ్యసించుటవలన దేహములోని యంగములన్నియు సంపూర్ణ స్వాధీనములోనికి వచ్చును. సాధకుడు తనకు పూర్తిగ సుఖముగా నుండు ఆసనమును తెలుసుకొని, యందుండి సాధకము చేయుచుండవలెను. అందువలన జిత్తనిరోధము

కొంత కలుగును. ఆసనములైన తర్వాత ప్రాణాయామము సాధించవలెను. ఇదే వాయుధారణ మందురు. లోనుంచి గాలి నాసారంధ్రములగుండ విడిచివైచుట రేచకము, తిరిగినింపుట పూరకము, ఆ గాలి నొడలిలో బంధించియుంచుట కుంభకము. రేచక పూరక కుంభకములను క్రమముగ జేయుచు నిరువదియొక్క వేయి యారునూరు పర్యాయములు మంత్ర పురశ్చరణము చేయుట మంత్రయోగము.

కేవల ప్రాణాయామమువల్లనే ప్రాణవాయువును, నపానవాయువును లీనముచేయుట లయయోగము.

ఎడమకాలి మడిమతో పాయుస్థానమును గట్టిగ, నొక్కిపట్టి యచ్చటి యపానమందలి వాయువును పైకి ప్రాణవాయువులో లీనమగునట్లు పంపుట మూలబంధము.

కుడికాలి మడిమతో నాభిని నొక్కిపట్టి కలిసిపోయిన ప్రాణాపానములను క్రిందికి రాకుండ నిలుపుట యుడ్యాణబంధము. గుండె అపై గడ్డము నుంచి కంఠమును ముడిచిపెట్టుకొని యుండుటవలన నా ప్రాణాపానవాయువులు చలింపనేరవు. ఈ బంధముపేరు జాలంధరబంధము.

ఇది కుంభక మను హఠయోగము.

ప్రత్యాహారమనగా నింద్రియముల వృత్తు లుడిగించి, మన సేవైపునకు ద్రిప్పిన నవి యావైపునకు దిరుగునట్లు చేయుట.

తర్వాత నిష్టదేవతయందు మనస్సు నిల్పుట ధ్యానము. మూలాధారాది స్థానములందు మనస్సు చలింపకుండ నిల్పుట ధారణ. తరువాత సమాధి. సమాధి ప్రజ్ఞతో కూడినది, ప్రజ్ఞకూడ బోయినది యని రెండువిధములు. రెండవదే సాధకునకు గావలసినది. అదే రాజయోగము. అదే మోక్షము.

మూలబంధమును యోగు లవలంబించి రనుట కీక్రింది తత్వము నిదర్శనము.

"కోరికోరి పరమగురుని కోరిచేరరే
కాలకర్మ జన్మములను కడకు జిమ్మరే
కాలిమడిమ గుదమునందు కదలకుండ నొత్తిపెట్టి
మూలబంధ తత్వగతిని మురియు టెవ్వరే
ప్రాణాపాన వాయువులను పరగ నైవేద్యంబుజేసి
పూని కాయసిద్ధి పొందు పుణ్యు లెవ్వరే."

(కాలజ్ఞాన తత్వములు)

సమాధిలో నింక దెలియునదెల్ల పరబ్రహ్మము బట్టబయలనియట.

జ్ఞానయోగ మను శీర్షిక క్రిందికి వచ్చు తారకయోగ మని మరియొకటి యున్నది. బాహ్యాభ్యంతర శుచిని సాధించిన సాధకుడు నిర్జనమైన ప్రదేశమునందు సరియైన యాసనముపై నాసీనుడై ముద్రల నభ్యసింపవలెను. ఖేచరి, భూచరి, మధ్యమ, షణ్ముఖి, శాంభవి యనియీ ముద్ర లైదు. కన్నులు మూసియో, విచ్చియో భ్రూమధ్యమున జూపు నిలిపినది ఖేచరి. నాసికాగ్రమును కన్నులు కదలించకుండ జూచునది భూచరి. అరమూసిన కన్నులతో నాసికామధ్యమందు చూపు నిలిపి నిటలమును చూచెడిని యది మధ్యమము. కండ్లు, చెవులు, ముకురంధ్రములు వ్రేళ్లతో మూసి భ్రూమధ్యముపై దృష్టి నిలుపుట షణ్ముఖి. మనోమారుతములను నిశ్చలముగా జేసి, పరాత్పరుని ధ్యానించుచు కన్నుల విచ్చి చూచునది శాంభవి. షణ్ముఖిని బాగుగా సాధింపగా సాధకునికి చిణియని, చిణిచిణి యని మొదలైన నాదములు పదివిధములైనవి వినిపించి వినిపించి తుద కోంకారముగా మారిపోవును. ఖేచరీ భూచరీ ముద్రలను బాహ్యలక్ష్య మందురు. వీనిలో నిర్గుణాకాశము, పరాకాశము, మహాకాశము, తత్వాకాశము, సూర్యాకాశము నను నైదాకాశములు కనబడును. వాని నడుమ నాకాశగంగవలెను, కల్పవృక్షమువలెను మొదలుగా కళలు కాన్పించును. ఇవి తెల్లనివి. ఇవి రైనసిమ్మట సూర్యునిదివలె తేజస్సు కనబడును. ఆ పిదప పూర్ణచంద్రుని వెన్నెలవంటి వెలుగు వచ్చును. అదిరైనవెనుక నొక హిరణ్మయమండలము కనబడగలదు. ఇదియే యాపోజ్యోతి. నీవారశూకము. దీనికి పేరలేదు. దానిపైగా నుండునది పరబ్రహ్మమే. కాని సాధకుని బుద్ధి యింకను చలించుచునే యుండును. దానికి మనోమారుతముల నరికట్టినగాని యచలత్వము రానేరదు. దీనికింకను నభ్యాస మవసరము. మరియు నజపామంత్రమును ౨౧౬౦౦ మారులు పురశ్చరణ చేయవలయును. ఇడాపింగళనాడుల నడుమగా మనస్సు వ్యాపించియుండును. సుషుమ్నలో హంస యనగా జీవు డుండును. జీవుడు పరమేశ్వరునియందు లయమగునప్పుడు కలుగు తెలివి పేరే తురీయావస్థ యనియు, నున్మని యనియు నందురు. ఇదియే రాజయోగము. నాలుకను బాగుగా చాచి దవుడల పైగా నున్న రంధ్రములో జొనిపినయెడల నమృతము పుట్టునట—

"ఊదే తిత్తులపైగానుండే ఉన్మని తెలియర ఓరన్నా
తిత్తుల నడుమను చక్షులమీదను చీకటిగొట్టర ఓరన్నా
చీకటిగొట్టును తోకనాలుకను తీసుక లేపర ఓరన్నా
తీసుక లేపితె కాకకు పాము చిర్రున లేచును ఓరన్నా
శంఖచక్రముల నట్టనడుమ ఆదిశేషుని లేపర ఓరన్నా
ఓంకారించుకయున్నది పాము, కొంకక లేపర ఓరన్నా
ఆరుచక్రముల కావల యీవల లోపల వెలుపల నోరన్నా
ఆరుచక్రములు పెనుచుకు పాము అధోముఖంబై ఓరన్నా
రెండుచక్రములు విడిబడి ఉన్నవి, కుండలి లేపర ఓరన్నా
రెంటికి సూత్రము మరిచుట్టొక్కటె లేపి పోతులూరి వీరన్నా"

(కాలజ్ఞాన తత్వములు)

శిష్యుడు సిద్ధయ్యగారి తత్వ మిదిగో:
"చందమామ, చందమామ, చందమామ

౧. కాయమను పుట్టలోన చందమామ, పాంబు
మాయగా నె వెలుగుచుండు చందమామా
౨. జంటవాదపరము లూది, చందమామా, పాంబు
పాడు పెకలించవే చందమామా
౩. తొమ్మిది వాకిళ్ళు మూసి చందమామా, పాంబు
నెమ్మదిగా పట్టవలెను చందమామా
౪. భక్తి యనే కట్టుగట్టి చందమామా, పాంబు
యుక్తిచేసి పట్టవలెను చందమామా
౫. దేహి దేహముల సందు చందమామా, పాంబు
తెలియకుండా చుట్టుకొంది చందమామా
౬. అజపామంత్ర న్యాసంబుచేత చందమామా, పాంబు
అఖండకళలతో వెలుగుచుండు చందమామా
౭. పాములబట్టే జోగి యెవరె చందమామా
అతని పేరే సిద్ధగురుడు చందమామా"

(కాలజ్ఞాన తత్వములు)

ఈ పాంబు కుండలినీశక్తి.

ఇట్లు సాధించిన వీరబ్రహ్మంగారు—

"ఓం నమశ్శివాయ సిద్ధమైన పదవి ఓంకార మేదిరా ఓరీ,
ఒనరుగా త్రికూట భ్రూమధ్యమందున్న వా డెవ్వడో చూడ రోరీ"

అని సంబోధించి,

"అహంకార మను చిలుక హంసతో గూడుకొని
ఆడించు చున్నాడురోరీ"

అని వివరించి,

"తెర తేరకాడు యీ దేవాలయంబులో శేలగా నున్నాడురోరీ,
యరలవ నారాయణ పరబ్రహ్మ మితడనుచు నివ్వరీ యీశ్వరుం డోరీ,
శివసహాయనే శివపోతులూరయ్య సాక్షిగా నున్నాడు రోరి"

(కాలజ్ఞాన తత్వములు)

అని జీవేశ్వరైక్యమునకు తానే సాక్షియనియు—

"శివపంచాక్షరి మంత్రం పరశివయోగులకే జపసూత్రం,
అవిరలయోగం బందినవారికి ఆరింటిమీద చిద్రూపం.
మూడు త్రోవలది సాకారం,
సుషుమ్నాంతంబందున గురుతేజం,
అష్ట కమలంబున శివపూజం,
వేయి కమలంబున మహాపూజం, గురుపీఠకుని ఘనతేజం"

(కాలజ్ఞాన తత్వములు)

అని చెప్పకొన్నాడు. మరియు 'ధరలో శివపోతులూరి దైవ రాయుడొక్క'డన్నాడు.

"మూడు మొనలమీద ఆడింతురా లోకం,
ముగ్గురు మూర్తులా ఓకింతురా! శివగోవిందా గోవిందా"

(కాలజ్ఞాన తత్వములు)

అనియు బెదరించినాడు.

"చెప్పెద గురుమహిమ తెలిసినంతట మీరు తెలుసుకోండి
విప్పిచెప్పగపోతె నేనెంతవాణ్ణని శరణంట ఒప్పకోండి.
౧. చింతమానుమీద చేమంతిపూసె తెలుసుకోండి
ఆ చేమంతిమీదను చెంగల్వ పూచెను తెలుసుకోండి.
౨. భూరుహంబున రెండు పుట్టలు గలవయ్య
ఆ పుట్టలో రెండు పెనుపాము లున్నవి పట్టుకోండి.
పట్టుకున్న మీద పైగా రెండుగ్రుడ్లు తెలుసుకోండి
ఆ గుడ్లమీద ఒక్క గూబగూర్చున్నది తెలుసుకోండి.
మూడుమూలల పెట్టె తీసి చేర్పు చేర్చుకోండి
మూత దీసితె పెద్దభూత మగుపడును తెలుసుకోండి
భూతంబు నెత్తిని జ్యోతియొక్కటి కలుగు తెలుసుకోండి"

(కాలజ్ఞాన తత్వములు)

అని తానే పరంజ్యోతినని తెలుపుచున్నాడు. పై తత్వములోని రెండు పాములు నిడాపింగళలు. చింతమాను ధ్యానము. చేమంతి చిన్మయ బిందువు. చెంగల్వ సహస్రారము. రెండు గ్రుడ్లు నేనో నాకు తెలియరాలేదు.

వేమన్న గారు నింతేకదా—

"తత్వము తిరమైన తావుల వెదకుచు
తాను తత్వమునను తత్వయోగి
తలపులన్ని యుడుగ తానె పో తత్వంబు
విశ్వ................"

యాగంటియాయన "సంధ్యవార్చెవిధము తెలియండీ, సదా బ్రాహ్మణుండనునా" యని బ్రాహ్మణులకు సంధ్యావందనము నేర్పెద నన్నాడు.

జీవాత్మ పరమాత్మతో నేకమగుటయే జ్ఞానము. అదియే సచ్చిదానందము. జీవుడు దేవునినుండి వేరుగాడు. వేరుగాదని తెలుసుకొనుటకు నిశ్చలసమాధి యవసరము. అదియే యచలసమాధి. అచల మతమని యిందుకే యీ మతమునకు పేరువచ్చినది. ఇది శంకరాచార్యుని యద్వైతమే కదా. జీవేశ్వరాద్వైతతత్వానుభావమే ముక్తి.

తంత్రశాస్త్రములలో నలంకారములు శృంగారముతో సంబంధించియుండుటచేత నది యొక సాంకేతికమైనది కాబోలు, నారాయణదాసు యోగము నిట్లు వర్ణించియున్నాడు:

"రాజులేని రాజ్యమందున రాచచిన్నది యున్నదీ
తేజరూపస్వభావ మెవ్వరు తెలియలేనటువంటిదీ

౧. ఏడు చుట్ల కోటలోపల మేడ కట్టించున్నదీ అ,
మేడలో దశవిధములైన నాద మినబడుచున్నదీ
౨. వెయ్యికాళ్ల మంటపంబులోన కొలువై యున్నదీ
శయ్యపై పవళింపు నిద్రాహార మేమియు లేనిదీ
౩. లెక్కలేని కోట్ల రాణుల చుట్టుప్రక్కల నున్నదీ
నిక్కముగ బుద్ధియు ప్రధాని రాజు మనపైయున్నదీ
౪. రాయబారమునకు నిది వైరాగ్యమైన చిన్నదీ
మాయనరకినవారినీ వేమరులకొంటానన్నదీ
౫. పంచభూతము గానిది ప్రపంచములో నున్నదీ
మంచిగురుని ఆశ్రయించితె కొంచెములో వశమౌతదీ."

(తారకామృత సారము)

శిష్యుడు తత్వమును సాధించి తానే తత్వమై నుండగొను. ఇంత సాధన లేకుండ భగవదనుగ్రహమాత్రముననే సిద్ధిని బడసినవారు నున్నారట. గురుడు దయదలచినచో శిష్య విన్ని తిప్పల బడకుండ గనే జ్ఞాన మనుగ్రహించగలడట. అవిశ్వాస మొకవంకకు, ఆశ యింకొకవంకకు లాగుచుండగా నెంతో కటకట బడుచు నది యబద్ధ మిది యబద్ధ మనుచున్న నరేంద్రుని మెట్లన్నియు నొక్క టొక్కటి యెక్కనక్కరలేకుండ గురుదేవుడు కరుణించి వివేకానం దుని చేసినట్లు వినుచున్నాము.

బ్రహ్మజ్ఞానమే ముక్తి యనుకొంటిమి. ఆ ముక్తి దేహి దేహ ములో నున్నపుడే లభించవచ్చును. ముక్తికొరకై జీవుడు దేహమును త్యజించనక్కరలేదు. అందువలన నిది జీవన్ముక్తి యనబడును. జీవ న్ముక్తి చెందినవారు మరణమునకు వెరువరు. పైగా వారి కిక నీసంసా రములో నుండనక్కరలేదని తోచినయెడల వారే యొక (గోరీ) సమాధిని కట్టించుకొని యందులోగాని, యేదేని గుహలలోగాని సజీవ ముగనే ప్రవేశించెదరు. అది జీవసమాధి యందురు. వీరబ్రహ్మము గారు జీవసమాధిలో చేరెనని పైని కనియుంటిమి. వేమన్నగారును, కటార్లపల్లె తుంగ వేమన్నగారు నట్లు చేరినవారేనట. వీరబ్రహ్మము గారి శిష్యపరంపరలోనివారైన పోకల శేషాచలనాయుడుగారును జీవసమాధిలో చేరినారట. సత్తెనపల్లి దగ్గర నందుకూరు గ్రామములో చావ వెంకయ్యగారను నొక కమ్మగృహస్థు కాకినాడ యడ్ల రామ దాసుగారి శిష్యరికము చేసి వారివలన నచలబోధలను బడసి తిరిగి తన యూరుచేరి ప్రమాదీచ వత్సర జ్యేష్ఠ ప్రథమైకాదశీ భానువారము నకు సరియైన ది ౧౫-౬-౧౯౧౩ తేదీని జనులు చూచుచుండగ గురుస్మరణ చేయుచు జీవసమాధి యైనట్లు 'శ్రీయడ్ల రామదాసుతత్వ నవరత్న మాలిక'లో నున్నది. వీరబ్రహ్మముగారి మతము ననుష్ఠించిన యొక యుప్పరియాతడు – రోశయ్య యనువాడు తెనాలిదగ్గర గాజులూరులో జీవసమాధియైనట్లు తెలియుచున్నది. అట్లగుటను 'గురువులు చాటునకు పోవుట' యందురట.

దాదాపు మన దేశమంతట నేదో యొక రూపున వ్యాపించి యున్న యద్వైత సిద్ధాంతమును సామాన్య ప్రజలలో బోధించుట కెవ్వరును పూనుకొనలేదు. ఆ లోటు నీ యచలబోధలు తీర్చివైచినవి. సామాన్యులలో గురుబోధనొంది యీ మతము నాశ్రయించినవారు లెక్కకు మీరియున్నారు. గ్రామగ్రామములో నున్నారు. అగ్ర జాతులలోను అట్టివారు సకృత్తుగ నున్నారు. ఆంగ్లేయ విద్యావిధా నము మన దేశములో నెగబ్రాకినకొలదియు నన్ని మతములతోపా టిదియు దిగజారినది. కాని యున్నంతలో నీమతమే మరియు రూపు చెడకుండ అంతయో కొంతయో నిలిచియున్నది.

ఈ యచలకీర్తనలందు తత్వములేగాని కవిత్వములేదు. ఉండ వలసిన యవసరమును లేదు. వీరబ్రహ్మముగారు చెప్పిన మాటలే యందరు కీర్తనకారులును వ్రాసినారు. తత్వములనే చెప్పి రసము చిప్పిలజేసిన వేమన్న పుట్టుకవి. అట్టివాడు దస్తావీజులలోను, చాకలి పద్దులలోను కవిత్వము నూరించగలడు. వేమన్న కవిత్వము రాకపోయి నను వాతని ముకోక్కపము సిద్ధించినది కాబోలు కంబగిరియాయన–

"రామభజన సేయరా, లమిడికా, నీ
తామస మణచర, భగిడీకా"

యని శిష్యుని తిట్టగా, పేరుతెలియని మరియొక యాయన—

"భ్రాంచెకు నే నెంతో చెప్పిన చంచల ముడుగవు,
ఛీ. ఛూ. మనసా"

యని మనసును తిట్టినాడు.

దొరికిన కీర్తనలన్నియు నర్థముకావు. ఏ రహస్యార్థములతో వ్రాయబడినవో గాని కొన్ని తత్వము లగమ్యగోచరములుగా నుండును. భావకవిత్వమును అర్థముకానిదని చెప్పి విమర్శించుచు, కీ. శే. అక్కిరాజు ఉమాకాంత విద్యాశేఖరులు దాని నీ తత్వము లతో బోల్చినారు.

అసత్

✿

— శ్రీ సుందరాచారి —

నల్లరాతికి కలతల యిల్లు గట్టి,
జారు కన్నీటి ధారల జలకమార్చి,
వేడి నిట్టూర్పుసెకలలో వేల్చి మనసు,
ముందుపెట్టితి నైవేద్యమునకు నయ్య.

అధరపుటములు కదలించి, మధుర మనుచు
ఆరగించెను నాస్వామి; ఆరగించి,
కడుపు నిండకపోయిన కారణమున
కండలూడ్చెను నాలోన కత్తిదూసి.

ఎముక లొకకొన్ని మిగులగా నేర్చిపేర్చి,
నరములన్నియు నారగా నరులు గూర్చి,
పచ్చినెత్తురుపళ్లెంబు పట్టి పాడి
'అమరుడైయుండు మోస్వామి!' యంటి నంత.

నిలువు మాసినదేకాని కలతయేమొ
తెలియనేలేదు, గాలిలో కలవరించె,
కడుపుచల్లనివానిని కదలనీక
కాళ్ల చుట్టను పెనగుచు కలవరించె.

పేదగుండియ పేలగా పీల్చినట్టి
రుధిరమదిరమ్ము కడుపులో రొదలుసేయ,
మందుగొంతుక తడుపగా మంచినీళ్ళ
కరవులోబడి నాస్వామి కలవరించె.

కనకపీఠము ముంగల కప్పురంపు
ప్రభలు వెలుగొంద, అగరుధూపాల నెత్తి,
మంచిపన్నీటిపాదాలు ముంచి కడుగ
పిలుచుచుండియు కలవారు, వెలికిరాడు.


ఏడులోకాల కనుసన్న నేలువాడు
ఇరుకు చీకటి గుడిలోన మరగినాడు—
నాకు లేనట్టి దేవుడు లోకములకు
లేడు, లే డింక—పిలిచినా రాడు, రాడు.



సేద్యము

శ్రీ వేలూరి శివరామశాస్త్రి

ఆదిమమనుష్యుఁడు ముందు కనుఁగొన్నది నిప్పు అని అందఱు నందురు. అతనికి చెట్లు నెలవులై యుండవచ్చును. చెట్టు లొండొంట రాచికొని అడవులు కార్చిచ్చు చేఁ దగులఁబడుచుండఁగా నతఁడు దైనందినము చూచియుండును. నేఁటికిని అడవిదాపులవారు కందిపుల్లమీఁద కందిపుల్లనుగాని, గుమ్మడుపుల్లనుగాని రాచి నిప్పు పడ వైతురు. ఇందులకుఁ గొన్ని రాలనుగూడ నుపయోగింతురు. శ్రౌత కర్మలకు రావికఱ్ఱమీఁద జమ్మికఱ్ఱ పెట్టి మథించి నిప్పు పడునటులు చేయుట పదపటి నేర్పై యుండును.



అడవులందును, కొండలమీఁదను తమంతటఁ దాము పెరుఁగు తృణధాన్యములను జూచి ఆదిమమానవులు సస్యోత్పత్తికిఁ బ్రయతించియుందురు. అటులే మేఘుని దయవలనను, తమ శక్తివలనను పెరిఁగిన చెట్లకాయలను, పండ్లను దిని తోఁటఁ బెంచియుందురు. అదియే సేద్యమునకు[1] సూత్రపాతము.

'జగత్తున కాది యనునది లేదు; కావున నాదిమమానవు లను కల్పన ఉశక్కి' అనువారు వాయుపురాణమును చూచుకొందురు గాక! [3]

ఇపుడు మనకుఁ గల వాఙ్మయమున ఋగ్వేదము ప్రాచీనమగు వేదల అందు నాఁగలి అను పనిముట్టు కనఁబడుచున్నది. నాఁడు నాఁగలితో దున్నుచున్నటు లందు కనుఁగొందుము. కావున నాఁటికి వేల కొలఁది యేండ్లక్రిందటనే సేద్యము కలదని ఊహించుట లగ్గు.

అథర్వణమున నాఁగలి, ఎరువు, క్షేత్రము మొదలగు కృషి విషయములు పెక్కులు కలవు. అటులయినను వ్యవసాయ శాస్త్రమును వేదమున మథించుట కానిపని.

వేదముల తరువాత వేదసంహితలు. తరువాత సంహితలు. తరువాత పురాణములు. ఈ చివరవగు సంహితలందును, పురాణములందును కృషివర్ణనము పరిపూర్ణముగాఁ గలదు. పరిపూర్ణమనఁగా ఆ నాఁటికిఁ బరిపూర్ణము.

సంహితలు

వేదసంహితలకుఁ బిదపఁ బలువురు ఋషులు పురాణసంహితల నొనరించిరి. విష్ణుపురాణము సంహిత, వాయుపురాణము సంహిత, స్కాందము సంహిత, పాద్మము సంహిత—ఇటులు పలు సంహితలు కలవు. అచట నచట వ్యాప్తమయియున్న శ్లోకముల నొకటిగాఁ గూర్చినచో నది సంహిత. కొన్ని పురాణములు ముఖ్యముగా మూఁడు కాలములందు సంహితములయినటు లా పురాణములవలననే తెలిసికొన వచ్చును. ఖగోళమునకు సంబంధించిన విషయములను ఓపికపట్టిచూచి నచో నీ సంగతి తేటపడును. భారతమున భీష్మ నిర్యాణకాలమును, విష్ణుపురాణమున 'మఘాదౌచ తులాదౌచ' చూచునది.

పరాశర సంహిత

పరాశరునకు కృషిపరాశరుఁ డని ఒక బిరుదు కలదు. ఆయన ఒక సంహిత చేసెను. దానికి పరాశరసంహిత యని పేరు.


---

1. సేద్య మను పదము 'ఛేద్య'భవ మని నా యనుమానము. భూమి మొదట ఛేద్యమును, ఛేద్యమును అయి పిదప హల్యమయి యుండును. నేను పిడివాదము చేయను. నిర్ణయించుటకుఁ బరిశోధకు లున్నారు.

2. మొదటికొన్ని అధ్యాయములు. 3. భాగవతము. చూ.

పరాశరుఁడు చాలఁ బ్రాచీనుఁడు. ప్రాచ్యపండితుల మీఁద కంటెఁ బాశ్చాత్య పండితులమీఁదనే యెక్కువ ప్రామాణ్య మున్న వారికి శ్రీ బిల్ ఫోర్డును ప్రమాణీకరింతును. అతఁడు 'పరాశరుఁడు క్రీస్తు వెనుక ౧౩౭౧ వ సంవత్సరమువాఁ డని వ్రాసెను. శ్రీవుకానన్ అతని మతమును ఖండించి 'పరాశరుఁడు క్రీస్తువెనుక ౧౩౦౦ సంవత్సరమున నుండెఁ'నని చెప్పెను. సరియు. సదరు పరాశర సంహిత మూఁడువేల యేండ్ల క్రింది దన్నమాట.

సేద్యముచేయుట చాల మంచిపని యని దాని యుపదేశము. ఖగోళశాస్త్రము చెప్పిన చొప్పున వానలను, దేనినిబట్టి యెప్పు డేపైరు పెట్టిన ఫలసంపదయగునో ఆయాసంగతు లందుఁ గలవు. మఱియు ఎద్దులను వాని లక్షణములను, గోష్ఠమును గోచరములను, గోమయము నెరువుగా మార్చుటయు, నాఁగలి సామగ్రియు, ఏలుకట్ట



సామానును, దుక్కిదున్ను తెఱఁగును, విత్తులు కట్టుటయు, వానినిఁ గాపాడుటయు, విత్తులు చల్లుటయు, ఎరువు వేయుటయు, పైరు కోయుటయు, ధాన్యము నతిచి తూరుపారఁబట్టి రాశిలు చేయుటయు, పాతర వేయుటయు, గాదెలనింపుటయు, వానికి పురుగుపట్టకుండఁ జేయుటయు, పైరులకు నీరుకట్టుటయు, భాద్రపదమాసమున తెవులురాకుండ నీరు పోఁద్రోలుటయు, తెవుళ్ళ కుపాయములును, మళ్లలో నీళ్ళు నిలుచుట కుపాయములును, కోఁతలు కోయుట మొదలగు విషయము లిందుఁగలవు.

హలయంత్రము

నాఁగలి కొనిమిడి ముఖ్యాంగము లిందు చెప్పఁబడెను. ఏఁడి, కాడి, గొడుగ అనఁగా ఏఁడిలేని నాఁగలి, నిర్యోలము(?), పాశ(?), (గొడుగును ఏఁడికిని కలిపి కొట్టు) అడ్డచీల, కౌలము(?), ములుకోల.

ఏఁడి-౫ మూరలు. కాడి - యెద్ల చెవులవఱకు. నాఁగలి-౫ జేనలు. నిర్యోలము - ౧ ష్ట మూర. పాశ - ౧౨ అంగుళములు. అడ్డచీల-౧౨ అంగుళములు. కౌలము-మూరెడు. ములుకోల-౯గాని ౧౨ ౧/౨ గాని పిడికిలి కొలఁదులు; దీనిచివర ఇనుపముల్లు. ఈరీతిగా కొలతలు చెప్పఁబడినవి. 4

ఏలుకట్టసామాను

మోకు నాలుగుచేతులు. పగ్గము ఒకొకటి ౫ చేతులు. ఆబంధము (?) ౧౫ అంగుళములు. పాశ జిల్లేడాకును బోలియుండును-౯ అంగుళములు.

---

4. ఈషా యుగో హలస్థాణు ర్నిర్యోల స్తస్య పాశికా
అడ్డచల్లశ్చ కౌలశ్చ పచ్చనీ చ హలాష్టకమ్
పంచహస్తా భవే దీషా స్థాణుః పంచవితస్తికః
సార్ధహస్తస్తు నిర్యోలో యుగః కర్ణసమానకః
నిర్యోలపాశికాచైవ అడ్డచల్ల స్తథైవచ
ద్వాదశాంగుల మానోహి కౌలో౽రత్ని ప్రమాణకః
సార్ధద్వాదశముష్టిర్వా కార్యావా నవముష్టికా
దృఢా పచ్చనికా జ్ఞేయా లోహాగ్రా వంశసంభవా.

మఱియు పలుగొఱ్ఱునకు ౨౧ మేకులు ఉండవలయుననియు, పాపటము ౯ చేతు లుండవలయుననియును గలదు. 5

ఇది నాఁటి వ్యవసాయపు సామాను. దీనినంతయుఁ బరిశీలించినచో నాఁటికిని నేఁటికిని ఈ హలయంత్రములో నిసుమంతయు నభివృద్ధి యున్నటులు కానిపింపదు. నాఁడు నేఁటివలె నిమిషమునకు నూఱుమణుగుల బియ్యమును, ౬౫ మణుగుల గోధుమలును, ౫౦ మణుగుల పప్పుదినుసులును పడమటి కెగుమతియగుట లేదు. 6 అమెరికా సంయుక్తరాష్ట్రములలో పేదలలో నిఱుపేదరైతున కొక్కనికే యొక చోటనే యేకఖండముగా ౧౬౦ ఎకరములకు తక్కువకాని పొలమున్నటు లీభరతవర్షమున నేరైతునకేని యున్నదా ? అథర్వణమునఁ జెప్పఁబడిన చందముగా నేఁటికిని భరతఖండమున సాగుకాని భూములు చాలఁగలవు. ప్రాచీనకాలమున పాకశాస్త్ర మెవరేని రచించి యుండిరేని 7 దాని జదివినవారు నాఁటికిని నేఁటికిని పాకమున నభివృద్ధి యున్నటులు చెప్పఁజాల రనుకొందును.

పొలము-పైరు-మార్పు

వైదికకాలమున పైరుమార్పు కనఁబడుచున్నది. ఇటులు మార్పునపుడు రెండుగాని, మూఁడుగాని క్షేత్రములు ఉపయోగింపఁబడుచుండెను. ఏఁటేఁటను ఆ మూఁడుపొలములలో నొకదానిని బీడుగా నుంచుట కనఁబడును. దానికి ఖిలమని పేరు. ఔత్తరేయభాషలలో పైరుపెట్టక నిలిపిన భూములకు ఖిల్ అని నేఁటికిని వాడుకయున్నది. మఱుసటియేఁడు ఈ ఖిలమును దున్ని పైరు పెట్టుదురు. పైరు పెట్టిన పొలమును ఒక యేఁడు ఖిలముగా నుంతురు.8 యుక్తికల్పతరు వను ఇటీవలి యొక గ్రంథమునందు పైరు తప్పక మార్చవలయు ననియు, 9 మార్పనిచో పొలము బీడపడుననియు నున్నది.

గోచరములు

మఱియు వైదికకాలమునందు పశువులకుఁగాను బీళ్లయేర్పాటు కలదు. పసులు మేయు బీటికి వ్రజ 10 మనియు, గోష్ఠ 11 మనియు, సుయవస12 మనియు, ఖిలమనియు పేళ్ళు. సస్యపరివర్తనమునకుఁగాక పసుల మేఁతకు ప్రత్యేకముగా బీళ్ళుండియుండును. ఆయకట్టులోఁ జేర్పకమునుపు చాల గ్రామములం దీగోచరములు కలవు.

ధాన్యములు

పురాణ సంహితలకంటె ప్రాచీనతరము లని తలఁపఁబడు వేద సంహితలలో నొకటియైన వాజసనేయ సంహితలోని చమకమునందు వడ్లు, యవలు, మినుములు, నువ్వులు, సెనగలు, ఖ్యాల్వము (పసు గ్రాసము), ప్రియంగువులు, నవము, చామలు, నెవ్వగులు, గోధుములు, మసూరములు 13 ఉన్నటులు కానబడుచున్నవి. సంహితల వెనుక నున్న అథర్వణమున మినుముల14మాట యున్నది. దానికి వెనుకటి దగు ఋగ్వేదమున యవలును' వరులును15 కనబట్టుచున్నవి.

రెండు పంటలు

ఇప్పుడు మెరకనేలలలో పునాసపైగులు కోసిన తరువాత దున్ని ఆ భూమిలోనే ఉలవ వేయుట అంద ఱెఱుఁగుదురు. ఇపుడు వేరుసెనగపంట యెక్కువైన పిదప పునాసలు పూర్తిగా పోయెను. వేరుసెనగ పూర్తిగా పక్వముకాక మునుపే తీయుటయు, వెనువెంటనే ఉలవవేయుటయు జరిగిపోవుచున్నది. వేరుసెనగ యెంత పాడయినను దానికి వెలయున్నది. ఉలవలకు వలసినంతకన్న వలఁతి వెల కదా! ఇట్టి పంటలు రెండు తైత్తిరీయమున తెగులుచున్నవి. 16

పంటలు - ఋతువులు

పై సంహితకాలమునందు యవలపంట గ్రీష్మమున వచ్చునని కలదు. 17 కావున హేమంతమునందు యవలను గొర్తబట్టుదు రని ఊహింపవచ్చును. మన దేశములో స్థలభేదముచే జొన్నలు మఖ పుబ్బ కార్తెలలో విత్తుదురు. ఓమధులవంటి సస్యములు వానకాలమునఁ గోఁతకు వచ్చును. వరులు శరత్తున. కావున గ్రీష్మమునవో, వర్షర్తువునవో వరులు నాటుచుండియుందురు. లేక చల్లుచుండియుందురు. మినుములును, నువ్వులును హేమంత శిశిరములలోఁ దీయుదురు. కావున గ్రీష్మాంతమునవో, వర్షాప్రారంభమునవో పైరుపెట్టుచుండి

5. ఆబంధో మండలాకారః స్మృతః పంచదశాంగుళః ।
యోక్త్రం హస్తచతుష్కం చ రజ్జుః పంచకరాత్మికా
పంచాంగుళాధికో హస్తో హస్తోవా ఫాలకః స్మృతః ।
అర్కస్య పత్రసదృశీ పాశికా చ నవాంగుళా ।
ఏకవింశతిశల్యస్తు విద్ధకః పరికీర్తితః
నవహస్తాతు మదికా ప్రశస్తా కృషికర్మసు.

6. ఇది యుద్ధమునకుఁ జాల వెనుకటియేండ్ల లెక్క.

7. నలుఁడును, భీముఁడును క్రియాశూరులేకాని వాక్శూరులు కారు. ఐనను సంస్కృతవాఙ్మయమున నలపాకశాస్త్రమని ఒక గ్రంథ మున్నది. రుచికలవారు దానికి వ్యాఖ్య వ్రాయవలసియున్నది.

8. ఋక్ ౪-౯౧-౫,౬.

9. తథా వర్షేషు వర్షేషు కర్షణా ద్భూగుణక్షయః
ఏకస్యాం గుణహీనాయాం కృషి మన్యత్ర కారయేత్.

10. ఋక్-౧-౧౦; ౮-౧-౯౨, ౪-౯-౯౪-౧

11. ౪-౪౩-౬-౭౯-౮ ఇత్యాది

12. ౬-౭౯-౨.౧౦-౧౪౨-౩ ఇత్యాది.

13. ౪-౧౪౦-౭; ౧౨-౨-౫౩.

14. ౧-౨౩-౧౫.

15. ౧-౧౯-౭; ౩-౩౫-౩.

16. దీర్ఘ స్సంవత్సరస్య సస్యం పచ్యతే (౫-౧-౮-౩).

17. యవన్ గ్రీష్మే ఓషధీర్ వర్షాభ్యో వ్రీహీం చ్ఛరదే మాషాతిం హేమంత శిశిరాభ్యామ్ (౮-౨-౧౦-౨).

యుందురు. వరిపంటలు కోసినతరువాత కొన్ని నెలలలో రెండవపైరు పెట్టుచుండియుందురు. సస్య పరివర్తనమునకుఁ గొన్ని నెలలు బీడు పెట్టుచుండియు నుందురు. మౌర్యుల యేలుబడిలో సస్యపరివర్తనము అమలులో నున్నటులు సాక్ష్యమున్నది. 18 ఆ కాలమున వరులు కోద్రవములు నువ్వులు ప్రియంగువులు గ్రీష్మాంతమునను, సెనగలు, మినుములు, పెసలు మొదలగునవి వానకాలు నడుమను, యవ కుసుంభ కుసుమ మసూరగోధూమ కలాయసర్షపాదులు శరదృతువునను పైరు పెట్టుచుండినటులు కానవచ్చును.

క్రీస్తునకు సుమారు రెండువేల అయిదువందల యేండ్లవెనుక సంవత్సరమును ఆరు ఋతువులుగా విభజించినటులు కానిపించును. అదియు చాంద్ర సంవత్సరము. ఐనను ఆంధ్రదేశమున నేఁటి ఋతుపవనములఁబట్టి ఆర్యావర్తము మొదలగు ఉత్తర దేశములందలి ఋతువులను బరిగణింపరాదు. దేశభేదమునుబట్టి మార్పులుండును. మాస భేదమునుగూడ జాగ్రత్తతో గమనింపవలెను.

అన్నిటికంటెఁ బ్రాచీనమగు ఋగ్వేదమునందు నాఁగలి యను కొఱముట్టు కనఁబడుచున్నదని లోఁగడఁ దెలిపియుంటిని:—

శునం వాహాః శునం నరః శునం కృషతు లాంగలం
శునం వరత్రా బధ్యంతాం శున మష్ట్రా ముదింగయ.

(౪-౫౭-౪)

ఎద్దులు సుఖముగా లాగుఁగాక. మనుష్యులు సుఖముగా పని చేయుదురు గాక. నాఁగలి సుఖముగా దున్నుఁగాక. పగ్గములు సుఖముగా కట్టఁబడుఁగాక. ములుకోల సుఖముగా తోలుఁగాక.

అర్వాచీ సుభగే భవ
సీతే! వందామహే త్వా
యథా న స్సుభగా మసి
యథా న స్సుఫలా మసి.

[ఓ సీతా! (నాగేటి చాలు) మా కభిముఖివి కమ్ము. నీకు నమస్కరింతుము. మాకు నిండుగా పండుము.]

---

18. అర్థశాస్త్రము-రెండవ భాగము (మైసూరు ప్రతి.)



తోటకు తవ్వాటం

"అధికాహారోత్పత్తి" ప్రయత్నంలో ప్రతిమెట్టునందూ నేలను తయారు చేయుటకూ, కలుపుతీయుటకూ, నీరు పోయుటకూ, గట్టువేయుటకూ పని ముట్లను ఉక్కు ఇచ్చును.

తాతా ఉక్కు



తాతా ఐరన్ & స్టీల్ కంపెనీ లిమిటెడ్,

హెడ్ సేల్సు ఆఫీసు:

102 A, క్లైవ్ స్ట్రీట్ కలకత్తా.



స్త్రీ పురుషులకు
దేహమనోబలములను పెంపొందించు
దివ్యరసాయనము ......
జీవామృతము
VAIDYARATNA
PANDIT
D. GOPALACHARLU
JEEVAMRUTHAM
THE BEST
NERVINE
TONIC
AYURVEDASRAMAM
MADRAS
VASANT
పండిత డి. గోపాలాచార్యులవారి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్.
మద్రాసు.17.
J.H.P

నాటకకళ : సినిమాకళ

— శ్రీ గోవిందరాజుల వెంకటసుబ్బారావు —

ఈ పై కళలలో జోవుడ్డోల్లుణ్ణి అనుకుని నేను యీవ్యాసము వ్రాయటంలేదు. ఇదొక పెద్దవ్యాసమూ కాదు; ముందుగా యీ విషయాలు గమనిస్తే బాగుంటుంది. వీటిలో నేనేదో క్వచిత్తు పచరిస్తూ వుండడంవల్లా, ఇతరులవద్ద వీటిపచనరుచిచూస్తూ వుండటంవల్లా దీనిని వ్రాయటానికి కొంత ఆధారం ఏర్పడ్డది అసలు.

ఏ కళ అయినాకానీ ఎందుకు పుట్టింది అని ప్రశ్నించుకొందాము. మానవ పరిపక్వ పరమావధులకు వేరువేరు తోవలను మహాపురుషులు మొదలు ఆఅరణ్యములో తీసివుంటారు. అవ్వే రానురాను హద్దుపడి కాలిబాటలై, రహదారులై, ఆ విశ్వమయుడి పట్టణాన్ని సూచిస్తూ ఆఉన్నతశిఖరాలని దవ్వుదవ్వులలో గోచరింపజేస్తూవుంటాయి. అవే కళలని నాఉద్దేశం. అందులో లలిత కళలు పెద్ద రహదారులు.

యీ తత్వవిచారణ కట్టిపెడుదాం. చాలాదూరము లాక్కుపొయ్యేటట్లు వున్నది. అసలు కీలకము ఎక్కడ వున్నదంటే ఏదోవొక వృత్తాంతం వినటమో, కనటమో చేస్తూ వుండాలని అనిపిస్తూవుంటుంది ప్రతి మానవుడికీ. కారణం ఏమిటా అని చూస్తే ఏం కనపడుతూన్నదంటే, తన జీవిత పాఠాలను, అనుభవాలను దాటిపోయిన జీవుల పాఠాలతోను, అనుభవాలతోను వరిపిడిచేసి, వన్నెవాసి కట్టుకోవాలని తన ఆత్మ లోపల పూరికే సందడిచేస్తూ వుంటుంది.



మళ్లీ ఓ అగాధంలోకి పోతున్నానే? వెనక్కు తగ్గుదాం. ఇటీవల యీఅగాధాల లోతు త్రవ్వి చూద్దామని అనిపిస్తుంది. ఎందుకోగానండి, యీ అగాధాల లోతులు చాతనైనంత మట్టుకు తడివి చూద్దామా అని అనిపిస్తున్నది. యిది వేరేవిషయం.

పైన చెప్పిన, చెప్పని, ఏదోవిధంగానైనా మానవుడికి అభిలాష అనేది కలిగింది. సరే, బాగానే వుంది. మరి యిది తీరేది ఏలాగ? ఆ విషయాలన్నీ వాటి వాటినైజ పరిణామాలతో, పరిపుష్టులతో, వుద్వేగాలతో తన కళ్ల ఎదుట కట్టినట్లు చూపించగల సాధనాలు కావాలసి వచ్చినై. యీ విధంగానే బొమ్మలాటలు మొదలు దశవిధరూపకాలుగా ఏర్పడ్డాయి. లలిత కళల సహాయ సంపత్తులతో జనసముదాయాలను ఆకర్షించి నాయి. కృత్రిమాలని తెలుసుకొనికూడా అందుకు రాజీపడి తన తృష్ణలను తీర్చు

కున్నాడు మానవుడు కొంత కాలము. బాగా సింహావలోకనము చేసిచూద్దాం.

యీ పైరెండు కళలూ ఎందుకు పుట్టినాయా అని పైన చెప్పాను కనుక ఏరహస్య కారణార్థమువల్ల ఎలా పుట్టినయ్యో చూద్దాం. యిలా తరిస్తే ఏదైనాసత్పదార్థం తేలునేమో. ముఖ్యముగా జరిగినదాన్ని, ఎప్పుడైనా ఒకప్పుడు జరగనున్నదాన్ని చూద్దాం, కళ్ళారాచూద్దాం అని ప్రతిమానవుడికీ ఎందుకు వుంటుంది అంటే అది జరుగుతూవున్నప్పుడు ఇతగాడు అక్కడ లేడు—మొదటి సంగతి. మరో సూక్ష్మం—ఏదోవొకటి ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది గనుక అది క్షణక్షణానికీ యీ విశ్వచరిత్రలాగ మారుతూవున్నది కనుక, ఆ మార్పులన్నీ పూర్తి అయి అది ఓ అవసానానికి వచ్చేవరకూ దేన్నీ ఎవరూ వూహించలేరు, చూడలేరు. రెండురాళ్ల మధ్యది వక్కమైలు అని నిర్ణయించుకున్నట్లు, జరిగిపోయిన విషయాలను గురించి అనుకోవచ్చు. అది జరిగినప్పుడు మనము దాంట్లో లేకపోతిమే, అధమపక్షం జరుగుతున్నప్పుడు చూడనన్నా చూడకపోతిమే అనే హృదయ దాహం కొంతకాలానికి హెచ్చి విదాహమైపోతుంది. జరుగనున్న దానిని చూద్దామని ఎవ్వరూ ఉబలాటపడరు. అవ్వి అలా అనుకున్నరీతిగా జరుగుతాయో లేదో అన్న నిశ్చితం లేదుగనుక. నిశ్చితము లైనప్పటికీ అవి యిప్పటికీ అబద్ధాలుగా తోస్తాయి; నిబద్ధాలుగా తోచవు. కాబట్టి ఏదో జరిగినదాన్ని 'వన్సుమోర్' (Once more) చేయాలనిన్నీ, జరుగనున్నదాన్ని నో మోర్ (no more) చేయాలనిన్నీ పట్టుపడతాడు మానవుడు. దీనికని ఏర్పడ్డయి ముఖ్యంగా నాటకాలు. కాని యివ్వి ఎంత బాగా వ్రాయబడ్డప్పటికీ, ఎంత కాళిదాసీయాలూ భవభూతీయాలూ అయినప్పటికీ యాథార్థ్య నిరూపణకు ఆవృత్తాంతాన్ని వన్సుమోర్ చెయ్యడానికి బలము చాలకపోయింది. లలిత కళల సహాయాలను అన్నిటినీ తీసుకొనిగూడా యివి కూడా బూటకాలని అనిపించినాయి. ఏరసం సిద్ధించాలని అనుకున్నాడో, ఏది సిద్ధించి తన ఆత్మకు శాంతి చేకూర్చుతుం దనుకున్నాడో అది లభ్యంగాకపోయింది. అప్పటికున్న సాధన సంపత్తులతో ఛాయాగ్రహణం బరిమీది కొచ్చింది. సెహబాస్, మంచిది అనుకున్నాడు. యీ సాధనమే ఆ వృత్తాంతం జరిగినప్పుడు వుండివుంటే ఎంత బాగుండేది, అది అంతా నాయిష్టమొచ్చినప్పుడు ఎన్నిమార్లయినా చూచివుండేవాణ్నిగదా, అయ్యో యింత ఆలస్యంగా పుట్టావేవమ్మా అని అనుకుంటూ ఆ కళామతల్లిని ఆలసించక వెంటనే ఆరాధించడం మొదలు పెట్టాడు. మూగచిత్రం(Silent Picture) అనేది లోకవృత్తంలోకి వచ్చి వ్యామోహాకరించింది. దాంట్లో ఆయా వ్యక్తులు మాట్లాడం మనకు వినపడటం లేదుగాని అది వాళ్లూ చేస్తూనేవున్నారు అని అనిపించినంత యాథార్థ్యనిరూపణవరకూ విజయవంతుడయ్యాడు.

యింతలో శబ్దగ్రహణశక్తి అనే వేగుచుక్క కూడా ఆకాశాన్న పుటుక్కున పొడిచింది. నైజతేజంతో సూర్యుడు బయటికి వచ్చేస్తున్నాడు. దీన్ని, అనగా యీ శక్తిని తన కింతకుముందు లభ్యమయిన ఛాయాగ్రహణ శక్తితో జోడించితే తన విజయం సంపూర్ణం అయిపోతుంది అనుకొని యీ సంధానం టాకీలలో చేశాడు. అందుకనే యిప్పుడు తీస్తూవున్న వార్తా చిత్ర ఖండాలు (News Reals) ముందు రాబోయేవారికి ఎంత పావనంగా ఉంటాయో చాలామందికి తెలియదు. ఇది ఒక పెద్ద రికార్డు. దీనికి లోబడే చరిత్రకారులు ముందు తమ లోకచరిత్రలను వ్రాయవలసి వుంటుంది. ఇప్పుడు పూరించిన రీతిగా, యిప్పుడు పడుతూవున్న అష్టకష్టాలు పడకుండా వివిధ దేశ చరిత్రలను పూర్తి చేయవచ్చు. యీ టాకీ సాధనసంపత్తే క్లియోపేట్రానాటి కాలానికి ఉండివుండినట్లయితే ఆవిడకూ, జూలియస్ సీజరుకూ వుండివుండిన సంబంధమూ, ఆవిడకూ యాన్టనీకీ వుండివుండిన సంబంధమూ, ఆనాటి ఏక్టియంవద్ద నౌకాయుద్ధము, ఆనాటి నిజచరిత్ర షేక్స్పియర్ బెర్నార్డుషాలనెత్తిన పడకుండా మనకందరకూ తెలిసివుండేది. యింతెందుకు? క్రీస్తుపుట్టుక, బుద్ధునిపుట్టుక (తలచుకుంటే నాగుండె విప్పారి ఊరికే ఎగురుతూ గం


తులు వేస్తూవున్నది.) కౌరవ పాండవయుద్ధం, రామాయణం, భాగవతం, సీజ్ ఆఫ్ ట్రాయ్-వెయ్యేల, ప్రపంచ చరిత్ర యావత్తూ నూటికినూరువంతులు యథార్థంగా చూచివుందుమే. ఎంతఅవకాశం మనకు తప్పిపోయింది, యీ టాకీ ఎప్పుడో పుట్టకపోవడంవల్ల అని అనిపిస్తుంది. అందరిమాటా చెప్పలేనుగాని నాకిలా అనిపిస్తుంది. చివరకు యిదా మీరు తేల్చేది అని అనగలరు. కాని సినిమా కళను గురించి నేను చెప్పగలిగింది అదే. యాథార్థ్య నిరూపణే దీని పరమావధి. అది ఆపని మన దేశంలో, లేదా మనదక్షిణప్రాంతాల్లో, మనం తయారు చేస్తూవున్న ఫిల్ములలో కొంతవరకైనా చేసుకుంటుందా అని ప్రశ్నించుకొంటుంటే బాబూ లేదు, యింకా లేదు అని జవాబు చెప్పవలసివస్తుంది. కారణమేమిటంటే, మనకుపూర్వపు నాటకాల మహాయుగం యింకా అస్తమించి పోలేదు. అది యీ కళలోకి వచ్చి జొరబడ్డది. ఎంతదూరం చెడగొట్టవలెనో అంత చెడగొట్టి పరమావధికి దూరంచేసేసింది. ఆ పరిస్థితుల్లోవుంది ప్రస్తుతం. నాటకమహాయుగం అంతరిస్తుందా అని నన్ను ప్రశ్నించితే, అది అంతరించదు. కొలది కాలంలోనే నూత్న వినూత్న పరిణామాలను చెంది యిప్పుడు ఒక సినేరియో రూపం తాలుస్తుంది. విజయవంతంగా యీ సినేరియో నాటకం ఆడితే యిదే టాకీ అయిపోవాలి. యిది నాకళ్లముందు నపడుతున్న దృశ్యం.

యీమార్పు నాటకకళ తెచ్చుకునేంతవరకూ ప్రేక్షకలోకం సందడి చేస్తూనేవుంటుంది. యీ రెండు కళలకూ పూర్వమున్న సరిహద్దులు, రాబోయే సంబంధ బాంధవ్యాలు యివి అని తోచింది.

యిక నటుల విషయం కొంత చెప్పి శెలవు తీసుకుంటాను. ముందుసంగతి. నాటకాల్లో నటించే నటుడు సినిమాల్లో పనికిరాడు. సినిమాల్లో నటించే నటకుడు నాటకాల్లో పనికిరావచ్చు. రెంటిలోనూ పనికివస్తే ఆయావ్యక్తుల పూర్వజన్మ సుకృతమే అనవచ్చు. నాటక నటనకూ, సినిమా నటనకూ చాలా భేదమున్నది. దాంట్లో వున్న కష్టాలు దాంట్లో వున్నాయి. దీంట్లోవున్నకష్టాలు దీంట్లోవున్నాయి. రాత్రి తొమ్మిదిన్నర నుంచి రెండు గంటల వరకూ, లేక మూడుగంటలవరకూ నాటక నటుడు తన కళానైపుణిని ఎక్కుబెట్టి సంధానంచేసి తనగురిని కొట్టగలడు. సినిమానటుడు యిదేపని కొన్ని నెలలమీదుగా సర్దుకొని ఆచిఆచి - ఆగిఆగి గురిని కొట్టవలసి వస్తుంది. కాబట్టి సినిమా నటుడు గురిని తప్పటానికి బోలెడంత సావకాశముంది. నాటక నటునకు యిది లేదు. సినిమా నటునకు మరిఒక కృత్రిమ సహాయంకూడా తన విజయానికి తటస్థించింది. ఆ ఛాయాగ్రాహకుడి అసాధారణ శక్తివల్ల, ఆశబ్దగ్రాహకుడి అసాధారణశక్తివల్ల కొత్త కొత్త డిస్టార్టో గ్రాఫులెన్నువల్ల సినిమా నటుడు తాను చెయ్యని నటన, అనని మాట, అనుకోని రూపము తెచ్చుకొని యథార్థనిరూపణకు సహాయ పడవచ్చును. ఇది యితరుల మీద ఆధారపడియుండే సహాయం. తనది గాదు.

యీవిధంగా మరికొన్ని తారతమ్యాలు కూడా చెప్పవచ్చునుగాని ముఖ్యమైనవి మాత్రమే మనవి చేశాను. నాటకాలు ముమ్ముందు నేచెప్పిన రూపము తాల్చినా టాకీలు, వాటి భవిష్యత్తు వీటిని బట్టి చూస్తే జనసముదాయాన్ని రానురాను ఆకర్షించుతాయా లేదా అనేది నాకు చాలా అనుమానంగా వుంది. ఒక మహాయుగము మనముందు ఆవలిస్తూ కనిపిస్తుంది. దాంట్లో టాకీలుతప్ప నాటకాలు వుండవేమో నేను చెప్పలేను.

విరమిస్తున్నాను.



ఆంధ్రదేశమందలి కొన్ని ముఖ్య పరిశ్రమలు

మన కర్తవ్యము

*

— శ్రీ గుమ్మిడిదల వెంకటసుబ్బారావు —

ఆంధ్రదేశము సర్వతోముఖముగ అభివృద్ధిగాంచవలెనని యెల్లరును ఆశించుచున్నారు. అందు ఆర్థికాభివృద్ధి అన్నిటికిని ప్రాతిపదిక. వీనిలో ప్రాజెక్టులు—పరిశ్రమలు ముఖ్యమైనవి.

తుంగభద్ర-ఇతర ప్రాజెక్టులు

ఇందు రాయలసీమ కాటకనివారణకై చిరకాలమునుండి ఆంధ్రులు వాంఛించుచున్న తుంగభద్రప్రాజెక్టు సర్ శొంఠి వెంకట రామమూర్తిగారి చేతిచలువచే యెట్టకేలకు ప్రారంభించబడినది. ఈపని పూర్తియగుట కింకను ౫ యేండ్లు పట్టునని యిటీవల ప్రధాని ప్రకాశంగారు చెప్పియున్నారు. ఈలోగా యిందు కెట్టి విఘాతము జరుగకుండునటుల మనము యేటేటా విఘ్నేశ్వరుని కొలుచుట అవసరము.

తుంగభద్రప్రాజెక్టుకంటెను ముఖ్యమైనది రామపాదసాగర ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టువల్ల ఆంధ్రదేశానికే కాకుండా, ఇండియా కంతకీ ధాన్యంకరువు తీరుతుందని శొంఠి రామమూర్తిగారు అంచనా వేసేరు. అమెరికాకు ఇంజనీర్లను పంపించేరు. ఢిల్లీప్రభుత్వాన్ని కూడా అంగీకరింపజేసేరు. ఈ ప్రాజెక్టును మనస్సులో పెట్టుకొని కాంగ్రెస్‌మంత్రులకు "రామపాదసాగర్ ముందు-ఆంధ్రరాష్ట్రము తరువాత"అని శ్రీ రామమూర్తిగారు ఉపదేశం చేసేరు. మన మంత్రులును ఆ ఉపదేశాన్ని శిరసావహించేరుకాని ఈయేటి బడ్జెటు లెక్కలు చూస్తే మనకు యీ ప్రాజెక్టుపనీ వెనుకబడిపోయింది, ప్రోవిన్సుప్రయత్నం అసలే లేదు. ఇప్పటికైనా మన నాయకులు ముందుపనులు ముందుచేయించుకొని దరిమిలా పనుల గురించి దరిమిలా ఆలోచించుకోవడం మంచిది. లేకపోతే, ఉభయ భ్రష్టత్వము అవుతుంది. కాని ఆంధ్రరాష్ట్రస్థాపనానంతరమైనా యీ రామపాదసాగరప్రాజెక్టువిషయమై తీవ్రముగా ఆలోచించవలసే వుంటుంది. ఈప్రాజెక్టుపని అంతా కేంద్రప్రభుత్వమే చేయించవలెనన్న ఆలోచనయు, ఈ ప్రాజెక్టు ప్రస్తుతం చెన్నపురిప్రభుత్వం సంకల్పించిన స్థలమునందుగాక వేరొకచోట గోదావరీ, శబరీనదులపై విడివిడిగా నిర్మిస్తే హైదరాబాదుతో వ్యవహారము తేలికగా పరిష్కారము కాగలదనే సూచనను ముందుముందు మనము జాగ్రత్తగా పరిశీలించవలసి యుండును.

ప్రస్తుతం అమలులో నున్న ఆంధ్రోత్కళప్రాజెక్టు దుడుమా ఎలెక్ట్రిసిటీప్రాజెక్టు. ఈ ప్రాజెక్టుకూడా అడ్వైజరీప్రభుత్వమువారి భిక్షే. పని ప్రారంభమైన దనిన్నీ, ఈయేడు బడ్జెటులో ఈపనికి సావకాశంకూడా కలిగించేరనిన్నీ వినుట సంతోషవార్త. ఎలెక్ట్రిసిటీ విషయమై ఆంధ్రజిల్లాలకును, ఆంధ్రేతరజిల్లాలకును యింతవరకు జరిగిన ఖర్చు ఒకటి- పది నిష్పత్తిలో నున్నది. ఎలెక్ట్రిసిటీ విరివిగను, చౌకగను లభ్యముకానిచో ఆంధ్రదేశమందలి పరిశ్రమలేకాక వ్యవసాయమును బాగుపడజాలదు. ఈ సందర్భములో కర్నూలునం దొక థెర్మల్ స్టేషన్‌కు యీఏడు ౧౧ లక్షలు శాంక్షనుచేయుట సంతోషవార్త. బెజవాడలో కట్టదలచిన నూతనపవర్‌హౌస్ విషయ మేమయ్యెనో తెలియుటలేదు.

నీటి ప్రాజెక్టులలో చిరకాలమునుండి నిలచియున్న కృష్ణా, కుముద్వతీ ప్రాజెక్టులు వెనుకబడి పోయినట్లే భావించవలసియున్నది. ఇది యెంతయు శోచనీయము. ప్రస్తుత ప్రొహిబిషన్ పాలసీ అట్లే యున్నచో యీ ప్రాజెక్టులకు మనము తిలోదకములను వదలుకొనవలసి వచ్చును.

పరిశ్రమలలో బెజవాడలో ఒక యెరువుల ఫ్యాక్టరీని గురించి కేంద్రప్రభుత్వ మాలోచించుచున్నట్లు ఇటీవల పత్రికలు ప్రచురించినవి. ఈ ఫ్యాక్టరీ విషయమై యీ దిగువ వివరములను ఆంధ్రులు గుర్తించుట అవసరము:

ఎరువుల ఫ్యాక్టరీ

ప్రస్తుతము ఉత్తర హిందూస్థానమునందు సింద్రీ యనుచోట భారతప్రభుత్వ మొక యెరువుల ఫ్యాక్టరీని స్థాపించుచున్నది. అచ్చటనే ఒక సిమెంటు ఫ్యాక్టరీకూడ స్థాపించబడును. ఆ ఫ్యాక్టరీ యొక్క అంచనావ్యయము ౧౦ కోట్ల ౨౬ లక్షలు. ఇందు సాలుకు ౩న్నర లక్షల టన్నుల అమోనియం సల్ఫేటున్నూ, ౧ లక్ష టన్నుల సిమెంటున్నూ తయారుచేయబడును. 'ఫ్యాక్టరీ యేర్పాటన్నియు

ఇండియా సిరమిక్సు లిమిటెడ్

109, పూనమల్లి హైరోడ్డు, కిల్‌పాక్,

మదరాసు.

ఫ్యాక్టరీలు

నెల్లూరు - కాళహస్తి

★ ఆంధ్ర పరిశ్రమ ★

* పరిశుభ్రతకు
* నవీన రకములకు
* అన్ని గృహోపకరణములకు
* విద్యుద్దీపాచ్ఛాదనములకు
* జలదారులకు
* అందమైన పింగాణీ బొమ్మలకు
* పూరుగాయ, పచ్చళ్ల, జాడీలకు
* ఇంకను పలువిధములైన పింగాణీ వస్తువులకు

ఈ ఆంధ్రపరిశ్రమ, దక్షిణదేశములో పేరెన్నిక గాంచినది.

ఏదో కేవికావలయుననిన, అవి మా ఫ్యాక్టరీనుంచి సప్లై చేయబడును

పూర్తియైనవి. కట్టడములు ప్రారంభమైనవి. ౧౯౪౯లో పని ప్రారంభించ బడును.

ఉత్తరాదిని యీ ఫ్యాక్టరీ సంకల్పించినప్పుడే ఇట్టి ఫ్యాక్టరీని మరొకదానిని దక్షిణాదినికూడ స్థాపింపవలెనని ప్రభుత్వము నిశ్చయించెనట. అందుకు బెజవాడ తగినస్థలమని ప్రభుత్వమునకు సూచింపబడిన దనియు, యీ నూతనఫ్యాక్టరీకి అవసరమగు సీమ సున్నము (జిప్సమ్) బికనీరు ప్రభుత్వము సప్లయి చేయుటకు అంగీకరించినట్లును ఇటీవల కేంద్ర శాసన సభలో పారిశ్రామికసభ్యుడు శ్రీయుత్ సి. రాజగోపాలాచారిగారు ప్రకటించిరి. ఈ ఫ్యాక్టరీ బెజవాడకే కాక, ఆంధ్రదేశమున కంతకు ఒక మహదవకాశము కలిగించగలదు. దీనిని ఆంధ్రుల అలక్ష్యముచేత రే కోయంబత్తూరో తన్నుకొని పోకుండునట్లు మన నాయకులు చూడవలసియున్నది.

బట్టల మిల్లులు

బట్టల మిల్లులలో ఆంధ్రదేశ మధోగతిలో నున్నది. ఇందు ముఖ్యముగ రాయలసీమప్రాంతమందు చక్కని ప్రత్తి పండును. సర్కారులలో గుంటూరుజిల్లా ప్రత్తిపంటకు ప్రసిద్ధికెక్కినది. మన ప్రక్కనున్న హైదరాబాదు నూతనముగా పదిబట్టలమిల్లులను నిర్మించుచున్నది. శ్రీ ప్రకాశంగారి ఖాదీ కార్యక్రమముయొక్క బాగోగుల విషయము నటుంచి, ఆంధ్రదేశము పారిశ్రామికముగా అభివృద్ధిగాంచవలెనన్నచో మనకీ బట్టలమిల్లులు అత్యావశ్యకమని మనము గుర్తించవలెను. ఈ రాజధానిలో యిప్పుడున్న బట్టలమిల్లులను చాలభాగము దక్షిణాదినే యున్నవనియు, మన చేనేత వస్త్రపరిశ్రమకూడ నాటికి నాల్గుపాళ్లు మిల్లునూలుపైనే ఆధారపడియుండుననియు మనము గ్రహించుట అవసరము.

రేవుల అభివృద్ధి

మన రేవుపట్టణముల అభివృద్ధియు అత్యంత ముఖ్యమై యున్నది. భారతదేశమందలి అన్ని ప్రాంతములలోను ఆంధ్రులకు నావికాసంప్రదాయ మెక్కువ. మన "యజ్ఞశ్రీ" యొక్కడే నౌకానాణెములను చిత్రించుకొన్న భారతప్రభువు. ఛత్రపురంమొదలు చెన్నపురివరకు మనకు పెద్ద కోస్తా యున్నది. ఇటీవల విశాఖపట్నం, కాకినాడ రేవులు యుద్ధకాలమందు కొంత అభివృద్ధి గాంచినవి. కాని వీనిలో కాకినాడ తిరిగి వెనుకముఖము పట్టినట్లు తోచును.

బందరుగోడు నెవరికినీ పట్టినట్లు కాన్పించదు. చీరాల వాడరేవు విషయము చీరాల, పేరాల పంచాయతీ బోర్డువారు కొంత కలుగజేసుకొనిరి. నేను మద్రాసుపోర్టు మంత్రిని చూచితిని. కడపటసారి యీ విషయము చెన్నపురి పోర్టుట్రస్టువారి విచారణలో నున్నదని మంత్రిగారనిరి. ఆంధ్రులకీ రేవుపట్టణమభివృద్ధికి వచ్చునేమోనని కొందరు యిందుకు అడ్డుతగిలినట్టును, కొందరు తమిళ శాసనసభ్యులు తూత్తుకుడి రేవును, కడలూరు రేవును బాగుచేయించమని కోరగా మంత్రివర్గము కొంత శ్రద్ధచూపెననియు వినికిడి. కనీసము మన శాసనసభ్యులైనను యీ చీరాల వాడరేవు గురించి శ్రద్ధచేయుట అవసరము. పేరాల పంచాయతీవారి తీర్మానముప్రకార మిచ్చట ౪-౫ ఫర్లాంగుల "పయర్" (వంతెన)మాత్రమే ప్రస్తుతము చాలునని తోచును. ఇది చాల సులికపని. కోస్తా వ్యాపారాభివృద్ధినిగూర్చియు, గోదావరీ నదీముఖములందును, విశాఖపురియందును నౌకానిర్మాణము గూర్చియు కేంద్రశాసనసభ్యులు కృషిచేయవలెను. ఆంధ్రదేశమందొక నావికాసంఘమును అవసరమే.

రైళ్ల విషయము

రైళ్ల విషయమై చెన్నపురిమొదలు గుంతకల్లువరకును, చెన్నపురినుండి బరంపురంవరకును రెండవ రైలుబాటయు, రైళ్లలో సాధ్యమైనంతలో విద్యుచ్ఛక్తిప్రవేశమును చాల ముఖ్యమైనవి. బెజవాడనుండి బందరువరకు పెద్దగాడికిమార్పుట అవసరము. హైదరాబాదునుండి చీరాల కొక నూతనబాటయు, బెజవాడనుంచి ఢిల్లీ, నాగపూర్, హైదరాబాదులకు క్రొత్తబండ్లును కావలసియున్నవి.

ఇతరపరిశ్రమలలో గుంటూరుజిల్లాయందలి రెంటచింతల స్ఫటికము రైలుబాటలకు కంకరగా వినియోగమగుచున్నదని తోచును. బొగ్గునుగూర్చి యిటీవల వ్యవహారశాఖాకార్యదర్శి బి. కె. గోఖలే గారిటులచెప్పిరి: "ఆంధ్రదేశములో ౩,౨౦౦లక్షల టన్నుల నేలబొగ్గు మంచి నాణ్యమైనది త్రవ్వితీయుటకు వీలుగలదు. ఉత్తరసర్కారులలో నేలబొగ్గు లభించును. దత్తమండలములలో ఇనుపగనులు కలవు. సీసముకూడ దొరకును." ఇట్టి గనులపరిశ్రమకు విద్యుచ్ఛక్తి చౌకలో అందుబాటునం దుండవలెను.

గృహనిర్మాణము

ప్రపంచయుద్ధానంతరము ప్రతిచోటా విరివిగ నూతన గృహనిర్మాణము రొక్కడుప్రాముఖ్యత వహించుచున్నది. వీనిలో కోటి రూప్యముల నూతనప్రభుత్వభవనముల(లేక కోటల)నుంచి, నూరు రూప్యముల పేదల కుటీరములవరకు అవసరముండును. ఈ నిర్మాణము నకై కేంద్రప్రభుత్వమునుండి పల్లెటూరి పంచాయితీబోర్డువరకు కృషి చేయవలసియున్నది. కేవలము ప్రభుత్వముమాత్రమేకాక, యిందు వందలాది గృహనిర్మాణసంఘములకును తావు కలదు. ఇందు కవసరమగు యిటుక, లేక రాయి, సున్నము, కలపసామానులు, ఇనపసామానులు మున్నగువాటి నన్నిటిని సిద్ధపరచుకొని, నిపుణులగు ఇంజనీర్ల సహాయముతో ప్రతితాలూకాపట్టణమందును కనీస మొకటి రెండు గృహనిర్మాణకంపెనీల కిప్పుడు తావుకలదు. అటులనే సినీమాలు, అచ్చుప్రెస్సులు, మోటారులారీలు, బస్సులు, కారులు, వ్యవసాయపనిముట్లు, గృహపరిశ్రమలు మున్నగు అనేకపరిశ్రమలు యెంతయో అభివృద్ధిగాంచవలసియున్నవి.

బ్యాంకులు

వడ్డీవ్యాపారవిషయమై - మన మెంత ధనవంతులమైనను, వ్యాపార, పారిశ్రామికవిషయములలో విరివిగా పెట్టుబడిసొమ్ము అవసరమగును. ఆంధ్రదేశమం దిప్పు డెన్నికోట్లతో వడ్డీవ్యాపారము జరుగుచున్నదో మన మెరుగము. పూర్వము ఈసొమ్ములో సగభాగము మార్వాడీలును, మిగతపెట్టుబడి ఇంపీరియల్ బ్యాంకియు యిచ్చెడిది. ఇప్పుడు మార్వాడీలు కొంతవరకు వెనుకతగ్గినటుల తోచును. కాని ఆంధ్రేతరబ్యాంకు లిచ్చట హెచ్చుపెరిగిపోయినవి. మన తెనుగుగడ్డలో పుట్టిన తెనుగుబ్యాంకులు బ్యాంకింగ్ వ్యాపారములో నాటికి ఒకవంతు వ్యాపారమునైనను సాధించలేకున్నవనుట అతిశయోక్తికాదు. ముందుముందు మనకు వ్యాపార, పారిశ్రామికాభివృద్ధి జరుగవలసి

యున్నచో; మనము ఆంధ్రదేశమందు నూతనబ్యాంకీల స్థాపన కొరకును, ఉన్న తెనుగుబ్యాంకీలను అభివృద్ధిపరచుకొనుటకును యత్నించవలెను. నా అభిప్రాయములో కనీస మొక కోటిరూప్యములతో ఆంధ్రదేశమందొక పెద్దబ్యాంకి వెంటనే యవసరము. ఆంధ్రనాయకు లీపనికి పూనుకొనని పక్షమందు కనీసము ప్రభుత్వమైనను యీయత్నము చేయవలెను. ఈ సందర్భమున యిటీవల ప్రభుత్వము సూచించిన రాష్ట్రపారిశ్రామికబ్యాంకి, కార్పొరేషనులలో తగు పాటి డైరెక్టర్ల స్థానములు ఆంధ్రులకు ప్రత్యేకించబడనిచో ఆ సంస్థలును దాదాపు తమిళసంస్థలే అయిపోయి, అందలి ధనమును తమిళపరిశ్రమలకే ఉపయోగపడును. రాజమహేంద్రవరం పేపరుమిల్లుకు పూనానుండియు, బెజవాడ నూలుమిల్లుకు కోయంబత్తూరునుండియు ధనసహాయము కావలసివచ్చిన దుర్గతిని మన మీసందర్భమున మరచిపోకూడదు.

విమానాశ్రయములు

ఆంధ్రజిల్లాలలో బళ్లారిలోను, బెజవాడసమీపమున గన్నవరములోను లోగడ రేండ్లక్రిందటనే ౧౫ విమానాశ్రయములు సంకల్పించబడినవి. యుద్ధసమయమందు యీ ఆశ్రయములకుతోడు వివిధాంధ్రమండలములందు కొన్నిలక్షలు-కోట్లఖర్చుతో, మరికొన్ని విమానాశ్రయములను నిర్మించిరి. యుద్ధము ముగియగనే యివన్నియు కుక్కగొడుగులవలె అంతరించినటుల తోచును. వీనిలో బళ్లారిలోగాని, బెజవాడలోగాని ప్రస్తుతము విమానములు దిగుటలేదు. చెన్నపురినుండి ఢిల్లీపోవలసినచో హైదరాబాదుమీదుగా వెళ్ళవలసియున్నది. విమానటపాలాకును యిప్పుడు ఆంధ్రదేశములో సౌకర్యములు లేవు. ముందుముందు ప్రజాజీవితములో విమానములు ఎక్కుడు ప్రాముఖ్యత వహించి తీరును. ఇప్పుడు మోటారుకార్లు ఉన్నట్లుగనే ముందుముందు ప్రతి శ్రీమంతుడును విమానములను కలిగియుండు రోజు లాసన్నమగుచున్నవి. ప్రస్తుత "జీపు"కార్లకైపు తాత్కాలిక దాస్యచిహ్నమే. మన గృహనిర్మాణములోకూడ యింతటనుండి పెద్దభవనములలో యింటిప్రక్క గేరేజీలకంటె పైనుండి విమానములు దిగుటకు సావకాశమును మన ఇంజనీర్లు కల్పించవలసియుండును. అందుచే ఆంధ్రదేశమునం దిప్పు డేర్పడిన విమానాశ్రయములు బీడుపడిపోకుండచూచుటకును, వాని నన్నిటిని సాధ్యమైనంతలో వినియోగపరచుటకును, పలుస్థానములందు విమానములు యాత్రీకులను, తపాలాను యెక్కించుకొని దింపుటకు వలయు స్టేషన్లను యేర్పరచుటకును మనము యత్నించవలెను.

జమీందార్ల ధర్మము

ఈ పారిశ్రామికాభివృద్ధి సందర్భములో మరొక్కమాట. ఆంధ్రదేశమందలి ధనికవర్గములో రైతులు, షాహుకార్లకంటె జమీందార్లే యెక్కువమంది యున్నారు. మనరైతులు, వర్తకులలో కోటీశ్వరు లెందరు ? అన్నచో లెక్కకు మిగులువా రెందరో మన మెరుగుదుము. కాని జమీందార్లు అటులకాదు. వీరి జమీలు ముందుండునా? పోవునా? అని వీరందరిప్పుడు జిజ్ఞాసలో పడిపోయిరి. ఆసమస్య యెట్లున్నను, వీరి శక్తిసామర్థ్యములను, ధనమును పలుకుబడిని యింతటనుండి యైనను పరిశ్రమల స్థాపనకును, పోషణకును, అభివృద్ధికిని వినియోగించినచో వారికిని, ప్రజకును ఉపయోగముగ నుండును.

ప్రస్తుతము మన దేశమందు రాజకీయాందోళనలో కొంత విశ్రాంతి కలిగినది. అట్టి సమయమందు ఆంధ్రనాయకులును, మహాజనులును మన సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయాది గృహకార్యములందు మన శక్త్యుత్సాహములను వినియోగించుట అవసరము. నిజముగ మనవారిలోకంటె గుజరాతీలలో కాని, తమిళులలో కాని యెక్కువమంది ధనికవర్గము లేరు. ఎక్కువ ధనమును లేదు. కాని మనవారా ధనమును వినియోగించుకొను పద్ధతిని నేర్వలేదు. ఇటీవల శ్రీ బొబ్బిలిరాజాగారివంటివారు కొంతవరకు గుణపాఠమును నేర్చుకొని కొన్ని పంచదార ఫ్యాక్టరీలకును, బ్యాంకులకును కమశక్తిని, ధనమును వినియోగించుట ఆంధ్రజీవితములో నూతన ఆశాజ్యోతిని సూచించుచున్నది. ఇట్టితరి, సమయము మించకుండ, యిప్పుడైనను, మనప్రజయు, నాయకులును, మనకుగల అవకాశములను వినియోగించుకొనుటకు శ్రద్ధవహించి కృతకృత్యులయ్యెదరు గాక! ఈ సందర్భమున మనము ముందు చేరవలసిన గమ్యస్థానమునకు ఊతనిచ్చుటకై మన ప్రస్తుత దుర్భరస్థితిని ఆంధ్రలోకమున కించుక జ్ఞప్తికి దెచ్చుచు అంతటితో నీ వ్యాసంగమును ముగించెదను.

ప్రస్తుత దాస్యము

ధనము కావలెనన్న మార్వాడికొట్టుకో
　　　　అరవ బ్యాంకీలకో పోవవలసె
బట్టలన్నియు మనకు అహ్మదాబాదాయు
　　　　బొంబాయి కాన్పూరు నేయవలసె
తిండికి సాంబారు, పరపు, సాదము, కూటు,
　　　　పసలేని రసము, పప్పడము, మోరు
చదువులలో సర్దు, ఇంగిలీస్, యెంగిలీ,
　　　　హిందిబాసలు మనకు నబ్బుచుండె
రాజ్యాంగసాధనల్ బ్రిటిషు, అరవల పాలు,
　　　　మిగులు గుజరాతీల ఖాసుసొత్తు
కళలకు కలకత్త, టాకీకి హాలివుడ్,
　　　　పన్నెలు టోకియో, పాలునార్వే,
మతముకు దయాలబాగు, శ్రీ పంఢరీ క్షేత్రంబు
　　　　హర్నాథపురము
తుదకు సంధ్యలలోగూడ గంగ, యమున
రెండునదులే యిలన్ మన పుణ్యనదులు
కృష్ణ గోదావరీ పెన్న తుంగభద్ర
ఆది నదులన్ని గుట్టలో పెట్టెదార?

ప్రస్తుత ఆంధ్రము యొక్క స్థితి యిట్టిది- భావిగతు లెట్టివో? కృషిని బట్టిగదా ఫలము!



భరతనాట్యము

= శ్రీ జగన్నాథ శర్మ =

నాట్యశాస్త్రమందుగాని, దాని భంగిమములందుగాని ప్రవేశము లేనివారికిఁగూడ నృత్తకళ ఆనందకారి కాఁగలదని భరతుఁడు వాకొన్నాఁడు. ఎందువల్లనో సర్వప్రపంచమువారికిని స్వాభావికముగానే నాట్యము ఇష్టాపూర్తము సమకూర్పఁగలదు. నర్తన మొనర్చువారికిని, చూచువారికినిగూడ శోభాయమాన మగుట వలననే నాట్యవిద్య ఎక్కువ మక్కువతో వ్యాప్తినందింపఁ బడుచున్నది. ఇట్లు చెప్పిన భరతుఁ డెప్పటివాఁడు? అతఁడు భారతభూమియం దేరీతిగాఁ దత్ప్రవర్తకుఁ డైనాఁడు? అతని నాట్యపద్ధతు లెట్టివి? ఇట్టి సమస్యలమీఁదుగా నే నీవ్యాసమందు విజృంభణమొనర్చు తలంపులేదు. ఐతే ఆ సమస్యలే అనావశ్యకములని కాదు. ఇంపునింపనివనికూడ కాదు. గ్రంథవిస్తృతిమీఁదఁగాని నిర్ణయావస్థకు రాఁజాలని వని. కనుక సంక్షేపించి భరతనాట్యమునొక్క విద్యమానస్థితినిగూర్చి యొకింత వ్రాయుటమాత్రమే ఇప్పట్ల నాయభిమతము.

గతశతాబ్దమందును, ఈశతాబ్దమందుఁ గడిచిన పాతికభాగమందును గల ప్రజలు నాట్యమును సందర్శించియుండి రనఁగా ఎక్కడ? ప్రాయికముగా అప్పటి నాట్యరంగము కల్యాణవేదికగాని, దైవోత్సవముగాని, రాజాస్థానముగాని అని చెప్పవలయును. అప్పటి ప్రదర్శకులో! గణికలు (భ్రకుంసులు) స్త్రీవేషధారులు. ఈ కడచిన పది, పదునైదు, ఇరువది యేండ్లనుండి ఆ గణికా, భ్రకుంసనాట్యవిధానమందో - పూర్వకాలమందు నెలకొనియున్న అచ్చాణీభరతవిధానము మారురూపునకు దారితీయ నారంభించినది. ఇప్పటికిని ఆంధ్రదేశమందు నామమాత్రముగానే మేళము లున్నవి. మేజువాణీ లనేపేరిట నిశ్శేషముగాకుండి చూపట్టు ఆ నాట్యరంగస్థలిలోఁ దెలిసినవారు సందర్శింపఁగల్గినదేమి? భోజానాట్యపద్ధతి. ఎట్టిది ఆ భోజానర్తనము? ఏరీతి గేయవాఙ్మయము మేజువాణీ డ్యాన్సులవారి కీనాఁడు లభ్యమానమగుచున్నది? అనఁగా ఇప్పటి సానిమేళాలలో: నాయికానాయక భావానుకరణయోగ్యములగు పద, వర్ణములు—జావళులు-పద్యములు—శ్లోకములు—అష్టపదులు మొదలగు నృత్యవాఙ్మయము అస్తమానదశయం దున్నది! పనితన మున్న ఠక్కునిపోజులు - కాలిఅడుగులు - చేతితీరికలు-జంపింగులు—భ్రమరికలు మొదలగు నృత్తవిధానము నిశ్శేషముకానున్నది. జాజ్వల్యమానముగానే గంభీరనిస్వనముతో పాడఁబడుచున్న పాట లేరీతి సనఁగా:— ఉదాహరణమునకు ఇవిగో రెండురకాలు:

౧. తోయిరా— పడవ— లాకులోకి
తోయరో— పడవా— ఊఁ— లాకులోకి—

౨. తేలు గుట్టిందోయ్ బాబు
తేలూ గుట్టింది—
"ఎక్కడ కుట్టిందే?" "అది ఎక్కడ కుట్టిందే"
"ఆ నడాన గుట్టిందీ—" "అది ఇక్కడె గుట్టిందీ"

"చూడె! పిన్నమ్మ పాడుపిల్లడు"— "పచ్చబొట్టు పొడిపించు బావ."

ఈ రీతిపాటలు: అసభ్యార్థక హస్తదృగంచలాభినయముతో "—నాదిరిదిర్ దిన్నా—తేర ధీంతా దిద్దిన్నా" అను హడవలతో, ద్రుతమధ్యమగతులందు చతురశ్రముగా మండలచారు లొనర్చుచు, ప్రసర్పణాపసర్పణ ర్తనము లొడగూర్చుటే ఆ భోజానాట్యపద్ధతి. అందలి రసమో? అతి హాస్యము!—"అతి సర్వత్ర వర్జయేత్" అన్న పేరవలన అదే "విరసమ్" అని చెప్పక తప్పదు. దీనిని భరతనాట్యమని యెవ్వరైన అందురా? మరి —మేజువాణీలలోని యిట్టి పని అంతయు అభ్యసించుటకు పదిదినములే విద్యాభ్యాస కాలము!!! గణికలుసేయు ఆ నర్తనమును ఒక్క భ్రకుంసునిచేత పదిదినాలలోనే నేను పూర్తిగా ఆడించి కృతకృత్యుండ నైతిని. అట్టిది భరతనాట్యమో! కాదు!! గనుక భోజాడ్యాన్సు. అనఁగా తెలుఁగుదేశ మెల్లకడల ఒకానొక జాతిని విడువకున్న మేళాలు-మేజువాణీలు అనే పేరిట ఇప్పుడు అమలునందున్న ఆటపద్ధతి యని యిక్కడ నిష్పత్తి సేయుదము.

సంస్కరణ సందర్భము

ఇట్టి తెలుఁగైన మేళాలు-మేజువాణీ—కారవా భాణీలలోని దైన నాచ్‌పార్టీ-అది తొల్లి ఎంతగానో ఆదరణీయసారవివిధార్థగతిస్ఫురణంబు గలిగిన దైనప్పటికిని భరతవిద్య మానదృష్ట్యా మాత్రము దానిస్థితి యిప్పటిలో మోజుచూపఁదగియుండలేదు. విద్యావిశిష్టత

లేకపోయిన తరువాత దుర్నీతి కాలవాలమయిన ఏదానికిని వినాశమే పరమావధి. ఇట్లు వినాశోన్ముఖమైన మేజువాణీభరతము జక్కులు - కూర్మాపులు-దేవదాసీలు-నాగవాసాలు-సానులు-భోగాలు అను ఆఱు తెగల జాతివారిలోనే ఇప్పటికిని ఉన్నది.

కూచిపూడి పద్ధతి

తెలుఁగుదేశమందు గొల్లకలాపము, భామవేషము, జలక్రీడలు, పంతులు-పఠాణీవేషము, పగటివేషాలు అను పంథాలో కూచిపూడి పద్ధతి సనాతనముగా జనకస్థానము-అగ్రిమస్థానము ఐయున్నది. ఇట్టి పద్ధతికి ఈడుగా వేరొక్కఁడగినది: తమిళ-కన్నడ-కొంకణ దేశములందు వ్యాపించియున్న మోహినీఅట్టము. ఐనే-ఈరీతి నాట్యపద్ధతిని భరతనాట్య మని చెప్పుటకు భరతపరిభాష తెలిసినవారు అంగీకరింతురా యనఁగా అంగీకరింపఁజాల రనియే చెప్పఁదగును. ఎందువల్ల ననఁగా భరతనాట్య మనునది రాజనర్తకీ సంప్రదాయము లోనిది. అవస్థానుకరణమాత్రమైన నృత్త-అభినయముల కూర్పు. ఇందులకు వాఙ్మయపరికరము హలారింపు-శబ్దము-తిల్లాన-వర్ణము-పదము-శ్లోకము-జావళి-నటనమస్కృతి-అష్టపది-తరంగము-ఇట్టివి. ఇందెందును కథాఘట్ట ముండదు. కూచిపూడి పద్ధతిలో కథకే ప్రాధాన్యత-అద్దానిని పోషించునట్లుగ నృత్తపరికరము, అభినయలీల ఉండును. ఐనే భరతనాట్యపద్ధతి యనఁబరఁగు రాజనర్తకీ సంప్రదాయములోఁ జాపట్టు కాలిఅడవు - చేతి తీరిక - కళాసిక - పోజునందలి క్రమంకము - త్రిభంగి - దృగంచలవ్యాప్తపరిధి మార్గనాట్యము నుండి యేర్పడినవి. కూచిపూడి పద్ధతిలోని హడవసొల్లు - హస్తచాలన - ముక్తాయింపు - పోజునందలి నఖపమము - అతిభంగి - అల్పదృగంచల - పరిధి ఇవి దేశీయ నాట్యము నుండి యేర్పడినవి. కాఁబట్టి ఆ కూచిపూడి సంప్రదాయ నర్తనము: దేశీయము (O iental). రాజనర్తకీ సంప్రదాయముగా నుండి దక్షిణ దేశమున భరతనాట్యమని వ్యవహరింపఁబడుచున్నది: మార్గనృత్యము (Classical). ఈ పద్ధతికి ఆంధ్రదేశమున తొల్లి శ్రీనాథునివాఁడు "దాక్షారామపురీ విహారవర గంధర్వాప్సరో భామినీ"గణము ఆలవాలము. ఆ దాక్షారామమో గోదావరీతీరభూమి. ఆ గణికల ఆచార్యస్థానమక్కడనే ఆండ్రంగి గ్రామము. రెడ్డి రాజ్య మంధ్రదేశమునం దంతరించిన తరువాత చోళరాజ్యము నాంధ్రనాయకు లేలుచున్నప్పుడు ఆంధ్రమాతృకను విడువఁజాలని భరతనాట్యము రాజాదరణమువలన బహుజనోపజీవికగా స్థిరపడి- కావేరీతీరమున తంజపురి గణికలందు నెలకొన్నది. ఆ గణికలకు ఆచార్యస్థానము అక్కడి పందనల్లూరు గ్రామము. ఈ యుభయ ప్రాతిపదికలే ఇప్పటికిని రాజనర్తకీ సంప్రదాయములుగాఁ దెలిసినవారిచేఁ జెప్పఁబడుచున్నవి. ఇందు దాక్షారామ భాణీ హెచ్చుగా శాస్త్రీయఫణితి గలది- తంజపురి భాణీ తళుకుబెళుకుల కూర్పు గలది. ఈ రాజనర్తకీ సంప్రదాయములోని లయదిట్టతను—భంగిమ సాంద్రతను తగ్గించినచోఁ గాని, దేశీయపద్ధతిలోని (మోహినీ అట్టము) కూచిపూడి భాణీలకుఁ గొన్ని చేర్పులు-మెఱుగులు-రేఖాప్రమాణములు చేర్చినచోఁ గాని అట్టిది: దేశీయ భరతనాట్య మనిపించుకొనును. అనఁగా Refined classical అగును. ఇట్టిదానిని పాఠ్యప్రమాణము (Syllabus)న కందిచ్చిన యెడల ఫీల్మ్ డ్యాన్సుగా నేర్పకి అది బహుజనోపజీవికయై కొన్ని కఠినపద్ధతుల మీఁదఁగాని అలవడకున్న నాట్యకళకు అభ్యాసిక సౌకర్యము లేర్పడును. భరతనాట్యము అది బహుభంగుల భంగిమ బాహుళ్యముతో అల్పకాలములో సార్వత్రికవ్యాప్తి నందును. భరతనాట్యవ్యాప్తికి మదరాసు గవర్నమెంటువారు హైస్కూలు కోర్సులో ఇఁకమీఁదఁ దోడ్పడఁదలఁచినారు. వారిప్పుడు చేపట్టిన సిలబస్ బహుకాలములో కఠినసాధనమీఁద విద్యార్థినుల నుత్తీర్ణులఁజేయ వలసినదిగా నున్నది. అల్పకాలములో-సులభసాధనమీఁదుగా విద్యార్థినుల నుత్తీర్ణులఁ జేయఁగల కోర్సు నేర్పరిచినప్పుడే భరతనాట్యమునకు విస్తృతవ్యాప్తి యేర్పడఁగలదు. కాఁబట్టి అందులకు సవరణలు వాంఛితము లగుచున్నవి. భామకలాప మనఁబడు పారిజాతాపహరణకథను కూచిపూడివారు ఆడుదురు. అందలి దశావతారనాట్యము మంచి పనితనము గలదిగా నుండును. కూచిపూడి పద్ధతిలో ఓరియంటల్ డాన్సుగా నున్న శ్రీ వేదాంతం జగన్నాథ శర్మగారు నర్తన మొనర్చునట్టి దశావతార ఘట్టికలలో కొంత మెఱుగు పనిని మార్గనృత్తముతో కల్పించి చూడఁగా భరతనాట్యానుగుణ్యమైన వైష్ణవ స్థానక చతురశ్రము లక్షణవంతమై తనర్చినది. ఇట్లే లక్షణోపేతతకు కూచిపూడివారి నర్తనవిధానమును తీసికొని వచ్చుచు అందులకు తంజపురి తళుకుబెళుకు కళాసికలు జోడించినచో ఆంధ్రభూమియం దనాదిగా నున్న నందికేశ్వరాగ్రగణ్య కోహళ నర్తనపక్కికలు ఉత్తమశ్రేణిలో వ్యాపింపఁగలవు. దాక్షారామ భాణీలోని మా యనుపూర్వకుల విధమును శాస్త్రసమన్వయ సౌలభ్య మేర్పడునట్లు ఏకాదశ పరివర్తనములం దిచ్చి మరి యిప్పుడు నేను భరతనాట్య పాఠములను నేర్పుచున్నాను. ఇందులకు ఔత్తరాహిక భంగిమములు శాస్త్రదృష్ట్యా అందివచ్చినప్పుడు ఇప్పటి భరతనాట్యమునకు అట్టివానిని చేర్చుటవలన సంప్రదాయవిరుద్ధత యేర్పడదు. ఇట్లు మార్చుట, చేర్చుట భరతనాట్యవృద్ధికి ఆవశ్యకమేను.

ఆంధ్రేతరపద్ధతి

కావేరీతీరభూమి క్రీ. శ. ౧౦౫౦ నాటినుండి ఆంధ్రరాజులగు చాళుక్యులకు బాంధవస్థానమై యుండెను. నన్నయభట్టుని ఆంధ్రభారతమునకు అభ్యుదయకారకుఁడైన రాజమహేంద్ర నృపాలుఁడు-రాజరాజనరేంద్రుఁడు- కావేరీతీరస్థచోళరాజుల్లుఁడు-అదిమొదలుగ తెనుఁగువారికిని తెనుఁగుబాసకును చోళభూమి ఆవాసము కాఁజొచ్చెను. కర్నాటక విజయనగరమున అచ్యుతదేవరాయలు పరిపాలించుచున్న కాలమున క్రీ. శ. ౧౫౪౦ ప్రాంతమున తంజపురిని అతని తోడియల్లుని కుటుంబము పరిపాలించుచున్నది. ఆ తంజావూరు తెలుఁగురాజుల కాలమునాఁటికే పాదుకొనియున్న తెలుఁగుబాస-

కావేరీతీరమున గేయభణితిని పెంపుకొనఁజొచ్చినది. అదిమొదలుగా త్యాగరాజుదనుక (౧౮౪౦ క్రీ. శ.) తమిళభాష అచ్చటచ్చట మతములందును, ఏగ్రహాములందో తప్ప వ్యావహారికమునకు అందఁజాలనంత అల్పవ్యాప్తిలో నుండినట్లు దాక్షిణాత్యచారిత్రకులు వ్రాయుచున్నారు. మరి ఆకాలమున చోళరాజ్యము నెల్లకడల ప్రాముఖ్యత గాంచినది తెనుఁగునొడికార మొక్కటే. అందువలన భరతనాట్య ప్రాతిపదిక కావేరీనీరసార ప్రాబల్య మెనసిన ఆంధ్రఫక్కికయని చెప్పనొప్పును. కాఁబట్టియే ఇప్పటికిని తంజావూరు ప్రాంతమునుండి వెడలు భరతనాట్యము తెనుఁగుపదములు-జావళులు-వర్ణములు-తిల్లానల మయమై యుండును. అయితే అచ్చట ఒక వందరేఁబదిసంవత్సరములనుండి ఆంధ్రభాష నీరసపడఁదొడఁగినందున ఆంధ్రశబ్దార్థాత్మకమైన అభినయభాగము-నృత్యశాఖ-భరతనాట్యమందు సన్నగిల్లినది. గీతానుగమైన నృత్తమమాత్రము ఆంగికచాలనమాత్ర మగుటచేత శబ్దార్థప్రసక్తి లేని చరణగ్రీవాహస్తకటిరేచకపద్ధతిలో వన్నెకెక్కినది. అభినయభాగమో తెనుఁగుదేశము నెల్లకడల విరివిగొన్నది. ఇట్లు ఇప్పుడు భరతనాట్య మను పేరఁ బరగు మదరాసు ప్రెసిడెన్సీయందలి నాట్యవిధానము ఆంధ్రఫక్కికగానే విలసిల్లుచున్నది. తెనుఁగుభాష రాని తమిళకన్నె లాడినను అది ఆంధ్రనృత్యమే యనవలసివచ్చును. మదరాసురాజధానిలో మలయాళప్రాంతీయమైన నాట్యములందు కథాకళియొకటి విలసిల్లుచున్నది. అది కథాగర్భనృత్యము. అనఁగా రూపకభేదములందు చెప్పఁదగినదియును, ఆంధ్రేతరఫక్కికయునుగూడ. ఇట్లే మణిపురనాట్యము. శ్రీ రవీంద్రనాథ టాగోరుకాలమున వ్యాప్తినందింపఁబడిన ఔత్తరాహికనాట్యము-అదియు ఆంధ్రేతరఫక్కికయే. ఘూర్జరదేశమందలి గర్భరాసకనాట్యము-అదియు ఆంధ్రేతరఫక్కికయే. గంగాతీరభూములందు నెలకొన్న కథక్‌సంప్రదాయము. ఇదియు ఆంధ్రేతరఫక్కికయే. ఐనను చరణప్రక్రియలో భరతనాట్యమున కది సన్నిహితమైన ఉత్తమనాట్యము. ఇవిగాక ప్రిమిటివ్-ఫోక్ డ్యాన్సు లెన్నేని కలవు. ఈరీతిని పరిగణన మారంభింతుమేని యావద్భారతభూమిమీఁద నిప్పుడు నూటికి లెక్కించి నర్తనవిధానములను చెప్పనొప్పును. ఇందలి ఏవేవో కొన్ని కలిపి ఓరియంటల్ డ్యాన్సు అను పేరిట రంగభూమి నలంకరించుచున్నవి. ఉదయశంకర్ మున్నగు మహానటకుల శివతాండవాదులు ఇట్టి సంకీర్ణపద్ధతిలోఁ బరిగణింపఁబడఁదగియున్నవి. ఇన్నిటినుండి ఆంధ్రతాండవరంగము ఉత్తమఫక్కికలుగల భంగిమవిధానముల నాహ్వానించి నాట్యవృద్ధి సేయవచ్చును. ఇప్పుడట్టి యవసరము మెండుగానే కలదు. ఎందువల్ల నన పదిదినములు వరుసగా పదిమంది ప్రదర్శించిన భరతనాట్యము లవలోకించినయెడల ఆపోజులన్నిటికి వరుసని ఒక్కటియే అని రెండవరోజునుండి తెలిసిన ప్రేక్షకునికి నిర్ణయ మారంభమగును. తుదకు పదియవరోజున అతని నడుగఁగా పదిరోజులును వరుసగాఁ దాను జూచిన భరతనాట్యములలోని పోజు లన్నియు రమారమి ఒక్కరీతి వే, ఆ ఆడిన తలలుమాత్రమే వేఱని. అట్లు ఒకే తెలుఁగుఆటను జూచుట శోభాయమానము గాకపోవుటయు, పైఁగా విసుగునకుఁ గారణమైనదనియు అతఁడు నిర్వచించును. ఏతాదృశకారణములను బట్టి యిప్పటి భరతనాట్యము అనేకపద్ధతులలో విరివిగొను మార్గములను ఏతత్కళాభిజ్ఞులు అన్వేషింపఁ దగియున్నారు.

చాళీయనాట్యపద్ధతి

ఇది అత్యురాత్మకవిజ్ఞానము. మాటలో ప్రాథమిక విద్యనుబోలి-ఎల్లరిచేతను సులువుగా అభ్యసింపఁబడఁదగినట్లు ఏర్పడి యున్న నర్తన విజ్ఞానపథకము. ఉభయసంధ్యలందు సాధకము చేయునెడల మూడు నెలలలోను, కొంత అపామోషిగానైతే ఆఱు నెలలలోను చతురతావిహీనములయిన పాత్రములకయిన అలవడునట్టి భరతనాట్యానుకరణవిధానము. భరతనాట్యమును వృత్తిగాఁ గైకొనఁదలఁచు వారెవ్వరైనను దేహలాఘవము, బుద్ధికౌశల్యము ఎంత ఉండినప్పటికిని బహిరంగమైన కచ్చేరీయందాడి, ఆ ఊపిరిదమ్మును వశపరచుకొనుటకు అధమము రెండు సంవత్సరములైన పట్టును. నర్తనోపజీవికగాక నాట్యవిజ్ఞాన మానందసంధాయకముగనుక - మనోవికాసకారకముగనుక-ఆరోగ్యదాయకముగనుక - సర్వావయవసౌష్ఠవజనకముగనుక-ధనసాధ్యము, ప్రయాససాధ్యము అనఁబడకుండ చాళీయనాట్యము నైనే ప్రతియింట ప్రతిబిడ్డలోను చిన్న పెద్ద యనక, ఆడ మగ యనక ఎల్లరును అభ్యసింపఁగలరు. ఆఫక్కిక అభ్యసింపఁబడునేని నాట్య ప్రదర్శనములను ఎన్నిటినేని చూచి అర్థముచేసికొని ఆనందించు అర్హత యేర్పడును. ఎందువల్ల ననఁగా శిరోగ్రీవాకటిజానుజంఘాహస్తభ్రూపాదచాలక సాధనవిధము లెన్ని కలవో అవి లయబద్ధముగా అభ్యాసకుల కిందు పట్టుపడును. ఈ విజ్ఞానమే భరతనాట్యాభ్యాసకులు కాఁదలఁచువారికి మొదటి మెట్టు. భరతనాట్యాభ్యాసము ఇంతటితో సరిపెట్టుకొందమన్న వారికిఁగూడ నాట్యవైదుష్యము గల్గి ప్రదర్శించువారినిఁ గని ఆనందింపఁగల శక్తి ఈ చాళీయ నాట్యపద్ధతి సమకూర్పఁగలదు. దీనిని ఐదేళ్ల బాలికకూడ అభ్యసింపఁగలదు.* ఇది భరతనాట్యవిధమునుండి శాస్త్రసిద్ధక్రియగా శోభాళ మతము ననుసరించి సంక్షేపనర్తన మనఁదగినట్లు కల్పింపఁబడిన నృత్తవిధానము!

ఇప్పుడు బొంబాయి-మదరాసునగరములందు బాలికాపాఠశాలలలో శారీరికవ్యాయామమాత్రసముపయోగికమైన డ్యాన్సింగును పెక్కండ్రు బాలిక లభ్యసించుటకు తగుమైన సదుపాయము లొడఁగూర్పఁబడినవి. అయినను అందుల కొక నిర్ణీతపద్ధతిలో సిలబస్ (పాఠ్యప్రణాళిక) సిద్ధపఱచఁబడలేదు. నాట్యోపాధ్యాయులే తమ తమ సమర్థతల ననుసరించియు, బాలికల యభినివేశ సందర్భములను బట్టియు విద్యను నేర్పుపట్ల కాలోచితము సేయుచున్నారు. ఇందువలన శాస్త్రసిద్ధమయిన నాట్యవిద్య బాలికలకు లభ్యమానమగుటలో సంశయ మేర్పడకతప్పదు. మదరాసుప్రణాళికలో భరతనాట్యము నభ్యసింపఁగోరు బాలికలకు ఉపయోగముగనుండునట్లు తత్పూర్వ ప్రాథమికప్రణాళికగా జాతీయనర్తనమునకు సిలబస్ వ్రాయించి అర్హా

వినిబట్టి సర్వత్ర నాట్యవిద్యావ్యాప్తి జరుగునట్లుచూచుట పాఠశాలా నిర్వాహకులకును, నాట్యోపాధ్యాయులకును సముచితకర్తవ్యము. ఈరీతిగా సేయుటలో భరతనాట్యమునుండి సులభమైన పోజులను గైకొని సార్వత్రికవ్యాప్తికై బాలికలచే పట్టించుట నాట్యరంగ ప్రశస్తికి ఎంతేని అవసరము.

ఈ రీతిగా ఎన్నెని సంస్కరణ మార్గములు విరివికొన్నప్పుడు గాని భరతనాట్యము లలితకళగా ఉచ్చస్థితి నెనయఁజాలదు. ఇది వరలోఁ జాలకాలము హైందవనాట్యకళ నిరాదరణముపాలై మృతప్రాయము కాఁజొచ్చినతఱిని ౧౯౨౯ లో రష్యానుండి ఆంగ్లదేశమునకువచ్చిన అన్నా పావ్లోవా అను నర్తకి హిందూదేశమున కేతెంచినది. ఆమె అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటా మున్నగు గుహలందలి శిల్పవిధానము నవలోకించి అందలి నాట్యప్రతిమలను నర్తన పద్ధతిలోనికిఁ బ్రవేశపెట్టినది. ఆమెయొక్క ప్రచారప్రాబల్యము మొదలుగా హైందవ నర్తనమందు అభంగసమభంగాతిభంగము లను పోజులు విరివిగొన్నవి. అంతకుముందు భరతనాట్యమునందు త్రిభంగ మొక్కటియే దేశీయస్థానక మర్యాదలో ఆడి చూపఁబడుచుండెడిది. ఈ రీతిగ శిల్పమునకు, నాట్యమునకు ఉన్న పరస్పరకళానుబంధమర్యాదను ఆమె ప్రచారించుటకు బూనుకొనునందాఁక మనదేశములో నాట్యవీథి ఏ మార్పుచేర్పులను చేరఁదీయ నుంకింపకపోయెను. అందువల్లఁ గదా కళలు మృతప్రాయములగుట తటస్థించును. నిజ మరయఁగా శిల్పమునకు నాట్యమునకు గల సన్నిహితబాంధవ్యము ఆర్యులచే ప్రాచీన కాలమందు గుర్తింపబడకపోలేదు. క్రీ.శ. ౫౦౦ నాఁటికంటె ప్రాచీన కాలపు రచనగాఁ జెప్పఁబడుచున్న విష్ణు ధర్మ భరతమందు ఈ లలితకళాద్వయసంబంధ మీక్రిందిరీతిని నిర్వచింపఁబడినది:—

"వినాతు నృత్యశాస్త్రేణ
చిత్రసూత్రం సుదుర్విదం
జగతో నక్రియాకార్యా
ద్వయోరపి యతః—

* * * *

ఆతోద్యేన వినా నృత్తం
విద్యతే న కథంచన

* * * *

గీతశాస్త్ర విధానజ్ఞః
సర్వం వేత్తి యథావిధి

* * * *

గీతశాస్త్ర విదేవాథ సర్వజ్ఞః—"

ఇట్లు ఆభినవముగా అభంగ సమభంగ అతిభంగాదులు నేటి నర్తనమందు వ్యాయామవ్యాప్తికి తేఁబడుటవలననే అది అత్యంత శుభోదర్కమై చూపట్టుచున్నదనుట వాస్తవాంశము. భరతనాట్యమునం దిట్టిపద్ధతు లింకను ఎన్నెని ప్రవేశపెట్టఁదగునని చెప్పుటతోనే నీ వ్యాసము నుపసంహరింతును. సామాన్యముగా ఏక పాత్ర—పాత్రద్వయ—ఇంతియ భరతనాట్యమందు సనాతనపద్ధతి. ఆర్యావర్త- గర్భరాసకమునందును గ్రీకుదేశమందలి ఉత్తమనర్తనవైఖరిలోను పాత్రబాహుళ్యరేఖ గలదు. అట్టిదానిని చేర్చుట భరతనాట్యమం దవసరమే! అల్పశిక్షగల బాలికలం దీ రీతి మార్పువలన వారిలో స్వతఃసిద్ధమైన నాట్యాభినివేశ మేర్పడును. ప్రభుత్వ మెంత అభిమానించినను, ఉపాధ్యాయు లెంత శ్రద్ధ చూపినను—విద్యార్థినుల ఉత్సాహమే కదా విద్యాభివృద్ధికి పట్టుకొమ్మ. ఈ విధానమువలన చతురతా విహీనములయిన పాత్రములయిన విద్యయొక్క పరమావధిని జేర నుద్యుక్తులు కాఁగలరు.



భారతదేశపు లక్క పరిశ్రమ

పరిశ్రమావనిలో లక్క ప్రాముఖ్యత

= శ్రీ వడ్డాది రామారావు =

భారతదేశం లక్కకు పుట్టినిల్లు. లక్క అనే పదార్థము బహు ప్రాచీనమైనది. కొద్దిగనో గొప్పగనో లక్కను మన పూర్వీకులు వాడియేయున్నారు. కౌరవులు లక్కయిల్లు సమర్పించి దానిలో పాండవులను ప్రవేశపెట్టి, ఆ యింటిని భస్మముచేయ నుద్దేశించుటను బట్టి లక్క యనే పదార్థముయొక్క నైజగుణములను, కొన్ని యుపయోగములను భారతయుద్ధమునాటి మన పూర్వీకు లెరిగియేయుండిరని ఉదాహరణముగా చెప్పవచ్చును. దీనినిబట్టి అప్పట్లో లక్క విస్తారంగా తయారుచెయ్యడం వాడుకఅయిఉండాలి. లక్క అంటే మనం మామూలుగా కంసాలికొలిమిలో ఉపయోగించే రవంత లక్కపై దృష్టిని పెట్టుకుంటాము. అందుకూ తప్పిగే ఏ ఉత్తరాలమీద సీళ్ళు వేయడానికో అనేకాని లక్కకు అంతకంటే ఎక్కువ వాడకం ఉన్నదన్నమాట గ్రహింపము. కాని లక్కకు ఈనాటి నాగరికతలో లక్షప్రయోజనా లున్నాయని చెప్పట అతిశయోక్తి కానేరదు. పైని సూచించినవి రెండు బహుప్రాచీనమైనవని ప్రజానీకానికి తెలిసినవియే. ఇస్పృకట్టడానికి కాకపోయినా ఇతరమైన అనేక కార్యాలకు వాడుకలో ఉన్న లక్క ఇంచుమించు అంతా ఇప్పటికీ భారతదేశంలోనే ఉత్పత్తి అవుతూంది.

లక్క అన్నపేరు 'లాక్ష'నుండి వచ్చిఉండవచ్చు. హిందూస్థానీ భాషయందు లాక్షకి 'లాక్' అంటారు. లక్షలాది పురుగులు కొన్ని చెట్లకొమ్మలయందు సమిగూడి ఉత్పత్తి చెయ్యడంవల్ల ఆ పదార్థానికి ఆ పేరు స్థిరపడి యుండవచ్చు. లేక లక్క విశేషంగా తయారయే. ఉనికిపట్టయిన మోదుగచెట్టు సంస్కృత భాషలో 'లక్షతరు' అనుపేర పిలువబడుటనుబట్టి అయినా వచ్చియుండవచ్చు. ఆ పేరు ఎట్లా వచ్చిఉండినా, ఆ పదార్థంమట్టుకు అతి ప్రాచీన కాలంనుంచీ భారతదేశంలో వుత్పత్తిఅయి వాడుకలో ఉన్న దనడం నిశ్చయం. క్రీ. శ. ౮౦లో ప్రచురమైన 'పెరిప్లెసు' అనేగ్రంథంలో భారతదేశంనుంచి లక్కరంగు ఆఫ్రికాతీరమునకు ఎగుమతి అవుతూండేదని ఉదాహరించబడింది. క్రీ. శ. ౨౫౦ ప్రాంతంలో ఏలియను అనే అతడు భారతదేశంలో ఒకరంగు పురుగు ఉందనీ, దానినుంచి రంగు పదార్థము ఒకటి తయారవుతుందనీ వ్రాశాడు. కాని లక్కయందు రంగుపదార్థమేకాక రజను (Resin) పదార్థముకూడ మిశ్రమైయున్న విషయం ౧౬ వ శతాబ్దమునాటి వరకు స్పష్టముగా స్థిరపడినట్లులేదు. క్రీ. శ. ౧౫౬౩ లో పోర్చుగీసుగవర్నరు యొక్క వైద్యుడైన గ్రేషియాడి ఆర్టా అనునతడు వివరముగ లక్కరంగు, లక్కరజను పదార్థముల గుణగణములను ప్రచురించినాడు. క్రీ. శ. ౧౫౯౦ లో ప్రచురించబడిన 'అయిన్, ఐ అక్బరీ' అనే గ్రంథంలో లక్కజిగురు రంగు పూరితమైన పదార్థముల (Pigment)తో మిశ్రమంచేసిన వార్నిషులు మొగలాయి ప్రభువుల మహళ్లలోని తెరలకు వాడబడిఉన్నట్లు వ్రాయబడింది. అదిగాక ౧౫౯౬ లో జాన్ హైగ్లెన్ వాన్ లిన్‌షాటెన్, (Jon Hyglen van Linschoten) అను విజ్ఞానవేత్త పోర్చుగీసు గవర్నరుచే ఈస్టుఇండీసుకు, ఇండియాకు వైజ్ఞానికశోధనాలోకనకై పంపబడి, లక్కరజనుయొక్క గుణములను వివరముగా ప్రచురించెను.

లక్కరంగు పరిశ్రమ

మొట్టమొదటిలో లక్కలో ఉండే రంగుపదార్థమే ప్రధానంగా పరిగణింపబడింది. లక్కపురుగు వంశంలోనిదే అయిన 'కొచీనియల్' అనే పురుగు మెక్సికోప్రాంతంలో 'కాక్టసు' అనే స్పీసీస్ మీద నివసిస్తూ రంగుపదార్థ మొకటి వుత్పత్తి చేస్తూవుంది. ఆ కొచీనియల్ రంగు చాలా ఉపయోగంగా వుండేది. ఆ రంగుకు బదులుగా లక్కరంగు ఉపయోగించవచ్చునని తేలినపిదప లక్కరంగు పరిశ్రమ వృద్ధిచెందింది. కొచీనియల్ రంగుకంటె లక్కరంగు కొంచెం నాసి. అయినా చౌకగా తయారుకావడంవల్ల కొన్నాళ్ళపాటు రంగునిమిత్తం లక్కపరిశ్రమ వృద్ధిచెందింది. ఈస్టు ఇండియా కంపెనీ అధిపత్యంలో చాలా లక్కరంగు పరిశ్రమాలయాలు ప్రబలి, ౧౯ వ శతాబ్దమునాటికి యీ రంగు పరిశ్రమ విస్తీర్ణముగా ఉత్తేజమై, లక్క జిగురుపదార్థముయొక్క ముఖ్యత గుణీకరింపగూడ చేసినది. ఈ సమయంలో రంగును బిస్కెట్టుమాదిరి చేసి అమ్మప్రయత్నములుగూడ సఫలమైనవి.

౧౮౬౮-౬౯ సం॥లో ౧౩,౭౪౮ హండ్రెడు వెయిట్ల పరిమితిగల లక్కరంగు ఇతరదేశములకు ఎగుమతి అయింది. దాని విలువ సుమారు ౮ లక్షల రూపాయలు. లక్కలో రంగు పదార్థము ఒక్కటే కాదు ఉన్నది. రంగుగాక ప్రధానమైన రజను పదార్థము (ఇంగ్లీషున **Resin**) ఒకటే ౭౦ పాళ్ళు, కొంత (౪-౬ పాళ్ళు) కొవ్వుపదార్థమూకూడా ఉంటాయి. అయితే అప్పట్లో వీటి ప్రయోజనం అంతగా పాటించలేదు. రంగుకోసమే లక్క తయారవుతూండేది. ఈ లక్కరంగుతో సిల్కు బట్టలను, ఉన్ని బట్టలను, సిల్కు, ఉన్ని దారములను అతి శృంగారమైన వంగపండుచాయ రంగు వేయడానికి ఉపయోగిస్తారు. ఇప్పటికీకూడ గంజాంజిల్లాలో, బరంపురంలో దేవాంగవీథిలో దీనిని సిల్కువస్త్రములకు రంగువేయుటకు ఉపయోగిస్తున్నారు.

అయితే కొద్దికాలంలో అసలు రంగు పరిశ్రమలోనే పెద్ద విప్లవం సంభవించింది. క్రీ. శ. ౧౮౫౬ తరువాత సర్ విలియమ్ పెర్కిన్ అనే విజ్ఞానవేత్త పరిశోధనల మూలకంగా అనిలీన్ రంగులు కనిపెట్టబడి వృద్ధిచెంది లక్కరంగు, కొచీనియల్ రంగులను అణగంటించినవి. ప్రకృతి సిద్ధంగా లభించే రంగులకు బదులు మనిషి తన బుద్ధికుశలతచేత స్వయంగా మూలపదార్థములనుండి చేయడం నేర్చిన చేతరంగులు (**Synthetic dyes**) వాడుకలోనికి రావడం మొదలైంది. దానితో పురుగులనుంచీ, చెట్లనుంచీ, మానులనుండి, పువ్వులనుండి తయారుచేసే రంగుల పరిశ్రమ అడుగంటింది.

అట్లా అడుగంటిన పరిశ్రమలు మనదేశంలో లక్కరంగూ, నీలిమందు రంగూను. అయితే నీలిమందు పూర్తిగా అడుగంటిపోయినా లక్కపరిశ్రమమాత్రం అట్లా కాలేదు. లక్కలో రంగుతోపాటు ఉన్నరజను (**Resin**)యొక్క ప్రాముఖ్యత వెల్లడిఅయి, దానికోసం పరిశ్రమా వృద్ధిచెందడం జరిగింది. లక్క రజనుయొక్క గుణములు శోధింపబడి దానిని ఉపయోగించు విధములు యూరోపులో వెల్లడి అయినాయి. మొదటిలో రంగుకోసం ప్రధానంగా పరిగణింపబడిన లక్క ౨౦ వ శతాబ్దమునాటినుండి రజనుకోసమై ప్రధాన పరిశ్రమగా వర్ధిల్లింది.

లక్క పురుగు

ప్రకృతి సిద్ధమైన రజను పదార్థాలలో (జిగురులు-**Natural resins**) లక్క చాలా ప్రాముఖ్యమైనది. లక్కపురుగుల శరీరాలనుంచి వెలువడే యీ పదార్థం, పైని తెలిపినట్లు, రజనూ, రంగూ, కొవ్వూ (౭౫: ౧౦: ౫) యీ పాళ్ళలో మూడింటి మిశ్రమమూను. లక్కపురుగు అర మిల్లిమీటరు పొడుగుకూడా వుండదు. చిన్న ఎర్ర నల్లిపిల్లలా వుండే ఈ క్రిములు కోట్లకొద్దీ కొన్నిరకముల చెట్ల కొమ్మలయందు గుంపులుగాగూడి యేటేటా ౬౦, ౭౦ వేల టన్నుల లక్క ఉత్పత్తిచేస్తాయి. పైనిచెప్పిన అంతలక్కా ఉత్పత్తి కావడానికి ఇంచుమించు ౮,౪౦౦,౦౦౦,౦౦౦,౦౦౦ ఆడ పురుగులు మూలాధారము. లక్కపురుగులు ముఖ్యంగా కుసుమ, మోదుగ, రేగు చెట్లమీద బాగా వర్ధిల్లుతాయి. చెట్లకు ఏ కొంచెమో హానికరమైనప్పటికీ, అవి ఉత్పత్తిచేసే విలువగల లక్కనుబట్టి ఆ చెట్లయందు లక్కోత్పత్తి చేయడం మంచి కిట్టుబాటయిన పని. అస్సాములో కందిచెట్లయందును, సింధూప్రాంతమున హైదరాబాదులో తుమ్మచెట్లయందును, మధ్యరాష్ట్రములలో దామోయందు కొండరేగు చెట్లయందును, బీహారు, ఒరిస్సా రాజసంస్థలలోను, మధ్య రాష్ట్రములయందును కుసుమ, మోదుగ, రేగుచెట్లయందును ఈలక్క క్రిములు నివసించి లక్కోత్పత్తి చేయుచున్నాయి.

లక్కపురుగు జీవితచక్రము

లక్క అనే జిగురును, కొంత కొవ్వుపదార్థమును లక్క పురుగులు యీ చెట్లకొమ్మలయందు వసించి స్వేదనచేయును. వాటి శరీరాలమీద చుట్టూ యీ లక్కను పూతగా విసర్జించుచుండును. ఈ చెట్ల లేతకొమ్మలలోని ద్రవములను జీవనోపాధిగ జేసుకొని ప్రత్యేకమైన నోటిరంధ్రములతో పీల్చుచు, పెరుగుచు లక్కను స్వేదరూపంగా విసర్జించుచుండును. ఏడాదికి రెండు పర్యాయములు గర్భిణీఅయిన పెద్ద లక్కపురుగులనుండి చిన్న నల్లిపిల్లలాటి లక్కక్రిము లుద్భవించును. పరిపక్వమునకు వచ్చిన లక్కలోనే యీ చిన్న క్రిముల నుత్పత్తిచేసే పెద్ద ఆడ లక్కపురుగులు వసించియుండును. ఒక్కొక్క ఆడపురుగునుండి సగటున ౨౦౦ నుండి ౫౦౦ వరకు చిన్న లక్కక్రిములు వెలువడును. ఈ చిన్న క్రిమి రెండు కళ్ళు, రెండు కాళ్ళు, ముక్కురంధ్రములు, నోటి రంధ్రములు అన్ని కలిగియుండును.

ఈ చిన్న లక్కక్రిము లుద్భవించినతోడనే కొంచెము దూరము ప్రాకగలవు. తమవసతికి అనుకూలమైన లేతవైనట్టియు, జీవద్రవములతో కూడుకొన్నట్టియు నైన చిన్న కొమ్మలవద్దకు ప్రాకి, వాటిక్రింది భాగమున వాడియైన నోటి భాగములను కాళ్లను లంఖించుకొని తమ జీవనమును ప్రారంభించును. ఎండిపోయిన కొమ్మలవద్దకు కాని, గట్టి పెద్దకొమ్మలవద్దకు కాని యీ క్రిములు చేరవు. ఎందుకనతమ జీవనోపాధికి ముఖ్యమైన ద్రవపదార్థముల నీ కొమ్మలనుండి ఆ అతిచిన్నవియైన క్రిములు ఆఘ్రాణించుట కష్టము. మానవుడు తన జీవనోపాధి ఎట్లు కల్పించుకొనునో అట్లే జంతువులు, పక్షులు, క్రిమికీటకాదులుకూడా వాటి కనుకూలమైన తావులందు జీవనవసతి చేసుకొనును. ఈ చిన్న లక్కక్రిమికూడ తన జీవనమున కనుకూలమైన తావునకు జేరి వసతిచేసుకొనుట ఒక విపరీతముకాదు. చెట్లయందు యీ ద్రవపదార్థముల కునికియైన లేతకొమ్మలు (అనగా ౧-౧౨ సం॥ వయస్సు గల కొమ్మలు) ఎంత మెండుగా నుంటే, అంత ఎక్కువగా లక్కక్రిములు వసించి, విస్తీర్ణముగా లక్కోత్పత్తి చేయును.

వీరు

L. G.

ఇంగువనుకొని పొగడుచున్నారు

గీ. కోయిలల పాటలకు మావిగున్న లెల్ల
పుల్కరింపుచు శాఖల బూపపింది
యలను దొడగుచు పిదప గాయలను గాయ
నూరుగాయలనందఱ్లు నుప్పతిల్లె.

గీ. ఏబదేండ్లుగ దేశమం దెల్లచోట
ఎల్.జి. "L. G. గుర్తును గల్గిన యింగువిదియె"
యనుచు నందఱు దీసికే యభినుతించి
యూరుగాయలలో వేయుచుండు రెపుడు.

గీ. "చెన్నపగరంబునను సుప్రసిద్ధమైన
యింగు విది"యంచు నేనోళ్ల నెన్నబడుచు
'ఎల్. జి.' యను నాంగ్ల యక్షరా లెల్లపొట్ల
ములకు పైభాగమున నుండి ముదము గూర్చు.

గీ. అట్టి యింగువవ్యాపారమందు మిగుల
ప్రథితులై స్వర్ణరజితంపు బతకములను
లాలితంబుగ బొందిరి "లాల్జి గోధు
కంపెనీ"వారు సిద్ధసంకల్పు లగుచు.

కం. రుచికిని ఘాటునకును మఱి
శుచికిని పరిమళమునకును జూడగనిదియే
సుచిరంబగు కీర్తిని గాం
చుచు నందఱ మన్ననలను జూఱగ గొనుతన్!

లాల్ జీ గోధు అండ్ కో.,

ఇంగువ మొత్తపు వ్యాపారం.
నెం. 8 పెరుమాళ్ మొదలివీధి, సాహుకారుపేట,
మదరాసు.



"శాశ్వతికంగా ఉపశమనము కలిగించే మందులను వాడటం చాలా ఉత్తమం."

అప్పటికప్పుడు వెంటనే గుణమిచ్చుటయే గాక, ఉబ్బస వ్యాధియొక్క మూలకారణములను రూపుమాపి శాశ్వతంగా నయము చేయునది పురోహిత్ వారి శ్వాసహారి మాత్రమే. శ్వాసహారిని వాడుట ప్రారంభించిన వెంటనే, దగ్గుపోయి, శ్వాస ధారాళమగుటయే గాక, జీర్ణకోశము, ఊపిరితిత్తులు క్రమేణ బలపడి, ఉబ్బసము పూర్తిగా తగ్గిపోవును.


ఉబ్బసము, ఊపిరి సలపకుండుట, నడుమునొప్పి, గొంతుకలో నసాళించు దగ్గు, మెందును గుండెజబ్బులకు శ్వాసహారి (తెలుపురంగు పెట్టె)ను వాడుడు. మలబద్ధకము, పులితేపులు, వీటితో బాధపడు ఉబ్బస వ్యాధిగ్రస్తులగువారు శ్వాసహారి కాంపౌండు (ఎరుపురంగు పెట్టె)ను వాడుడు.

అందరు కెమిస్టులవద్ద, 8, 6, 12 ఔన్సుల సైజులలో 8-6-0, 5-12-0, 10-0-0ల ధరలుగలిగినవి లభించును

మద్రాసు స్టాకిస్టులు:

మెస్సర్సు: అప్పా & కో, సైనా బజార్ రోడ్,
,, శ్రీ క్రిష్ణన్ బ్రదర్స్, తంబుశెట్టివీధి,
,, అమృత రత్నాకర ఫార్మసీ, గోవిందప్ప నాయక్ వీధి.
,, పండారిక్ & కో, హైదరాబాదు, సికిందరాబాదు.

తయారుచేయువారు
పురోహిత్ ఫార్మసీ
కొల్హాపూరు.



తాడిపత్రిలో రాయలనాటి శిల్పాలు

అనంతపురంజిల్లా తాడిపత్రిలో పెన్నానది గట్టున రెండు పాడుపడిన దేవళాలున్నాయి. నేడయితే అవి ఆలనా పాలనా లేక, దిక్కూ మొక్కూ ఎరగక నానాటికీ ఇంకా ఇంకా పాడుపడి పోతున్నవి కాని ఒకప్పుడవి ఎంతో దివ్యవైభవంతో తులతూగినవి.

ఆంధ్రసార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల కాలంలో రూపొందినవవి. కాగా, రాయలనాటి శిల్పకళకూ, చిత్రకళకూ ఆకరములై యున్నందున నేటికీ అవి కళాభిమానుల ఆదరానికి అంతో ఇంతో పాత్రమవుతూనే ఉన్నాయి—చివికి జీర్ణమవుతున్నా కూడా.

ఈ దేవాలయాల్లో ఒకటి రామలింగస్వామి దేవాలయం. రామలింగనాయుడు అనే ఒక రాయలనాటి పాళెగాడు కట్టించిందిది. ఈ ఆలయాన్ని రామేశ్వరదేవాలయం అనికూడా అంటారు.

ఇంకొకటి చింతల తిరువేంకటస్వామి దేవాలయం. అంత పెద్ద పేరుతో కాక ఇప్పుడది కేవలమూ చింతలరాయని దేవాలయం అనే చిన్న పేరుతో పిలువబడుతున్నది. దీన్ని కట్టించినవాడు పైజెప్పిన రామలింగనాయని కుమారుడైన తిరుమలనాయడు.

ఈ రెంటాకూడా గోడలమీదా, స్తంభాలపైనా, చూరులోనూ ఎన్నో దివ్యసుందరశిల్పాలు చెక్కబడి ఉన్నాయి. రామాయణం, భారతం, భాగవతం మొదలైన పురాణాలనుంచి మంచి మంచి ఘట్టాల నేరి చక్కని తీరైన శిల్పాలుగా మలిచారు ఆనాటి శిల్పివరేణ్యులు.

పదితలల రావణాసురుడు, ఆరావణునితో సరిక్కిసరిగా మాట్లాడుతూ అతని కన్న ఎత్తులో కూర్చోవలెనన్న ధీమాతో తనతోకను ఇంతది అంతదానిగా పెంచి పెద్దచేసి చుట్టచుట్టి ఆ తోకచుట్టపైన ఠీవిగా కూర్చొన్న అనుమన్నా, రాముని సప్తతాళచ్ఛేదనమూ, అనుమన్నకు సీతఅంగుళీయక ప్రదానమూ, మరణోన్ముఖుడైన వాలి రామునికి అంతోళ్లిపన్యాస మివ్వడమూ, కృష్ణుని గోపికావస్త్రాపహరణమూ, కాళీయమర్దనమూ మొదలైన ఇందలి శిల్పచిత్రాలు చూపరకు ఆశ్చర్యానందాలను రేకెత్తింపజాలి ఉన్నాయి.

ఈ పౌరాణిక గాథలేకాదు, అలనాటి అలంకారాల తీరులనూ, కస్త్రకేశాల వైఖరినీ, రూపరేఖల విన్యాసాన్నీ చాటగల సాధారణ చిత్రాలుకూడా ఎన్నో ఉన్నాయి ఈ దేవాలయాల్లో. అటువంటివాటిలోని భావపటిమను చూపడానికి స్థలాంతరంలో ప్రకటితమైయున్న చిత్రాలు మచ్చుముక్కలు కాగలవు.

చింతలరాయని దేవాలయానికి ఆపేరు రావడానికి స్థానికులు చెప్పుకొనే కారణం ఇది. అందులో వెలసిఉన్న దేవతామూర్తి ఒకానొక చింతచెట్టుతొర్రలో దొరికిందట. అందువల్లనే దానికా పేరు వచ్చిందని వారి వాదము. అయినాకావచ్చు. లేదా, ఆలయం చుట్టూ ఆవరించియున్న చింతతోపులనుబట్టి అయినా దానికాపేరు వచ్చియుండవచ్చు ననడంకూడా సబబుగానే కనిపిస్తున్నది.

ఏమైనా, రాయలనాటి శిల్పసౌందర్య సమంచితములైయున్న ఈ దేవాలయాలు ఆంధ్రులకు పవిత్రస్థలాలు.

లక్కనుపండించు క్రమమైన విధములు

ఆ కారణముచేతనే లక్కక్రిములకునికిపట్టయిన, యిదివరలో పేర్కొన్న చెట్ల కొమ్మలను సకాలములో నరుకుట వాడుకరైవున్నది. ఆ నరుకుటలో వైజ్ఞానికపద్ధతులను అవలంబించవలెను. సకాలములో సమమైన పద్ధతులలో ఆ ఎండునైన ౧½"-౩"దళసరిగల కొమ్మలను నరికినయెడల సంవత్సరమున్నరలోపున ఆ నరికిన తావులనుండి చిన్న-చిన్న కొమ్మలు పెరుగును. అట్టికొమ్మలు యీ లక్కక్రిములకు ముఖ్యమైన జీవనపట్టు. ఈ లక్కక్రిములను ఆ చెట్లకొమ్మలమీద ఎక్కించు మార్గము ఏది? పక్వముచెంది లక్క లోపల గర్భిణులైన లక్కపురుగులు గల లక్కకొమ్మలను సకాలములో (అనగా క్రిము లుద్భవించుకాలమున) నరికి, ౬"-౧౨" పొడుగు గల ముక్కలుగాచేసి రెండుమూడింటిని చేర్చి పురికోసతోగాని, ఎండుగడ్డితోకాని, తదితరమైన నారలతోగాని బంధించి, చెట్లమీద లేతకొమ్మలకు దరిగా కట్టవలెను.

వేనకు వేలు చిన్న లక్క క్రిములు బంధించబడిన లక్కనుండి పైకి వెడలి లేతకొమ్మలపైకి ప్రాకును. పరిపక్వమైన లక్క లోపల నున్న పురుగులనుండి యీ చిన్న క్రిములన్నీ పూర్తిగా వెలువడుటకు ౧౫-౨౦ దినములు పట్టును. లేతకొమ్మలమీదకు ప్రాకి అక్కడనే యీక్రిములు వసించును. ఈ క్రిములు చాలా దట్టనుగా ఒకదాని కంటుకొని ఒకటి కొమ్మయొక్క అడుగుభాగము నావరించి పై భాగముచెంతకుకూడ వ్యాపించును. ఒక నిడుపు డించికి ౧౫౦-౨౦౦ క్రిము లావరించియుండును.

లక్క లక్కపురుగుయొక్క స్వేదన

లక్కక్రిమి స్వేదనగా లక్కను తనమీద విసర్జించుట నారంభించును. ఈ స్వేదన క్రిమిలోనున్న గగ్గలు తయారుచేయుచుండును. ఈ లక్క స్వేదవిసర్జన పైకిఉబికినకొద్ది గట్టిపడుచుండును. పెరుస్తూ క్రిములపై నావరించినట్లు కానవగును. క్రిమిదరి క్రిమి వుండుట చేసి లక్కస్వేదన యించుమించుగా కలిసియేయుండును. ఈ క్రిమిజాలములో ౧౦౦కి ౩౦ మొగక్రిములు, ౭౦ ఆడక్రిములు సగటున ఉండును. కొన్ని దినముల పిదప మొగక్రిములు లక్కమీద ప్రాకుతూ, ఆడపురుగుతో కలియుచుండును. అటుతరువాత మగపురుగులు చనిపోవును. ఇక ఆడపురుగు మాత్రమే లక్కను విసర్జించుచు పెరుగుచుండును. మగపురుగులు లేకయే ఆడ పురుగులు లక్క విసర్జించుచు గర్భవతులై క్రిముల నుద్భవింపజేసిన తరములు ౧౮ పెంచబడినవి. ఈ పరిశోధనబట్టి తెలియు విషయమేమనగా, వాతావరణ పరిస్థితులు ప్రతికూలమై లక్క క్రిములు పురుగునుండి వెలువడిన వెంటనే పెద్ద గాలివానలు వచ్చి, మగక్రిములను ఆ సమయములో నశింపజేసిన, ఆ మగక్రిముల సహాయము లేకయే ఆడుక్రిములు. స్వేదించుచు, పెద్దవియై, గర్భవతులై మళ్లీ వచ్చే లక్కపంటకు పాటుపడగల వని నిర్ధారణ చేయుటకే. ఆరుమాసములలో యీ లక్కక్రిములు పెరిగి, పురుగులై పూర్ణ గర్భవతులై లక్క క్రిములను ప్రసవింపజేయును. ఆ సమయముననే లక్కను చెట్లనుండి నరికి యిదివరలో చెప్పిన మార్గముగా తిరిగి కొత్త కొమ్మలున్న చెట్లకు బంధించిన యీ క్రిమిజాలము వాటికి ఉనికిపట్టయిన లేతకొమ్మలపైకి ప్రాకి తమ జీవనము ప్రారంభించును. మళ్లీ ౬ మాసములలో యీ క్రిములు పురుగులై లక్కను విసర్జించి, గర్భవతులై క్రిములను ప్రసవింపజేయును. ఇట్లు యీ జీవన చక్రము వెళ్లుచుండును. సంవత్సరమునకు రెండుసార్లు లక్క చెట్లమీద పండును.

కుసుమచెట్టు- లక్కపంట

లక్కపురుగుకు ఉనికిపట్టయిన చెట్లలో కుసుమచెట్టు (Schleichera trijirga) శ్రేష్ఠము. ఈ చెట్టుమీద లక్క పురుగు స్వేదించు లక్క బహుశ్రేష్ఠమైనది. లక్కను పెంపొందజేయు పద్ధతులలో యీచెట్లను సాధారణముగా ఫిబ్రవరి మాసములో (అనగా వసంతకాలమునకు కొంచెము ముందుగా)నో, లేక జూలై మాసములోనో సమమైన పద్ధతిలో ¾"-౧౨" దళసరిగల కొమ్మలను నరుకుదురు. ఈ నరికిన ౧-౧½ సంవత్సరములయిన పిదప యీ చెట్లమీద లక్క పండించుటకు మంచి వసతి దొరకును. జూన్-జూలై నెలలలో నొకపంటయు, తిరిగి జనవరి-ఫిబ్రవరి నెలలలో నొకపంటయు కుసుమ చెట్లపై లక్కపురుగుల మూలముగా లక్కపంటలు పండును. లక్కకొమ్మలను చెట్లనుండి నరుకునప్పుడే సమార్గమున సరియైన శాస్త్ర పద్ధతులలో నరికిన (Prune) అది ముందు పండబోయే లక్కపంటలకు చాల అనుకూల మవుతుంది. ఒక చెట్టునుండి ఒక ఋతువున పంట పండిన వెనుక అధమం ఒక సంవత్సరం చెట్టుకు విశ్రాంతి యిచ్చినయెడల, మళ్లీ లేతకొమ్మలు అలవడుటకు తావు దొరకును. ప్రతి ఋతువునందు లక్కను ఒకేచెట్టుమీద విశ్రాంతిలేకుండా పండించిన ఆచెట్టుకు ప్రతిలక్కపంట నరుకుటచే క్షీణించును. అందువల్లనే ఒక్కొక్క ఋతువునందు ఒక్కొక్క వృక్షజాలములను సరిపడచేసి లక్క పెంపొందజేసెదరు. ప్రతి ఋతువునందు ఒకేచెట్టుపై లక్కను పండించరాదు. దానివల్ల లక్కయు క్షీణించును. ఆలక్కకు ఉనికిపట్టయిన చెట్టును క్షీణించును. సాధారణముగా యీ కుసుమచెట్లు ౮౦౦ అడుగుల ఎత్తయిన ప్రదేశమునుండి ౩౦౦ అ. ల ఎత్తయిన ప్రదేశములలో నున్న అడవి ప్రాంతములలోను, నదీతీరములందును, సెలయేళ్ల ఒడ్డునను, ఇసుకఒడ్డులలోను మెండుగా వృద్ధిచెందును. లక్క ఈ చెట్లపై పండుటకుకూడ యీ విస్తు ఆవశ్యకము. అదికాక యీచెట్లు గల ప్రదేశములయందు వాతావరణం శీతాకాలములో చలిమెండుగాను, వర్షములు అధికముగాను, ఎండలు కొంచెము తక్కువగాను ఉంటాయి. వాతావరణములు విపరీతమైనయెడల లక్కపంట సమృద్ధిగానుండదు. పెద్ద మామిడి చెట్లవలె గాని, పెద్ద మఱ్ఱిచెట్లవలెగాని యీ కుసుమచెట్లు విస్తీర్ణముగా

పెరుగును. సమృద్ధిగా లక్క పురుగులను పకాలములో యీ చెట్లపై పెంపొందజేసిన ఒక్కొక్క చెట్టుపై ౧౦౦ పౌనులు లేక ౧౫౦ పౌనులు లక్క కూడా పండించవచ్చును. అందుచేతనే యీ వృక్షము లక్కపంటకు దేవతవంటిది. లక్క పండించు అరణ్యవాసులు యీ చెట్టను పూజింతురు. లక్క కోసేముందర లక్కను, చెట్టును కూడా పూజింతురు.

మోదుగ, రేగుచెట్లు-లక్కపంట

లక్కపంటకు కుసుమతరువాత మోదుగ, రేగుచెట్లు ప్రధానమైనవి. మోదుగ చిట్టడవులయందును, పల్లభూములయందును కాన్పించును. రేగు సాధారణముగా పొలములమధ్యను, గ్రామ ప్రాంతములందును కానవచ్చును. విస్తారముగా వేసవి యుండని ప్రదేశములలో యీ చెట్లపై లక్కపంట పండింపవచ్చును. ఏప్రిల్ మాసమున చెట్ల కొమ్మలను సమార్గమున నరికి, అయిదారుమాసములు గడువిచ్చి, అక్టోబరు నవంబరులలో యీ చెట్లకు లక్కకట్టవలెను. జూలైమాసములో లక్క పూర్ణముగా పండును. వేసవి ఎక్కువగా నున్నయెడల ఏప్రిల్-మేనెలలలో $\frac{2}{3}$వంతు లక్కను కోసివేసి, మిగతా $\frac{1}{3}$ వంతు వదలివేసి, దానంతటదే పురుగుల నుద్భవించనిచ్చి మళ్ళీ అక్టోబరు-నవంబరులో లక్కను పరిపూర్ణముగ కోయుదురు.

ఈ చెట్లపై మోదుగరేగునుండి జనితమైన లక్కయే కాకుండా కుసుమజనితమైన లక్కకూడా కొద్దికాలమార్పులతో పండింపవచ్చును. ఈ చెట్లపై లక్క బీహారు, ఒరిస్సారాష్ట్రములందు, మధ్యరాష్ట్రములందు ఎక్కువగా పండును. కుసుమలక్కకూడా యీ తావులందే ముఖ్యముగా పండును.

దక్షిణమున మధురప్రాంతమున నున్న కంభంనందు కుసుమలక్క పండుచున్నది. హోసూరు సేలంజిల్లాయందుకూడ రేగుచెట్లు విస్తారముగా ఉన్నవని వాడుకతప్ప లక్కపంట యీ తావునందు సమార్గములలో పండించినట్లు నిదర్శనము లేదు. కాని పండింపవచ్చు. సమార్గమున అన్ని ప్రయత్నములు చేయదగును.

తదితరచెట్లు-లక్కపంట

ఈపైని పేర్కొన్న చెట్లపైగాక, అస్సామునందు కందిచెట్లపైని, సింధులో తుమ్మచెట్లపైని, మధ్యరాష్ట్రములలో నొకతావున గొట్టిచెట్లపైని, కొన్నితావులందు బొడ్డ, రావి, నేరేడుచెట్లపైని, దిరిసెనచెట్లపైని, సీతాఫలపు చెట్లపైని పండించుట కలదు. మైసూరు ప్రాంతమున జాలిచెట్లపై (Shorea robusta) సంవత్సరమునకు మూడుపార్లు లక్కపండించినట్లు నిదర్శనములు కలవు. కాని యీలక్క నీరసమైనది. కుసుమలక్కకు చాలహీనమైనది. రేగు మోదుగ లక్కలకుకూడ తీసికట్టు.

లక్కపురుగు-శత్రుపురుగులు

ఈ లక్కను పెంపొందజేయుటలో శాస్త్రయుక్తమైన మార్గములు చాలగలవు. ఈ లక్కపురుగులను, లక్కను తినివేయు శత్రుకీటకములు, క్రిములు కొన్నిగలవు. వాటిని నశింపజేసి లక్కను, లక్కపురుగులను భద్రముచేయు శాస్త్రపద్ధతులు బయలుదేరుచున్నవి. ఈ శత్రుక్రిములవల్ల ఒక్కొక్కప్పుడు ౧౦౦ కి ౩౦ పాళ్లు లక్క పాడైపోయి లక్క క్రిమిహీనమైయుండును. ఈ శత్రుక్రిములకు శత్రువులైన క్రిములను శాస్త్రాలయములయందు పెంపొందజేసి వాటిని యుక్తమైన పద్ధతులలో ఉపయోగించుకొనినయెడల లక్కకు కాని, లక్కపురుగులకు కాని శత్రుక్రిములవలన జరిగే ఆపద తగ్గింపవచ్చును. తగ్గిన మార్గములను విశదముగా పేర్కొనుట యిప్పుడు అనావశ్యకము.

లక్కను పరిశుభ్రముచేయువిధము

లక్కపంట కోసి, క్రిములను చెట్లపై పెంపొందజేసిన తరువాత ఆలక్కను కత్తితో గీకుదురు. లక్క అంతయు కొమ్మనుండి రాలిపోవును. ఈ లక్కను ఆరవేయుదురు. ఎందుకనగా, అందులో లక్కరంగుమూలమైన రంగు వుండును. పురుగుల చర్మములే ఈరంగుకు కారణము. అది ఎండకపోతే లక్క అంతయు ఒకటి నొకటి అంటి పెద్దగాయివలె గడ్డకట్టుకుపోవును. ఆరినపిదప పరిశ్రమాలయమునకు పంపుదురు. దీనిని పరిశుభ్రముచేసినయెడల విలువ అధికముగా నగును. పరిశుభ్రతచేయు విధానము ఏదియన —

బియ్యపులక్క (సీడులాక్)

ఈ లక్క ఢెంకీ(Dhenki) లలో కాని, తిరగలిలో కాని జొన్నలమర (Corn-crushing machine) యంత్రములలో గాని వేసిన ఉప్పుబెడ్డల సైజుకి నలగకొట్టబడును. దీనిని జల్లించి అందులో నున్న కర్రముక్కలను, మట్టిని, తదితర మలినపదార్థములను తీసివేయుదురు. అప్పుడు రాతికుండీలలో (లోతు ౨ అడుగులు. ఆకుండీలో పలి పరిభాగము గరుకుగానుండవలెను.) వేసి కొంచెము నీళ్ళతో తడిపి, అందులో ఒకపనివాడు నిలబడి, చేయూతకు అడ్డుగా నున్న వెదురునో, లేక ఇనపగొట్టమునో పట్టుకొని, కాళ్ళతో లక్కను నలుపుచు, కుండీచుట్టూ తొక్కును. ఈ రాపిడివలన లక్కలో నున్న రంగు చాలమట్టుకు లక్కనుండి వేరుచేయబడును. తదితర మలినపదార్థములుకూడ విడదీయబడును. ఒకగంట రెండుగంటలు లక్కను కాళ్ళతో తొక్కినపిదప, కుండీనిండా మంచినీళ్ళు పోసినయెడల, తేలికయైన మలినపదార్థములు నీటిపైని తేలును. అవి జల్లెడతో తీయబడును. లక్కరంగుకూడ నీటిలో కరిగియుండును. ఆ నీటిని తీసివేయుదురు. ఇదే పద్ధతిలో రెండుమూడుపార్లు లక్కను కుండీలో తొక్కి కడిగిన అది చాలమట్టుకు శుభ్రమగును. లక్కకంటె తేలిక పదార్థములు నీటిమధ్య తేలును. బరువైన రాళ్ళు, ఇసుక అట్టడుగుకు దిగిపోవును. అవి తీసివేయుదురు. రంగునుండి లక్కను నీళ్ళతో శుభ్రముగా కడుగుదురు. ఒక వెదురుబుట్టలో వేసి నీటినంతయు జారనీయుదురు. అప్పుడు నీడలో ౧౨ గంటలు ఆరనీయుదురు. ఆరిన పిదప ఆ లక్కబెడ్డలను జల్లించి, చెరిగి యింకా మిగిలిన ధాన్యపు

గింజలు, రాయిబెడ్డలు, కర్రముక్కలు మొదలైనవి తీసివేయుదురు. ఈ తయారైన లక్క ఉప్పుబెడ్డలసైజుకంటె కొంచెము చిన్నదిగా నుండి బంగారపురంగు గలదై యుండును. దీనినే 'లక్క బియ్యము' (Seed lac) అని అందురు. ఈ రూపములోనే దీని విలువ చెట్టు నుండి గీకిన లక్కకంటె రెట్టింపుగా నుండును. యుద్ధమునకు పూర్వము, అనగా ౧౯౪౦లో దీని విలువ ౮–౨పా. మణుగుకి ౨౮ రూ.లు, ౧౯౪౪లో ౮౦ రూ.లు, ౧౯౪౬–౪౭ లో ౧౩౫ రూ.లు అవుతూవచ్చినది. ఇది యిట్లే అమెరికాకు ఎగుమతి అగును. అక్కడ అనేకపరిశ్రమలలో దీనిని వాడుదురు.

గుల్ల, లేక రేకులక్క (షెల్లక్కు)

ఈ బియ్యపులక్క (Seed-lac) ను కరిగించి అటుకుల లక్కగా శుద్ధిము చేయుదురు. రేకురేకులగాగాని, బిళ్ళబిళ్ళలగాగాని (Shellac flakes, Butten lac) గాని తయారుచేయుదురు.

ఈ బియ్యపు లక్కను ౨త్తివెడల్పుగల శ్రీల్లుగుడ్డతో చేయబడిన ౨౦ అడుగుల పొడుగుగల సంచిలో కూరి, ఒక కొనను త్రిప్పుడుచర ఖాకు తగిలించి, రెండవకొనను కరిగించే పనివాడు పట్టుకొని ఒక ౪ అడుగుల పొడుగైన బొగ్గుపొయ్యిసెగకు లక్కసంచి ముందు భాగము తగిలేటట్లు పట్టుకొని కరిగించును. నిప్పుసెగకు సంచిలో నున్న లక్క కరిగి పైకి ఉబుకును. బాగా ఒకగంట కరిగిన చాల శుద్ధమైన లక్క పైకివచ్చుచుండును. దానిని మొనైన యినప కత్తితో రుద్దుచు, సంచిని చరఖామూలముగా త్రిప్పుచుండు, తన చేతిలో నున్న సంచికొనకూడ లక్కకరుగుతో వచ్చుచుండ వీలుచూసుకొని త్రిప్పుకొనుచు, బాగా పాకము వచ్చిన లక్కను తీసి, తన ప్రక్కనున్న ఒక నున్ననిజాడీ (Porcelain jar. ౩౦° వీట వాలుగా నుంచి అందులో వేడినీటిని పోసి వెచ్చజేసి) పైభాగము మీద వేసి తాటియాకుతో మెల్లగా క్రిందకు గీకిన అది ఒక ౯"పొడుగు ౯"వెడల్పు గలిగినరేకు (Sheet) యుండును. దానిని వేడిగా నుండునప్పుడే నున్ననిజాడీభాగము నుండి చేతులతో యుక్తిగా తీసి, నిప్పుసెగకు చూపెట్టుచూ సాగతీయును. బాగా సాగతీసి, రెండుకాళ్ళ బొటనవ్రేళ్ళ తోళ్ళతోను, రెండుచేతుల వ్రేళ్ళ తోను, పళ్ళతోను యుక్తిగా పెద్దషీటు (Sheet)గా సాగతీసి ఒకచోట వేయును. దీనిని ఆరినపిదప కాళ్ళతోగాని, చేతితోగాని నొక్కిన చిన్నచిన్న రేకులుగా ముక్కలైపోవును. దీనినే షెల్లక్కు (Shellac) అంటారు. రేకులా సాగతీసే బదులు టిన్‌షీట్ (Tin sheet) మీదచెంచాతో చిన్నచిన్న కరిగిన లక్కముద్దలు వేసిన అది బిళ్ళలుగా తేరుకొనును. వాటిని చల్లారినపిదప తీసివేయువచ్చును. దీనినే బటన్‌లాక్ (Butten-lac అంటారు. వీటి వెల బియ్యపులక్క కంటె ఎక్కువ. ఈరూపమున ఈలక్క అమెరికా, ఇంగ్లాండులకు, తదితరదేశములకు ఎగుమతిఅగును. ఈ తయారుచేయుటలో కొన్ని పదార్థములు పరిశ్రమేతరముగా తీయబడును (Bye products). వాటి నుంచికూడ శాస్త్రపద్ధతులతో లక్కను సాధించితీయవచ్చును.

లక్క తయ్యారీ అగు ప్రాంతములు

భారతదేశంలో ఇంచుమించు అన్నిరాష్ట్రాలలోను లక్క కొద్దిగానో గొప్పగానో పండుతూంది. అయితే మిక్కిలి ప్రాముఖ్యమైన తావులు బీహారులోని ఛోటానాగపూరు (అనగా రాంచీ, సింగభూమ్, మాన్‌భూమి, జాల్దాజిల్లాలు), ఒరిస్సాలోని సంస్థానాలు (ముఖ్యముగా మయూర్‌భంజ్), మధ్యరాష్ట్రాలు వగైరాలు. దేశంలో పండే మొత్తంలక్కలో మూటికి రెండుపాళ్ళు ఈప్రాంతాలలో పండుతూంది. అందులో ఛోటానాగపూర్ ప్రాంతంలో ౫౦, ౬౦ వంతులు తయారవుతుంది. పైని చెప్పినట్లు లక్కచెట్ల కొమ్మలనుంచి గీకినది గీకినట్లు అపాటున ఉపయోగించరు. అది శుద్ధపరచి, బియ్యపులక్కగా (Seed-lac) తయారుచేసి, కరిగి అందులోంచి గుల్లలక్క (Shellac) రేకులు రేకులుగా (Flakes) తయారుచేస్తారు. ఈ తయ్యారీ ముఖ్యంగా ప్రయాగరాష్ట్రంలోని మిర్జాపూరు, బీహారురాష్ట్రంలోని బలరామ్‌పూర్, జాల్దా, రాంచి, పురులియాలు, కలకత్తా, మధ్యరాష్ట్రములలోని ధమ్‌తరి, రాయపూర్, ఒరిస్సాసంస్థలలోని మయూర్‌భంజ, జయపురం, రీవా స్టేటులోని ఉమారియాలోను జరుగుతూంది. బియ్యపులక్క తయ్యారీ దక్షిణమున మద్రాసుగవర్నమెంటు అధిపత్యమున సేలం జిల్లాలోని డెంకనికోటలోను, మైసూరురాష్ట్రములో మైసూరు నందును ఒకమాదిరిగా జరుగుతూంది.

ఈ కింది పట్టీలో ౧౯౧౮–౧౯౩౬ మధ్య దేశంలో యేటేటా పండిన మొత్తం లక్కపంట సూచింపబడింది:—

లక్కపంటల జాబితా

సంవత్సరం	లక్కపంట మణుగులు ౧ మ=౮౦ శేర్లు.
౧౯౧౮	౭,౮౨,౦౦౦
౧౯౧౯	౯,౧౬,౨౦౦
౧౯౨౦	౧౨,౨౪,౫౦౦
౧౯౨౧	౧౧,౫౭,౪౦౦
౧౯౨౮	౧౪,౫౬,౫౭౬
౧౯౨౯	౧౦,౧౨,౫౦౦
౧౯౩౦	౧౨,౬౯,౦౦౦
౧౯౩౧	౮,౪౪,౨౫౦
౧౯౩౨	౮,౫౬,౦౦౦
౧౯౩౩	౯,౧౫,౫౦౦
౧౯౩౪	౯,౭౬,౮౦౦
౧౯౩౫	౧౦,౫౭,౫౦౦
౧౯౩౬	౧౫,౮౦,౦౦౦

దేశంలో మొత్తంమీద సగటున యేటేటా ౧౦ న్నర లక్షల మణుగుల లక్క ఉత్పన్నమవుతూందని లెక్క.

రాష్ట్రివారీ యెంతెంత ఉత్పన్నమవుతూన్నదీ తెలుస్తుంది దిగువ (౨-వ) పట్టీవల్ల.

౩-వ పట్టీలో అంకెలను బట్టి లక్క ఎగుమతి ఎంత విస్తారంగా పెరిగిందో విశదమవుతుంది. ప్రకృతిసిద్ధమైన రజనులమీద ఆధారపడకుండా స్వయంగా రాసాయనికంగా చేసుకున్న రజనులు అనేకం ఇటీవల వాడుకలోకి వచ్చాయి. అయినప్పటికీ లక్క జిగురు యొక్క ప్రాధాన్యత క్షీణించిపోలేదు. ఇంకా దాని ప్రయోజనం హెచ్చయిపోయింది. లక్క ఏయే విధాలుగా, ఏయే పరిశ్రమలలో పనికివస్తుందో, దాని ప్రాశస్త్యం ఎల్లాంటిదో వగైరా విషయాలను

రాష్ట్రం	మణుగులు
బీహారు	౭,౧౬,౦౦౦
మధ్యరాష్ట్రములు	౧,౬౦,౦౦౦
బెంగాలు	౮౦,౦౦౦
బర్మా	౫౨,౦౦౦
అస్సాము	౩౭,౦౦౦
మధ్య హిందూస్థానము	౩౬,౦౦౦
పంజాబు	౧౦,౦౦౦
బొంబాయి-బరోడా	౯,౦౦౦
సంయుక్త రాష్ట్రములు	౫,౫౦౦
ఒరిస్సా	౪,౫౦౦
హైదరాబాదు (సింధు)	౪,౪౦౦
నేపాళ్	౨,౦౦౦
హైదరాబాదు (దక్కను)	౧,౦౦౦
మైసూరు	౧,౦౦౦
తిరువాన్కూరు, మదరాసులోని కంబం, సేలంజిల్లాలలో	౧,౦౦౦

గురించి పరిశోధన చేసి ఉత్పత్తివిధానంలో క్రమమైన వైజ్ఞానికపద్ధతులు అవలంబించి ఈ పరిశ్రమను విశేషంగా వృద్ధిచేసుకోడానికి సావకాశం ఉంది. ఈ పురుగులను మన ఆంధ్రప్రాంతములలో ఆయా వసతి కనుకైన చెట్లపై పెంచి, లక్క పండించడం కష్టమైన పని గాదు. ప్రయత్నములు జరుగవలెను. లక్క ఎగుమతుల వివరం కింది

(లక్కరంగు, లక్కజిగురు ఎగుమతుల పట్టీ)

సంవత్సరం	లక్క రంగు పరిమితి హండ్రెడు వెయిట్లు	లక్క రంగు విలువ రూపాయలు	లక్క జిగురు పరిమితి హండ్రెడు వెయిట్లు	లక్క జిగురు విలువ రూపాయలు
౧౮౬౮-౯	౧౭,౭౪౮	౭,౯౬,౬౫౫	౪౩,౭౪౦	౧౧,౬౫,౭౩౯
౧౮౭౮-౯	౮,౨౬౧	౧,౯౫,౨౮౫	౬౪,౪౮౯	౨౨,౨౪,౮౪౩
౧౮౮౮-౯	౩౩౩	౮,౦౩౮	౮౧,౩౯౦	౩౧,౯౪,౧౨౫
౧౮౯౮-౯			౧,౪౬,౩౯౫	౭౦,౦౭,౭౮౧
౧౮౯౯-౦	౧	౨౪	౧,౯౫,౨౩౯	౯౨,౬౫,౬౦౦
౧౯౨౦-౨౧			౩,౦౮,౯౩౭	
౧౯౨౧-౨౨			౪,౩౪,౯౩౪	
౧౯౨౨-౨౩			౪,౭౬,౦౧౧	
౧౯౨౩-౨౪			౪,౮౫,౬౭౧	
౧౯౨౫-౨౬			౫,౩౭,౯౨౪	
౧౯౨౬-౨౭			౫,౯౨,౦౩౦	
౧౯౨౮-౨౯			౭,౪౩,౪౦౩	
౧౯౨౯-౩౦			౬,౬౮,౯౧౪	
౧౯౩౦-౩౧			౫,౪౭,౧౫౧	
౧౯౩౩-౩౪			౭,౩౦,౯౮౮	
౧౯౩౬-౩౭			౮,౩౩,౯౬౪	
౧౯౩౭-౩౮			౬,౬౪,౬౭౧	

పట్టీవల్ల తెలుస్తుంది. లక్కరంగు ఎగుమతి క్రమంగా క్షీణించి పోవడం, లక్కరజను (జిగురు) ఎగుమతి అంతకంతకు పెరగడం విశదమవుతుంది.

లక్క ప్రయోజనములు

ప్రపంచం అంతటిలోనూ ఉత్పత్తిఅయే మొత్తంలక్కలో నూటికి ౯౫ వంతులు మన దేశంలోనే తయారవుతూంది. బర్మా, సయాం, ఇండోచీనా, సింహళం, మలయా వగైరా తూర్పు ఇండియన్ దేశములలో మిగతా ౫ వంతులూ ఉత్పత్తిఅవుతూంది. ఆ ౫ వంతులుగూడ కలకత్తాద్వారా ఎగుమతిఅవుతోంది. భారత భూమిలో అంత విస్తారంగా ఉత్పత్తిఅవుతున్నా దేశంలో ఉపయోగపడే సరుకుమట్టుకు చాల తక్కువ. నూటికి ఏమూడుపాళ్ళు విని యోగమవుతూందో దేశంలో; అంతే. మిగతా సరుకు యావత్తూ అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాంసు వగైరాదేశాలకు ఎగుమతి అవుతూంది. లక్కయొక్క ప్రయోజనం ఆనాటి కానాటికి విస్తరించిన కొద్దీ, మన దేశంలో ఉత్పత్తికూడా పెరిగింది. ౧౮౬౮ సం.రంలో ౨,౦౦౦ టన్నుల గుల్లలక్క (Shellac) ఎగుమతి అయింది. ౧౯౩౬లో ౩౫,౦౦౦ టన్నులకు పెరిగింది ఆ ఎగుమతి. దీనినిబట్టి పైదేశములవారు వైజ్ఞానికపద్ధతుల నవలంబించి, తదితర దేశములలో పండు లక్కను ఖరీదుచేసి వారి పరిశ్రమలకు ఉపయోగించుటలోని యుక్తి గోచరమవుతూంది.

లక్కకు ప్రస్తుతకాలంలో అనేకవిధములైన ప్రయోజనాలున్నాయి. ప్రస్తుతం ఉత్పత్తిఅయే లక్కలో (నూరు పాళ్ళలో) ఎంతెంత ఏయే పరిశ్రమలలో ఉపయోగమవుతూన్నదీ తెలుస్తుంది కింది వివరంవల్ల —

౧. గ్రామఫోను రికార్డుల పరిశ్రమలో — ౩౫-౪౦%.

౨. విద్యున్నిరోధక పరిశ్రమలో (Electrical insulating industry) — ౧౫-౨౦%.

౩. రంగువార్నిషు, పెయింటు, పాలిష్‌పరిశ్రమలో — ౧౦%.

౪. టోపీలు గట్టిపరచడం నిమిత్తం (Hat-stiffening industry) — ౫%.

౫. సీళ్ళు వగైరా వెయ్యడంలో (Sealing wax and adhesives) — ౫%

౬. లక్కపూత పరిశ్రమలో (Lacquer-ware and toys) — ౩-౫%.

౭. సానరాళ్లు వగైరా వేయడం నిమిత్తం (Grinding wheels and emery stones) — ౫%.

౮. తదితరపరిశ్రమలు (Tin foil lacquers, ammunitions, playing card lacquers etc.) — ౨-౫%.

౯. ప్లాస్టిక్సు (Plastics) వేడి, పీడనాబలముచే తయారగు వివిధ వస్తుపరిశ్రమలో (Plastics industry) — ౧౦%.

పైన పేర్కొన్న పరిశ్రమలలో లక్కను ఏయే విధములలో వైజ్ఞానికపద్ధతులతో ఉపయోగిస్తున్నారో వివరముగా వ్రాయుటకు ఇచ్చట వసతి తక్కువ. ఈ లోపమునకు చదువరులు క్షమించవలెను.

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.


శ్రీవిస్-ఆమ్లా
తల నూనె
తల యందలి చుండు,
గుల్లలను పోగొట్టి
కురులను మృదువుగా
పెంపొందించును.
ఇందు సువాసన,
సుగుణము రెండును
కలవు.
SRIVIS
AMLA HAIR OIL
SRIVIS
PERFUMERY
యస్. విశ్వనాథం అండ్ కంపెనీ,
44, బందరువీధి, మద్రాసు.